



# బోల్షివిక్

సంచిక: 8 సి.పి.ఐ(మావోయిస్టు) ఎ.ఒ.బి సమాచార పత్రిక అక్టోబర్ 2016-జూన్ 2017

## లోపలి పేజీల్లో...


రాంగూడ సంఘటన ......... 05

కామ్రేడ్ ఆర్.కె. ఇంటర్వ్యూ ......... 09

సిద్ధాంత వ్యాసం ......... 13

సామాజిక పరిశోధన నివేదిక ......... 17

సి.సి కరపత్రం ......... 24


పత్రికా ప్రకటన ......... 27

నేను గెరిల్లానెందుకయ్యానంటే? ......... 29

రాంగూడ అమరుల చరిత్రలు ......... 33

పోరాట స్రవంతి ......... 59

# రాంగూడ అమరులకు జోహార్లు





























# అమరుల ఆశయాలను కొనసాగిద్దాం!

“ప్రజల కోసం మరణించడం హిమాలయాల కన్న ఉన్నతమైనది

ప్రజా శత్రువుల కోసం మరణించడం కోడి ఈక కన్న తేలికైనది"

**ప్రజా వీరులు మృత్యుంజయులు**

**ప్రజలే అజేయులు**

# మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధ మార్గం ప్రకాశవంతమైంది!
# లక్ష్యం చేరేదాక మీరు చూపిన మార్గాన్ని వదలం!!



భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్ధ భూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సి.పి.ఐ మావోయిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైన, పి.ఎల్.జి.ఎ.పైన, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెప్టెంబర్ నుండి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరం అయింది. ఈ దాడి అత్యంత పాశవికంగా, క్రూరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాలకోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడీ వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజల ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. 2016 అక్టోబర్ నుండి జూన్ 2017 వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పి.ఎల్.జి.ఎ., ప్రజాసంఘాల సభ్యుల నాయకత్వంతో పాటు సాధారణ ప్రజలు నేలకొరిగారు. ఎ.ఒ.బి.లో బాకూరి వెంకటరమణరాజు (ప్రసాద్) ఎస్.జడ్.సి.ఎమ్., చామల కిష్టయ్య (దయ) ఎస్.జడ్.సి.ఎమ్, ప్రభాకర్ (గంగాధర్) డి.వి.సి.ఎమ్., సువర్ణరాజు (కిరణ్) డి.వి.సి.ఎమ్., బొడ్డు కుందనం (మమత) ఎ.సి.ఎమ్., భారతి (లత) ఎ.సి.ఎమ్., సింహాచలం (హరి) ఎ.సి.ఎమ్., గౌతం (సుర్జిత్ దర్రో) టెక్నికల్ డిపార్ట్‌మెంట్ కమాండర్, పృథ్వీ (మున్నా) సి.ఆర్.సి.పి.ఎల్–పి.పి.సి.ఎమ్., పి.ఎల్ డిప్యూటీ కమాండర్, కేశవరావు (బిర్సు) సి.ఆర్.సి.పి.ఎల్–పి.పి.సి.ఎమ్, సెక్షన్ కమాండర్, భీమ (రాజేష్) సి.ఆర్.సి.పి.ఎల్–పి.పి.సి.ఎమ్., నంగాల్ (ఎర్రాల్) సి.ఆర్.సి.పి.ఎల్–పి.పి.సి.ఎమ్, సాధురాం (దాసురాం) సి.ఆర్.సి.పి.ఎల్–పి.ఎమ్., సూరి (నరేష్) సి.ఆర్.సి.పి.ఎల్–పి.ఎమ్, దాసు (మధు) ప్రొటక్షన్ పి.ఎల్ – పి.పి.సి.ఎమ్., సోడి బుద్రి, ప్రొటక్షన్–పి.ఎల్., పి.పి.సి.ఎమ్., సెక్షన్ డిప్యూటీ కమాండర్, మాడవి ఉంగి (మంజుల) ప్రొటక్షన్ పి.ఎల్–పి.పి.సి.ఎమ్., పాయికే (చిలక) ప్రొటక్షన్ పి.ఎల్–పి.ఎమ్., గంగాల్ ప్రొటక్షన్ పి.ఎల్–పి.ఎమ్. లక్కె (కమల) ప్రొటక్షన్ పి.ఎల్–పి.ఎమ్, రజిత (శాంతి) పి.ఎమ్., జ్యోతి, పి.ఎమ్., మిలీషియా కామ్రేడ్స్ సిందే, దాసు, కొములు, జయరాం, శ్యామల, జొమ్మి, కావేరి, కమల, లక్ష్మణ్ కోరాపుట్ శ్రీకాకుళం డివిజన్‌లో కాంత (పద్మ) ఎ.సి.ఎమ్., అంకు (టుబ్రి) ఎ.సి.ఎమ్., ఈస్ట్ డివిజన్‌లోని గొర్లమెట్టలో జాంబ్రి ఎ.సి.ఎమ్., చిట్టిబాబు (మిలీషియా సభ్యుడు) నేలకొరిగారు. ఈ కామ్రేడ్స్‌తో పాటు దేశ వ్యాపితంగా అనేక మంది కామ్రేడ్స్ శత్రువుతో విరోచితంగా పోరాడుతూ అమరులైనారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకీ, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్పించింది. వారి కుటుంబాలకూ, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దు:ఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దు:ఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్.జడ్.సి. ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

మన అమరుల త్యాగాలు మన వెంటనే వున్నాయి. వారి త్యాగాలతో మన మార్గం ప్రకాశవంతమైంది. మన పురోగమనంలో వారిస్తున్న ఉత్తేజం మనకు నూతన శక్తినీ, చైతన్యాన్ని అందిస్తున్నది. అందుకే వారు సదా చిరస్మరణీయులు.

# రాంగూడ సంఘటన–ఆర్థిక, రాజకీయ నేపథ్యం

అక్టోబర్ 24, 2016న ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన గ్రేహౌండ్స్, ఎస్.ఒ.జి పోలీసు కమాండ్ బలగాలు సంయుక్తంగా, ఉదయం 6గం॥లకు రాంగూడ వద్ద ఉన్న మా పార్టీ, పి.ఎల్.జి.ఎ, సాధారణ ప్రజానీకంపై అకస్మాత్‌గా దాడి జరిపి 31 మందిని హత్య చేసారు. ఈ మారణకాండలో పార్టీ, పి.ఎల్.జి.ఎ.కి చెందిన 22 మంది కామ్రేడ్స్‌తో పాటు వివిధ ప్రజా నిర్మాణాలలో పని చేస్తున్న, నిరాయుధంగా వున్న 9 మంది యువత అమరులైనారు. మరి కొద్ది మంది గాయపడ్డారు. ఈ సంఘటన సందర్భంగా ప్రభుత్వ సాయుధ బలగాలు చట్టపరమైన, నైతికపరమైన విలువలను ఉల్లంఘించడంపై ప్రజాస్వామికవాదులు, మేధావులు, ప్రజా నిర్మాణాలు నిజనిర్ధారణ చేపట్టి ఖండిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం చేత ప్రేరేపించబడిన  కొద్ది మంది విప్లవోద్యమానికి వ్యతిరేకంగా, రాజ్యానికి మద్దతుగా పోటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరు నిజనిర్ధారణ కోసం ప్రయత్నిస్తున్నవారిని అడ్డుకుంటున్నారు. అయితే ఈ సందర్భంగా జరుగుతున్న చర్చగానీ, నిజాన్ని రాబట్టేందుకు చేస్తున్న కృషిగాని సంఘటనకే పరిమితమవుతున్నాయి. ఈ పరిమితమైన కృషి ప్రజాస్వామిక విలువలను కొంతమేరకు కాపాడేందుకు దోహదపడే మాట నిజమే అయినప్పటికీ, రాంగూడ సంఘటన తాలుకు ఆర్థిక, రాజకీయ నేపథ్యాలను తెలుసుకోగల్గితే సంఘటనలోని పై పై నిజాలనే కాకుండా సారాన్ని (సత్యాన్ని) కూడా ఆవిష్కరించి ఒక నిర్దిష్టమైన వైఖరిని తీసుకోగల్గుతారు. ఇటువంటి కృషి కూడా కొంత జరుగుతున్నప్పటికీ దానికి మరింత సమగ్రత చేకూరేందుకు కొంత సమాచారాన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాం.

రాంగూడ 10 ఇళ్ళు మాత్రమే ఉన్న ఒక చిన్న ఆదివాసీ గ్రామం. ఇది ఒడిశా రాష్ట్రం, మల్కనగిరి జిల్లా, గుమ్మ బ్లాక్, ఒండ్రుపల్లి పంచాయితీలో ఉంది. గుమ్మ బ్లాక్‌లో 9 పంచాయితీలు వుంటే 7 పంచాయితీలు ఉన్న ప్రాంతాన్ని కటాఫ్ ఏరియా అంటారు. ఈ ప్రాంతం సీలేరు నది ద్వారా ఒడిశా భూభాగం నుండి విడిపడి ఒంటరి ప్రాంతంగా ఉండటంతో దీన్ని కటాఫ్ ఏరియా అంటున్నారు. వాస్తవంగా ఈ ప్రాంతం 2009దాకా ప్రభుత్వం చేత అత్యంత తీవ్రంగా నిర్లక్ష్యానికి గురైన ఒంటరి ప్రాంతంగానే ఉంది. అంటే 2009 తర్వాత ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పట్టించుకున్నదని అర్థం కాదు. 2009కి ముందు ఆ ప్రాంతంతో ఒడిశా ప్రభుత్వానికి ఏ ఆధిపత్య సంబంధాలు కొనసాగుతూ వచ్చాయో అవే నేడు మరింతగా పెరిగాయి. కాకపోతే 2009 నుండి ప్రజలను విప్లవోద్యమం నుండి దూరం చేసేందుకు బూటకపు సంస్కరణలను మరింతగా గుప్పిస్తున్నది. ఈ సంక్షేమ కార్యక్రమాలనే సామ్రాజ్యవాదుల భాషలో 'మానవ ముఖం' అంటున్నారు. ఈ మానవ ముఖం ఉద్యమ ప్రాంతాలలో మరింత నాటకీయంగా వుంటుంది.

ఇక్కడ 2009వ సంవత్సరాన్ని ఎందుకు ప్రస్తావిస్తున్నామంటే, ఆ సంవత్సరమే మా పార్టీ ఉద్యమ కర్తవ్యాలను నిర్వహించేందుకు ఆ ప్రాంతంలోకి ప్రవేశించింది. యాదృచ్ఛికమే అయినప్పటికీ అదే సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ గ్రీన్‌హంట్ సైనిక దాడిని ప్రారంభించాయి. ఈ దాడి కటాఫ్ ఏరియాలో కూడా 2009లోనే ప్రారంభమై క్రమంగా పెరుగుతూ వచ్చింది. కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆంధ్ర, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలు మా పార్టీపై అమలు చేస్తున్న ఈ గ్రీన్‌హంట్ సైనికదాడిని సమర్థించుకునేందుకు మమ్మల్ని అభివృద్ధి నిరోధకులుగానూ, ప్రజా వ్యతిరేకులుగానూ, శాంతి భద్రతలు క్షీణింపజేసే వారిగానూ, ఉనికి కోసం చర్యలు చేపడుతున్న వారిగాను చిత్రీకరిస్తున్నాయి. అయితే వీరు చెబుతున్న కుంటిసాకుల వెనుక దాడి చేపట్టడానికి వున్న అసలు ఉద్దేశ్యాలు ఏమిటో తెలుసుకోవడం అవసరం.

2009కి చాలా సంవత్సరాల ముందే ఒడిశా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు తమ 'అభివృద్ధి నమూనా'లో భాగంగా జోలాపుట్, సీలేరు నదులపై అనేక హైడల్ పవర్ ప్రాజెక్టులు నిర్మించి లక్షలాది మంది ఆదివాసీలను విస్థాపితుల్ని చేశాయి. ఈ సందర్భాలలో విస్థాపితులైన లక్షలాది ఆదివాసీలకు ఒక్క పైసా కూడా నష్టపరిహారం లభించలేదు. వీరు చెట్టుకొకరు, పుట్టకొకరు అన్నట్లు ఎక్కడికెక్కడికో వెళ్ళి ఆవాసాలు ఏర్పర్చుకున్నారు. అలా వెళ్ళినవారిలో గణనీయమైన సంఖ్య కటాఫ్ ఏరియాలో కొత్త గ్రామాలను నిర్మించుకొని స్థిరపడ్డారు. అయితే వారిని సమస్యలు వెన్నాడటం ఆగలేదు. వారి రక్తం తాగే పరాన్నభుక్కులైన ప్రభుత్వ పరిపాలన శాఖలు, ఆదివాసేతర భూస్వాములు, నిరంకుశులైన కొందరు తెగ పెద్దలు, పంచాయితీ వ్యవస్థ, మతం, స్వచ్ఛంద సంస్థలు అక్కడ కూడా ప్రత్యక్షమైనాయి. ఇవి వాళ్ళను సర్వనాశనం చేస్తూ వచ్చాయి. ఈ శ్రమ జీవుల సర్వస్వం, జీవనోపాధి భూమే. గతంలో ఆ భూమిని ప్రభుత్వ 'అభివృద్ధి నమూనా' వల్ల కోల్పోయారు. విస్తాపితులైన తర్వాత తిరిగి కష్టపడి భూమిని సంపాధించుకుంటే ఆ భూమికి కూడా అదే గతి పట్టింది. ప్రతి సంవత్సరం బలిమెల డ్యాం బ్యాక్ వాటర్‌లో వందలాది ఎకరాల భూమి ముంపుకు గురై పంటలు నాశనమవుతుంటాయి. దీనిపై వాళ్ళెప్పుడూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది కూడా లేదు. ప్రభుత్వం తమకన్న బలియమైన శక్తి కనుక దానికి తలవంచి వుండాలనే భావనే వాళ్ళలో ఉంది. మరోవైపు ఆదివాసేతర భూస్వాములు దౌర్జన్యంగా వందలాది ఎకరాల వాళ్ళ భూములను ఆక్రమించారు. కొన్ని గ్రామాలలో నిరంకుశులైన తెగపెద్దలు సైతం వివిధ పద్ధతులలో ప్రజల భూములను కబ్జా చేసి, సాంప్రదాయంగా వచ్చిన కొన్ని సౌకర్యాలను వినియోగించుకొని వారిపై ఆధిపత్యాన్ని నెరుపుతూ వచ్చారు. ఇక ప్రభుత్వం అంటే వాళ్ళకు ఎక్కువలో ఎక్కువ తెలిసింది ఫారెస్ట్ శాఖ, వాళ్ళ దౌర్జన్యాలు మాత్రమే. ప్రభుత్వం నుండి విద్యా, వైద్యం, రవాణా నామమాత్రమనే చెప్పుకోవాలి. వాళ్ళు ఒడిశాలోని మిగిలిన ప్రాంతాలకు వెళ్ళాలంటే నదిలోనే వెళ్ళాలి. ఆ నీటి ప్రయాణానికి తగిన ఏర్పాట్లు లేవు. వున్న ఒక్క లాంచి ఉదయం వచ్చి సాయంత్రం వెళుతుంది. ఇక ప్రభుత్వంతో వాళ్ళకున్న మరో సంబంధం ఏమిటంటే ఈ దేశ 'ప్రజాస్వామ్యం'లో భాగంగా 5 సంవత్సరాలకొక పర్యాయం వాళ్ళ ఓట్లకోసం వచ్చే రాజకీయ పార్టీలు, వాటి ప్రచారం మాత్రమే. అందుకే వాళ్ళెపుడూ ఈ ప్రభుత్వాన్ని తమదిగా భావించలేదు. తమకన్న బలమైన శక్తిగా మాత్రమే భావించి భయంగా బతుకులీడుస్తూ వచ్చారు. ఈ దేశ పాలకవర్గాలకు కావాల్సింది కూడా ఇదే. ఎందుకంటే ప్రజలు

దైన్యస్థితిలో వుంటేనే వాళ్ళ ఆర్థిక లక్ష్యాలకనుగుణంగా ఈ దేశ సంపదను సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేస్తూ తమ బొక్కసాలు నింపుకోగల్గుతారు. తమ రాజకీయ లక్ష్యానికనుగుణంగా నిరంకుశ దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాల నియంతృత్వాన్ని కొనసాగించగల్గుతారు. ప్రజల ఈ దైన్యస్థితినే వారు 'శాంతియుత వాతావరణం'గా చిత్రీకరిస్తూ వచ్చారు. అప్పుడు వాళ్ళకు అక్కడ తమ విధ్వంసకర అభివృద్ధిని అడ్డుకునేవారెవరూ కన్పించలేదు. మావోయిస్టులు ఆ ప్రాంతంలోకి ప్రవేశించడంతోనే పాలకవర్గాలు, వారికి అమ్ముడుపోయిన మేధావులు తమ అభివృద్ధి నమూనాకు ఆటంకాలేర్పడుతున్నాయనీ, శాంతి భద్రతలకు విఘాతం కలుగుతున్నదనీ గగ్గోలు పెడుతున్నారు. అందుకే వాళ్ళు మావోయిస్టులను నాశనం చేయాల్సిందే అంటూ ఉన్మాదుల్లా కేకలు పెడుతున్నారు.

పాలకవర్గాలు, వాళ్ళకమ్ముడుపోయిన మేధావులు గగ్గోలు పెట్టినట్టుగానే మా పార్టీ రూపొందించుకున్న ఆర్థిక, రాజకీయ లక్ష్యాలు పాలకవర్గాల ఆర్థిక, రాజకీయ లక్ష్యాలకు పూర్తిగా వ్యతిరేకమైనవి, నష్టపరిచేవి కూడా. ఈ దేశ సంపదను సామ్రాజ్యవాదుల నుండి, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వాముల కబంధ హస్తాల నుండి కాపాడి ప్రజలపరం చేయడమే మా పార్టీ ఆర్థిక లక్ష్యం. దళారీ నిరంకుశ బూర్జువా భూస్వాముల నుండి అధికారాన్ని ప్రజలపరం చేయడమే మా పార్టీ రాజకీయ లక్ష్యం. ఈ లక్ష్యాలకనుగుణంగా వ్యవసాయక విప్లవం ఇరుసుగా కలిగిన నూతన ప్రజాస్వామిక విప్లవం మా పార్టీ కార్యక్రమంగా వుంటుంది. ఈ కార్యక్రమం దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో కొనసాగుతుంది. తద్వారా బ్రహ్మణవాద హిందుత్వంతో విడదీయరాని విధంగా పెనవేసుకుపోయిన అర్ధవలస, అర్ధభూస్వామ్య సామాజిక వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేసి నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించడమే ఈ దశకు సంబంధించి మా ప్రధాన లక్ష్యంగా వుంది.

ఈ ఆర్థిక, రాజకీయ లక్ష్యాలకనుగుణంగానే మా పార్టీ 2009 నుండి కటాఫ్ ఏరియాలో విప్లవోద్యమాన్ని నిర్మిస్తూ వచ్చింది. సాధారణంగా బయట నుండి వచ్చిన వారిని చూస్తే మళ్ళీ ఏ 'అభివృద్ధి పథకం' తెచ్చి తమని విస్థాపితుల్ని చేస్తారో అని భయపడే కటాఫ్ ఏరియా ఆదివాసీ ప్రజలు మా పార్టీని ప్రారంభంలోనే ఆహ్వానించారు. ఇలా ఆహ్వానించడానికి వారికున్న భూమి సమస్యతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలలో మా పార్టీ నేతృత్వంలో జరుగుతున్న ఉద్యమ ప్రభావం వారిపై పడటం కూడా ముఖ్య కారణాలుగా పని చేశాయి.

పార్టీ కార్యక్రమాన్ని సొంతం చేసుకొని కార్యోన్ముఖులైన ప్రజలు ప్రారంభంలోనే తమ భూముల ముంపు సమస్యను పార్టీ ముందుకు తెచ్చారు. తమ భూముల ముంపుకు కారణమైన బలిమెల డ్యాంను కూలగొట్టాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలో అంతర్లీనంగా ప్రభుత్వంపై ప్రజలకున్న ఆగ్రహాన్ని పార్టీ అర్థం చేసుకుంటూనే అందులోని సాధక బాధకాలను వారికి అర్థం చేయించింది. ముంపు భూములకు బదులుగా మరోచోట భూములివ్వడంతో పాటు విద్య, వైద్యం, రవాణా, బోట్ల వంటి మౌలిక సమస్యల పరిష్కారానికై ప్రజలను పెద్ద ఎత్తున చిత్రకొండకు కదిలించింది. ఈ పోరాటంలోకి కదిలిన వేలాది మంది ప్రజలు విచ్ఛినాంచల్ పోరాట కమిటీలలోకి సంఘటితపడ్డారు. ఈ పోరాట కమిటీల నేతృత్వంలో 30 నుండి 35 వేల మంది ప్రజలు రెండు పర్యాయాలు 3 నుండి 5 రోజుల పాటు చిత్రకొండలోని ప్రభుత్వ యంత్రాంగాన్ని దిగ్బంధించారు. అయినా దున్నపోతు మీద వర్షం పడినట్లు ప్రభుత్వం స్పందించింది నామమాత్రమే. ఇప్పటికీ భూమి సమస్య పరిష్కారం కాలేదు. విద్య, వైద్యం, రవాణా, బోట్ల వంటి ఇతర మౌలిక సమస్యల పరిష్కారం కూడా అంతంత మాత్రమే. ఈ పోరాటం ద్వారా చైతన్యవంత మవుతున్న ప్రజలు ఒక వైపున ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తూనే మరోవైపు ఆదివాసేతర భూస్వాములు అక్రమంగా ఆర్జించిన వందలాది ఎకరాల భూములపై తమ దృష్టిని సారించారు. ఒక్క గుర్రసెట్టు గ్రామంలోనే అక్రమంగా ఆర్జించిన సొండి భూస్వామికి చెందిన 300 ఎకరాలకు పైగా భూమిని ప్రజలు పోరాడి సాధించుకున్నారు. అతడి దౌర్జన్యాలకు తాళలేక గ్రామం నుండి అతడిని బహిష్కరించారు. ఈ పోరాటాలు, వాళ్ళ సంఘటిత శక్తిపై వారికి విశ్వాసాన్ని కల్గించాయి. పార్టీ అందించిన రాజకీయ చైతన్యం తమ భవిష్యత్‌ను తమ చేతుల్లోకి తీసుకునేలా చేసింది. ఈ పరిణామాలతో వాళ్ళు తమ తెగ నిర్మాణంలోని ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగా సైతం పోరాటం ప్రారంభించారు. అనేక గ్రామాలలో తెగ ఆధిపత్య శక్తుల నుండి అక్రమంగా ఆర్జించిన భూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు ప్రజా నిర్మాణాలను ఏర్పాటు చేసి వారి ఆధిపత్యాన్ని దెబ్బతీశారు. పాత తెగ పెత్తందారీ ఆధిపత్యం స్థానంలో ప్రజల ప్రత్యామ్నాయ అధికారాన్ని నెలకొల్పారు. గత దశాబ్ద కాలంగా ఆ ప్రాంతంలో జరుగుతున్న వర్గపోరాటం పాత సామాజిక సంబంధాలను ఒక కుదుపు కుదపటంతో పాటు ప్రజల శక్తినీ, చొరవను, సృజనాత్మకతను వెలికితీసింది. ప్రజల మెదళ్ళను బంధించి వున్న వెనకబడిన భావాల దాస్య శృంఖలాలను బద్దలు కొట్టింది. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా వందలాది మంది కదిలి చెక్‌డ్యాంలు నిర్మించుకున్నారు. ఉత్పత్తి సాధనాల (నాగళ్ళు,ఎడ్లు...వగైరా) సమస్యను పరిష్కరించు కునేందుకు సహకార గ్రూపులు ఏర్పర్చుకొని సకాలంలో అన్ని భూములలో విత్తనాలు పడేలా కృషి చేసారు. కొన్ని గ్రామాలలో భూములన్నింటిని కలిపి సమిష్టి వ్యవసాయం చేశారు. గంజాయి పంటను నిరుత్సాహపరిచే విధంగా కొన్ని నిర్ణయాలు తీసుకొని వాటిని ఆచరణలో పెట్టారు. ఇంకా వ్యవసాయపరంగా ఎదురవుతున్న అనేక సమస్యల (పశువుల మరణాలు, భూమి కోత, విత్తనాలు, ఎరువులు, గిట్టుబాటు ధరలు, అధిక వడ్డీ రేట్లు)ను పరిష్కరించుకునేందుకు పంచాయితీల వారిగా రైతాంగ సదస్సులు నిర్వహించారు. స్థానిక యువకులకు వైద్యం నేర్పి చిన్న చిన్న అనారోగ్య సమస్యలను పరిష్కరించుకోవడం ప్రారంభించారు. ఈ కార్యక్రమాలన్ని నల్లేరు మీద బండిలా సాగటం లేదు. స్థానిక ఆధిపత్య శక్తులకు, వారికి అండగావున్న ప్రభుత్వ సాయుధ బలగాలకు వ్యతిరేకంగా పోరాటం చేపడుతూనే నిర్వహిస్తున్నారు.

ఈ పోరాటం కేవలం సమస్యల పరిష్కారానికీ, హక్కుల సాధనకు జరుగుతున్న పోరాటం మాత్రమే కాదు. పైన చెప్పుకున్నట్లుగా రెండు ఆర్థిక లక్ష్యాల మధ్య, రెండు రాజకీయ లక్ష్యాల మధ్య జరుగుతున్న పోరాటం. పీడిత రైతాంగం వ్యవసాయ విప్లవాన్ని కోరుతుంటే పాలకవర్గాలు సామ్రాజ్యవాద అనుకూల ప్రపంచ అభివృద్ధి నమూనాను వారిపై రుద్దుతూ వ్యవసాయక విప్లవ వ్యతిరేక వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కోరుతుంటే

పాలకవర్గాలు దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల నియంతృత్వాన్ని వారిపై రుద్దుతున్నారు. ఈ వైరుధ్యాలే ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడికి కారణమైనాయి. ఈ వైరుధ్యాలే రాంగూడలో జరిగిన ప్రభుత్వ నరహంతక గ్రేహౌండ్స్, ఎస్.ఒ.జి. పోలీసు మూకల అమానవీయ దాడికి కారణమైనాయి. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వాస్తవాలను పక్కకునెట్టి మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులుగా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారుగా, ఉనికి కోసం చర్యలు చేస్తున్న వారుగా ఉండటం వల్లనే శాంతి భద్రతల రక్షణకు తాము దాడి చేయవలసి వచ్చిందని చెప్పడం పచ్చి అబద్ధం.

ఇక సంఘటనకు సంబంధించిన నిర్దిష్ట విషయాలను కూడా ఒకసారి పరిశీలిద్దాం. రాంగూడ గ్రామంలో జొగర్నాథ్ అనే పెత్తందారుకు వ్యతిరేకంగా ప్రజలు మా పార్టీ నేతృత్వంలో పోరాటం చేపట్టారు. ఇది అక్కసుగా చేసుకొని అతను 2014 డిసెంబర్‌లో మా పి.ఎల్.జి.ఎ.కు చెందిన సమాచారాన్ని పోలీసులకు అందించాడు. దీంతో పోలీసులు ఆపరేషన్ ఆలౌట్ పేరుతో కొదిలిబంద గ్రామం వద్ద వున్న మా పి.ఎల్.జి.ఎ. బలగాలపై పెద్ద దాడికి ప్లాన్ చేశారు. కానీ పోలీసుల సమాచారం ప్రజల ద్వారా మా పి.ఎల్.జి.ఎ. బలగాలకు ముందుగానే అందడంతో వాడి దాడిని తిప్పికొట్టారు. ఆ దాడి తర్వాత ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను ఛేదించే క్రమంలో జొగర్నాథ్ విషయం బయట పడింది. అతడిని ప్రజల ముందు విచారించగా తన తప్పును ఒప్పుకుంటూ ఇక నుండి బుద్ధిగా వుంటానని మాట్లాడాడు. ఈ సందర్భంగా ప్రజలు వాడి ఆర్థిక, రాజకీయ ఆధిపత్యాన్ని దెబ్బతీయడంలో భాగంగా అతని భూమిని స్వాధీనం చేసుకొని భూమిలేని ప్రజలకు పంచారు. ఊరిలో సంఘం పెట్టుకొని ప్రజల అధికారాన్ని నెలకొల్పారు. అప్పటి నుండి అతడు పిల్లలకు చదువు చెప్పడం పేరుతో గ్రామంలోనే ఉంటూ వచ్చాడు. తర్వాత కాలంలో మొబైల్ ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం అందిస్తున్నాడని ప్రజలకు అనుమానం వచ్చి మళ్ళీ ప్రజా పంచాయితీ నిర్వహించారు. ఈసారి తన వద్ద మొబైల్ ఫోన్ ఉంది, కానీ సిమ్ లేదని బొంకాడు. కానీ ప్రజలు ఇంట్లోకి వెళ్ళి వాడు దాచుకున్న మరో సిమ్ వున్న మొబైల్ ఫోన్‌ను వెతికి తెచ్చారు. ఈసారి కూడా ప్రజలు వాడిని క్షమించి చివరి చాన్స్‌గా వదిలేశారు. అప్పటికే ఆ ప్రాంతంలో సాయుధ వ్యవసాయ విప్లవం తీవ్రతరం కావడంతో కొంతమంది పెత్తందారులు, వారి అనుయాయులు పారిపోయి రాజ్యం పక్షాన చేరారు. ముఖ్యంగా 2015 జనవరి నుండి, అంటే ఆపరేషన్ ఆలౌట్ దాడి తర్వాత ఆ ప్రాంతంలో ఆంధ్రా–ఒడిశా పోలీసుల దాడి తీవ్రరూపం దాల్చింది. ప్రజల అరెస్టులు, వేధింపులు నిత్యకృత్యమైనాయి. పోలీసులు ప్రజల ఇళ్ళపై దాడి చేసి లక్షలాది రూపాయల ఆస్తులను దోచుకున్నారు. మరోవైపు పారిపోయిన ప్రజా వ్యతిరేకుల్ని, పోలీసులు కూడగట్టి ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేశారు. కటాఫ్ ఏరియా చుట్టూ ఆంధ్రా, ఒడిశా ప్రభుత్వాలు పోలీసు క్యాంపులను పెంచాయి. వీటిని కేంద్ర సాయుధ పోలీసు బలగాలైన బి.ఎస్.ఎఫ్., సి.ఆర్.పి.ఎఫ్. బలగాలతో పాటు స్థానిక బలగాలతో నింపారు. కమాండో బలగాలైన గ్రేహౌండ్స్, ఎస్.ఒ.జి. బలగాలను పటిష్టం చేశారు. ఈ పోలీసు బలగాలకు జి.పి.ఎస్.ల వంటి సాంకేతిక పరికరాలను అందించడంతో పాటు టార్, ఎ.కె–47 వంటి అత్యాధునిక ఆయుధాలతో వారిని సాయుధం చేశారు. ముఖ్యంగా 2015 తర్వాత ఈ రెండు రాష్ట్రాల పోలీసు బలగాల మధ్య సమన్వయం పెరిగి స్వల్ప వ్యవధితో కూడిన ఏరియా డామినేషన్లు నిర్వహిస్తున్నారు. ఈ సాయుధ దాడి ద్వారా ప్రజలను ఒకవైపు భయోత్పాతానికి గురిచేస్తూ, మరోవైపు ప్రజల నుండి ఒక సెక్షన్‌ను విడదీసేందుకు బూటకపు సంస్కరణలను పెద్ద ఎత్తున గుప్పిస్తున్నారు. ఈ రెండు సంవత్సరాలలో రాజ్యం దాడి తీవ్రతరం కావడంతో స్థానిక ప్రజా శతృవులు ఉద్యమ ప్రాంతానికి చుట్టూ వున్న చిన్న చిన్న పట్టణాలలో వుంటూ తమ ప్రతీఘాతుక కార్యకలాపాలను తీవ్రతరం చేశారు. ఇదే అదునైన సమయంగా భావించి జొగర్నాథ్ ఒక రోజు ఇంటి నుండి పారిపోయి ఎ.పి.ఎస్.ఐ.బి. లింక్‌లోకి వెళ్ళాడు. సాధారణంగా ఇలా పారిపోయిన వాళ్ళు పోలీసులతోనూ లేదా ఎక్కడైనా టౌన్‌లోను ఉంటూ తమ కార్యకలాపాలను సాగిస్తూ వుంటారు. కానీ జొగర్నాథ్ మాత్రం ఎవరికి అర్థం కాకుండా రహస్యంగా వుంటూ వచ్చాడు. దీంతో మళ్ళీ ఆ గ్రామంలో అతనిపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా అతని కుటుంబ పరివారాన్ని (తల్లి, అన్న, భార్య, పిల్లలు తదితరులు) గ్రామంలో ఉంచాలా లేక పంపేయాలా అనే విషయంపై కూడా చర్చ జరిగింది. చివరికీ వాడి కార్యకలాపాలతో కుటుంబ సభ్యులకు సంబంధం లేదనీ, వారు గ్రామంలోనే వుండవచ్చునీ, అయితే సంఘానికి తెలియకుండా సంతలకు గానీ, టౌన్‌కు గాని వెళ్ళరాదని షరతులు విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కానీ కొద్ది రోజుల తర్వాత జొగర్నాథ్ భార్య పారిపోయి అతడి వద్దకు చేరింది. మొత్తంగా ఆ ప్రాంతంలో విప్లవ యుద్ధంతో పాటు ప్రతిఘాతుక విప్లవ యుద్ధం కూడా తీవ్రరూపం దాల్చింది. దీనికి తోడు ప్రత్యేకంగా రాంగూడ (ఒండ్రుపల్లి పంచాయితీ) ప్రాంతానికి మూడు వైపులా నీరు వుండి ప్రభుత్వ సాయుధ బలగాల దాడికి అనుకూలంగా వుంది. ఈ విషయాలు పార్టీ, పి.ఎల్.జి.ఎ. దృష్టిలో వుండి అవి తమ కదలికలనూ, కార్యకలాపాలను ప్రజలపై ఆధారపడి, జాగ్రత్తగా ఒక పథకం ప్రకారం రూపొందించుకుంటూ వచ్చాయి. ఈ క్రమంలోనే అక్టోబర్ 23 ఉదయం పార్టీ, పి.ఎల్.జి.ఎ. శ్రేణులు రాంగూడ ప్రాంతంలో డేరా వేశాయి. అదే రోజు ఉదయం జొగర్నాథ్ తల్లి లాంచ్ ఘాటి వద్దకు వెళ్ళితే ప్రజలు పట్టుకొని విచారించారు. ఆ సందర్భంగా ఆమె 'తాను లాంచ్‌పై వెళ్ళాలనుకోలేదనీ, తన మనవరాలిని స్కూల్‌కి పంపేందుకు లాంచ్ ఘాటీ వద్దకు వెళ్ళానని' చెప్పింది. దీంతో పార్టీ కామ్రేడ్స్, ప్రజలు విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు. కానీ పార్టీ, పి.ఎల్.జి.ఎ. సమాచారం పోలీసులకు అందటానికి ఇదొక ముఖ్య సోర్స్‌గా ఆ గ్రామ ప్రజలతో పాటు పార్టీ భావిస్తున్నది. 23 సాయంత్రమే ఆ డేరాను ఖాళీ చేసి వేరే ప్రాంతానికి వెళ్ళాలనుకున్న పార్టీ, పి.ఎల్.జి.ఎ. బలగాలు కొన్ని ఇతర పనులు పడటంతో ఆ రాత్రికి అక్కడే వున్నారు. ఎప్పటి నుండో, అంటే కనీసం రెండు సంవత్సరాల నుండి ఆ ప్రాంతంలో నాయకత్వం దొరికే ఏ చిన్న అవకాశం వున్నా పెద్ద దాడి చేయాలనే ఉద్దేశ్యంతో రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు ఏర్పాట్లపై కేంద్రీకరించి పూర్తి చేసుకున్నారు. వీరికి ఈ మధ్య పార్టీ నుండి దిగజారిపోయిన కొద్ది మంది విప్లవ ప్రతీఘాతకులు తోడైనారు. దీంతో వాళ్ళకు అన్ని అనుకూలతలు తోడైనాయి. 23 సాయంత్రం నుండే కొన్ని రెక్కీ టీంలను అత్యంత రహస్యంగా డేరా సమీపానికి పంపారు. ఎంపిక చేసిన కొద్ది మంది కమాండో బలగాలను 23 రాత్రికే పి.ఎల్.జి.ఎ.

బలగాలు తప్పుకోవడానికి వీలులేని విధంగా డేరాకు సమీపాన వున్న ఎత్తైన గుట్ట పైన మోహరించారు. 24 ఉదయం 6గం॥ల కల్లా వందలాది పోలీసు బలగాలు డేరా సమీపానికి చేరి, చుట్టుముట్టి పి.ఎల్.జి.ఎ. బలగాలను నది వైపు నేట్టేందుకు ప్రయత్నించాయి. ఇటువంటి పరిస్థితులలో, ఆ సమయానికి పి.ఎల్.జి.ఎ. బలగాల రక్షణ వ్యవస్థ బలహీనంగా వుండటంతో శతృవును గుర్తించలేకపోయారు. దీంతో శతృవు దాడిచేసి "ఒక్కళ్ళను కూడా వదలొద్దంటూ" కేకలు పెడుతూ ఏకంగా రోల్‌కాల్‌పై సర్‌ప్రైజ్ దాడి చేశాడు. ఈ సర్‌ప్రైజ్ నుండి మరుక్షణంలోనే తేరుకున్న పి.ఎల్.జి.ఎ. బలగాలు వీరోచితంగా ప్రతిఘటిస్తూ శతృదాడిని తిప్పికొట్టే క్రమంలో అనివార్యంగా పోలీసు వలయాన్ని గండి కొట్టవలసి వచ్చింది. ఈ క్రమంలోనే మొత్తంగా అమరులైన 31 మంది కామ్రేడ్స్‌లో మెజారిటీ కామ్రేడ్స్ ఇక్కడే అమరులైనారు. కొద్దిమందికి గాయాలైనప్పటికీ 54 మంది కామ్రేడ్స్ సురక్షితంగా ప్రజల సహకారంతో బయటపడ్డారు. అయితే శతృవు కేవలం పార్టీ, పి.ఎల్.జి.ఎ. బలగాలపై మాత్రమే కాల్పులు జరపలేదు. క్యాంపుకు వచ్చిన నిరాయుధులైన 9 మంది యువతను పట్టుకొని కాల్చి చంపారు. ఆ దాడిలో గాయపడి క్యాంపు పరిసరాలలో పడిపోయిన ముగ్గురు పి.ఎల్.జి.ఎ. కామ్రేడ్స్‌ను కూడా పట్టుకొని చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు. ఈ దాడి సందర్భంగా పోలీసు అధికారులు "పెద్దతలలు కొడితే ఎక్కువ డబ్బులు వస్తాయని" ప్రోత్సహించడాన్ని మా పి.ఎల్.జి.ఎ బలగాలు విన్నారు. ఈ మారణకాండ 24 నుండి 27 తేదీ దాకా కొనసాగింది. ఇదే సందర్భంగా పోలీసులు రాంగూడ గ్రామంలోని ఒక ఇంటిపై కాల్పులు జరిపారు. డొంగల్లో (పడవ) పారిపోతున్న ప్రజలపై కాల్పులు జరపగా ఒక రైతుకు గాయాలైనాయి. ఈ దాడిలో పాల్గొన్న కమాండో బలగాలు ఎటువంటి విలువలు లేకుండా డబ్బులకు అమ్ముడుపోయిన అరాచకపు గుండా గుంపుల్లా వ్యవహరించారు. వీరి 'ధీరోధాత్తమైన' చర్యకు బహుమానంగా హెలికాప్టర్‌లలో విస్కీ సీసాలు వచ్చాయి. ఆ ప్యాక్‌లు ఇప్పటికీ అక్కడే పడి వున్నాయి. ఆ ప్రాంతానికి వెళ్ళిన వాళ్ళు ఎవరైనా వాటిని చూడవచ్చు.

ఈ దాడి అక్కడి ప్రజానీకాన్ని కొంత భయోత్పాతానికి గురి చేసినప్పటికీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాస్తవంగా ఎవరి పక్షాన వున్నాయో ఈ దాడి ద్వారా ప్రజలకు మరింత బహిర్గతమైంది. పోలీసులు ఈ దాడిలో విజయవంతమైనప్పటికీ ప్రజలను గెలుచుకోలేకపోయారు. ప్రజలు ఈ దాడికి ముందు తర్వాత కూడా పార్టీతోనే వున్నారు. ఈ సంఘటన సందర్భంగా ప్రజలు నిర్వహించిన పాత్ర చూస్తే పోలీసులు తమ దాడికి చూపెడుతున్న కుంటిసాకుల బండారం బహిర్గతమవుతుంది. పోలీసు అధికారులు ప్రచారం చేస్తున్నట్లుగా మావోయిస్టులు ప్రజావ్యతిరేకులు, అభివృద్ధి నిరోధకులు అయితే 28 కిలోమీటర్ల దూరం, వాళ్ళ కమాండో బలగాలు ఏ ఒక్క మనిషికి కనబడకుండా దొంగతనంగా ఎందుకు ప్రయాణం చేసినట్లు? మా డేరాకు దగ్గరలో వున్న గుసంపొదూర్ గ్రామ ప్రజలు మాకు సమాచారం ఇచ్చేందుకు పరుగెత్తుకుంటూ వస్తుంటే పోలీసు బలగాలు వారిని పట్టుకొని విపరీతంగా కొట్టి బెదిరించి ఎందుకు వాపస్ పంపినట్లు? ఈ విషయాలు నిజంగా ఎవరు ప్రజావ్యతిరేకులో ఎవరు అభివృద్ధి నిరోధకులో బహిర్గతపరుస్తాయి. పోలీసులు ప్రచారం చేస్తున్నట్లు మేమే అభివృద్ధి నిరోధకులం, ప్రజావ్యతిరేకులం అయితే పోలీసులకు అన్ని కుట్ర పద్ధతులు అవసరమై ఉండకపోయేవి. ప్రజలు మా పక్షాన ఉన్నారు కాబట్టే గ్రామ గ్రామాన సెంట్రీలు పెట్టుకొని పార్టీని రక్షించుకునేందుకు ప్రయత్నం చేస్తుండబట్టే ప్రజావ్యతిరేకులు, అభివృద్ధి నిరోధకులైన పోలీసులకు మా పై దొంగదెబ్బ తీయాల్సి వచ్చింది. ఇక మరో హాస్యాస్పదమైన విషయమేమిటంటే పోలీసులు శాంతి భద్రతలు రక్షించడానికే దాడి చేశారని ఎ.పి. డి.జి.పి. 'ప్రవచిస్తున్నాడు'. అయితే అవి ఎవరి శాంతి భద్రతలో 'ఆయనగారు' వివరిస్తే బాగుండేది. ప్రభుత్వాధికారులు, ఆదివాసేతర భూస్వాములు, కొందరు నిరంకుశ తెగ పెద్దలు, మత పెద్దలు అక్కడి ఆదివాసీ ప్రజలను తీవ్రంగా దోపిడీ చేసి వాళ్ళ శాంతికి, భద్రతకు విఘాతం కల్పించినప్పుడు ఆయన ఎక్కడున్నాడు? అప్పుడు ఆయన/పోలీసులకు చట్టాలు, బాధ్యతలు గుర్తు రాలేదా? ప్రజలు తమ హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం ఈ దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా పోరాడినప్పుడే మీకు శాంతి భద్రతలు గుర్తుకు వస్తాయి, ఇప్పుడు సరిగ్గ అందుకే వచ్చాయి కూడా. మళ్ళా ఒక్కసారి ఈ పోలీసు వ్యవస్థ ఈ దోపిడీ పాలకవర్గాల చేతిలో సాధనమనే విషయాన్ని రుజువు చేసుకున్నది. మరో విషయమేమిటంటే పోలీసులు ఆయుధాలు వుంటే సహించమంటున్నారు. కానీ మా వద్ద వున్న వివిధ గ్రామాలకు చెందిన యువత ఎవరి వద్దా ఆయుధాలు లేవు. అంతేకాదు పార్టీకి చెందిన విద్య, వైద్యం, వ్యవసాయం వంటి శాఖలలో పని చేస్తున్న కొద్ది మంది కామ్రేడ్స్ వద్ద కూడా తుపాకులు లేవు. మరి పోలీసులు 9 మంది యువతతో పాటు వివిధ శాఖలకు చెందిన కొద్ది మంది నిరాయుధ కామ్రేడ్స్‌ను పట్టుకొని చిత్రహింసలు పెట్టి ఎందుకు కాల్చి చంపినట్లు? పోలీసులు దోపిడీ వర్గాల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నారు కనుకనే "ఒక్కరిని కూడా వదలొద్దం"టూ కేకలు పెడుతూ దాడి చేశారు. మరి పోలీసులు చట్టాల గురించి మాట్లాడటంలో అర్థమేమున్నది? అందుకే పోలీసులు ఎంతగా ప్రజాస్వామ్యం గురించి మాట్లాడినా రాజీపడని వర్గవైరుధ్యాల పర్యవసానంగా ఏర్పడిన రాజ్యంలో మీరు దోపిడీ వర్గాల చేతిలో ఒక సాధనం అనే విషయం ఎంత దాచినా దాగని సత్యం.

ఇక చివరగా మేము చెప్పదల్చుకున్నదేమిటంటే అమరులైన వారిలో మెజారిటీగా వ్యవసాయ కూలీ, పేద రైతాంగానికి చెందిన వారే అధికం. కొద్ది మంది మధ్య తరగతికి చెందినవారు కూడా వున్నారు. సామాజిక గ్రూపుల రీత్యా చూస్తే ముగ్గురు వెనుకబడిన కులాలకు చెందిన వారైతే మిగిలిన వారంతా ఆదివాసీలు, దళితులు; ఈ వర్గ, సామాజిక సంపుటి మా పార్టీ ఏ వర్గ ప్రజల ప్రయోజనాల కోసం అంకితమై పని చేస్తున్నదో తెలియజేస్తున్నది. అంతే కాదు ఈ సంపుటి మా పార్టీ పీడిత వర్గ స్వభావాన్ని కూడా తెలియజేస్తున్నది. వీరిలో మెజారిటీ మంది భూమి కోసం పోరాడుతూ సాయుధ వ్యవసాయ విప్లవ రాజకీయాలతో సాయుధులైన వాళ్ళే. ఈ నష్టం మా పార్టీకీ, పీడిత ప్రజలకూ తీవ్రమైనదే, వెంటనే పూరించుకోలేనిదే. అయితే వ్యవసాయ విప్లవం ఇరుసుగా నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం ప్రజాయుద్ధ రాజకీయాలతో సంఘటితపడిన ప్రజా నిర్మాణాలు మాకు విస్తృతంగానే ఉన్నాయి. ఈ బలమైన ప్రజాపునాది నుండే తిరిగి నాయకత్వం ఉద్భవిస్తుందనీ, ఇది చారిత్రక సత్యమని తెలియజేస్తున్నాం. ✱

# రాంగూడ సంఘటనపై

## కామ్రేడ్ ఆర్.కె.తో ఇంటర్వ్యూ

*(క్రాంతి పత్రికకు ఇచ్చినది)*

**1. సి.పి.ఐ. (మావోయిస్టు)చరిత్రలో రాంగూడ ఘటన అతి పెద్ద ఘటన కదా! ఎలా జరిగింది? వివరించండి.**

**జ॥** నిజమే మీరన్నట్లు రాంగూడ ఘటన మా పార్టీ చరిత్రలో జరిగిన అతి పెద్ద ఘటనగా చెప్పవచ్చు. కొన్ని బూర్జువా పత్రికలు ఈ దాడిని, ప్రభుత్వం మా పై చేపట్టిన 'సర్జికల్ స్ట్రైక్'గా వర్ణించడం మీరు గమనించే వుంటారు. ఈ దాడిలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన గ్రేహౌండ్స్, ఎస్.ఓ.జీ. కమాండో బలగాలతో పాటు కేంద్ర ప్రభుత్వ పారా మిలిటరీ బలగాలు కూడా పాల్గొన్నాయి. ఆంధ్రప్రదేశ్ డి.జి.పి. ఇచ్చిన ప్రకటన ప్రకారం 800 బలగాలు ఈ దాడిలో పాల్గొన్నాయి. అక్టోబర్ 24, 2016 ఉదయం 6 గంటలకు, మేము రోల్‌కాల్‌లో వున్నప్పుడు వాళ్లు మమ్మల్ని చుట్టుముట్టారు. అప్పుడు ప్రభుత్వ సాయుధ బలగాలకు, మా పి.ఎల్.జి.ఎ. బలగాలకు మధ్య 45 ని॥ల నుండి 1గంట వరకు హోరాహోరిగా కాల్పులు జరిగాయి. ఈ పోరాటంలో మాకు పెద్ద నష్టమే జరిగింది. మా వైపు 31 మంది కామ్రేడ్స్ అమరులైనారు. వీరిలో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు ఇద్దరు. డివిజనల్ కమిటీ సభ్యులు ఇద్దరు, ఏరియా కమిటీ సభ్యులు పన్నెండు మంది, పార్టీ సభ్యులు ఆరుగురు, వివిధ ప్రజాసంఘాలకూ, మిలీషియాకు చెందిన వారు 9 మంది వున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బలగాలలో ఒక సీనియర్ కమాండో చనిపోవడంతో పాటు మరొకరికి తీవ్రమైన గాయాలయ్యాయి. మరో నల్గురికి స్వల్పంగా గాయాలయ్యాయి.

ఈ ఘటనను అర్థం చేసుకోవాలంటే మరికొన్ని విషయాలను కూడ తెలుసుకోవాల్సి ఉంటుంది. ఈ దాడి ప్రధానంగా మా పార్టీ పై స్థాయి నాయకత్వ కామ్రేడ్స్‌ను లక్ష్యంగా చేసుకొని జరిగింది. ఇటువంటి ప్రయత్నాలు జనవరి 2015 నుండి ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ పేరుతో ముమ్మరం చేసారు. ఇటువంటి దాడులే జనవరి 2015న 'బెజ్జి' పాకెట్‌లో, ఆగస్టు 2015న 'జంత్రి' పాకెట్‌లో, డిసెంబర్ 2015న 'నందపూర్' పాకెట్‌లో మా పై జరిగాయి. ఈ మూడు సందర్భాలలో కూడా నాయకత్వాన్నే లక్ష్యంగా చేసుకొన్నారు. వందలాది ప్రభుత్వ సాయుధ బలగాలు అత్యంత పకడ్బందీ పథకాలతో ఈ దాడులు నిర్వహించారు. అయినప్పటికీ మా పి.ఎల్.జి.ఎ. బలగాలు ఈ దాడులను వీరోచితంగా తిప్పికొట్టాయి.

ఈ వైఫల్యాల నుండి వాళ్లు గుణపాఠాలు తీసుకున్నారు. ఈ సారి మరింత రహస్యంగా, మరింత కుట్ర పూరితంగా పథకం రూపొందించారు. ఈ పథకాన్ని, జరుగుతున్న మార్పులను మేం లోతుగా అర్థం చేసుకోలేకపోయాం. 23 ఉదయమే మా బలగాలన్నీ రాంగూడ మకాంకు చేరాయి. అప్పటిదాకా మా సంస్థాగత పనులు పూర్తి చేసుకొన్నాం. దీంతో బాహ్య వలయంలో వున్న రక్షణ బలగాలను కూడ వెనక్కి పిలిపించాము. ఆ రోజు జమైన మా బలగాలతో మాట్లాడి, పనులు ప్లాన్ చేసుకొని సాయంత్రమే విడి పోవాలనుకున్నాం. ఆ రోజు మేము ఎంపిక చేసుకొన్న రాంగూడ డేరా, రక్షణరీత్యా, బలహీనమైందనే విషయం మా దృష్టిలో వుంది. దానికి రెండు వైపుల 'ఎల్' ఆకారంలో నది ప్రవహిస్తూ వుంటుంది. ఆ డేరానే కాదు, మొత్తంగా ఆ పాకెట్ గ్రామాల పరిస్థితి అదే. ఆ పాకెట్ నుండి బయట పడాలంటే నదిని దాటకుండా బయటపడలేము. ఇదొక అనివార్య పరిస్థితి. ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకొనే 23 సాయంత్రానికి పనులు పూర్తి చేసుకొని పాకెట్‌ను ఖాళీ చేయాలనుకున్నాం. కానీ ఆ రోజు మా బలగాల్లో కొన్ని బ్యాచీలు మకాంకు ఆలస్యంగా చేరడంతో మేమనుకున్నట్లు 23 సాయంత్రానికి పనులు పూర్తి కాలేదు. దీంతో ఆ పూట అక్కడే వుండి 24 సాయంత్రానికి మకాం ఖాళీ చేద్దామనుకున్నాము. ఇదే సందర్భంగా శత్రు సమాచారాన్ని వాకబ్ చేసాము. మా పరిసర ప్రాంతాల్లో శత్రు కదలికలు లేవనే విషయం తెలిసింది. ఈ సమాచారం కూడ, మేము ఆ రోజు అక్కడే వుండాలని తీసుకున్న నిర్ణయానికి ఊతమిచ్చింది.

మేము అక్కడే ఉండాలని నిర్ణయం తీసుకున్న తర్వాత అదే రాత్రి 7 గంటలకు మాకు దక్షిణాన వున్న కొండపై రెండు లైట్లు వెలిగి ఆరిపోయాయి. కానీ వాటిని లైట్లని నిర్ధారించుకోలేక పోయాము. రాత్రిపూట చుక్కలు అప్పుడప్పుడు అలా కన్పిస్తుంటాయని సరిపుచ్చుకొన్నాము. అదే రోజు ఉదయం రాంగూడకు చెందిన ఇన్‌ఫార్మర్ తల్లి చిత్రకొండకు వెళ్లేందుకు ప్రయత్నిస్తే, ప్రజలు ఆమెను అడ్డుకొన్నారు. ఆమె మాత్రం మనుమరాలిని పంపి తను వాపసు వచ్చింది. ఈ విషయాన్ని ప్రజలు మాకు తెలియ చేసినప్పటికీ మేం ప్రమాదాన్ని శంకించలేక పోయాము. కొద్ది రోజుల ముందు ఒక విలేఖరికి పని చెప్పాము. అతన్ని 22 సాయంత్రం కలిసేందుకు వేరే గ్రామంలో అపాయింట్‌మెంట్ పెట్టాము. కానీ అతను 22 సాయంత్రానికి రమ్మన్న స్థలానికి రాకుండా, మా గురించి వాకబ్

చేస్తూ 23 రాత్రి 10 గంటలకు రాంగూడ గ్రామానికి వచ్చి మమ్మల్ని కలిసాడు. ఈ విషయం కొంత అసహజంగా వున్నప్పటికీ, సీరియస్‌గా తీసుకోలేదు. వాస్తవంగా 23 ఉదయం నుండి రాత్రి 10 గంటల దాక, మా దృష్టికి వచ్చిన ఈ మూడు విషయాలు ప్రమాదాన్ని సూచించే సంకేతాలే. ఈ సంకేతాలను క్రోడీకరించు కున్నట్లయితే మేము అదనపు జాగ్రత్తలు తీసుకునే వాళ్లమే. కానీ క్రోడీకరించుకోలేదు. అదే మా వైఫల్యం.

ఇక మరో వైఫల్యమేమంటే 24 ఉదయం నుండి కొన్ని బలగాలు విడిపోవాల్సి రావడంతో రక్షణ ఏర్పాట్లు సడలించబడుతూ వచ్చాయి. సెంట్రీలు, పెట్రోలింగ్స్ నిర్వహణ, సైనిక నియమానుసారం జరగలేదు. మా ఈ వైఫల్యం శత్రువుకు మరింత కలిసి వచ్చింది. దీంతో రాత్రికి రాత్రే, ప్రజలెవరి కంట బడకుండా మేమున్న పాకెట్‌లోకి ప్రవేశించిన బలగాలు ఉదయం 6 గంటల కల్లా మేమున్న మకాంను చుట్టుముట్టి, ఒక బ్యాచ్ నేరుగా మా మకాంలోకి ప్రవేశించింది. ఆ సమయంలో మేం రోల్‌కాల్ చేస్తున్నాం. అయితే మా కామ్రేడ్స్ ముందుగా పోలీసులను గమనించి, కొంత సర్‌ప్రైజ్‌కు గురి అయినప్పటికీ, వెంటనే తేరుకొని ఫైరింగ్ ప్రారంభించారు. అయితే అప్పటికే డేరాను పోలీసులు చుట్టుముట్టి వుండటంతో, మా బలగాలు అక్కడే ఎక్కువ సేపు ప్రతిఘటన ఇవ్వకుండా, రాత్రి లైట్లు కనబడిన కొండవైపుకు రిట్రీట్ అయ్యారు. ఆ క్రమంలోనే కొండపై నుండి పోలీసులు కాల్పులు ప్రారంభించారు. దీనిని బట్టి రాత్రి కనిపించిన లైట్లు పోలీసులవని నిర్ధారణ అయింది. పై నుండి వస్తున్న కాల్పులను తిప్పికొడ్తూనే మా బలగాలు మరో వైపు కొండ కింది దిశగా వెళ్లాయి. అప్పటికే మా బలగాలను చుట్టుముట్టిన పోలీసు బలగాలు అన్ని వైపుల నుండి కాల్పులు ప్రారంభించారు. ఈ పరిస్థితిలో పోలీసు వలయాన్ని గండికొట్టి బయటపడే క్రమంలో ఎక్కువ మంది కామ్రేడ్స్ వీరోచితంగా పోరాడుతూ అమరులైనారు. ఈ సందర్భంగా గాయపడిన కామ్రేడ్స్‌ను పోలీసులు పట్టుకొని క్రూరంగా చిత్ర హింసలకు గురిచేసి, అప్పుడే కాల్చి చంపారు. 25వ తేది ఉదయం, గాయపడి తుప్పల్లో దాక్కున్న నల్గురు నిరాయుధ మిలీషియా కామ్రేడ్స్‌ను పట్టుకొని కాల్చి చంపారు. 26వ తేదీ, తీవ్రంగా గాయపడి రిట్రీట్ కాలేక ఒక గొయ్యిలో దాక్కున్న మహిళా కామ్రేడ్‌ను హత్య చేశారు. 27వ తేదీ, గాయపడి అక్కడ నుండి బయటపడ లేని మరో ఇద్దరు కామ్రేడ్స్‌ను పట్టుకొని కాల్చి చంపారు. మొత్తంగా ఈ హత్యాకాండ 24వ తేది నుండి 27వ తేది వరకు నాలుగు రోజుల పాటు జరిగింది. ఈ నాలుగు రోజుల పాటు హెలికాప్టర్‌లలో పాత బలగాల స్థానంలో నూతన పోలీసు బలగాలను దింపుతూ వచ్చారు. ఏ.పి. డి.జి.పి.తో పాటు పలువురు పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి, మొత్తం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలీసులు రాంగూడ గ్రామాన్ని కూడ చుట్టుముట్టి కాల్పులు జరిపారు. భయంతో చిన్న చిన్న డొంగల (పడవ)లో పారిపోతున్న ప్రజలపై కూడా కాల్పులు జరిపారు. ఈ సందర్భంగా ఒక రైతు గాయపడ్డాడు. ఈ ఘటన సందర్భంగా మా బలగాలు 85 మంది వున్నారు. అయితే వీరిలో 30 మంది నిరాయుధులైన ప్రజా సంఘ నిర్మాణాలకూ, మిలీషియాకు చెందినవారు. ఈ సందర్భంగా 54 మంది కామ్రేడ్స్ సురక్షితంగా బయటపడ్డారు.

## 2. ఇంత భారీ సంఘటన ఎందుకు జరిగింద నుకుంటున్నారు?

**జ॥** ఇక్కడే అసలు విషయం వుంది. వాళ్ళు (పోలీసులు) మమ్మల్ని 'శాంతి భద్రతలకు' విఘాతం కల్గించే వాళ్లుగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. 'శాంతి భద్రతల'ను కాపాడేందుకు మా పై దాడి చేసామంటున్నారు. ఇది పచ్చి అబద్ధం. ప్రజలెవరూ ఈ విషయాన్ని నమ్మరు. నమ్మటం లేదు కూడా. వాస్తవంగా ఈ దాడి వెనుక ఈ దోపిడీ ప్రభుత్వాలకు ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు వున్నాయి. ఈ దేశ పాలకవర్గాలైన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు సామ్రాజ్యవాదులకు దళారీలుగా పని చేస్తున్నాయి. వీళ్ళు ఈ దేశ సంపదను సామ్రాజ్యవాదులకు దోచి పెట్టడమే కాకుండా తమ బొక్కసాలు కూడా నింపుకుంటున్నారు. ముఖ్యంగా ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థలో సంక్షోభం తీవ్రతరమైన తర్వాత అందులో నుండి బయటపడేందుకు ఈ దోపిడీని మరింత తీవ్రతరం చేశారు. 'సంస్కరణల' ముసుగులో ఈ నయా వలస దోపిడీ దేశ ప్రజలపై విచ్చలవిడిగా కొనసాగుతున్నది. వాళ్ళిప్పుడు ఖనిజ సంపదను దోచుకోవడంపై ఎక్కువ దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా, ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలలో పెద్ద ఎత్తున బాక్సైట్ తవ్వకాలు మొదలు పెట్టి ఆదివాసీ ప్రజలను నిర్దాక్షిణ్యంగా విస్తాపితుల్ని చేస్తున్నారు. వాళ్లు చేస్తున్న ఈ బందిపోటు ప్రయత్నాలను మా పార్టీ నేతృత్వంలో ప్రజలు సమరశీల పోరాటాలతో ఎదుర్కొంటున్నారు. 'జల్, జంగల్, జమీన్' మావే అనే నినాదంతో తమ సంపదను తామే కాపాడుకొనేందుకు ఈ దోపిడీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సంఘటితపడుతున్నారు. ఈ పరిణామాలు ఈ దోపిడీ ప్రభుత్వాలకు మింగుడు పడటం లేదు. ఆర్థికంగా, రాజకీయంగా ప్రజల నుండి ఎదురవుతున్న ఈ ప్రతిఘటనను, పాలకవర్గాలు ఏ మాత్రం సహించలేకపోతున్నారు. అందుకే వాళ్లు ఫాసిస్టు అణిచివేతను ప్రధాన పరిష్కారంగా ఎంచుకున్నారు. ఈ ఫాసిస్టు అణిచివేతను ఇప్పుడు గ్రీన్‌హంట్ మూడవ దశ పేరుతో అత్యంత క్రూరంగా నిర్వహిస్తున్నారు. ఈ దాడి ద్వారా మా పార్టీనీ., పి.ఎల్.జి.ఎ.ను విప్లవ ప్రజానీకాన్ని పూర్తిగా దెబ్బతీసి తమ దోపిడీకి మార్గం సుగమం చేసుకోవాలను కుంటున్నారు. ఈ లక్ష్యంలో భాగంగానే రాంగూడ దాడి జరిగింది. ఈ కారణాల రీత్యానే ఈ దాడికి ఆపరేషన్ ఆల్ ఔట్ 2 అనే పేరు పెట్టారు.

## 3. ఈ ఘటన ప్రజలపై ఎలాంటి ప్రభావం వేసిందనుకుంటున్నారు?

**జ॥** ప్రజలు చరిత్రను నిర్మిస్తారు. అయితే ఈ ప్రయాణం సీదా సాదాగా ఉండదు. అనేక బాధాకరమైన అనుభవాల గుండా, తిరోగమనాలు, పురోగమనాలతో ఈ ప్రయాణం సుదీర్ఘంగానే ఉంటుంది. ఈ క్రమంలోనే వాళ్ళు రాటుదేలుతారు. ప్రస్తుతం కట్ ఆఫ్ ఏరియా ప్రజలు కూడా విప్లవ యుద్ధంలో రాటుదేలుతున్నారు. నిర్దిష్టంగా ఈ సంఘటన గురించి చెప్పాలంటే వాళ్ళు, పార్టీనీ, పి.ఎల్.జి.ఎ.నీ, ప్రజా నిర్మాణాలను రక్షించుకొనేందుకు చాలా బాధ్యతగా వ్యవహరించారు. ఎన్‌కౌంటర్‌కు ముందు పోలీసుల కదలికలను ఒకే గ్రామ ప్రజలు చూశారు. వాళ్లు మాకు సమాచారం ఇచ్చేందుకు వేగంగా వస్తుంటే, వాళ్లను పోలీసులు గమనించి పట్టుకొని కొట్టి వెనక్కి పంపారు. ఎన్‌కౌంటర్ తర్వాత తప్పుకొన్న మా బలగాలను కాపాడటం కోసం వాళ్లు చేయని ప్రయత్నం లేదు. వాళ్ల సహకారమే లేకపోతే పార్టీ అక్కడ నిలదొక్కుకోవటం కష్టం. ఈ సందర్భంగా వాళ్ల భాగస్వామ్యానికి సహకారం అనటం చిన్న మాట కూడా అవుతుంది. వాళ్లు తమ నేతలను, సొంత బిడ్డలను కోల్పోయి దుఃఖంలోనూ, ఆందోళనలోనూ ఉన్నప్పటికీ, సాధించుకున్న విజయాలను వదులు కొనేందుకు సిద్ధంగా లేరు. తిరిగి వర్గ పోరాటాన్ని పురోగమింప చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ముఖ్యంగా ఈ సందర్భంగా చెప్పుకోవాల్సిన మరో ముఖ్య విషయమేమిటంటే, పట్టణ, మైదాన ప్రాంత ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు వాళ్లకు అండగా నిలబడటం వాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింప చేసింది.

## 4. ఈ ఘటన మీ పార్టీ క్యాడర్‌పై ఎలాంటి ప్రభావం వేసిందనుకుంటున్నారు?

**జ॥** గతంలో ఇటువంటి పెద్ద సంఘటనలు జరిగినప్పుడు కొంతమంది అధైర్యపడి దిగజారిపోతుండేవాళ్ళు. ప్రస్తుతం ఈ సంఘటన సందర్భంగా ఒక్కరు కూడ దిగజారిపోలేదు. దీన్ని బట్టి పార్టీ దృఢ పడిందనే అనుకుంటున్నాము. ఈ మధ్య కాలంలో మేము పార్టీ, సైన్యం, ఐక్య సంఘటనలలో బోల్షివీకరణ క్యాంపెయిన్ నిర్వహించాము. ఈ క్యాంపెయిన్ వల్ల పార్టీ సిద్ధాంతపరంగా, రాజకీయంగా, సైనికపరంగా మెరుగుదల సాధించింది. కనుక ఈ సంఘటన పార్టీ శ్రేణులపై పెద్దగా నకారాత్మక ప్రభావాన్ని చూపదనే అనుకుంటున్నాము.

## 5. దేశ వ్యాపితంగా ఈ ఘటనకు వ్యతిరేకంగా ప్రజలు, మేధావులు ఏ విధంగా స్పందించారు?

**జ॥** గతంలో వలె ఈ సారి కూడా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు ప్రభుత్వ దమనకాండను పెద్ద ఎత్తున నిరసించారు. సమాజంలో పెరుగుతున్న ప్రజాస్వామిక వాతావరణానికి ఈ కదలిక ఒక మంచి ప్రతీకగా వుంది. ఈ సారి ప్రత్యేకత ఏమిటంటే దేశ వ్యాపితంగా 12 యూనివర్సిటీల నుండి విద్యార్థులు సంఘటనా స్థలానికి వచ్చి, ఆదివాసీ రైతాంగాన్ని కలిసి నిజ నిర్ధారణ నివేదిక ద్వారా వాస్తవాలను ప్రకటించడమే గాకుండా, వారికి అండగా నిలిచారు. ఇంకా పౌరహక్కుల సంఘాలు, ఇతర ప్రజా సంఘాలు విడతలు, విడతలుగా సంఘటనా స్థలాన్ని సందర్శించి, ప్రజలను కలిసి వాస్తవాలను బహిర్గత పరచడమే కాకుండా స్థానిక ప్రజలకు మద్దతుగా నిలిచారు.

## 6. కొద్ది మంది మేధావులు పి.ఎల్.జి.ఎ. అంటే చావు సైన్యమనీ, మీ పార్టీకి ప్రజల మద్దతు లేదని రకరకాలుగా వ్యాఖ్యానించారు కదా! వాటి మీద మీ స్పందన ఏమిటి?

**జ॥** విప్లవోద్యమాన్నీ, విప్లవ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకొని దుష్ప్రచార దాడి చేసేందుకు వాళ్లకు సామ్రాజ్యవాదుల నుండి ఆదేశాలు వున్నాయి. వాళ్ళకు త్యాగాలు లేకుండా చరిత్ర పురోగమనం వుండదనే విషయం అర్థం కాదు, అర్థం చేసుకోరు కూడా. నిజమే వాళ్ళన్నట్లు మేము కొండను ఢీకొంటాం, పర్వతాలను తవ్వుతాం, ఏటికి ఎదురీదుతాం. ఇటువంటి సంకల్పం, కార్యాచరణ లేకుండా వట్టి పోచికోలు కబుర్లతో కరుదు గట్టిన ఈ దోపిడీ వ్యవస్థను ఎవరు మార్చలేరు. వాళ్ళు ఉద్దేశపూర్వకంగా మాపై దాడి చేయాలనుకుంటున్నారు. కనుక విప్లవోద్యమం సమాజంలో తీసుకొచ్చిన మార్పులనూ, విప్లవోద్యమానికి పెరుగుతున్న ప్రజల మద్దతును చూడ నిరాకరిస్తారు. అజేయమైన ప్రజా సైన్యం వాళ్ళకు చావు సైన్యంలా కనిపిస్తుంది. అది వాళ్ళ అత్యాశ మాత్రమే. వాళ్ళెప్పుడో రాజకీయ నిబద్ధతను కోల్పోయారు. వాళ్లు వృత్తిపరమైన అవకాశవాదులు. తమ స్వార్థ, సంకుచిత ప్రయోజనాల కోసం, కుతర్కంతో తమ 'తెలివి తేటల'ను దోపిడీ పాలకవర్గాలకు ఉపయోగపెడ్తుంటారు. దేశంలో ఒక వైపున సామ్రాజ్యవాద గ్లోబలీకరణ ఆర్థిక విధానాలు మరో వైపున రాజకీయంగా బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు విధానాలు అమలవుతున్న నేటి పరిస్థితుల్లో తమ స్వార్థ ప్రయోజనాలకు, డబ్బు సంచులకు అమ్ముడు పోయే మేధావుల సంఖ్య పెరుగుతున్నట్లు మనం గమనించవచ్చు. నేటి ఈ పరిస్థితి విప్లవ, కుహన మేధావుల మధ్య ఖచ్చితమైన విభజన రేఖను గీస్తుంది. స్పష్టమైన పోలరైజేషన్‌ను మన ముందుంచుతుంది.

## 7. ఈ ఘటనకు సంబంధించిన ఏ ఏ లోపాలు గుర్తించారు? ఏమి గుణ పాఠాలు తీసుకుంటున్నారు?

**జ॥** యుద్ధమన్న తర్వాత త్యాగాలు అనివార్యం. అయితే అనవసర త్యాగాలు చేయకూడదనేది మా విధానం. రాంగూడ సంఘటనలో మా వైపు నుండి లోపాలు జరిగాయి. ఆ సందర్భంగా

శత్రువు శక్తిని తక్కువగా అంచనా వేసాము. గెరిల్లా యుద్ధ నియమాలను పాటించడంలో కొంత అలసత్వం కూడ చోటు చేసుకుంది. మా ఈ లోపాలే శత్రువుకు విజయావకాశాలుగా మారాయి. మాకు భారీ నష్టం జరిగింది. మేము ఆ తప్పులు చేయకుండా వుంటే కొంత మేరకు నష్టాలను నివారించుకోగలిగే వాళ్లం. యుద్ధ పరిస్థితిలో రోజు రోజుకు మార్పు వస్తున్నది. భారత పాలక వర్గాలు మమ్మల్ని తుడిచిపెట్టి వాళ్ల దోపిడీని తీవ్రతరం చేసేందుకు మా పై దాడిని పూర్తి స్థాయిలో కేంద్రీకరించారు. ఈ దాడిని గ్రీన్‌హంట్ మూడవ దశ అంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ దాడిని ఓడించేందుకు మేము మరింతగా ప్రజలను అంటి పెట్టుకొని వుంటాము. ఈ యుద్ధంలో ఇదే మా అసలు బలం. అలాగే కార్మిక వర్గ క్రమశిక్షణను చైతన్యవంతంగా అమలు చేయడంతో పాటు నేడున్న కఠిన పరిస్థితులలో సైతం ఎంతటి కష్టాలకైన సిద్ధపడి గెరిల్లా యుద్ధ నియమాలను అమలు చేస్తాం. ఈ విధానాలే మమ్మల్ని గెలుపు వైపు నడిపిస్తాయి. గతంలో ఇటువంటి గడ్డు పరిస్థితుల్ని అధిగమించిన అనుభవం మా పార్టీకి వుంది.

### 8. ఏ.ఓ.బీ. ఉద్యమానికి కోలుకోలేని దెబ్బతీశామని ప్రభుత్వం, పోలీసులు ప్రచారం చేస్తున్నారు కదా! మీరేమంటారు?

**జ॥** ఇటువంటి దుష్ప్రచారాన్ని పోలీసులు ఒక కళగానే అభ్యసించారు. ఎల్.ఐ.సి.లో భాగంగానే వాళ్లు ఇటువంటి దుష్ప్రచారానికి పాల్పడి, ప్రజల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తుంటారు. వాస్తవంగా ఇది మాకు భారీ నష్టమే అయినప్పటికీ మా అమరులు లేని లోటును పూడ్చేందుకు మా కామ్రేడ్స్ అంతా వాళ్ల పనిలో రెట్టింపు కష్టానికి సిద్ధపడుతున్నారు. మాకున్న గాఢమైన విప్లవకర ప్రజా పునాది నుండి నూతన శక్తులు ఎదిగి వస్తున్నారు. ఈ నష్టం మా సుదీర్ఘ ప్రయాణంలో, లక్ష్య సాధనలో చిన్న అవరోధమే.

### 9. నిర్దిష్టంగా ఈ ప్రాంతంపై శత్రు దాడి పెద్ద ఎత్తున అమలు కావడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

**జ॥** వాళ్ల మొదటి ప్రాధాన్యత, పై స్థాయి నాయకత్వాన్ని నిర్మూలించడం. ఇందుకనుగుణంగా, ఆ ప్రాంతంలో మా నాయకత్వ కదలికలుండటంతో వాళ్లను నిర్మూలించేందుకే ఆ ప్రాంతంపై ఇంత పెద్ద దాడి చేసారు. ఇక ఆ సరిహద్దు ప్రాంతమంతా బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజల సమరశీల పోరాటాలు జరుగుతున్నాయి. నిర్దిష్టంగా కట్ ఆఫ్ ఏరియాలో సాయుధ వ్యవసాయ విప్లవం ఊపందుకొని, స్థానిక ఆదివాసీ రైతాంగం భూస్వాములకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటం చేపట్టి, వందలాది ఎకరాల భూములు ఆక్రమించడంతో పాటు సాయుధులవుతూ రాజ్యాధికార నిర్మాణాల దిశగా పురోగమిస్తున్నారు. ఈ కారణాల రీత్యానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ ప్రాంతంపై ప్రత్యేకంగా కేంద్రీకరించారు.

### 10. ఈ ఘటన ఏ.పీ రివైవల్ పై ఎటువంటి ప్రభావం వేస్తుంది?

**జ॥** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అగ్ని పర్వతాల్లాంటివి. ఆ రెండు రాష్ట్రాలలో ప్రజల ఆగ్రహం అనే లావా ఉడుకుతున్నది. అక్కడి ప్రజలకు సుదీర్ఘమైన వర్గ పోరాట చరిత్ర ఉంది. త్యాగాల చరిత్ర వుంది. వాళ్ళు విప్లవంలోని ఆటు పోట్లను చూసారు. వాళ్ళు ఇటువంటి సంఘటనలు జరిగినపుడు ఏ మాత్రం నిరాశపడరు. ఇటువంటి సంఘటనలను సైతం ఆసరా చేసుకొని పాలక వర్గాలకు వ్యతిరేకంగా రాజకీయ పోరాటాన్ని ఎక్కుపెడ్తారు. ఇప్పుడు వాళ్లు రాంగూడ సంఘటనలో పాలక వర్గాలు, వాళ్ల హంతక కిరాయి పోలీసులు విప్లవకారులపైన, ప్రజలపైన అనుసరించిన అమానుషమైన, పాశవికమైన పద్ధతులను బహిర్గతం చేస్తూ, విమర్శిస్తూ పలు రూపాల్లో రాజకీయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇక పోతే మనం రివైవల్ గురించి మాట్లాడుకునేటప్పుడు మనం ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆ రెండు రాష్ట్రాలలో విప్లవ ప్రవాహం ఆగిపోలేదు. వేరు వేరు రూపాలలో అప్పటి నుండి కొనసాగుతూనే వుంది. ఆ ప్రజా విప్లవ ప్రవాహం మరో ప్రజా విప్లవ వెల్లువను తనదైన రీతిలో, వినూత్న పద్ధతుల్లో కచ్చితంగా సృష్టిస్తుంది. అది బద్దలైన అగ్ని పర్వతం నుండి విరజిమ్మే లావాలా ఉంటుంది.

### 11. సాయుధ శిక్షణ, బలాబలాల్లో పెద్ద తేడాను చూపి పోలీసు అధికారులు చేస్తున్న వాదనలో నిజం వున్నదా?

**జ॥** వాళ్ల వాదనలో పస లేదు. పెద్ద బలగాలు, సాయుధ శిక్షణ యుద్ధంలో అంతిమ విజయాన్ని చేకూర్చవు. ఏ యుద్ధంలోనైనా ప్రజల క్రియాశీలక పాత్ర నిర్ణయాత్మక మవుతుంది. చరిత్రలో వియాత్నం, కొరియా దేశాలు మొదలుకొని నేటి మధ్య ప్రాచ్య దేశాల వరకు ఈ విషయాన్నే రుజువు చేసాయి, చేస్తున్నాయి కూడా. ఆయా దేశాల ప్రజలు సామ్రాజ్యవాదాన్ని కాగితపు పులిగా తేల్చేశారు. అయితే ప్రజలు సాధించే అంతిమ విజయాలు అనేక కష్టాలతోనూ, కడగండ్లతోనూ, బాధకరమైన అనుభవాలతోను కూడుకొని సుదీర్ఘమైన క్రమాన్ని తీసుకొంటుంది. ఈ క్రమంలో ఇరు పక్షాల బలాబలాల్లో కూడ తేడా వస్తుంది. ఇప్పుడు వాళ్లకున్న బలం, స్థితి ఎల్లకాలం అలాగే వుండదు. ఒక క్రమంలో ప్రజా సాయుధ శక్తులు అన్ని విషయాలలో పై చేయి సాధించి పరిస్థితిని తలకిందులు చేస్తాయి. ✱

**సిద్ధాంత వ్యాసం**

# పార్టీ క్రమశిక్షణ

పార్టీ నిబంధనావళి ఇలా పేర్కొంది. – 'యావత్తు పార్టీ ఏకీకృత క్రమశిక్షణను పాటించాలి. వ్యక్తి సంస్థకు కట్టుబడి ఉండాలి. మైనారిటీ మెజారిటీకి కట్టుబడి ఉండాలి. కింది స్థాయి పై స్థాయికి కట్టుబడి ఉండాలి. యావత్తు పార్టీ కేంద్ర కమిటీకి కట్టుబడి ఉండాలి'. పంథాను అమలు చేయడానికి, ఐక్యతను పటిష్టం చేయడానికీ పార్టీని సంఘటితం చేయడానికీ, దాని నిర్మాణాన్ని శుద్ధి చేయడానికీ, కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటితం చేయడానికి విప్లవంలో విజయం సాధించడానికీ, పార్టీ క్రమశిక్షణ ఒక తప్పనిసరి షరతు. కమ్యూనిస్టు పార్టీ సభ్యులలో ప్రతీ ఒక్కరూ చైతన్యవంతంగా ఈ క్రమశిక్షణకు లోబడి ఉండాలి. దాన్ని నిలబెట్టాలి.

## పంథా అమలుకు క్రమశిక్షణే హామి ఇస్తుంది

**'పంథా అమలుకు క్రమశిక్షణ హామి ఇస్తుంది. ఇదంటూ లేకుండా పార్టీ ప్రజలనూ, సైన్యాన్నీ పోరాటం విజయవంతం చేసే వైపుగా నడిపించలేదు'.** చైర్మన్ మావో ఇచ్చిన ఈ ఆదేశం క్రమశిక్షణకూ పంథాకూ మధ్య ఉన్న సంబంధాన్ని గొప్పగా బహిర్గతం చేస్తుంది. పార్టీ పంథాను అమలు చేయడంలోనూ దాని మిలిటెంటు కర్తవ్యాలను నెరవేర్చడంలోనూ విప్లవ క్రమశిక్షణకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తుంది. పార్టీ నిర్మాణపర క్రమశిక్షణను దాని రాజకీయ పంథా నిర్ణయిస్తుంది. అలాగే పంథా అమలుకు ఇది హామి ఇస్తుంది. యావత్తు సోషలిజం చారిత్రక కాలానికి చైర్మన్ మావో నిర్వచించిన పార్టీ మౌలిక పంథా మార్క్సిస్టు లెనినిస్టు పంథా. ఇది మన సమస్త కృషికీ మౌలిక సూత్రంగా ఉంటుంది. ఈ పంథాకు కట్టుబడి ఉండడం ద్వారానే పార్టీలో కార్మికవర్గ క్రమశిక్షణను పటిష్టం చేయడం, యావత్తు పార్టీలో నిజమైన **'ఆలోచనలలో, విధానంలో, పథకంలో కమాండ్, చర్యలో ఐక్యత'** సాధ్యం అవుతుంది. ఈ పంథా నుంచి పక్కకు మళ్లడం అంటే తప్పుడు పంథాను అమలు చేయడం. పార్టీ కార్మికవర్గ క్రమశిక్షణను ధ్వంసం చేయడం. కార్మికవర్గ ఏకీకృత పట్టుదల గురించిన చర్చనంతా అర్థం లేనిదిగా చేయడం. క్రమశిక్షణకూ పంథాకూ మధ్య సంబంధంలో ఇది ఒక అంశం. మరో పక్క పార్టీ మౌలిక పంథా అమలులో కార్మికవర్గాన్నీ విశాల విప్లవ ప్రజానీకాన్నీ నడిపించడానికి మార్క్సిజం లెనినిజం మావో సే టుంగ్ ఆలోచనా విధానం పునాదిగా శ్రేణులలో ఉన్నత స్థాయి కేంద్రీకృతత్వం కోసం మన పార్టీకి ఏకీకృత క్రమశిక్షణ అవసరం. ఏకీకృత క్రమశిక్షణ లేకపోతే ప్రతీ ఒక్కరూ తన ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తే తనకు కావలసినది మాత్రమే చేస్తే, దిశా, చర్యలలో ఐక్యత లేకుండా పార్టీ మౌలిక పంథాను అమలు చేయడం కష్టం. పార్టీ కార్మికవర్గ అగ్రగామిగా పాత్ర వహించడం సాధ్యం కాదు.

కార్మికవర్గ నియంతృత్వం కాలంలో పార్టీ అంతటా ఒకే విధమైన క్రమశిక్షణ నిలబెట్టుకోవడం చాలా ముఖ్యమైనది. ఈ చారిత్రక కాలంలో మనం ప్రతీ ప్రాథమిక నిర్మాణంలోనూ కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటితం చేసే మౌలిక కర్తవ్యాన్ని సరిగా నిర్వహించడం అవసరం. సోషలిస్టు నిర్మాణ వేగాన్ని మనం వేగవంతం చేయాలి. పెట్టుబడిదారీ పునరుద్ధరణను అంతర్గతంగా నివారించాలి. సామ్రాజ్యవాదం, సోషల్ సామ్రాజ్యవాదాల దురాక్రమణనూ, పెత్తనాన్నీ నివారించాలి. కార్మికవర్గ క్రమశిక్షణను పటిష్టం చేయడం ద్వారానే దీన్ని నెరవేర్చగలుగుతాం. లెనిన్ పేర్కొన్నట్టు – **'కార్మికవర్గ పార్టీ ఉక్కు క్రమశిక్షణను ఎవరైతే బలహీనపరుస్తారో (ముఖ్యంగా దాని నియంతృత్వ కాలంలో), వాళ్లు కార్మివర్గానికి వ్యతిరేకంగా బూర్జువా వర్గానికి సహాయం చేస్తున్నట్టు'.** పెట్టుబడిదారీ విధానం నుంచీ కమ్యూనిజానికి పరిణామం చెందే చారిత్రక కాలంలో మనం కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటితం చేయడానికీ, పెట్టుబడిదారీ పునరుద్ధరణను నివారించడానికి కార్మికవర్గ ఉక్కు క్రమశిక్షణను నిరంతరం పటిష్టం చేయాలని ఇది స్పష్టంగా తెలియజేస్తుంది. పార్టీ క్రమశిక్షణను బలహీనపరిచే ఏ చర్య అయినా కార్మికవర్గాన్ని ఎదిరించడంలో భౌతికంగా బూర్జువా వర్గానికి మాత్రమే సహాయం చేస్తుంది. కార్మికవర్గ నియంతృత్వాన్ని ధ్వంసం చేస్తుంది కూడా.

పార్టీ క్రమశిక్షణను పటిష్టం చేయడం గురించి చైర్మన్ మావో మనకు పదే పదే బోధించాడు. రెండో అంతర్యుద్ధ కాలంలో రాసిన **పార్టీలో తప్పుడు భావాలను సరిదిద్దడం** అన్న రచనలో చైర్మన్ మావో అతి ప్రజాస్వామ్యాన్ని, నిర్మాణ నిరాకరణనూ, పార్టీ క్రమశిక్షణను తక్కువ చేసే ఇతర హానికరమైన ధోరణులనూ తీవ్రంగా విమర్శించాడు. యావత్తు పార్టీ, పార్టీ తీర్మాణాలను గౌరవించాలనీ, క్రమశిక్షణను గౌరవించాలనీ నొక్కి చెప్పాడు. మన పార్టీ, సైన్యం నిర్మాణంలో సైద్ధాంతికంగా నిర్మాణపరంగా పాటించవలసిన దృక్పథాన్ని వివరించాడు. జపాన్ వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధంలో చైర్మన్ మావో **ఉదారవాదాన్ని ఎదిరించండి** అనే మరో అద్భుతమైన రచన చేసాడు. నెగిటివ్ ఉదారవాదాన్ని మార్క్సిజం లెనినిజం విప్లవ స్ఫూర్తితో ఎలా అధిగమించాలో యావత్తు పార్టీకి బోధించాడు. చాంగ్ కువో టావో అవకాశవాద పంథాకు వ్యతిరేక పోరాటంలో మన పార్టీ అనుభవాన్ని క్రోడీకరిస్తూ చైర్మన్ మావో మరోసారి ఏకీకృత పార్టీ క్రమశిక్షణ ప్రాధాన్యత గురించి నొక్కి చెప్పాడు –**'క్రమశిక్షణ నియమాలను ఉల్లంఘించేవారు పార్టీ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తారు'.** విముక్తి యుద్ధంలో చైర్మన్ మావో ఇలా ప్రకటించాడు –**'సైన్యం పురోగమిస్తుంది. ఉత్పత్తి పురోగమిస్తుంది. మన క్రమశిక్షణా స్పృహ పటిష్టం అయినప్పుడు మనం విప్లవంలో మరింత విజయవంతం అవుతాం'.** ఇలా పార్టీకీ, సైన్యానికీ, ప్రజలకూ దేశవ్యాప్త విజయం వైపుగా మార్గదర్శకంగా ఉన్నాడు. యావత్తు దేశం విముక్తి చెందిన తరువాత చైర్మన్ మావో పార్టీ క్రమశిక్షణను పటిష్టం చేయవలసిన అవసరం గురించి పదే పదే నొక్కి చెప్పాడు. స్వేచ్ఛకూ, క్రమశిక్షణకూ మధ్య ఉన్న గతితార్కిక

క్రమశిక్షణ మీద వెలుగు ప్రసరింపజేసాడు. పార్టీనీ, సైన్యాన్నీ, ప్రజలనూ లిన్ పియావో పార్టీ వ్యతిరేక ముఠాను ఓడించడంలో నడిపించే క్రమంలో చైర్మన్ మావో 'చేయవలసిన మూడు, చేయకూడని మూడు' అన్న మూడు మౌలిక సూత్రాలను రూపొందించాడు. **'కేడర్‌లకూ, పార్టీ సభ్యులకూ, ప్రజలకూ మూడు క్రమశిక్షణా సూత్రాలూ, ఎనిమిది శ్రద్ధ పెట్టవలసిన అంశాల గురించి బోధించండి'** అన్నాడు. ఆయన మార్గదర్శకత్వంలో ప్రజలు లిన్ పియావో పార్టీ వ్యతిరేక ముఠా పెట్టుబడిదారీ పునరుద్ధరణ నేరపూరిత కుట్రను పూర్తిగా ధ్వంసం చేయగలిగారు. చైర్మన్ మావో స్వయంగా అందించిన శిక్షణ ఫలితంగా క్రమశిక్షణకు గట్టి గౌరవం దక్కింది. సుదీర్ఘ విప్లవ పోరాట క్రమంలో మన పార్టీలో అది ఒక మహత్తర సంప్రదాయం అయింది. పార్టీ ఐక్యతను సంఘటితం చేసి శత్రువును ఓడించే ఆయుధం అయింది.

పార్టీ మార్క్సిస్టు లెనినిస్టు పంథాను మార్చడం కోసం, తమ రహస్య విచ్ఛిన్నకర కార్యకలాపాలు కొనసాగించడం కోసం అన్ని అవకాశవాద పంథాల నాయకులూ పార్టీ క్రమశిక్షణను వ్యతిరేకించడానికి అన్ని అవకాశాలనూ ఎల్లప్పుడూ వినియోగించుకున్నారు. మన పార్టీ యావత్తు చరిత్రలో చెన్ టు సియు, వాంగ్ మింగ్, చాంగ్ కువో టావోల నుంచీ లీ షావ్ చీ, లిన్ పియావో మొదలయిన కుట్రదారుల వరకూ ఇదే రకంగా వ్యవహరించారు. వీరంతా పార్టీ క్రమశిక్షణను ధ్వంసం చేయాలనుకున్న ఒంటెద్దుపోకడతో ఉండే కుట్రదారులు, బందిపోటులు.

లిన్ పియావో, అతని పార్టీ వ్యతిరేక ముఠాలకు సంబంధించినంత వరకూ ఒక పక్క పార్టీ కేంద్రీకృత క్రమశిక్షణను ధ్వంసం చేయడానికి తీవ్రంగా ప్రయత్నించారు. బూర్జువా హెడ్‌క్వార్టర్స్‌ను ఏర్పాటు చేసారు. చైర్మన్ మావో నేతృత్వం వహించిన కేంద్ర కమిటీని వ్యతిరేకించారు. పార్టీ ఆధిపత్యం ద్వారా అధికారాన్ని గుంజుకోవాలని చూసారు. మరో పక్క వారి పార్టీ వ్యతిరేక ముఠా పార్టీ క్రమశిక్షణను గౌరవించే పేరు మీద పెద్దఎత్తున ఫాసిస్టు క్రమశిక్షణను రుద్దారు. ఇదంతా పార్టీ మౌలిక పంథాను వ్యతిరేకించడం లక్ష్యంగా, విప్లవ ప్రతీఘాతుక రివిజనిస్టు పంథా అమలు చేసే లక్ష్యంగా సాగింది. పార్టీ క్రమశిక్షణను ధ్వంసం చేసిన లిన్ పియావో మొదలయిన వారి నేరాల మీద మనం లోతుగా విమర్శ చేయాలి. ఈ క్రమశిక్షణను సంఘటితం చేసి పటిష్టం చేయడానికి కృషి చేయాలి.

## పార్టీ క్రమశిక్షణను చైతన్యయుతంగా గౌరవించాలి

కమ్యూనిస్టులు **'పార్టీ క్రమశిక్షణను గౌరవించడంలో నమూనాలుగా'** ఉండాలని చైర్మన్ మావో మనకు బోధిస్తాడు. పార్టీ క్రమశిక్షణను గౌరవించడం కోసం మనం, వ్యక్తి సంస్థకు కట్టుబడి ఉండాలన్న, మైనారిటీ మెజారిటీకి కట్టుబడి ఉండాలన్న, కింది స్థాయి కమిటీ పై స్థాయి కమిటీకి లోబడి ఉండాలన్న, యావత్తు పార్టీ కేంద్ర కమిటీకి లోబడి ఉండాలన్న పార్టీ నిబంధనావళికి కట్టుబడి ఉండాలి.

వ్యక్తి సంస్థకు లోబడి ఉండాలి. అంటే పార్టీ సభ్యులు పార్టీ నిర్మాణాల తీర్మాణాలను, ఆదేశాలనూ ఊగిసలాట లేకుండా సమర్ధించాలి. వాటిని అమలు చేయాలి. ఎటువంటి సాకుతోనూ వాటిని ఉల్లంఘించరాదు. అయితే పార్టీ ఆదేశాలను అంగీకరించని పార్టీ సభ్యులకు తమ అభిప్రాయాన్ని రిజర్వు చేసుకునే హుక్కు ఉంటుంది. అలాగే తమ పై స్థాయి కమిటీకే కాక నేరుగా కేంద్ర కమిటీకీ దాని చైర్మన్‌కూ తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చు.

మైనారిటీ మెజారిటీకి లోబడి ఉండాలి. అంటే పార్టీ నిర్మాణాలు విడుదల చేసే తీర్మాణాలను పార్టీ సభ్యులు దృఢంగా అమలు చేయాలి. మైనారిటీ అభిప్రాయాన్ని నిరాకరించినప్పుడు మైనారిటీలో ఉన్నవాళ్ళు మెజారిటీ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తారు. అవసరం అయిన చోట భవిష్యత్తు సమావేశంలో ఈ విషయం మరోసారి చర్చకు పెట్టవచ్చు. అయితే ఎట్టి పరిస్థితులలోనూ ఎవరూ ఆచరణలో చర్య ద్వారా తమ వ్యతిరేకతను తెలియజేయరాదు.

కింది స్థాయి పై స్థాయికి లోబడి ఉండాలి. అంటే పార్టీ నిర్మాణాలలో కింది స్థాయి కమిటీలు పై స్థాయి నిర్మాణాలు తీసుకున్న నిర్ణయాలు, ఆదేశాలూ, కర్తవ్యాలకు నిశ్చయాత్మకంగా కట్టుబడి ఉండాలి. మొత్తంగా పార్టీ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించరాదు. అందులో ఒక భాగం ప్రయోజనాలకు సేవ చేయరాదు. అలాగే పై స్థాయిల నిర్ణయాలను ఆమోదించకుండానూ వ్యతిరేకించీ, యావత్తు పార్టీ కేంద్రీకృత ఐక్యతను ధ్వంసం చేయరాదు.

యావత్తు పార్టీ కేంద్ర కమిటీకి లోబడి ఉండాలి. ఇది మన పార్టీ క్రమశిక్షణలో అత్యున్నత సూత్రం. చైర్మన్ మావో నేతృత్వంలో ఉన్న మన పార్టీ కేంద్ర కమిటీ యావత్తు పార్టీ, సైన్యం, ప్రజల నేతృత్వ సంస్థ. చైర్మన్ మావో ఆదేశాలు, కేంద్ర కమిటీ పిలుపులూ కేంద్రీకృత రూపంలో కార్మికవర్గ ప్రయోజనాలకూ, మన దేశ యావత్తు జనాభా ప్రయోజనాలకూ ప్రాతినిధ్యం వహిస్తాయి. విప్లవంలోనూ, నిర్మాణాల్లోనూ విజయాలు సాధించడానికి మౌలిక హామీగా ఉంటాయి. అన్ని సమయాలలోనూ, అన్ని పరిస్థితులలోనూ మనం చైర్మన్ మావో నేతృత్వంలో ఉన్న పార్టీ కేంద్ర కమిటీ ఆదేశాలకు అనుగుణంగా మాట్లాడాలి, వ్యవహరించాలి. నిశ్చయాత్మకంగా అతి ప్రజాస్వామ్యాన్నీ, అతిగా ఆధారపడే తత్వపు స్ఫూర్తినీ, పార్టీ క్రమశిక్షణను ధ్వంసం చేసే ఇతర ప్రవర్తనలను నివారించాలి.

పార్టీ క్రమశిక్షణను గౌరవించడం అంటే దానికి గుడ్డిగా లొంగి ఉండటం కాదు. మన పార్టీలో చైర్మన్ మావో ప్రాతినిధ్యం వహించే సరైన పంథా నాయకత్వ స్థానాన్ని ఆక్రమించింది. కానీ కొన్ని తప్పుడు పంథాలు, ధోరణులూ కూడా అప్పుడప్పుడూ ముందుకు వస్తాయి. ఈ తప్పుడు పంథాలూ, ధోరణులను కొన్ని రంగాలలో కొన్ని ప్రాంతాలలో అనేక మంది ప్రజలు సమర్థిస్తే, కమ్యూనిస్టు పార్టీ సభ్యులైన వాళ్ళు ఉమ్మడి ప్రయోజనం కోసం వాటికి వ్యతిరేకంగా నిలబడాలి. చైర్మన్ మావో విప్లవ పంథానూ, పార్టీ క్రమశిక్షణనూ పరిరక్షించడానికి ఏటికి ఎదురీదే సాహసం చేయాలి.

పార్టీ క్రమశిక్షణను గౌరవించాలంటే మనం ఈ విషయంలో పార్టీ సభ్యుల చైతన్య స్థాయిని పెంపొందించాలి – ఇది బూర్జువా వర్గ ప్రతిఘాతుక క్రమశిక్షణకు మౌలికంగా భిన్నమైనది. బూర్జువా వర్గ క్రమశిక్షణ ప్రజల దోపిడీ, బానిసత్వాల పునాదిగా నెలకొల్పినది.

పీడిత చర్యలు లేదా ఇది అబద్దాలతోనే నిలబడగలదు. కానీ కార్మికవర్గ క్రమశిక్షణ పార్టీ సభ్యులందరి చైతన్యం పునాదిగా ఉంటుందని లెనిన్ పేర్కొన్నాడు. అది **'కార్మికవర్గ అగ్రగామి వర్గ చైతన్యం, విప్లవం పట్ల దాని అంకితత్వం, దాని పట్టుదల, ఆత్మ త్యాగం, వీరత్వాల'**తో నిలబడుతుంది, మెరుగవుతుంది, అమలు అవుతుంది. పార్టీ క్రమశిక్షణ తప్పనిసరి స్వభావం కాగా దాని అమలు అన్నింటికంటే పార్టీ సభ్యుల చైతన్య స్థాయి మీద ఆధారపడి ఉంటుంది. పార్టీ పట్ల, ప్రజల పట్ల సభ్యుల అంకితత్వం, విప్లవ ఆశయం కోసం వారిలో ఉన్న ఉన్నత బాధ్యతా స్పృహ ఈ చైతన్యానికి వనరు. ఈ ఉన్నత స్థాయి రాజకీయ చైతన్యంతోనే విప్లవ ప్రయోజనాలను ముందు పెట్టి, తమ వ్యక్తిగత ప్రయోజనాలను లోబడి ఉండేట్టు చేయడం సాధ్యం అవుతుంది. పార్టీ క్రమశిక్షణను పరిరక్షించడానికి తమ ప్రాణాలైనా ఇచ్చేట్టు చేస్తుంది. ఈ ఉన్నత స్థాయి రాజకీయ చైతన్యం కలిగి వున్న వీరు ఎంతటి కష్టమైన పరిస్థితులు ఎదురయినప్పటికీ పార్టీ క్రమశిక్షణను నిశ్చయాత్మకంగా అమలు చేయడానికి **'కష్టానికి కానీ మరణానికి భయపడకుండా'** ఉండడం సాధ్యం అవుతుంది. అలాగే నాయకత్వం నుంచీ విడిపోయినప్పుడూ, తమను చూసేవాళ్ళు ఎవరూ లేనప్పుడూ, తమకు తామే బలంగా చెప్పుకుంటూ చైతన్యవంతంగా పార్టీ క్రమశిక్షణను గౌరవించేట్టు చేస్తుంది. పార్టీ రహస్యాలను కాపాడడం కోసం లియు హు లాన్ తొణక్కుండా నిలబడింది. నిర్దాక్షిణ్యమైన చిత్రహింసలలో సయితం పూర్తి నిశ్చయాత్మకతతో ఉంది. శత్రు కత్తులకు ప్రాణాలు అర్పించింది. వీరోచిత త్యాగం చేసి, పార్టీ ప్రయోజనాలను పరిరక్షించింది. వాలంటీర్ల సైన్యం దాగి ఉన్న స్థలాన్ని రహస్యంగా ఉంచడం కోసం చియు షావో యున్ శరీరం మంటల్లో కాలిపోతుంటే కూడా చలనం లేకుండా నిశ్శబ్దంగా ఉండిపోయాడు. యుద్ధరంగ క్రమశిక్షణను గౌరవించాడు. కమ్యూనిస్టు పార్టీ సభ్యులందరూ ఈ విప్లవ అమరుల నుంచీ ప్రేరణ పొందాలి. మార్క్సిస్టు లెనినిస్టు గ్రంధాలనూ, చైర్మన్ మావో రచనలనూ జాగరూకతతో అధ్యయనం చేయాలి. తమ సైద్ధాంతిక చైతన్యాన్ని పెంపొందించుకోవడానికి కృషి చేయాలి. తమ కార్మికవర్గ పార్టీ స్ఫూర్తిని పటిష్టం చేసుకోవాలి. పార్టీ క్రమశిక్షణను చైతన్యవంతంగా గౌరవించడంలో నమూనాలుగా నిలవాలి.

పార్టీ క్రమశిక్షణ పట్ల గౌరవం ఉండేందుకుగాను దాన్ని తక్కువ చేసే అన్ని పనులనూ మనం నిశ్చయాత్మకంగా వ్యతిరేకించాలి. కమ్యూనిస్టులందరూ నిర్భయంగా పార్టీ వైఖరులకు కట్టుబడి ఉండి విప్లవ స్ఫూర్తిని ప్రదర్శించాలి. కార్మికవర్గ విప్లవ సూత్రాలను ధ్వంసం చేసే అన్ని కుట్రలకూ వ్యతిరేకంగా పోరాటం చేయాలి. పార్టీ క్రమశిక్షణకు వ్యతిరేకమయిన పనులన్నింటినీ వ్యతిరేకించాలి. ఈ నమ్మకం ఉందా లేదా అన్నది కమ్యూనిస్టు పార్టీ స్ఫూర్తి బలమైనదా బలహీనమైనదా అన్నది తేలుస్తుంది. మన పార్టీలో పార్టీ క్రమశిక్షణకు భంగం కలిగించే పనుల పట్ల ఉదారవాద వైఖరి అవలంబించే కామ్రేడ్స్ ఉన్నారు – **'తమను వ్యక్తిగతంగా ప్రభావితం చేయని వాటిని జరగనివ్వడం', 'తప్పు గురించి పూర్తిగా అర్థమయినప్పటికీ వీలయినంత తక్కువ మాట్లాడడం', 'అందరితో మంచిగా ఉండి ఆరోపణలను నివారించుకోవడం కోసం జాగ్రత్తపడడం'.** ఇది బూర్జువా వర్గ, తప్పుడు, కుళ్లిపోయిన శైలి. అగ్గికి నీరు ఎంత దూరమో ఇది కమ్యూనిస్టుల విప్లవ స్వభావానికి అంత దూరమైనది. మనం పార్టీ క్రమశిక్షణను తక్కువ చూసే పనులకు వ్యతిరేకంగా పోరాడకపోతే, వాటిని ఖండించకపోతే, వాటి పట్ల ఉదారవాద వైఖరి అవలంబిస్తే, మంచికీ చెడుకూ మధ్య తేడా చూడలేం. విషపూరితమైన పని శైలిని వ్యాపించనిచ్చిన వాళ్ళం అవుతాం. పార్టీ ప్రయోజనాలకు హాని చేసిన వాళ్ళమవుతాం. కమ్యూనిస్టులు ఎలా ప్రవర్తించాలో చైర్మన్ మావో మనకు బోధిస్తాడు –**'ఎల్లప్పుడూ అంతటా సూత్రానికి కట్టుబడి ఉండాలి. అన్ని తప్పుడు భావాలకూ చర్యలకూ వ్యతిరేకంగా అలుపు లేని పోరాటం చేయాలి'.** ఈ విప్లవ స్ఫూర్తి మనకు ఉండాలి. పార్టీ క్రమశిక్షణను పరిరక్షించేందుకు పోరాటం చేయాలి.

పార్టీ క్రమశిక్షణను గౌరవించాలంటే, ప్రతీ కమ్యూనిస్టూ, ముఖ్యంగా వివిధ స్థాయిలలో ఉన్న పార్టీ నాయకత్వ కేడర్‌లు చైతన్యయుతంగా ప్రజల విమర్శకూ, అదుపుకూ కట్టుబడి ఉండాలి. మన రాజ్యం కార్మికవర్గ నియంతృత్వ సోషలిస్టు రాజ్యం – శ్రామికవర్గం, పేద, మధ్య తరగతి రైతాంగం, విశాల శ్రామిక ప్రజలూ దాని యజమానులు. పార్టీలోనూ, రాజ్యంలోనూ వివిధ స్థాయిలలో కేడర్‌ల మీద విప్లవకర అదుపు అమలు చేయడానికి వాళ్ళకు అధికారం ఉంది. అయితే పార్టీలో పని చేస్తున్న వారు కానీ, బయటి వారు కానీ తమ పరిశీలనలు వ్యక్తం చేసినప్పుడు తట్టుకోలేని మైనారిటీ కేడర్‌లు ఉన్నారు. ఈ కేడర్‌లు విమర్శలను అణిచిపెట్టేంతవరకూ వెళతారు. దాన్ని ఖండిస్తారు కూడా. పార్టీ క్రమశిక్షణ ఇందుకు అంగీకరించదు. పార్టీ క్రమశిక్షణకు వ్యతిరేకంగా సాగే ఈ కార్యకలాపాలకు వ్యతిరేకంగా మనం నిశ్చయాత్మక పోరాటం చేయడం కోసం రెండు పంథాల మధ్య పోరాటపు ఉన్నత స్థాయి నుంచీ ఈ విషయాన్ని చూడాలి.

## పార్టీ క్రమశిక్షణను సరిగా అమలు చేయండి

పార్టీ నిబంధనావళి ఇలా పేర్కొంటుంది. – 'పార్టీ సభ్యులు పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినప్పుడు సంబంధిత అన్ని స్థాయిల పార్టీ నిర్మాణాలూ ప్రతీ సందర్భంలోనూ తమ విధుల, అధికారాల మేరకు తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి – హెచ్చరిక, తీవ్ర హెచ్చరిక, పార్టీ పదవుల నుంచీ తొలగింపు, పార్టీలో ప్రొబేషన్‌లో ఉంచడం, లేదా పార్టీ నుంచీ బహిష్కరించడం'. మన పార్టీలో క్రమశిక్షణ లక్ష్యం కేవలం శిక్షించడం కాదు. తప్పులు చేసే సభ్యులకు అర్థం చేయించి సహాయం చేయడం. ఈ కారణం వల్లనే క్రమశిక్షణను చైతన్యయుతంగా గౌరవించేందుకు సభ్యులకు ఎంతో బోధనను అందించింది పార్టీ. పార్టీ సభ్యులకు వ్యతిరేకంగా చర్య చేపట్టినప్పుడు ఆ సభ్యులతో ముందుగా చర్చించి, పదే పదే బోధించడం అవసరం. తద్వారా వారు తమ తప్పులను గుర్తించి వాటిని నిజంగా సరిదిద్దుకోగలుగుతారు.

పార్టీ క్రమశిక్షణను అన్వయించేటప్పుడు మనం వేర్వేరు స్వభావం ఉన్న రెండు రకాల వైరుధ్యాల మధ్య తేడా చూడాలి. వాటి పట్ల భిన్న దృక్పథం కలిగి ఉండాలి. వాటిని విడిగా చూడాలి. సరిగా పరిష్కరించుకోవాలి. రెనగేడ్‌లు, శత్రు ఏజెంటులు, పెట్టుబడిదారీ మార్గం చేపట్టే ఎంత మాత్రం పశ్చాత్తాపం లేని వ్యక్తులూ, దిగజారిన,

అన్యవర్గ శక్తులను పార్టీ నుంచి తప్పించాలి. తిరిగి చేర్చుకోరాదు. తప్పులు చేసిన పార్టీ సభ్యులకు అవి తీవ్ర తప్పులయినప్పటికీ, **'గత తప్పుల నుంచీ నేర్చుకొని భవిష్యత్తులో వాటిని నివారించండి, రోగిని రక్షించడానికి రోగానికి చికిత్స చేయండి'** అన్న సూత్రాలను అన్వయించాలి. సైద్ధాంతిక విమర్శలో తీవ్రంగా ఉండాలి. నిర్మాణ రంగంలో వెనులుబాటుతో ఉండి వారు తమ తప్పులు సరిదిద్దుకునేందుకు తీవ్రమైన, అనుకూల, అర్ధ వైఖరిని అవలంబించాలి. తమ్ము తాము సరిదిద్దుకోవడానికి వాళ్ళు నిజమైన నమ్మకం చూపిస్తే, మనం వారికి సైద్ధాంతికంగా బోధించాలి. తమ చైతన్యాన్ని పెంపొందించుకునేందుకు సహాయం చేయాలి. చైర్మన్ మావో విప్లవ పంథా మార్గంలోకి తీసుకురావాలి. తప్పులు చేసిన పార్టీ సభ్యులకు ప్రజల మీద, పార్టీ మీదా నమ్మకం ఉండాలి. తమ్ము తాము తీవ్రంగా 'ఖండించుకోవాలి'. చైతన్యయుతంగా తమ తప్పులను విశ్లేషించుకోవాలి. మూడు గొప్ప విప్లవోద్యమాలలో తమ ప్రాపంచిక దృక్పధాన్ని మార్చుకోవడానికి కృషి చేయాలి. ప్రజల గౌరవాన్నీ సంపాదించడానికి విప్లవాన్ని కొనసాగించాలి. తీవ్రమైన తప్పులు చేసి పదే పదే బోధించినప్పటికీ తమ్ము తాము సరిదిద్దుకోవడానికి నిరాకరించే మైనారిటీ పార్టీ సభ్యుల మీద పరిస్థితులకు అనుగుణంగా తప్పనిసరిగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి. అవసరమైతే పార్టీ నుంచి బహిష్కరించాలి.

తప్పులు చేసిన సభ్యులకు పార్టీ క్రమశిక్షణను అన్వయించినప్పుడు మనం తీవ్రంగా నిశితంగా ఉండాలి. తేలికగా తీసుకోరాదు. చైర్మన్ మావో ఇలా అంటాడు – **'కామ్రేడ్స్ విషయాలను పరిష్కరించేటప్పుడు జాగ్రత్త వైఖరిని అవలంభించాలి. విషయాలను తేలికగా తీసుకోవడం కానీ, కామ్రేడ్స్‌కు హాని చేయడం కానీ తగదు..'.** తీవ్రంగా నిశితంగా వుండటం అంటే తప్పులు చేసిన పార్టీ సభ్యుల హోదాలు, ఒప్పులతో ప్రభావితం కావడం కాదు. వారి తప్పుల గురించి మనకు తెలిసినప్పుడు శాస్త్రీయమైన వైఖరి అవలంబించి వారిని తీవ్రంగా విమర్శించాలి. అయితే ఆ విషయాన్ని పరిష్కరించేటప్పుడు మనం తీవ్రంగా వ్యవహరించి నిజమైన బాధ్యతాయుత వైఖరిని అవలంబించాలి. పార్టీ సభ్యులు తప్పులు చేసినప్పుడు మనం పూర్తి చారిత్రక విశ్లేషణ చేసి వారి తప్పులను దృష్టిలో ఉంచుకుంటూ ఆ సభ్యులు చైర్మన్ మావో, పార్టీ నాయకత్వం కింద విప్లవానికి చేసిన మంచి దోహదాన్ని కూడా చూడాలి. తప్పుల స్వభావం గురించి, వారు తప్పు చేసిన పరిస్థితుల గురించీ, ఆ తప్పులు ఎల్లప్పుడూ వ్యక్తమయ్యాయా, ఆ తప్పులు చేసిన వ్యక్తులు పశ్చాత్తాపపడుతున్నారా లేదా అన్న విషయాల గురించి నిర్దిష్ట విశ్లేషణ చేయాలి. వాస్తవాల నుంచి సత్యాన్ని గ్రహించాలి. నాయకత్వానికీ, ప్రజలకూ మధ్య ఐక్యతా పద్ధతిలో మనం తప్పుల గురించి సరిగా వ్యవహరించాలి.

పార్టీ క్రమశిక్షణను అన్వయించేటప్పుడు మనం ఏకపక్షంగా ఉండకుండా, లేదా తీవ్రంగానో ఉదారంగానో ఉండకుండా జాగ్రత్తపడాలి.

తప్పులు చేసిన పార్టీ సభ్యులతో వ్యవహరించేటప్పుడు మనం వారు తప్పులు చేసారనీ, పార్టీ ప్రయోజనాన్ని ప్రమాదంలో పెట్టారనీ దృష్టిలో ఉంచుకోవాలి. అలానే వారిలో మెజారిటీ పార్టీలో ఉండి విప్లవాన్ని కొనసాగిస్తున్నారన్నది కూడా దృష్టిలో ఉంచుకోవాలి. వాళ్ళు కమ్యూనిస్టు పార్టీ సభ్యులకు ఉండవలసిన ప్రమాణాల ప్రకారం పూర్తిగా లేరన్న వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. అయితే వారిలో ఎక్కువ మంది పార్టీ ఇచ్చిన బోధన సహాయంతో తమ తప్పులను సరిదిద్దుకోగలుగుతారని, కార్మికవర్గ అగ్రగామికి చెందిన నమూనాను నెరవేరుస్తారనీ కూడా అర్థం చేసుకోవాలి. పార్టీ క్రమశిక్షణను అన్వయించినపుడు మనం అన్నింటికీ మించి ఈ వాస్తవం పట్ల శ్రద్ధ వహించాలి. పార్టీ సభ్యులు చేసిన తప్పులతో వ్యవహరించేటప్పుడు స్పాంటేనియస్ భావాలు ముందుకు రాకుండా జాగ్రత్తపడాలి. ఒక విషయంలో ఉన్న వాస్తవాలను అతి చేసి ఎట్టి పరిస్థితుల్లోనూ నియమాలను అన్వయించకూడదు. వెంటనే చర్యలు తీసుకుని లేదా తేలికగా పార్టీ నుంచీ బహిష్కరించకూడదు. అయితే పార్టీ సభ్యుల ప్రమాణాలను తక్కువ చేసే వారిని అనవసరంగా కలుపుకోరాదు. బహిష్కరించవలసిన వారిని బహిష్కరించకుండా ఉండరాదు. చేపట్టవలసిన కేసులను చేపట్టకుండా ఉండరాదు.

సాధారణంగా పార్టీ సభ్యులకు వ్యతిరేకంగా తీసుకునే క్రమశిక్షణా చర్యలను పార్టీ బ్రాంచిలో చర్చించాలి. ఎవరి మీద చర్యలు తీసుకుంటున్నామో వారికి సహాయపడడం కోసం వారు తమ తప్పును విశ్లేషించుకుని విమర్శలను ఆమోదించడానికి అవకాశం ఇవ్వాలి. లోతైన చర్చ చేసే వరకూ నిర్ణయం తీసుకోరాదు. ఆ తరువాత తాము నిర్ణయించిన దానిని ఆ పై స్థాయికి తెలియజేయాలి. తీసుకున్న నిర్ణయం, అంతిమ చర్య సంబంధిత వ్యక్తికి రాతపూర్వకంగా తెలియజేయాలి. ఆ పార్టీ సభ్యులు తమ మీద తీసుకున్న చర్యలతో అంగీకరించకపోతే దానిని మరోసారి చర్చించాలని అడిగే హక్కు, అలాగే పై స్థాయికి, పార్టీ కేంద్ర కమిటీ వరకూ ఫిర్యాదు చేసుకునే హక్కు వాళ్ళకు ఉంటుంది. పార్టీ సభ్యులు రూపొందించిన ఫిర్యాదులతో పార్టీ నిర్మాణాలు వేగంగా వ్యవహరించాలి. వాటిని ఆపడం కానీ, ఖండించడం కానీ చేయకూడదు. ఫిర్యాదు సరైనదయినప్పుడు, నిర్ధారణా చర్య వాస్తవానికి అనుగుణంగా లేనప్పుడు, దాన్ని అందుకున్న నిర్మాణం ఆ వ్యక్తికి సహాయం చేయడం కోసం, వాటిని గుర్తించి, సరిదిద్దుకోవడం కోసం వివరణలు కూడా ఇవ్వాలి. తప్పులు చేసి చర్యకు గురయిన పార్టీ సభ్యులు కారణం లేకుండా ఏదో సాకుతో సమస్య సృష్టించరాదు.

స్థూలంగా చెప్పాలంటే పార్టీ క్రమశిక్షణను అన్వయించడం అత్యంత తీవ్రమైన రాజకీయ, సైద్ధాంతిక కృషి. ఇందులో 'చాలా వరకూ' అన్న ప్రసక్తి లేదు. చైర్మన్ మావో బోధనల ప్రకారం మనం చైతన్యయుతంగా పార్టీ సూత్రాలను అమలు చేయాలి. తప్పులు చేసిన పార్టీ సభ్యులకు బోధించాలి. ఇతర సభ్యులు వీటి నుంచీ పాఠాలు తీసుకునేట్టు చూడాలి.

***(ఈ వ్యాసం చైనా కమ్యూనిస్టు పార్టీ మౌలిక అవగాహన అనే పుస్తకం నుండి తీసుకున్నది. ఈ పుస్తకం 1976లో నార్మన్ బెతూన్ ఇన్‌స్టిట్యూట్ వారిచే ఫ్రెంచి ముద్రణ నుంచి ఇంగ్లీషులోకి అనువాదం చేయబడి ముద్రించబడినది. తరువాత తెలుగులోకి అనువదించబడినది).***

✱

# ఎమ్.కె.వి.బి డివిజన్ సామాజిక పరిశోధన నివేదిక

**(2016 మార్చి-ఏప్రిల్)**

సామాజిక పరిశోధన లక్ష్యం సమాజంలో వర్గాల బలాబలాలను అర్థం చేసుకోవడానికే. భారతదేశం నేటికీ మౌళికంగా అర్థవలస, అర్థభూస్వామ్య వ్యవస్థనే. అయినప్పటికీ సమాజం నిరంతరం చలనంలో ఉండటం మూలంగా జరిగే పరిణామాత్మక నూతన మార్పులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయడం ద్వారా మన వ్యూహానికి మరింత సేవ చేసే ఎత్తుగడలను అభివృద్ధి పర్చగల్గుతాం. 2014లో మన కేంద్రకమిటీ భారతదేశంలో ఉత్పత్తి విధానం, ఉత్పత్తి సబంధాలు అనే డాక్యుమెంట్‌ను రూపొందించింది. అదే మనకు మార్గదర్శకం. అయితే ప్రతి ప్రాంతం దాని నిర్దిష్ట ప్రత్యేక లక్షణాలు కలిగి వుంటుంది. ఒక దశాబ్దం క్రితం మన ఎ.ఒ.బిలో కూడా సామాజిక పరిశోధన జరిపి వర్గవిశ్లేషణను చేసాం. ఇక్కడి వర్గాల స్థితిపై ఒక స్పష్టతను అందించాం. అయినప్పటికీ గడిచిన 10 సంవత్సరాలలో నూతనంగా వచ్చిన, వస్తున్న మార్పులను అర్థం చేసుకోవడం అవసరం. దానిపై ఆధారపడి ఎత్తుగడలను మరింత అభివృద్ధి చేసుకోగల్గుతాం. సామాజిక పరిశోధనను జరపాల్సిన ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకొని సి.ఆర్.బి, ఎస్.జడ్.సి చేసిన నిర్ణయంపై ఆధారపడి మన ఎమ్.కె.వి.బి డివిజన్‌లో సామాజిక పరిశోధన కార్యక్రమాన్ని చేపట్టాం.

సామాజిక పరిశోధనకు ముందు దానికి అవసరమైన సన్నాహాలు చేసుకున్నాం. దానికి అనుసరించిన పద్ధతి విషయానికి వస్తే, స్టడీ కోసం భారతదేశంలో ఉత్పత్తి విధానం-వుత్పత్తి సంబంధాలు అనే సి.సి డాక్యుమెంట్‌పై డి.వి.సి, ఎ.సి కామ్రేడ్స్‌కు క్లాసులు నిర్వహించాం. సామాజిక పరిశోధనలో పాల్గొనవలసిన టీంను నిర్ణయించుకున్నాం. అందులో ఎస్.జడ్.సి.ఎమ్.లు ఇద్దరు, డి.వి.సి.ఎమ్.లు ఇద్దరు, ఎ.సి.ఎమ్.లు ఐదుగురు, ఎస్.జడ్.సి స్టాఫ్ నుండి ఒకరు ఉన్నారు.

**పరిశోధన సందర్భంగా చేసిన అధ్యయనం....**

1. గ్రంథపూజను వ్యతిరేకించండి.
2. చైనా సమాజంలో వర్గవిశ్లేషణ
3. వ్యవసాయ విప్లవం
4. ఆదివాసీ సమాజంలో వర్గాలు (ఎ.ఒ.బి ఎస్.జడ్.సి సర్క్యులర్)
5. సిద్ధాంతం వెలుగులో ఉత్పత్తి సంబంధాలు వ్యాసం (సి.జి)
7. డి.కెలో పరిశోధనకు అనుసరించిన పద్ధతి (దేవ్‌జీ)ని సమిష్టిగా 3 రోజులు అధ్యయనం చేసాం.

డి.కెలో రూపొందించిన టేబుల్ నమూనాగా తీసుకొని ఎమ్.కె.వి.బి డివిజన్ పరిస్థితులకు అనుగుణంగా, మార్పులతో 47 అంశాల టేబుల్‌ను తయారు చేసాం. దానికి తోడుగా గ్రామం మొత్తాన్ని అర్థం చేసుకోవడానికి ఒక 19 ప్రశ్నలను రూపొందించాం. గ్రామాల అధ్యయనం కోసం డివిజన్‌లో పెదబయలు ఏరియాలో 3 గ్రామాలు, గుమ్మ ఏరియాలో 3 గ్రామాలు ఎంపిక చేసుకున్నాం. ఎంచుకున్న గ్రామాలు ఒకే రకమైనవి కావు.

1. పూర్తిగా వెనకబడిన గ్రామాలు-2
2. సాపేక్షికంగా అభివృద్ధి చెందిన గ్రామాలు-2
3. అభివృద్ధి చెందిన గ్రామాలు-2

ఇలా మొత్తం 6 గ్రామాలను ఎంచుకున్నాం. ఎంపికలో మరో కోణం-వివిధ ఆదివాసీ తెగలు, ఆదివాసేతర కులాలను అధ్యయనం చేసే విధంగా ఎంపిక చేసుకున్నాం. ఎంచుకున్న గ్రామాలలో అధ్యయనం చేసేముందు సంఘం, వారి ద్వారా ప్రజలకు మన వర్గ విశ్లేషణ లక్ష్యం అర్థం చేయించి అన్ని విషయాలు వివరంగా, స్వేచ్ఛగా చెప్పే విధంగా ప్రజలనూ, సంఘాలను సన్నద్ధం చేసాం.

ఈ అధ్యయనంలో మనం ప్రజల రిపోర్టు మీద ఆధారపడి రూపొందించుకున్న టేబుల్‌లోని విషయాలను అర్థం చేసుకోవడానికి మేము అవలంబించిన పద్ధతి

1. ప్రజలు భూముల వివరాలను ఎకరాలలో చెప్పలేకపోయారు. ఎందుకంటే కొండపోడు, గరువులు కొలతలతో లేకపోవడం వలన వారు చెప్పలేకపోయారు. అందుకే పంట దిగుబడి ఆధారంగా ఎకరాల అంచనా కట్టాం.

| | | |
|---|---|---|
| వరి 2-4 బస్తాలు | (క్వింటాళ్ళు) | = 1/2 ఎకరం |
| వరి 6-10 " | " | = 1 ఎకరం |
| చోళ్ళు 5 " | " | = 1 ఎకరం |
| గొచ్చ కందులు 5-10 " | " | = 1 ఎకరం |
| పసుపు 10 " | " | = 1 ఎకరం |
| గంజాయి 300-400 గోతులు | | = 1 ఎకరం |

2. అప్పులు ప్రతి సంవత్సరం పంటకు ముందు తీసుకోవడం, పంట పండిన తర్వాత మొత్తం తీర్చేవి -90%, దీర్ఘకాలిక అప్పులు- 10% మాత్రమే వుంటాయి.

3. నిల్వలు చెప్పేటప్పుడు కొందరు 100% వాస్తవాలు చెప్పలేదు.

4. ఖర్చు చెప్పేటప్పుడు ప్రతి పద్దును ఖచ్చితంగా చెప్పడం వారికి కష్టంగా వుండటం వలన మనం రాసినవి 90% వాస్తవాలకు దగ్గరగా సం॥రం మొత్తం ఖర్చులు మాత్రం సరిగానే చెప్పారు.

5. ఏ పార్టీలో పని చేస్తున్నారు ? అనే దగ్గర బూర్జువా పార్టీల పేర్లు రాసాం. అయితే అందులో అందరూ క్రియాశీల కార్యకర్తలు కారు. ఎన్నికల సమయంలో ఓటు వేసారు. అయితే వారంతా గ్రామంలోని సంఘం, విప్లవ కార్యకలాపాలలో పాల్గొంటున్నారు.

**సామాజిక పరిశోధనలో భాగంగా అధ్యయనం చేసిన ఆరు గ్రామాల సంశ్లేషణ**

ఎ.పిలోని పెదబయలు ఏరియాలో 3 గ్రామాలు, ఒడిశాలోని కట్‌ఆఫ్ ఏరియాలో 3 గ్రామాలు మొత్తం 6 గ్రామాలలో 2 పూర్తిగా వెనకబడినవి, 2 మధ్యస్థం, 2 ఒక మోస్తరుగా అభివృద్ధి అయినవి. ఈ గ్రామాలలోని 324 కుంటుంబాలను అధ్యయనం చేసాం. ఈ 6 గ్రామాల జనాభా 1,571 అందులో స్త్రీలు 792, పురుషులు 778 మందిగా ఉన్నారు. ఈ గ్రామాలలో మొత్తం 11 తెగలు (తెగలు, కులాలు కలిపి) వున్నాయి.

1. కువ్వి (35.8%), 2. డిడోయ్ (18.51%), 3.పోరజ (7.40%),

4. కొండదొర (9.25%), 5. నూకదొర (2.46%), 6.కొటియా (.92%), 7. గౌడ (11.41%), 8. రొణా (2.77%), 9. భగత (9.25%), 10. కమ్మరి (.30%), 11. కుమ్మరి (1.85%) గా వున్నారు.

గ్రామాల తెగలలోని కుంటుంబాల మధ్యన ఆర్థిక, సాంస్కృతిక, అసమానతలు వున్నాయి. ఈ అసమానతలను అర్థం చేసుకోవడానికి గ్రామ వివరాలతో కూడిన టేబుల్ విడిగా వుంది. దాన్ని జతపరిచి చూడటం ద్వారా గ్రామాలలోని ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరమైన విషయాలను అర్థం చేసుకోవచ్చు. ఈ 6 గ్రామాలను కలిపి ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి విధానం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవడానికి చేసిన సంశ్లేషణను కింద చూడవచ్చు (దీన్ని గమనంలో పెట్టుకొని అధ్యయనం చేయగలరు).

## ఉత్పత్తి సాధనాలు, వాటిపై యాజమన్యం

అధ్యయనం చేసిన 6 గ్రామాలలో భూమే ప్రధానమైన ఉత్పత్తి సాధనం. భూమి 6 గ్రామాలలోని 324 కుటుంబాలలో 276 కుటుంబాలకు ఉంది. ఈ 276 కుటుంబాల చేతిలో 689 ఎకరాల భూమే ఉంది. అందులో 24 కుటుంబాలకు కొద్ది పాటి మెట్ట ఉండగా, 24 కుటుంబాలకు సెంటు భూమి కూడా లేదు. ఈ 48 కుటుంబాలు రైతు కూలీలుగా జీవిస్తున్నారు. 6 గ్రామాలలోని మొత్తం కుటుంబాలలో 316 కుటుంబాలు వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా బతుకుతున్నారు. మొత్తంలో భూమిపై ఆధారపడి బతికేవాళ్ళు 97.53%గా వున్నారు. ఇక మిగతా కుటుంబాలు వ్యవసాయం పై కాకుండా, ఉద్యోగాలు, వ్యాపారం, చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. భూమి ఉన్న 276 కుటుంబాలకు సగటున ఒక్కొక్క కుటుంబానికి 2.49%ఎకరాల భూమి (మెట్ట+పొలం కలిపి) ఉంది. భూమి అనేక చిన్న చిన్న కమతాలుగా ఉంది.

• మన పార్టీ చేపట్టిన భూ పోరాటం ద్వారా 4 గ్రామాలలోని 108 కుటుంబాలకు 78 ఎకరాల భూమి లభించింది. ఇందులో 60 కుటుంబాలకు 1/2 ఎకరం చొప్పున, 48 కుటుంబాలకు 1ఎకరం చొప్పున భూమి దక్కింది.

• 6 గ్రామాలలోని మొత్తం సాగు భూమిలో 25% భూమికి కాలువల ద్వారా సాగునీటి సౌకర్యం ఉంది.

• భూమిని కలిగి ఉన్న 276 కుటుంబాలలో 77 మంది రైతులు వారి శ్రమతో పాటు వ్యవసాయ కూలీలను పెట్టుకుంటున్నారు.

• మొత్తం కుటుంబాలలో 24 నామ మాత్రపు మెట్ట ఉన్న కుటుంబాలు, మరియు 24 భూమిలేని కుటుంబాలు వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు.

• మొత్తం కుటుంబాలలో భూమి ఉన్న రైతులు 85.18%, వ్యవసాయ కూలీలు 12.34%. వ్యాపార, ఉద్యోగ, ఇతర వృత్తులవారు కలిపి 2.47%గా ఉన్నారు.

• ఉత్పత్తి పరికరాల విషయానికి వస్తే భూమిని దున్నడానికి అత్యంత వెనకబడిన, పాతకాలం నాటి అతి బలహీనమైన నాగళ్ళు (కొన్నింటికి ఇనుప కర్రులు కూడా లేనివి) ఉపయోగిస్తున్నారు. వీళ్ళు నాగళ్ళకు కట్టే ఎడ్లు, గొడ్లు కూడా చాలా బలహీనమైనవి. వాటికి అవసరమైనంత పౌష్టికాహారం ఉండదు. మరి కొంత మందికి కర్రనాగళ్ళు కూడా లేకపోవడంతో వారు పారలతో తవ్వి భూమిని సాగు చేస్తున్నారు. ఈ మొత్తం 6 గ్రామాలలో ట్రాక్టర్లు వాడకం చాలా నామమాత్రంగానే ఉంది. భూమి ఉన్న 276 కుటుంబాలలో 237 కుటుంబాలకు నాగళ్ళు ఉన్నాయి. 31 కుటుంబాలకు నాగళ్ళు లేవు. బెజ్జి గ్రామంలో మాత్రం 2 ట్రాక్టర్లు ఉన్నాయి. వారి స్వంత భూమితో పాటు అదే గ్రామలో మరికొన్ని కుటుంబాలు ట్రాక్టర్‌తో దున్నించుకుంటాయి. మిగిలిన 5 గ్రామాలలో ట్రాక్టర్‌తో దున్నించడం అనేది పూర్తిగా లేదు.

భూమి ఉన్న 276 కుటుంబాలలో 85.86% వారికి నాగళ్లు ఉన్నాయి.

14.14% కుటుంబాలకు నాగళ్ళు లేవు.

• వ్యవసాయ సాగు పద్ధతి విషయానికి వస్తే మొత్తం భూమి ఉన్న కుటుంబాలలో 106 (38.4%) కుటుంబాలు వ్యక్తిగతంగా సాగు చేస్తున్నాయి. 17 సహకార బృందాలతో 61(22.10%) కుటుంబాలు సహకార వ్యవసాయం చేస్తున్నాయి. మిగిలిన 120 (43.47%) కుటుంబాలు శ్రమ సహకార పద్ధతిలో పంటలను సాగు చేసుకుంటున్నారు.

మొత్తం రెండు రూపాలలో సహకార వ్యవసాయం 65.57%.

మొత్తంలో వ్యక్తిగత వ్యవసాయం 38.4%.

ఇక్కడ శ్రమ సహకార పద్ధతిలో సాగు చేస్తున్న వ్యవసాయమే ఎక్కువ.

• భూమి లేని 24, మరియు నామమాత్రపు మెట్ట ఉన్న 24 రైతుకూలీ కుటుంబాలే కాకుండా పేద, మధ్య తరగతి రైతులు కూడా కూలీ పనులకు వెలుతున్నారు. వీళ్ళు సొంత గ్రామంతో పాటు పక్క గ్రామాలకు కూడా వ్యవసాయ కూలీలుగా వెళుతున్నారు. వ్యవసాయ రంగంలో రోజుకూలీ 50/- రూ॥ లభిస్తుంది. బెజ్జి లాంటి గ్రామాలలో గుత్తరూపంలో పని చేసే పద్ధతి కూడా ఉంది. మొత్తం కుటుంబాలలో అసలుకే కూలీకి వెళ్ళని కుటుంబాలు 57. మొత్తం 247 కుటుంబాలు కలిసి సం॥లో 19,861 కూలీ పని దినాలు పని చేస్తారు. దీని విలువ 9,93,050/- రూ॥. అలాగే బూర్జువా ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్.ఆర్.జి.ఎస్ పథకం క్రింద 900 పని దినాలు పని చేసారు. దీని విలువ 94,000/- రూ॥లు.

### 1. జీతగాళ్ళ కోసం

బెజ్జి గ్రామంలో 5 కుటుంబాలు 6 మందిని జీతానికి పెట్టుకున్నారు. సిమ్లిపొదర్ గ్రామంలో ఒకరు పక్క గ్రామంలో జీతంకు ఉంటున్నారు. ఇతనికి సంవత్సరంకు జీతం 2000/- రూ॥, 2 బస్తాల ధాన్యం ఇస్తారు. బెజ్జిలో సంవత్సరానికి జీతం ఆవరేజ్‌గా 4,500/- రూ॥ జీతం ఇస్తున్నారు. బూర్జువా ప్రభుత్వాలు చెబుతున్న కనీస వేతనంలో 30% మాత్రమే.

ఇక్కడి వ్యవసాయ రంగంలో గొడ్లు, మేకలు ఇచ్చి ఒక్కో సమూహంతో పని చేయించుకొనే పద్ధతి కూడా ఉంది.

### 2. వలసల కోసం

ఒక్కో కుటుంబం నుండి చింతగువ్వలో ముగ్గురు, సిమ్లిపొదర్‌లో ఒకరు, తాబేరులో ఒకరు చొప్పున సం॥లో కొన్ని నెలలు పట్టణ ప్రాంతాలకు వలస పోయి పని చేస్తారు. వీరు నెలకు 3000/- రూ॥ సంపాదిస్తున్నారు.

గతంలో ఈ వలసలు ఎక్కువగా ఉండేవి. గంజాయి సాగు చేయడం ప్రారంభమైన తర్వాత ఈ వలసలు దాదాపుగా తగ్గిపోయాయి.

### 3. భూమి సరుకుగా మారిందా?

మనం అధ్యయనం చేసిన గ్రామాలే కాకుండా వీటికి ఆనుకొని ఉండే అనేక ఆదివాసీ గ్రామాలలో భూమి అమ్మడం గానీ, కొనడం గానీ లేదు. ఆదివాసేతర గ్రామాలలో (ఉదా: బెజ్జి వంటి గ్రామాలలో) భూమి అమ్మడం, కొనడం ఉంది.

భూమి కౌలుకూ, పాలుకు తీసుకోవడం 4 కుటుంబాల్లో ఉంది. భూమి తనఖా (తాకట్లు, గిరివి) పెట్టడం, పెట్టుకోవడం కూడా ఉంది. ఉదా : బెజ్జి గ్రామంలో నలుగురు రైతులు పక్క గ్రామమైన సింగొయి రైతుల భూములను తాకట్టు పెట్టుకున్నారు. ఇది భవిష్యత్‌లో విస్తరించే అవకాశం ఉంది.

### 4. సాగు చేస్తున్న పంటలు

మనం అధ్యయనం చేసిన 6 గ్రామాలలో వరి, చోళ్ళు, కోలా మొక్కజొన్న, గొచ్చ కందులు, ఆహార పంటలు. జీడి మామిడి, పసుపు, నూనె గింజలు(అలుసులు) గంజాయి వాణిజ్య పంటలుగా సాగు చేస్తున్నారు.

**పంటల దిగుబడి :**

| | | |
|---|---|---|
| వరి | – 936 క్వింటాళ్ళు | |
| చోళ్ళు | – 216 " | |
| సామలు | – 160.6 " | |
| మొక్కజొన్నలు | – 210.5 " | |
| పప్పు దినుసులు (గొచ్చ కందులు) | – 229.8 " | @80/– రూ॥ కిలో |
| 18,32,000 | | |
| నూనె గింజలు | – 6.36 " | @14.5/– రూ॥ కిలో |
| 9,250 | | |
| పసుపు | – 244.66 " | @65/– రూ॥ కిలో |
| 15,90,290 | | |
| గంజాయి | – 173 " | @1000/– రూ॥ కిలో |
| 1,73,00,000 | | |
| జీడి మామిడి | – 3 '' | @70/–కిలో |
| 21,000 | | |
| **మార్కెట్‌కు అమ్మిన విలువ** | – 2,07,52,540 | |

● వరి, చోళ్ళు, సామలు, జొన్న పంటలను కుటుంబ ఆహార అవసరాలకు వినియోగిస్తారు. ఉత్పత్తి అవుతున్న ఆహార పంటలు కుటుంబ ఆహార అవసరాలు తీర్చడానికి సరిపోవడం లేదు. దానితో ప్రతి రైతు (మెజారిటీ రైతులు) మార్కెట్, రేషన్ డిపోపై ఆధారపడుతున్నారు.

● వాణిజ్య పంటలను మార్కెట్‌లో అమ్మడం ద్వారా వచ్చే సంవత్సరపు ఆదాయం 2,07,52,540 లో కేవలం తిండి కోసమే 32,04,528 రూ॥ (15.44%) ఖర్చు పెడతారు. ఈ డబ్బులు మార్కెట్ వ్యాపారుల చేతుల్లోకి వెళుతున్నాయి

### 5. వ్యవసాయంపై పెట్టుబడులు

ఆహార పంటల సాగుకు ఎరువులు, క్రిమి సంహారక మందులు, హైబ్రిడ్ విత్తనాల వాడకం (కొనుగోలు) లేదు. వాణిజ్య పంటలైన గంజాయి సాగులో ఎరువులు, పురుగుల మందులు కొంటున్నారు. కూలీలపై చేసే ఖర్చులు మొత్తం వ్యవసాయ పెట్టుబడిగా ప్రధానంగా సాగులో కూలీలపై ఖర్చు పెట్టుబడిగా పెడుతున్నారు. వ్యవసాయ పెట్టుబడికి బ్యాంకుల నుండి పంట రుణాలు ఎవ్వరికి అందడం లేదు. ఇక్కడ పెట్టుబడి కోసం షావుకారులు, వడ్డీ వ్యాపారుల పైనే ప్రధానంగా ఆధారపడుతున్నారు. గుంజివాడలో మాత్రం ఎస్.హెచ్.జిలు కూడా అప్పులు ఇస్తున్నాయి. షావుకారుల నుండి తీసుకున్న అప్పు షరతులతో కూడినది. పంట అప్పు ఇచ్చిన షావుకారులకే మాలు అమ్మాలనే షరతు ప్రధానంగా ఉంది. షావుకార్లు పంటకు మార్కెట్ విలువ కన్న తక్కువ ధర నిర్ణయిస్తారు. తరుగు, తూకంలో మోసం, నాణ్యత పేరుతో ధర తగ్గించడం, రవాణా చార్జీలు కలిసి 100/– రూ॥లకు 25/– రూ॥ వడ్డీ వసూలు చేస్తున్నారు.

మనం అధ్యయనం చేసిన మొత్తం 6 గ్రామాలలో రైతులు వ్యవసాయం పై పెట్టిన మొత్తం పెట్టుబడి 13,63,640/– రూ॥. ఇందులో గంజాయి కోసం పెట్టిన పెట్టుబడి 7,41,500/– రూ॥, పసుపు పంటపై 1,25,000/– రూ॥, ఇవి వడ్డీతో కూడిన అప్పు కాగా మిగతా 4,97,140/– రూ॥ రైతుల నడుమ చేబదులుగా తీసుకున్న అప్పు.

● వ్యవసాయంపై వస్తున్న మిగులును తిరిగి వ్యవసాయంపై పెడుతున్న పెట్టుబడిగా ఎక్కడ కనిపించలేదు.

● పెట్టుబడి కోసం కేవలం అప్పుపై మాత్రమే ఆధారపడుతున్నారు.

● రైతుల ఆర్థిక అవసరాలు (తక్కువ వ్యయంతో కూడుకున్నవి) వడ్డీలేని చేబదులులు కూడా కొంత వరకు తీర్చగలుగుతున్నాయి.

### 6. పంటల అమ్మకం

ఇక్కడ రైతులు పండించిన వాణిజ్య–వ్యాపార పంటలను (గంజాయి) మధ్య దళారులకు మార్కెట్ ధర కన్న 80% తక్కువ ధరకు అమ్ముతున్నారు. పసుపు, గొచ్చకందులు అప్పు ఇచ్చిన షావుకార్లకు లేదా స్థానిక వ్యాపారులకు అమ్ముతున్నారు. మరి కొంత మంది నేరుగా సంతలోనే అమ్ముతున్నారు. ఆంధ్ర, ఒడిశా రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రకటిస్తున్న పంటల మద్దతు ధరతో ఇక్కడి రైతులకు ఎలాంటి సంబంధం లేదు. షావుకారుల, మధ్య దళారుల నిలువు దోపిడీకి గురౌతు పంటలను (వాణిజ్య పంటలు)అతి తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు.

● వ్యవసాయంలో అత్యంత వెనుకబడిన ఉత్పత్తి విధానం ఉండటం. భూమి చిన్న చిన్న కమతాలుగా ఉండటం, ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందకపోవటం మూలంగా వ్యవసాయం పెరుగుతున్న జనాభాను ఇమిడించుకోలేక పోతుంది. ప్రజల భౌతిక అవసరాల కోసం మార్కెట్‌పై ఆధారపడవలసిన పరిస్థితి పెరిగి కొంత వలసలు వెళ్ళడం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలోనే ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలైన పసుపు సాగు విస్తరణ పెరగటం, గంజాయి సాగు వైపు మళ్ళడం జరిగింది. వాణిజ్య పంటలు వచ్చిన తర్వాత వచ్చే ఆదాయంలో కుటుంబ అవసరాలు తీరగా మిగులు మాత్రం నామమాత్రంగానే ఉంది.

వ్యవసాయంలో ఉత్పత్తి పెరగకపోవడానికి గల కారణాలు

ఎ. ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందకపోవడం.

బి. మొత్తం భూమిలో 73.58% భూమి పోడు (కొండపోడు) రూపంలో ఉండటం.

సి. భూమిని సారవంతం చేయడానికి ఎలాంటి చర్యలు చేపట్టకపోవటం.

డి. వర్షాల మూలంగా పోడు కోతకు గురికావటం లాంటి అనేక కారణాల మూలంగా వ్యవసాయోత్పత్తి పెరగడం లేదు.

**7. పశు సంపద**

| | |
|---|---|
| ఎడ్లు, గొడ్లు | - 761 |
| గుర్రాలు | - 72 |
| మేకలు | - 441 |
| పందులు | - 29 |
| కోళ్ళు | 1005 |

పశుసంపద అభివృద్ధి చెందడానికి బదులు క్రమంగా అది క్షీణించిపోతున్నది. ప్రతి సంవత్సరం కాలానుగుణంగా వచ్చే రోగాలు, అంటు వ్యాధులు ఒక కారణం అయితే, వాటికి సరైన పోషణ లేకపోవటంతో వందలాది పశువులు మృత్యువాత పడుతున్నాయి. దీని ప్రభావం వ్యవసాయంపై, ప్రజల పౌష్టికాహారంపై, ఆదాయ వనరులపై పడుతున్నది.

- పెదబయలు ఏరియాలో సరుకుల రవాణా ప్రధానంగా గుర్రాలపై ఆధారపడి కొనసాగుతున్నది.

**8. చేతివృత్తులు**

కమ్మరి, కుమ్మరి, వెదురు ఉత్పత్తులు తయారు చేసేవాళ్ళు, పూజారులు (గురుమై) ఫాస్టర్లు, చాలన్ వృత్తులవారు ఉన్నారు. వీళ్ళు వ్యవసాయరంగంలో భాగమౌతూనే ఈ వృత్తులను కొనసాగిస్తున్నారు. అయితే వీరిలో కమ్మరి 5 గ్రామాలలో, కుమ్మరి 5 గ్రామాలలో, చాలన్ ఒక్క గ్రామంలో వృత్తులను కొనసాగిస్తున్నారు. చలాన్ 4 గ్రామాలలో ఉన్నప్పటికీ ఒకే గ్రామంలో వృత్తిగా కొనసాగుతుంది. హిందువులు, ఆదివాసీలు ఉన్న దగ్గర గురుమై, పూజారులు, క్రిష్టియన్‌లు ఉన్నదగ్గర ఫాస్టర్‌లు ప్రజల శ్రమను దోచుకుంటున్నారు. వీరు మనం అధ్యయనం చేసిన 5 గ్రామాలలో ఉన్నారు.

**వృత్తుల వారిగా సం॥ర ఆదాయం**

| | | |
|---|---|---|
| ఎ. కుమ్మరి | = | 19,110/- |
| బి. కమ్మరి | = | 40,145/- |
| సి. చాలన్ | = | 960/- |
| డి. పూజారి, ఫాస్టర్ | = | 1,34,912/- |
| మొత్తం రూ॥ | = | 1,95,127/- |

ఇది మొత్తం రైతుల ఆదాయంలో 3.51%. ఇందులో పూజారికీ, ఫాస్టర్‌కు చెల్లించేదే 2.44%. ఇది రైతులపై జరుగుతున్న ఆర్థికేతర దోపిడి.

**9. అటవీ ఉత్పత్తులు**

పరిటాకులు (అడ్డాకులు), వెదురు ఉత్పత్తులు, జీరకల్లు, చింతపండుపై మనం అధ్యయనం చేసిన 6 గ్రామాలలో 3,91,850/- రూ॥ ఆదాయం వస్తుంది. ఇవే కాక అనేక అటవీ వుత్పత్తులు దొరుకుతాయి.

(ఉదా : మామిడి, పనస, ఉసిరి, జీడిమామిడి, కెందు, ఆకు కూరలు, దుంపలు, ఔషద మొక్కలు, పందులు, గొర్రెలు, కుందేళ్ళు, నెమళ్ళు, కోళ్ళు, ఉడుములు, కెవుడ, మానుపిల్లి, జంగపిల్లి....రకరకాల పక్షులు).

**10. సంవత్సరం మొత్తం ఆదాయం**

| | | |
|---|---|---|
| వ్యవసాయం | = 2,04,30,215/- | (75.71%) |
| చేతివృత్తులు | = 60,205/- | (0.22%) |
| ఉద్యోగ,వ్యాపార ఇతరములు | = 46,67,595/- | (17.29%) |
| అటవీ ఉత్పత్తులు | = 3,91,850/- | (1.45%) |
| కూలీ పనుల పై | = 11,19,550/- | (4.14%) |
| గుర్రాలపై | = 3,12,000/- | (1.15%) |
| మొత్తం | = 2,69,81,415/- | |

**గమనిక :** దీనికి అనుబంధంగా ఇచ్చిన టెబుల్‌లోని ఆదాయానికి సంశ్లేషనలోని మొత్తం ఆదాయానికి 60,205/- రూ॥ తేడా ఉంటుంది. ఎందుకంటే సంశ్లేషన కోసం చేతి వృత్తులను కూడా ఒక్కదగ్గరకు చేర్చాము.

**11. సంవత్సరపు ఖర్చుల మొత్తం**

| | | |
|---|---|---|
| వంటఖర్చులు | = 32,04,528/- రూ॥ | (44.28%) |
| కాస్మోటిక్స్ | = 6,48,248/- రూ॥ | (8.95%) |
| అతియారాలు | = 1,33,060/- రూ॥ | (1.83%) |
| గృహోపకరణాలు | = 37,900/- రూ॥ | (0.52%) |
| కల్లు, గుట్కా | = 3,08,910/- రూ॥ | (4.26%) |
| బట్టలు | = 7,82,520/- రూ॥ | (10.81%) |
| వైద్యం | = 3,55,340/- రూ॥ | (4.91%) |
| చదువు | = 58,000/- రూ॥ | (0.80%) |
| వినోదం | = 2,09,492/- రూ॥ | (2.89%) |
| వ్యవసాయ పెట్టుబడి | = 13,63,640/- రూ॥ | (18.84%) |
| ఆర్థికేతర ఖర్చులు | = 1,34,912/- రూ॥ | (1.86%) |
| **మొత్తం ఖర్చు** | = 72,36,550/- రూ॥ | |

| | |
|---|---|
| సంవత్సర మొత్తం ఆదాయం | = 2,69,81,415/- రూ॥ |
| సంవత్సర మొత్తం ఖర్చులు | = 72,36,550/- రూ॥ |
| మిగులు | = 1,97,44,865/- రూ॥ |
| మొత్తం అప్పులు | = 16,91,300/- రూ॥ |

| | |
|---|---|
| మొత్తం స్థిరాస్థులు | = 1,02,63,500/- రూ॥ |
| బ్యాంక్ డిపాజిట్‌లు | = 5,44,880/- రూ॥ |
| **మొత్తం** | = 1,08,08,380/- రూ॥ |

**స్థిరాస్థుల వివరాలు**

బంగారం - 112 తూలాలు 30,000 = 33,60,000/-

| | | | |
|---|---|---|---|
| వెండి | – 698.75 " ఇ 120 | = | 83,500/- |
| వాహనాలు | – | = | 44,96,000/- |
| ఎలక్ట్రానిక్స్ వస్తువులు– | | = | 23,23,000/- |
| **మొత్తం** | – | = | 1,02,63,500/- |

● స్థిరాస్తుల విలువ 75% గుంజివడ, బెజ్జి గ్రామాలకు సంబంధించివే.

● మిగులు పెద్ద మొత్తంలో గంజాయి సాగు చేసే పెత్తందార్లవద్ద, వ్యాపారుల వద్ద పోగుబడి ఉందని అర్థం చేసుకోవచ్చు.

● ఎందుకంటే మిగతా నాలుగు గ్రామాలలో పెద్ద స్థాయిలో వ్యాపారం చేసేవాళ్ళ సంఖ్య కూడా లేదు.

● మనం అధ్యయనం కోసం ఎంపిక చేసుకున్న మూడు రకాల గ్రామాలలో బెజ్జి, గుంజివడ, రెండు కూడా ఒక్క మోస్తరుగా అభివృద్ధి చెందిన గ్రామాలే.

## 12. ప్రభుత్వ పథకాల సంస్కరణలు

మనం అధ్యయనం చేసిన 6 గ్రామాలలో రేషన్ కార్డు, ఓటర్ కార్డు, భీమా కార్డు, ఆధార్ కార్డులు ఉండి వాటి నుండి కొంత మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారు.

| | | | |
|---|---|---|---|
| రేషన్ కార్డులు | – 281 ఉన్నవి | 43 కుటుంబాలకు లేవు. | |
| ఓటర్ కార్డులు | – 290 " | 34 | " |
| ఆరోగ్యభీమా | – 276 " | 48 | " |
| ఆధార్ కార్డు | – 311 " | 13 | " |

బి.పి.ఎల్ (బిలో పావర్టీ లెవల్) రేషన్ కార్డుపై ప్రతి కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగా ప్రతినెల 5కిలోల బియ్యం చొప్పున ఇస్తున్నారు. కుటుంబం మొత్తానికి కలిపి 2 లీటర్ల కిరోసిన్ , అరకిలో పంచదార, అరకిలో మంచినూనె ఎ.పి ప్రభుత్వం ఇస్తుండగా, ఒడిశా ప్రభుత్వం బియ్యం, కిరోసిన్ మాత్రమే ఇస్తున్నది.

● ఆరోగ్య భీమా 276 కుటుంబాలకు ఉన్నప్పటికీ దీనిని మొత్తం కుటుంబాలలో ఒక్క కుటుంబం మాత్రమే ఉపయోగించుకొని లబ్ధి పొందింది.

● ఆధార్ కార్డును, అన్ని ప్రభుత్వ పథకాలకు అనుసంధానించారు.

● ఇందిరా ఆవాస్, ముకుడియా పథకం ద్వారా లబ్ధి పొందిన కుటుంబాల సంఖ్య 119(మొదటి ఒక్కొక్క కుటుంబానికి 45,000/- ఉండగా ప్రస్తుతం అది 75,000/- చేసారు).

● ఈ పథకం లబ్ధి కోసం ప్రభుత్వ ఉద్యోగులకు, రాజకీయ నాయకులకు 10% లంచం ఇచ్చుకోవలసిందే.

● ఈ పథకం ద్వారా మనం అధ్యయనం చేసిన 6 గ్రామాలలో 36.72% కుటుంబాలు మాత్రమే లబ్ధి పొందాయి. అయితే ఇండ్లు లేని నిరుపేదల కన్న ఆర్థిక, రాజకీయ పలుకుబడి ఉపయోగించుకొని లబ్ధి పొందినవారు కూడా ఉన్నారు. ఉదా : బెజ్జి గ్రామంలోని 48 కుటుంబాలలోని 44 కుటుంబాలు రెండుసార్లు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. కోంద్రు, చింతగుప్ప గ్రామాలలో ఏ ఒక్క కుటుంబం కూడా ఈ పథకం ద్వారా లబ్ధి పొందలేదు.

● వృద్ధాప్య పెన్షన్స్ విషయానికి వస్తే 58 మందికి మాత్రమే లభిస్తుంది. (ఎ.పిలో 1000/- రూ॥, ఒడిశాలో 300/- రూ॥ ఇస్తున్నారు).

## 13. మతం

క్రిష్టియన్, హిందూ, ఒలేకు మతాలు ఉనికిలో ఉండగా ఏ మతంలో లేని వారు కూడా ఉన్నారు.

● క్రిస్టియన్ మతంలో 48 కుటుంబాలు ఉన్నాయి. ఈ మతం మనం అధ్యయనం చేసిన 4 గ్రామాలలో ఉన్నది.

● ఒలేకు– ఇందులో 4 కుటుంబాలు ఒక్క బెజ్జి గ్రామంలోనే ఉన్నాయి.

● హిందూమతం– గుంజివాడ, బెజ్జి గ్రామాలలో కలిపి 92 కుటుంబాలు ఉన్నాయి.

● ఏ మతంలో లేని ఆదివాసీ కుటుంబాలు 171 ఉన్నాయి. మొత్తం 6 గ్రామాలలో 52.77% ఆదివాసీ కుటుంబాలే. వీరికి ఏ మతం లేదు.

● క్రిస్టియన్ మతం ప్రస్తుతం ఎ.పి.రాష్ట్రంలో ఎక్కువగా ఉంది. మనం అధ్యయనం చేసిన గ్రామాలలో క్రిష్టియన్ మతంలో కువ్వి తెగ ప్రజలు ఎక్కువగా చేరారు. ఇందులో చేరడానికి వాళ్ళు చెప్పే ప్రధాన కారణాలు....

ఎ. మాకు ఉన్న రోగాలు నయమవుతాయనీ,

బి. కల్లు తాగడం లాంటి వ్యసనాలను వదులుకోగలుగుతామనీ,

సి. ఆదివాసీ తెగ సాంప్రదాయక పండుగల ఖర్చులు తగ్గుతాయనీ,

● ప్రతి ఆదివారం పనులు బంద్ పెట్టుకొని చర్చికి తప్పకుండా వెళ్ళాలని నియమం పెట్టుకొని ఆచరిస్తున్నారు.

**హిందూ మతం :–** బెజ్జి, గుంజివడ గ్రామాలలో ఆదివాసీ ప్రజలు ఆదివాసేతర సంస్కృతి, సాంప్రదాయాలతో కలిసిపోతున్నారు. ఈ రెండు గ్రామాలలో శివాలయాలు నిర్మించుకున్నారు. శివ పూజలు చేస్తూ శివరాత్రి పండుగ సందర్భంగా ప్రతి కుటుంబం నుండి 500/- రూ॥ నుండి 1000/- రూ॥ వరకు చందాల రూపంలో వసూలు (బలవంతంగా) చేస్తున్నారు. ఇది లక్షలలో ఉంటుంది. శివరాత్రి జాగరణ పేరుతో సినిమాలు, నాటకాలు, రికార్డ్ డ్యాన్స్‌లు కూడా ప్రదర్శిస్తున్నారు. ఇవే కాకుండా వినాయక చవితి, దసరా, దీపావళి పండుగలు ప్రోత్సహిస్తూ పెద్ద ఎత్తున ఆదివాసీ ప్రజల ధనాన్ని వృధాగా ఖర్చు చేయిస్తూ హిందూ మత సంస్కృతిని విస్తరింపజేస్తున్నారు.

**ఒలేకు మతం :–** ఒకప్పుడు హిందూమతాన్ని వ్యతిరేకిస్తూ కొంత ప్రగతిశీల భావాలు కల్గి ఉన్నప్పటికీ ప్రస్తుతం దానిని హిందూమతంగానే పరిగణించాలి.

## 14. సంస్కృతి

హిందూ, క్రిష్టియన్, ఆదివాసీ తెగ సంస్కృతులు విడిగా వాటి అస్థిత్వాన్ని కాపాడుకుంటున్నాయి. సామ్రాజ్యవాద సంస్కృతి వేగంగా ఆదివాసీ ప్రాంతాలకు చొచ్చుకొని వస్తున్నది. ఆదివాసీ ప్రజలను ప్రభావితం చేస్తున్నది. బాల్యవివాహాలు, బలవంతపు పెళ్ళిళ్ళు, బహుభార్యత్వం, ఇతర పితృస్వామిక రూపాలు అన్ని మతాల స్త్రీలపై అమలు చేస్తున్నారు. వేష, భాషలలో సాధారణత్వానికి భిన్నంగా పెట్టుబడిదారి సంస్కృతి క్రమంగా విస్తరిస్తున్నది.

## 15. వ్యసనాలు

ఒలేకు, క్రిష్టియన్ మతంలో చేరినవారు ప్రధానంగా సారా, గుట్కాలు తినడం మానేసారు. మిగతా వారిలో సారా, కల్లు, పొగ తాగడం, గుట్కాలు తినడం, మైనర్ల నుండి మేజర్లలోని అన్ని వయస్సుల స్త్రీ-పురుషులలో ఉంది. కొన్ని గ్రామాలలో పేకాట, కుడికుడిలు ఆడటం వుంది.

## 16. విద్యా-ఉద్యోగాలు

మనం అధ్యయనం చేసిన 6 గ్రామాలలోని ఒక్క గ్రామం సిమ్లిపొదర్‌లో పాఠశాల లేదు. మిగతా 5 గ్రామాలలో పాఠశాలలు ఉన్నాయి. కాని తాబేరు, చింతగుప్ప పాఠశాలల్లో ఉపాధ్యాయులు రావడం లేదు. మిగిలిన గ్రామాలలో సింగిల్ ఉపాధ్యాయులతో నడుస్తున్నాయి. ఉపాధ్యాయులు రెగ్యులర్‌గా రాకపోవడంతో పిల్లలకు అందవలసినంత విద్య అందడం లేదనే చెప్పాలి. అధ్యయనం చేసిన 6 గ్రామాలలో అక్షరాస్యత శాతం 17.25%గా వుంది. అతి తక్కువ అక్షరాస్యత తాబేరులో 1.90%గా ఉంది. మొత్తం గ్రామాలలో మహిళలు 6.81%, పురుషులు 10.43%గా ఉన్నారు. ఈ 6 గ్రామాలలో అతి తక్కువ 1వ తరగతి కాగా, మెజారిటీగా 5వ తరగతి ఉండగా, గుంజివడ, కోంద్రు గ్రామాలలో ఒక్కరిద్దరు ఎమ్.ఎ, బి.ఇ.డి, ఇంజనీరింగ్ వంటి చదువులు చదివి నిరుద్యోగులుగా ఉన్నారు.

**మొత్తం 6 గ్రామాలలో**

ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు,

6 మంది అంగన్‌వాడీ టీచర్లు

5 మంది అంగన్‌వాడీ ఆయాలు

ఇద్దరు అంగన్‌వాడీ లింక్ వర్కర్లు ఉన్నారు.

**ప్రైవేటు ఉద్యోగులు :-** ఇద్దరు బోరింగ్ మేస్త్రిలు, ముగ్గురు వాహన డ్రైవర్లు ఉన్నారు.

## 17. వైద్యం

అల్లోపతి, ఆయుర్వేదం (నాటువైద్యం) అన్ని గ్రామాలలో ఉపయోగిస్తున్నారు. మనం అధ్యయనం చేసిన గ్రామాలకు అందుబాటులో ఎలాంటి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రలు(పి.హెచ్.సి)లు లేవు. 5 నుండి 20 కి.మీ దూరంలో పి.హెచ్.సిలు ఉన్నా డాక్టర్ల, మందుల కొరతలు ఎదుర్కొంటున్నాయి. సిమ్లిపొదర్, తాబేరు గ్రామాలలో ఎ.వి.ఆర్.సి.ఎస్ నేతృత్వంలో చదువుకున్న విద్యార్థులను ఎంపిక చేసి వారికి ప్రాథమిక వైద్యంపై తర్ఫీదునిచ్చి ప్రజావైద్యాన్ని అభివృద్ధి పరుస్తున్నాము.

## 18. త్రాగునీరు

మనం అధ్యయనం చేసిన 6 గ్రామాలలో ఏ గ్రామంలో కూడా ప్రజలకు సురక్షిత త్రాగునీటి వ్యవస్థ లేదు. ప్రధానంగా నదులలో, కాల్వలలో, కొండల నుండి వస్తున్న ఊట చెలిమెల నీటినే త్రాగుతారు. చింతగుప్ప, బెజ్జి గ్రామాలలో పైపుల ద్వారా నీళ్ళు అందుతున్నా అవి సురక్షితమైన నీరేమి కావు. త్రాగునీరు విషయంలో బూర్జువా ప్రభుత్వ నిర్లక్ష్యం చాలా తీవ్రంగా కొనసాగుతున్నది. సురక్షితమైన మంచినీరు లేకపోవడం మూలంగా మురుగునీరు తాగి ముఖ్యంగా వర్షకాలంలో టైఫాయిడ్, కామెర్ల వ్యాధులతో అనేక మంది వయస్సుతో నిమిత్తం లేకుండా మృత్యువాత పడుతున్నారు. ఇక దోమకాటుతో మలేరియా, డెంగ్యూ వ్యాధులకు గురి అయ్యేవారు మెజారిటీగా వుంటారు.

## 19. పిల్లల అకాల మరణాలు

మనం అధ్యయనం చేసిన 6 గ్రామాలలో పిల్లల అకాల మరణాలు చూస్తే మెజారిటీగా పురిట్లోనే చనిపోతున్నారు. తల్లికి ప్రసవ సమయంలో ఎక్లాంసా జబ్బు రావడంతో తల్లి బిడ్డ ఇద్దరు చనిపోతున్నారు. ఒకవేళ పిల్లలు బతికినా వారికి అవసరమైనంత ఆక్సిజన్ అందక అదేరోజు చనిపోతున్నారు. ఆస్తమాతో మరికొంత మంది పిల్లలు చిన్న వయస్సులోనే చనిపోతున్నారు. ఇక మలేరియా అనేది ఇక్కడ సాధారణమైనదే. మలేరియాకు సకాలంలో మందులు, వైద్యం అందక అది పాల్సిఫారం, సెరిబ్రల్‌గా మారి టైఫాయిడ్, కామెర్లు, డెంగ్యూ వ్యాధులు ఏక కాలంలో సోకి అత్యధిక మంది పిల్లలు చనిపోతున్నారు. టి.బితో కుడా వయస్సు నిమిత్తం లేకుండా అనేక మంది అకాల మరణాలు పొందుతున్నారు.

## 20. రవాణా సౌకర్యాలు

మనం అధ్యయనం చేసిన ఎ.పిలోని పెదబయలు ఏరియాలో ప్రధానంగా గుర్రాలే ప్రధాన రవాణా వనరుగా ఉంటున్నాయి. అక్కడి మెజారిటీ ప్రజలు సంతలకూ, బంధువుల దగ్గరికైనా కాలినడకనే వెళతారు.

కట్‌ఆఫ్ ఏరియాలోని మూడు గ్రామాలకు లాంచి, చేతి డొంగలు (చిన్న పడవలు) ప్రధానమైన రవాణ వనరు. బెజ్జిలాంటి కొంత అభివృద్ధి చెందిన గ్రామానికి ట్రాక్టర్, వ్యాన్, జీపుల సౌకర్యం కొంత మేరకు ఉంది. దీన్ని కూడా మెజారిటీ ప్రజలు ఉపయోగించుకోలేరు. ఇక ఈ 3 గ్రామాల ప్రజలు కాలి నడకనే ప్రధానంగా వుపయోగిస్తారు.

## 21. ఇళ్ళ పరిస్థితి

మనం అధ్యయనం చేసిన 6 గ్రామాలలోని 324 కుటుంబాలలో, 315 కుటుంబాలకు స్వంత ఇళ్ళు ఉన్నాయి. కేవలం నలుగురికి మాత్రం ఇళ్ళులేవు. ఇళ్ళు ఉన్నా 315 మందిలో....

128 మందికి రేకుల ఇళ్ళు

163 మందికి పెంకుల ఇళ్ళు

25 మందికి గడ్డి గుడిసెలు

ఒక్కరికి జిల్లీ గుడిసె ఉంది.

## నిర్ధారణలు

మనం అధ్యయనం చేసిన 6 గ్రామాలలో అత్యంత వెనకబడిన ఉత్పత్తి శక్తులు వున్నాయి. కొండపోడు, సమతలం లేని, రాళ్ళు రప్పలతో కూడిన భూములు ఉన్నాయి. వ్యవసాయం ప్రధానంగా వర్షాధారం పైనే ఆధారపడి సాగవుతున్నది. భూమి కోతకు గురికావడం, భూమిని సారవంతం చేయకపోవడం, సంవత్సరాల తరబడి ఒకే రకమైన పంటలు సాగు చేయడం, నాసికరపు విత్తనాలు వాడటం, ప్రకృతి వైపరీత్యాల (అతివృష్టి-అనావృష్టి) ప్రభావం, భూమి దున్నడానికి ఎద్దులు అందరికీ లేకపోవడం, ప్రభుత్వ నిర్లక్ష్యం లాంటి తదితర కారణాల రీత్యా ఇక్కడ ఉత్పత్తి శక్తుల అభివృద్ధి చాలా వెనకబడి ఉంది.

నేటికి భూమిలేని వ్యవసాయ కూలీల సంఖ్య 15%గా ఉంది.

నేటికి ఇక్కడ భూమి గ్రామ సాంప్రదాయ పెత్తందార్ల, స్థానిక రాజకీయ నాయకుల, నూతనంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్మీడియట్(ఆదివాసేతర)శక్తుల, భూస్వాముల చేతుల్లో సారవంతమైన, సాగు యోగ్యమైన, మెరుగైన భూములు కేంద్రీకరించబడి ఉన్నాయి.

**దోపిడీ రూపాలు:-** శ్రమదోపిడీతో పాటు అధిక వడ్డీ, తూకంలో (దండి) దోపిడీ కొనసాగుతున్నాయి. తెగ, మత సాంప్రదాయల, ఆచారాల పేరుతో దండుగలు, ఉదా : తెగపెత్తందార్లను ధిక్కరించారని తెగాంతర వివాహం చేసుకున్నారనీ, భర్తలను వదిలిపెట్టారనీ, దండుగలు, మొగనాలు వేయడం జరుగుతున్నవి.

మార్కెట్ దోపిడీ :- పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం, సరుకు నాణ్యత లేదనే పేరుతో ధరను తగ్గించి ఇవ్వడం, షావుకార్లు రైతులకు ముందస్తు అప్పులు ఇచ్చి పంటల ధరలను వారే నిర్ణయించడం, తూకాలలో దోపిడీ, తరుగు, రవాణా పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నారు.

● రైతులు మార్కెట్‌లో (సంతలలో)కొనే సరుకులకు అధిక ధరలు చెల్లించి మరోరకంగా దోపిడీకి గురవుతున్నారు. మార్కెట్‌లో రైతులు అమ్మిన, కొన్న రెండు సందర్భాలలో దోపిడికే గురవుతున్నారు.

భూమి సరుకు : భూమి అమ్మడం, కొనడం ప్రధానంగా లేదు. అక్కడక్కడ ఇప్పుడిప్పుడే మొదలైంది. అది ఆదివాసేతరులలో మాత్రమే.

● ఇక్కడ భూమిని కౌలుకు ఇవ్వడం, తనఖా పెట్టడం తక్కువ స్థాయిలో అయినప్పటికీ ఉంది.

పంటల వినియోగం : ఇక్కడ పండించే ఆహార పంటలు సొంతానికే (తిండి అవసరాలకే) సరిపోతాయి. ఆహార పంటలను మార్కెట్‌లో అమ్మరు. వాణిజ్య పంటలను మార్కెట్ కోసమే ఉత్పత్తి చేస్తున్నారు.

● వ్యవసాయంపై మిగులు నామమాత్రమే.

● వ్యవపాయంపై నామమాత్రపు మిగులును బట్టలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాలు, కాస్మోటిక్స్, తిండి అవసరాలపై మెజారిటీగా ఖర్చు పెడుతున్నారు. కొద్దిమంది తక్కువ మోతాదులో అయినప్పటికీ బంగారం, వెండి కొంటున్నారు. క్రమంగా గ్రామాలలో వస్తు వ్యామోహ సంస్కృతి పెరుగుతున్నది.

● భూమి చదును చేయడం అనేది అతి తక్కువ స్థాయిలో ఉన్నది. మనం అధ్యయనం చేసిన 6 గ్రామాలలో కేవలం ఇద్దరు మాత్రమే భూమిని చదును చేసారు.

● గంజాయి పంట, ప్రభుత్వ సంస్కరణలను ఉపయోగించుకుంటూ ఒక ఇంటర్మీడియట్ సెక్షన్ భూములను చదును చేయడం, వాహనాలు కొనడం, కాంట్రాక్టులు పట్టుకోవడం, రైతులకు వడ్డీకి అప్పులివ్వడం, పట్టణాలలో స్థలాలు కొనడం, ఇళ్ళు నిర్మించడం కొనసాగుతున్నది.

## వర్గాల బలాబలాలలో వచ్చిన మార్పులు

మన వ్యూహం-ఎత్తుగడల అవగాహనపై ఆధారపడి మనం పని చేస్తున్న ఆదివాసీ ప్రాంతాలలో వర్గాలను నిర్ధారించవలసి ఉంది. దానికి ప్రాతిపదికగా తీసుకోవల్సింది. భూములనే ఆధారంగా కాకుండా 1. భూమి, అందులో వస్తున్న ఆర్థిక విలువ 2. ఉత్పత్తిలో వారి శ్రమ పాత్ర 3. జీవన ప్రమాణాలు 4. రాజకీయ, సామాజిక హోదాలను చూడాలి.

మనం అధ్యయనం చేసిన గ్రామాలలో 1. వ్యవసాయ కూలీలు 2. మధ్య తరగతి 3. ధనిక రైతులు 4. భూస్వాములు ఉన్నట్లుగా గుర్తించాం. అయితే ఈ వర్గాలను మొత్తం జోన్‌లో జరిగే అధ్యయనం ఆయా ప్రాంతాల నిర్ధిష్టతలపై ఆధారపడి నిర్ణయిస్తే సమగ్రంగా వుంటుందనేది మా ప్రతిపాదన. రైతులే కాకుండా 1.వ్యాపారులు 2. ఉద్యోగులు 3. వాహన యజమానులు 4. కాంట్రాక్టర్‌లు 5. వృత్తులు చేసేవారు కూడా వీరిలో కూడా వర్గాన్ని నిర్ణయించాల్సి వుంటుంది.

● ఈ నాటికి భూమిలేని వ్యవసాయ కూలీలు 15%గా వున్నారు.

● చాలి చాలని భూములు కలిగిన పేద రైతుల శాతం గణనీయంగానే ఉంది.

● మధ్య తరగతి వర్గం కూడా ఉంది.

● అందులోంచి నూతనంగా ఒక ధనిక వర్గం అభివృద్ధి అవుతుంది.

● ఆదివాసీ ప్రాంతాలలో అదివాసేతరుల నుండే ప్రధానంగా భూస్వాములుగా వున్నారు.

● పాత తెగ వ్యవస్థలో సామాజిక హోదా కలిగిన తెగ పెద్దలు ఉన్నారు. ఇందులో కొందరు భూస్వామ్యవర్గంగా ఉన్నారు.

● వాణిజ్య పంటలు పండించిన వారిలో కొందరు అదే పంటలకు మధ్య దళారీలుగా మారారు. మరి కొందరు ప్రభుత్వ సంస్కరణల ద్వారా అబ్ధి పొందిన వారు ఉన్నారు. అతి చిన్నదైన ఒక సెక్షన్ నూతన భూస్వామ్య వర్గంగా అభివృద్ధి చెందింది.

● చేతి వృత్తులకు ఆదరణ లేక అవి క్రమంగా చతికిల పడుతున్నాయి. (ఇక్కడ ప్రధానంగా మూడే చేతి వృత్తులు కమ్మరి, కుమ్మరి, చాలన్ వున్నారు).

## ప్రస్తుత వ్యవస్థకు పరిరక్షకులు, నూతన ప్రజాస్వామిక విప్లవానికి టార్గెట్‌లుగా గుర్తించబడినవారు...

1. గ్రామాలలోని ఆదివాసేతర, ఆదివాసీ భూస్వామ్యవర్గం

2. తెగ వ్యవస్థలో తెగ పెద్ద (సామాజిక హోదా)లలోని ఒక సెక్షన్

3. ప్రభుత్వ విధానాలను అమలు చేస్తున్న పంచాయితీ వ్యవస్థలో భాగమయిన స్థానిక బూర్జువా పార్టీ నాయకులు

4. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారిలోని ఇంటర్మీడియట్ సెక్షన్

5. మతం

6. ఎన్.జి.ఓలు

7. ప్రజలను దోపిడీ చేస్తున్న వడ్డీ వ్యాపారులు. వీరు ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి, నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఆటంకంగా వున్నారు. వీరితో నిర్ధిష్టంగా ఎలా వ్యవహరించాలి అనేది నిర్ణయించుకోవాలి.

## వైరుధ్యాలు

1. భూస్వామ్యానికి పీడిత ప్రజలకు మధ్య వైరుధ్యం ఉంది.
2. సామ్రాజ్యవాదానికి, అశేష పీడిత ప్రజలకు మధ్యన వైరుధ్యంఉంది.
3. పాలకవర్గాల మధ్యన అంతర్గత వైరుధ్యం ఉంది.

28వ పేజీలో...

కరపత్రం

# నక్జలరీ సాయుధ విప్లవ వెల్లువ 50వ వార్షికోత్సవాలను గ్రామ గ్రామానా విప్లవోత్సాహం–ఉత్తేజాలతో జరపండి!

## నక్సల్బరీ మార్గమే భారత పీడిత ప్రజల విముక్తికి ఏకైక మార్గం!

## నక్సల్బరీ రగిల్చిన ప్రజాయుద్ధ జ్వాలల్లో సామ్రాజ్యవాదాన్నీ, భూస్వామ్యాన్నీ భస్మీపటలం చేద్దాం!

## నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేద్దాం!

***ప్రియమైన కామ్రేడ్స్ మిత్రులారా!***

చిన్న నిప్పురవ్వ దావానలమైనట్టే బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లా, సిలిగురి సబ్–డివిజన్, నక్జల్డరీ ప్రాంతంలో కామ్రేడ్ చారు మజుందార్ నాయకత్వంలో మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానం(నేడు మావోయిజం)తో చైతన్యయుతమై, సంఘటితమైన సంతాల్ రైతాంగం నిర్వహించిన సాయుధ వ్యవసాయ విప్లవ పోరాటం భారతదేశ విప్లవ పథాన్ని నిర్దేశించింది. అప్పటి నుండి నక్సల్బరీ కేవలం ఊరు పేరుగా కాక ఒక రాజకీయ పంథాకు ప్రతీకగా నిలిచింది. 2017మే 23 నాటికి చారిత్రక నక్జల్బరీ సాయుధ తిరుగుబాటుకు 50 వసంతాలు నిండుతాయి.

కామ్రేడ్ మావో నేతృత్వంలోని చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఆధునిక కృశ్చేవ్ రివిజనిజానికి వ్యతిరేకంగా సాగించిన బృహత్తర చర్చ మరియు సాంస్కృతిక విప్లవ ప్రేరణతో కామ్రేడ్ చారు మజుందార్, కన్హయ్ చటర్జీ వంటి మొదటి శ్రేణి నాయకులతో సహా పెద్ద సంఖ్యలో మావోయిస్టు విప్లవకారులు రంగంలోకి దూకారు. సి.పి.ఎమ్. డార్జిలింగ్ జిల్లా కార్యదర్శిగా ఉన్న కామ్రేడ్ చారు మజుందార్ 1963–65మధ్య పార్టీలో అంతర్గత సైద్ధాంతిక పోరాటం కోసం ఎనిమిది డాక్యుమెంట్లను కేడర్లలో పంపిణీ చేశారు. ఆయన పేద రైతాంగాన్ని మావో సిద్ధాంతాలతో చైతన్యపరిచారు. దీంతో జోతేదార్లకు వ్యతిరేకంగా తిరుగుబాటుకు రంగం సిద్ధమైంది.

1967 మార్చి నుండి పేద రైతాంగం జోతేదార్లపై, వడ్డీ వ్యాపారులపై తిరుగుబాటు చేసి వారి భూముల్ని స్వాధీనపర్చుకో నారంభించింది. ఆనాటి సి.పి.ఎమ్ నాయకుడు, రాష్ట్ర హోంమంత్రి జ్యోతిబసు ఆదేశాలతో పెద్దెత్తున దాడికి దిగిన ప్రభుత్వ సాయుధ పోలీసు బలగాలకూ, రైతాంగానికీ మే 23న నక్సల్బరీ గ్రామం వద్ద జరిగిన సాయుధ ఘర్షణలో ఒక పోలీసు మరణించగా మే 25న ప్రసాద్ జోతె వద్ద ప్రజలపై పోలీసులు విచ్చలవిడిగా జరిపిన కాల్పుల్లో ఆరుగురు మహిళలు, ఇద్దరు పిల్లలతో సహా 9 మంది ప్రజలు నేలకొరిగారు. చైనాలోని పెకింగ్ రేడియో నక్సల్బరీ తిరుగుబాటును "వసంతకాల మేఘగర్జన"గా అభివర్ణించింది. పాలకవర్గాలు ఆ తిరుగుబాటును మూడు నెలల్లోనే అణచివేసారు. అయితే అది దేశ వ్యాపితంగా పేద రైతాంగంలో చైతన్యాన్ని రగిల్చింది. వారిలో నిద్రానమై ఉన్న వీరత్వాన్ని మేల్కొల్పింది. అనతి కాలంలోనే నక్సల్బరీ జ్వాలలు దేశవ్యాప్తంగా శ్రీకాకుళం (ఆంధ్రప్రదేశ్); ముషాహరి (బిహార్); లఖింపూర్, ఖేరీ, తెరై (ఉత్తరప్రదేశ్); దేబ్రా, గోపీవల్లభపూర్, బీర్‌భూం, సోనార్‌పూర్, కాంక్సా (బెంగాల్); పంజాబ్, కేరళ, తమిళనాడు, ఒడిశా, కాశ్మీర్, అసోం, త్రిపుర రాష్ట్రాలకు వ్యాపించాయి. భూస్వాములకు మద్దతుగా వచ్చిన పోలీసు, పారామిలటరీ బలగాలకు, భారత సైన్యాలకు వ్యతిరేకంగా రైంతాగం సాయుధమై సాగించిన గెరిల్లా యుద్ధంలో భారత పాలకవర్గాలతో పాటు సామ్రాజ్యవాదులు భయకంపితులయ్యారు. ఆనాటి విప్లవ వెల్లువలో గ్రామీణ ప్రాంతాలే కాదు. పట్టణ ప్రాంతాలు కూడా బాగా ప్రభావితమయ్యాయి. విద్యార్థి యువజనుల నాయకత్వంలో సాగిన పట్టణ గెరిల్లా యుద్ధంతో బెంగాల్ రాజధాని కోల్‌కతా నగరం అట్టుడుకిపోయింది.

ఈ తిరుగుబాటు ప్రాముఖ్యతను వివరిస్తూ కామ్రేడ్ చారు మజుందార్ ఇలా అన్నారు: 1. రైతులు భూమి, పంట కోసం కాక రాజ్యాధికారం కోసం పోరాడారు; 2. ప్రభుత్వ సాయుధ బలగాలపై సాయుధ పోరాటాన్ని నడిపారు; 3. సాంప్రదాయక ఆయుధాలపైనే ఆధారపడి శత్రు బలగాలపై దాడులు చేస్తూ తుపాకులను స్వాధీనం చేసుకున్నారు; 4. పోరాటంలో తమ స్వంత కాళ్లపై నిలబడ్డారు; 5. రివిజనిజాన్ని ఎదుర్కోవడం ద్వారానే ఈ పోరాటం అభివృద్ధి అయ్యింది; 6. మావో ఆలోచనా విధానాన్ని రైతాంగంలోకి తీసుకెళ్ళడం ద్వారా మాత్రమే రివిజనిజాన్ని ఎదుర్కోగలమని ఈ పోరాటం నిరూపించింది.

మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానాన్ని, సాయుధ వ్యవసాయ విప్లవం ఇరుసుగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో ప్రజాసైన్యాన్ని నిర్మించడం, సాయుధ పోరాటం ద్వారా ప్రాంతాల వారీగా అధికారాన్ని స్వాధీనం చేసుకోవడం, ముందు గ్రామీణ ప్రాంతాలను విముక్తి చేసి

అంతిమంగా పట్టణాలను చుట్టుముట్టి దేశవ్యాప్తంగా విజయం సాధించడమనే దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాని భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయించిన ఫలితమే మహత్తర నక్సల్బరీ తిరుగుబాటు. అది భారత విప్లవోద్యమంలో ఊడలు దిగిన రివిజనిజానికి గొడ్డలి పెట్టు. ప్రపంచ సోషలిస్టు విప్లవంలో విడదీయరాని భాగం. అది రివిజనిజంతో తెగతెంపులు చేసుకొని మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధాన దిశానిర్దేశంతో మావోయిస్టు విప్లవ పార్టీ నిర్మాణానికి, సరైన రాజకీయ పంథాకు, వ్యూహానికి, పోరాట పద్ధతికి, నాయకత్వ శైలికి మహత్తర ఆరంభంగా నిలిచింది. ఒక్కమాటలో భరత విప్లవ చరిత్రలో అది ఒక గొప్ప మలుపు, ఒక గుణాత్మక ముందంజ.

మహత్తర నక్సల్బరీ పోరాటానికి నాయకత్వన్ని అందించిన కామ్రేడ్ చారు మజుందార్ నేతృత్వంలో సి.పి.ఐ. (ఎం.ఎల్)ఏర్పడింది. అదే సమయంలో కామ్రేడ్ కన్హయ్ చటర్జీ నాయకత్వాన అదే సిద్ధాంతాన్ని, పంథాను, వ్యూహాన్ని అనుసరిస్తూ ఎం.సి.సి. ఆవిర్భవించింది. ఇవే ఆనాటి చారిత్రక విప్లవ వెల్లువకు నాయకత్వం వహించాయి. నక్సల్బరీ పంథాకు తూట్లు పొడవజూసిన దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, చంద్రపుల్లారెడ్డి మొదలైన కుహనా విప్లవకారుల మితవాద, అవకాశవాదాన్ని తిప్పికొట్టడం ద్వారానే విప్లవ వెల్లువ పురోగమించింది. అయితే ఆనాటి ఉద్యమ వ్యూహం సరైందే అయినప్పటికీ ఎత్తుగడలపర లోపాలు, సి.పి.ఐ. (ఎం.ఎల్)లోపలా బయటా మితవాద శక్తుల విచ్ఛిన్నకర కార్యకలాపాలు, దేశవ్యాప్తంగా పాలకవర్గాలు కొనసాగించిన ప్రతీఘాతుక నిర్బంధకాండ వల్ల వరుసగా ఉద్యమం తీవ్రమైన నష్టాలు పొంది అది 1972 మధ్య నాటికి వెనకపట్టు పట్టింది. అవకాశవాదులు, విచ్ఛిన్నకారులు పార్టీని చీల్చి బలహీనపరిచారు.

అయితే నిజమైన విప్లవకారులు నక్సల్బరీ నుండి విలువైన గుణపాఠాలు తీసుకొని విప్లవ విజయానికి అవశ్యకమైన మూడు అద్భుత ఆయుధాలు -పార్టీ, ప్రజాసైన్యం, ఐక్యసంఘటనలను పెంపొందించడం కోసం దృఢ సంకల్పంతో, త్యాగనిరతితో కృషి చేశారు. పార్టీ లోపల తప్పుడు ఎత్తుగడలకు, బయట మితవాద, 'అతివాద' అవకాశవాదాలకు వ్యతిరేకంగా సాగించిన సరైన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, పోరాట కృషితో పార్టీ పునర్నిర్మాణమైంది. విప్లవోద్యమం తిరిగి పెల్లుబికింది. ఫలితంగా తిరిగి విప్లవ శక్తులను కూడగట్టారు.

ఫలితంగా 1978 నుండి సి.పి.ఐ. (ఎం.ఎల్) (పీపుల్స్‌వార్) నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో, సి.పి.ఐ. (ఎం.ఎల్) (పి.యు) నేతృత్వంలో బీహార్‌లో; ఎం.సి.సి నాయకత్వంలో బీహార్ కేంద్రంగా తొలి నుండి సాగించిన కృషి ఫలితంగా మరో విప్లవ వెల్లువ బద్దలైంది. రైతాంగాన్ని సాయుధ వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధంలో, విద్యార్థి, యువజనులను, కార్మికులు, మేధావులను విప్లవ, ప్రజాస్వామిక ఉద్యమాలలో కదలించడం ద్వారా ప్రజాపునాది, స్వీయాత్మక శక్తులు గణనీయంగా పెంపొందాయి. 2000 సం. నాటికి అలలు అలలుగానే క్రమంగా ఉద్యమం 16-17 రాష్ట్రాలలోని విశాల మైదాన ప్రాంతాలకూ, వ్యూహాత్మక ప్రాంతాలకూ, అనేక పట్టణాలు, నగరాలకు విస్తరించింది. 'దున్నేవారిదే భూమి, విప్లవ రైతు కమిటీ/విప్లవ ప్రజా కమిటీలకే సర్వాధికారాలు' అనే నినాదం ఉద్యమ ప్రాంతాలన్నింటా మారుమోగింది. పెద్దెత్తున ప్రజా గెరిల్లా దళాలు వృద్ధి చెందాయి. ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలు, గెరిల్లా జోన్లు ఆవిర్భవించాయి. మధ్య, తూర్పు భారతంలో దోపిడీ పాలకవర్గాల అధికారం ధ్వంసమైన చోట బీజప్రాయంగా ప్రజా రాజ్యాధికార నిర్మాణాల స్థాపనా క్రమంలో వాటి రక్షణకూ, విస్తరణకూ, గెరిల్లా యుద్ధ అభివృద్ధికీ 2000 డిసెంబర్ 2న పార్టీ నాయకత్వాన ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పి.ఎల్.జి.ఎ) ఏర్పడింది. 2004 సెప్టెంబర్ 21న రెండు ప్రధాన విప్లవ ప్రవంతులు ఐక్యమై భారత విప్లవోద్యమానికి నాయకత్వాన్ని అందించే ఏకైక కేంద్రంగా, సాపేక్షికంగా బలమైన పార్టీగా సి.పి.ఐ. (మావోయిస్టు) ఆవిర్భవించింది. దేశంలో మిగతా విప్లవకారులతో ఐక్యతా కృషిని కొనసాగించిన ఫలితంగా 2014 మే 1న సి.పి.ఐ. (మా.లె) (నక్సల్బరీ) ఈ నూతన పార్టీలో కలిసింది. నూతన పార్టీ నేతృత్వంలో గెరిల్లా యుద్ధం ఉన్నతస్థాయికి అభివృద్ధి అయ్యింది. వ్యూహాత్మక ప్రాంతాల్లో గ్రామ, ఏరియా, జిల్లా స్థాయి విప్లవ ప్రజా రాజ్యాధికార అంగాలు, గెరిల్లా బేసులు అభివృద్ధి చెందాయి. ఇది భారత విప్లవోద్యమంలో వెనుకపట్టులను, విద్రోహాలనూ, ఎగుడు -దిగుళ్ళనూ, మలుపులూ-మెలికలనూ అధిగమిస్తూ, నక్సల్బరీ అందించిన అమూల్యమైన అనుభవాలనూ, గుణపాఠాలను నిర్దిష్ట పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయిస్తూ, రక్తసిక్తమైన త్యాగాల బాటలో, దృఢంగా, ధైర్యంగా పురోగమిస్తూ సాధించిన మరో గొప్ప చారిత్రాత్మక ముందంజ. ఈ ఉద్యమం నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రభావాన్ని వేస్తూ ప్రపంచ విప్లవ కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు త్వరితం చేస్తోంది.

ఈ క్రమంలో ఉద్యమం అభివృద్ధి చెందకుండా పురిట్లోనే దెబ్బతీసేందుకు భారత పాలకవర్గాలకు చెందిన ఏ పార్టీ కేంద్రంలో/ రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ సామ్రాజ్యవాదుల తక్కువ తీవ్రత కలిగిన యుద్ధ (ఎల్.ఐ.సి) వ్యూహంతో 1980ల మధ్య నుండి విప్లవోద్యమంపై దఫదఫాలు అమలు చేస్తూ వచ్చిన బహుముఖ దాడిని కొనసాగించాయి. దాన్ని విప్లవోద్యమం ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వచ్చింది.

అయితే పాలకవర్గాలు ఈ ఉద్యమానికి గడగడ వణికిపోయాయి. అవి సి.పి.ఐ. (మావోయిస్టు)ను దేశ అంతర్గత భద్రతకు అతి పెద్ద ముప్పుగా ప్రకటించాయి. శత్రుదాడి 2005 నాటికి తీవ్రస్థాయికి చేరుకుంది. కొన్ని రాష్ట్రాలు, ప్రాంతాలలో ఉద్యమం తాత్కాలిక వెనకపట్టు పట్టింది. పాలకవర్గాలు సల్వాజుడుం, సేంద్ర, నాగరిక్ సురక్షా సమితి, శాంతికమిటీ తదితర పేర్లతో విప్లవ ప్రతిఘాతక క్యాంపెయిన్ల ద్వారా ప్రజల మధ్య అంతర్యుద్ధం సృష్టించి విప్లవోద్యమాన్ని రూపుమాపాలని ప్రయత్నించి విఫలం కావడంతో 2009 మధ్య నుంచి దేశవ్యాప్తంగా అత్యంత క్రూరంగా ప్రజలపై యుద్ధం-ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను కొనసాగిస్తున్నాయి. ఈ బహుముఖ దాడి వల్లా కొన్ని లోపాల వల్లా పెద్ద సంఖ్యలో వివిధ స్థాయిలో ప్రత్యేకించి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లోని నాయకత్వాన్ని నష్టపోయాం. కొన్ని ప్రాంతాలు బలహీనపడ్డాయి. దీనితో 2013 నుంచి విప్లవోద్యమం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నది. దీన్ని అధిగమించేందుకై తగిన ఎత్తుగడలను రూపొందించుకోవడమూ,

పార్టీని బోల్షివీకరించే క్యాంపెయిన్‌ను చేపట్టడం ద్వారా తిరిగి పార్టీని, ప్రజాపునాదినీ బలోపేతం చేస్తూ, ప్రజా పోరాటాలనూ పెంపొదిస్తూ పార్టీ, ఉద్యమం శత్రు దాడిని ఎదుర్కొంటూ నిలదొక్కుకుంటున్నది. నేడు పార్టీ, ఉద్యమం ముందు అనేక పెను సవాళ్ళు ఉన్నప్పటికీ గత 5 దశాబ్దాల అనుభవాల వెలుగు నుండి చూసినప్పుడు వాటిని అధిగమిస్తూ ఉద్యమాన్ని పురోగమించి తీరుతామని మన పార్టీ అచంచల విశ్వాసంతో ప్రకటిస్తున్నది.

**ప్రియమైన కామ్రేడ్స్, మిత్రులారా!**

నక్సల్బరీ విప్లవ వెల్లువ గడిచిన 5 దశాబ్దాలలో భారత విప్లవోద్యమంలో సి.పి.ఐ. (మావోయిస్టు) నాయకత్వంలో ఎన్నో గొప్ప విజయాలు, విలువైన అనుభవాలు సాధించాం. ఏ సంక్షుభిత అంతర్జాతీయ-దేశీయ పరిస్థితులు నక్సల్బరీ విప్లవ వెల్లువకు దారి తీశాయో అవి నేడు మరింత తీవ్రతరమయ్యాయి. ఉద్యమం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని అధిగమించి పురోగమించేందుకు భౌతిక పరిస్థితులు మున్నెన్నడటి కంటే పరిపక్వంగా ఉన్నాయి. కనుక ఆ అమూల్యమైన అనుభవాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ అజేయమైన దీర్ఘకాల ప్రజాయుద్ధ పథంలో పురోగమించండి! ఇందుకోసం -

పార్టీని సైద్ధాంతికంగా, రాజకీయంగా, సైనికంగా, నిర్మాణపరంగా, సాంస్కృతికంగా బలోపేతం చేయాలి. సిద్ధాంతాన్ని అచరణకు సృజనాత్మకంగా అన్వయించడంలో, పార్టీలో తలయెత్తే మితవాద, 'అతివాద' అవకాశవాద ధోరణులకు వ్యతిరేకంగా పోరాడి పార్టీ సమైక్యతని పటిష్టం చేయాలి. పీడిత వర్గాలు, సెక్షన్లను వర్గ ప్రాతిపదికన ఐక్యం కాకుండా వివిధ రూపాల్లో ప్రభావితం చేస్తున్న పోస్టు మాడర్నిజాన్నీ, గాంధీయిస్టు, పార్లమెంటరిస్టు, రివిజనిస్టు వాదాలను, ప్రచండ-అవాకియన్‌ల నయా రివిజనిస్టు వాదాలను సైద్ధాంతికంగా ఎండగట్టాలి. కార్మికవర్గ అంతర్జాతీయతను ఎత్తిపడుతూ ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న మావోయిస్టు విప్లవ శక్తులతో, సంస్థలతో ఐక్యం కావాలి.

సమాజంలోని పేద రైతులు, కార్మికులు, దళితులు, ఆదివాసీలు, విద్యార్థి యువజనులను, మహిళలను, మత మైనారిటీలను, పీడిత జాతులను సంఘటితం చేయడం ద్వారా దీర్ఘకాల ప్రజాయుద్ధానికి ప్రజాపునాదిగా అపారంగా పెంపొందించాలి. విశాల ప్రజలను సాయుధం చేస్తూ, అజేయమైన కఠిన పోరాట శైలిని, మావోయిస్టు యుద్ధ కళను అభివృద్ధి చేసి పి.ఎల్.జి.ఎ. యుద్ధ సామర్థ్యాన్ని పెంపొందించాలి. ప్రభుత్వ సాయుధ బలగాలను సంహరిస్తూ, ఆయుధాలను స్వాధీనం చేసుకుంటూ పి.ఎల్.జి.ఎ. శక్తినీ, పోరాట పటిమనూ పెంపొందించాలి. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడించే లక్ష్యంతో వ్యవసాయ విప్లవం గెరిల్లా యుద్ధాన్ని విశాల ప్రాంతాలకు విస్తరింపజేయాలి. వ్యూహాత్మక ప్రాంతాలలో దోపిడీ పాలకవర్గాల అధికారాన్ని ధ్వంసం చేయాలి.

శత్రు అధికారాన్ని ధ్వంసం చేసిన చోట ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయాధికార అంగాలను నిర్మించాలి. ఇప్పటికే ఉన్న వాటిని బలోపేతం-విస్తృతం చేయాలి. ప్రజాయుద్ధాన్ని దున్నేవారికే భూమి ప్రాతిపదికగా సాగే భూస్వామ్య వ్యతిరేక-విస్థాపిత వ్యతిరేక భూ పోరాటాలతో, సామాజియ, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సెక్షనల్ ప్రజా ఉద్యమాలతో, కాశ్మీర్, అసోం, నాగా, మణిపురీ, బోడో వంటి జాతుల విముక్తి పోరాటాలతో సమన్వయించాలి. ప్రజలను విప్లవ మార్గం నుంచి మళ్ళించేందుకు దేశంలో, ప్రపంచంలో పెరుగుతున్న మతోన్మాద, జాతీయోన్మాద, జాత్యహంకార ఫాసిస్టు ధోరణులకు/దాడులకు వ్యతిరేకంగా, ప్రత్యేకించి మన దేశంలో రోజు రోజుకూ తీవ్రతరమవుతున్న బ్రాహ్మణవాద హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా, ప్రజల జీవితాల్ని ధ్వంసం చేస్తున్న సామ్రాజ్యవాద సరళీకృత ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా, పర్యావరణాన్ని నాశనం చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికన సమరశీల ప్రజా ఉద్యమాల్ని నిర్మించాలి. లక్షలాది మంది పీడిత ప్రజారాశులను ప్రజాయుద్ధంలో క్రియాశీలకంగా భాగస్వాముల్ని చేసే లక్ష్యంతో ఈ ఉద్యమాన్ని అభివృద్ధి చేయాలి.

21వ శతాబ్దం సామ్రాజ్యవాదం నాశనమయ్యే, విప్లవాలు జయించే యుగం! రండి, నక్సల్బరీ చూసిన మార్గంలో పయనిద్దాం. నక్సల్బరీ అమరులు, నూతన ప్రజాస్వామిక విప్లవంలో నేలకొరిగిన వేనవేల వీరుల త్యాగాలు వృధా కావని చాటిచెబుతూ ఎర్రజెండాలను చేబూనుదాం. కార్మిక-కర్షక, విద్యార్థి-యువజన, మేధావులారా! పీడిత తాడిత విశాల ప్రజారాశులారా! సమైక్యంగా సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్యాన్ని కూల్చి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేద్దాం. సాహసించి పోరాడితే అంతిమ విజయం ప్రజలదే!

**★ నక్సల్బరీ ఏకీ రాస్తా!**

**★ మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి!**

**★ రకరకాల రివిజనిజం నశించాలి!**

**★ సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ బూర్జువా-భూస్వామ్య విధానం నశించాలి!**

**★ దోపిడీ పాలకవర్గాల అధికారాన్ని ధ్వంసం చేసి స్వావలంబనతో కూడిన విప్లవ ప్రజా రాజ్యాధికారాన్ని స్థాపించండి!**

**★ విప్లవ పార్టీ, ప్రజాసైన్యం, ప్రజా రాజ్యాధికారం లేకుండా ప్రజలకుండేదేమీ లేదు!**

**★ సాయుధ వ్యవసాయక విప్లవ యుద్ధం వర్ధిల్లాలి!**

**★ భారత నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!**

**విప్లవాభివందనాలతో,**

**కేంద్ర కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

1-3-2017

❋

పత్రికా ప్రకటన

# బి.ఎస్.ఎఫ్. బలగాలను భారీగా నిర్మూలించే లక్ష్యంతోనే సుంకి ఘాట్ రోడ్డుపై మందుపాతరను పేల్చాం!

# ప్రజాయుద్ధంపై పాలకవర్గాలు కొనసాగిస్తున్న క్రూరమైన దమనకాండకు ప్రతిఘటనగా ఈ దాడి చేశాం!!

2014 పార్లమెంటరీ ఎన్నికలలో అధికారం చేపట్టిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు (బి.జె.పి., టి.డి.పి., బి.జె.డి.)మునుపెన్నటికంటే మరింతగా బరితెగించి దేశ సంపదను సామ్రాజ్యవాదులకూ, కార్పొరేట్లకు తాకట్టు పెట్టి, ప్రజలకు నిలువనీడ లేకుండా మరింత దారిద్ర్యంలోకి నెడుతున్నారు. ఒడిశాలోని నవీన్‌పట్నాయక్ ప్రభుత్వం రాష్ట్రాన్ని సామ్రాజ్యవాదులకు తాకట్టుపెట్టడంలో అగ్రభాగాన వుంది. రాష్ట్రంలోని అత్యంత విలువైన ఖనిజ సంపదను దోచుకుపోవటానికి కార్పొరేట్ సంస్థలు, బహుళజాతి సంస్థలకు అనుమతి ఇవ్వడం వలన 1.50లక్షల చదరపు కి.మీ విస్తీర్ణంలో 3.50లక్షలకు పైగా ప్రజలు నిర్వాసితులవుతున్నారు. కొరాపుట్ జిల్లాలో మాలి, దేవ్‌మాలి, బాగుడొంగర్, డంగుదేవుల, సేరుబంద, రక్తకండి తదితర ప్రాంతాల్లో, విశాఖ జిల్లాలోను వున్న బాక్సైట్‌ను ఇతర విలువైన సంపదను దోచుకుపోవడానికి సామ్రాజ్యవాదులు గోతికాడ నక్కలా కాచుకొని వున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా, సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు వ్యతిరేకంగా, భూమి, విస్తాపన సమస్యపై ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నారు. అన్ని సెక్షన్ల ప్రజలు తమ డిమాండ్ల పరిష్కారం కోసం రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కొరాపుట్, మల్కనగిరి, విశాఖ జిల్లాల్లో జల్, జంగల్, జమీన్, అధికార్ నినాదంతో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలు పెద్ద ఎత్తున ప్రజాయుద్ధంలో భాగస్వాములవుతున్నారు. దేశంలో 'పాలకవర్గాల భద్రతకు ఏకైక ముప్పుగాను' తమ దోపిడీ విధానాలకు ఆటంకంగాను వున్న ప్రజాయుద్ధాన్ని, మావోయిస్టు పార్టీని అడ్డు తొలగించుకోవటానికే దేశవ్యాప్త గ్రీన్‌హంట్ దాడిని ప్రభుత్వాలు కేంద్రీకరించి కొనసాగిస్తున్నాయి.

ప్రజా ఉద్యమాలనూ, ప్రజాయుద్ధాన్ని అణచివేయటం కోసం పాలకవర్గాలు అత్యంత క్రూరమైన దమనకాండను ప్రయోగిస్తున్నాయి. కార్పెట్ సెక్యూరిటీలో భాగంగా పెద్ద ఎత్తున పోలీసు క్యాంపులను ఏర్పరుస్తున్నారు. వేలాదిగా కిరాయిపోలీసు బలగాలను నియమిస్తున్నారు. పోరాడే ప్రజల్ని, ప్రజాస్వామికవాదుల్ని, విప్లవకారుల్ని హింసావాదులుగా, అభివృద్ధి నిరోధకులుగా ముద్రలు వేసి అడ్డుతొలగించుకోవటానికి ఫాసిస్టు హత్యకాండలకు పూనుకుంటున్నారు. అందులో భాగంగానే 2016 అక్టోబర్ 24న తేదీన మల్కనగిరి జిల్లా రాంగూడ వద్ద ఆంధ్ర, ఒడిశా పోలీసు బలగాలు అత్యంత పాశవికంగా హత్యాకాండకు పాల్పడ్డారు. పోలీసు కాల్పులలో గాయలయ్యి నిరాయుధంగా వున్న మావోయిస్టులనూ, సాదా దుస్తులలో వున్న మిలీషియానూ, గ్రామస్తులను కూడా పట్టుకుని 3 రోజుల పాటు తీవ్రమైన చిత్రహింసలకు గురి చేసి నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు. భూమి, విస్తాపన సమస్యలపై తెగించి పోరాడుతున్న ప్రజలనూ, ప్రజా ఉద్యమాలను అణచివేయడంలో భాగంగా ఏర్పాటు చేసిన బి.ఎస్.ఎఫ్. క్యాంపుల పోలీసు బలగాలు గ్రామాలపై దాడులు, మహిళలపై అత్యాచారాలు, ప్రజల ఆస్తులను లూటీ చేయటం, యువకులను అరెస్టులు, హత్యలు చేయడం వంటి అరాచకాలు ఎ.ఒ.బి. ప్రాంతంలో నిత్యకృత్యమయిపోయాయి. ప్రజలను బెదిరించి ఒత్తిడి చేసి బలవంతంగా సరెండర్లు చేయించుకుని తిరిగి ప్రజలు హింసను విడనాడి శాంతియుత జీవితంలోకి అగుడుపెట్టారని పాలకవర్గాలు గొప్పలు చెప్పుకుంటున్నాయి.

ఎ.ఒ.బి. ప్రాంతంలో పాలకవర్గాలు పెంచి పోషిస్తున్న కిరాయి పోలీసు బలగాల క్రూరమైన దమనకాండకు ప్రతీకారంగానే బి.ఎస్.ఎఫ్. బలగాలను పెద్ద ఎత్తున నిర్మూలించాలనే లక్ష్యంతోనే సుంకిఘాట్ రోడ్డుపై మందుపాతరను పేల్చాం. అయితే ఇందులో 9 మంది ఒ.ఎస్.ఎ.పి. పోలీసులు హతమయ్యారు. వీరు కూడా ప్రభుత్వ పథకంలో భాగంగా విప్లవోద్యమంపై దాడులకు పూనుకుంటున్నవారే. ఈ సందర్భంగా గాయలైన నలుగురిని వదిలి వారికి ప్రాణబిక్ష పెట్టాం. తమ బతుకుదెరువు కోసం పోలీసు ఉద్యోగాలు చేసే పోలీసులు దోపిడీ పాలకవర్గాలకు సేవ చేసే, కాపలా కాసే ఇటువంటి ఉద్యోగాలు మానేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

ప్రజా ఉద్యమాలనూ, ప్రజా యుద్ధాన్ని బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా, హత్యల ద్వారా అణచివేయాలనుకోవటం దోపిడీ పాలకవర్గాల అవివేకం మాత్రమే. ప్రజాయుద్ధం అజేయమైనది. ప్రజలు ప్రజాయుద్ధం ద్వారానే పాలకవర్గాల దోపిడీ విధానాలనూ, పోలీసుల దమనకాండను ప్రతిఘటిస్తారు.

ప్రజల సమస్త బాధలకు కారణం ఈ దోపిడీ వర్గ సమాజమే. దీనిని ధ్వంసం చేసేందుకు సాయుధ పోరాటం తప్ప మరో మార్గం లేదు. పోరాడితే పోయేది బానిస సంకెళ్ళే! ఎ.ఒ.బి. ప్రాంతంలోని ప్రజలంతా పాలకవర్గాల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా జల్, జంగల్, జమీన్, అధికారం కోసం తెగించి పోరాడాల్సిందిగా, మావోయిస్టు పార్టీ నాయకత్వంలోని ప్రజయుద్ధంలో, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం(పి.ఎల్.జి.ఎ)లో భాగస్వాములు కావాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు న్యాయమైన ప్రజాయుద్ధానికి మద్దతు ఇవ్వాల్సిందిగా, క్రూరమైన పాలకవర్గాల దోపిడీ విధానాలనూ, దమనకాండను ఖండించవల్సిందిగా కోరుతున్నాం.

- దేశవ్యాప్త గ్రీన్‌హంట్ దాడిని తక్షణమే ఓడించండి.
- కార్పెట్ సెక్యూరిటీ పోలీసు క్యాంపులను ఎత్తివేసేంతవరకు పోరండండి.

**అజయ్ (కార్యదర్శి),**

**శ్రీకాకుళం-కొరాపుట్ డివిజనల్ కమిటీ,**

**సి.పి.ఐ. (మావోయిస్టు).**

# విప్లవ ద్రోహి అనిల్‌కుమార్ ఉరఫ్ చందుకు మరణశిక్ష విధించింది ముమ్మాటికీ మావోయిస్టు పార్టీనే! దీన్ని వక్రీకరించి ఈ అభియోగంతో ఒడిశా పోలీసులు అమాయకులను అరెస్టు చేయడం, హింసించడం, జైలుపాలు చేయడాన్ని ఖండిస్తున్నాం!! వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం!!!

ప్రజాద్రోహిగా మారి విప్లవ వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగించిన కారణంగానే చందును శిక్షించాం. ఆ సందర్భంగా తన చొక్కా జేబులో ఈ విషయాన్ని స్పష్టపరుస్తూ ఒక లేఖను కూడా ఉంచాము. అయితే అనివార్య కారణాలమూలంగా చందు విషయంలో, పార్టీ పత్రికలకు వివరమైన ప్రకటనను పంపించలేకపోయింది. చందు నుంచి పార్టీ లేఖను పోలీసులు స్వాధీనపర్చుకున్న విషయం పత్రికలు కూడా ప్రచురించాయి. అయితే ఈ విషయాన్ని దాచిపెట్టి పోలీసులు మరియు ప్రత్యర్థులు కుట్రపన్ని కావలనే (ఉద్దేశ్యపూర్వకంగా) ఇందులో సంబంధంలేని వ్యక్తులను ఇరికించారు. తమ మధ్య గల ఆర్థిక, రాజకీయ వైరుధ్యాలతో వారిపై కక్ష సాధించ బూనుకున్నారు. దీన్ని మావోయిస్టు పార్టీ తీవ్రంగా నిరసిస్తున్నది. నిర్దోషుల విడుదలను తక్షణమే డిమాండ్ చేస్తున్నది.

చందు శవం వద్ద ఉంచిన పార్టీ లేఖను యధాతదంగా మరోమారు పత్రికలకు ఈ సందర్భంగా దిగువన ఉటంకిస్తున్నాం.

"ఎ.ఒ.బి. స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌గా పని చేస్తూ పోలీసులచే అరెస్టు కాబడిన అనిల్‌కుమార్ (చందు) రాజకీయంగా దిగజారి వ్యక్తిగత స్వార్థంతో, ప్రాణంపై తీపితో, పీడిత ప్రజల మరియు పార్టీ ప్రయోజనాలకు ద్రోహం చేసి దోపిడీ ప్రభుత్వంతో రాజీపడ్డాడు.

ఆంధ్రా, ఒడిశా పోలీసుల గైడెన్స్ ప్రకారమే అతిత్వరగా జైలు నుండి విడుదలై కొరాపుట్‌లో మకాం పెట్టి ఒకవైపు పార్టీకి, ప్రజలకూ అనుకూలంగా ఉన్నట్టు నటిస్తూ తెరవెనుక పోలీసులకు అనుగుణంగా ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకూ అక్రమ వసూళ్ళకు పాల్పడుతూ వచ్చాడు. వీటిని మానుకోవాలని పార్టీ నుంచి పత్రికాముఖంగా ప్రకటించినప్పటికీ ఖాతరు చేయకపోవడం, పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్న మాజీలతో చేతులు కలిపి యధావిధిగా పార్టీ పేరుతో చందాలకు పాల్పడుతున్న కారణంగా ఎ.ఒ.బి-ఎస్.జడ్.సి. నిర్ణయంతో, శ్రీకాకుళం-కొరాపుట్ డివిజనల్ కమిటీ అనిల్‌కుమార్‌కు మరణశిక్ష విధిస్తున్నది.

ఇదే బాటలో నడుస్తున్న మాజీలంతా దీన్నీ ఒక హెచ్చరికగా తీసుకొని తమ పద్ధతుల్ని మార్చుకోవాలనీ లేని యెడల జరిగే పరిణామాలకు వారిదే బాధ్యత అని తెలియజేస్తున్నాం.

సి.పి.ఐ (మావోయిస్టు)"

అనిల్‌కుమార్ మరణానికి ప్రభుత్వమూ మరియు పోలీసులే పూర్తి బాధ్యత వహించాలి!

అనీల్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత నయాన, భయాన అనేక విధాలుగా ప్రలోభపెట్టి ప్రజలకూ, పార్టీకి వ్యతిరేకంగా మార్చారు. దొరికిన ఏ అవకాశాన్ని వదిలిపెట్టకుండా మావోయిస్టు పార్టీని తుదముట్టించాలనే ప్రయత్నాలు పోలీసులు చేయడం ఇదేం కొత్తకాదు. ఇందులో ఆరితేరిన ఆంధ్ర ఎస్.ఐ.బి. పోలీసుల చొరవతో నయీం లాంటి గ్యాంగులు దశాబ్దాలుగా చేసిన స్వైర విహారం అందరికీ తేటతెల్లమే. "ఇందులో మేము కూడా ఏం తక్కువకాదంటూ" ఒడిశా పోలీసులు అనిల్‌కుమార్‌లాంటి మాజీలందరినీ దగ్గరచేర్చి కుట్రపన్ని వివిధ రకాలుగా పార్టీని దెబ్బతీయాలని చూస్తున్నారు. అక్టోబరు 24-27 మధ్య మల్కనగిరిలోని రాంగూడలో జరిగిన మరణకాండ వెనుక మాజీల పాత్రనే ప్రముఖమైనది. కావున దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే.

**అజయ్ (కార్యదర్శి),**

**శ్రీకాకుళం-కోరపుట్ డివిజనల్ కమిటీ,**

**సి.పి.ఐ (మావోయిస్టు).**

---

23 తరువాయి...

## ప్రతిపాదనలు

1. దున్నేవారికే భూమి కేంద్రంగా సాయుధ వ్యవసాయ విప్లవాన్ని కొనసాగించాలి.

2. వ్యవసాయ అభివృద్ధి కోసం కృషి చేయాలి.

(సాగునీరు, పశు సంరక్షణ-అభివృద్ధి, వ్యవసాయ కారకాల అభివృద్ధి, ఆహార పంటల ఉత్పత్తికి ప్రోత్సాహకం, గంజాయి లాంటి వాణిజ్య పంటలను నిరుత్సహపర్చడం, అడవులను పరిరక్షిస్తూ పర్యావరణ సమతుల్యతకై కృషి, వ్యవసాయ అభివృద్ధితో వలసలు ఆపాలి).

3. మార్కెట్‌లలో రైతాంగానికి గిట్టుబాటు ధరకై పోరాడాలి.

4. అధిక వడ్డీకి వ్యతిరేకంగా పోరాడాలి.

5. ప్రజలకు పరిశుభ్రమైన నీరు, విద్యా, వైద్యం, గృహవసతి కల్పనకై కృషి చేయాలి.

6. ఆదివాసీ సంస్కృతిని ధ్వంసం చేస్తున్న సామ్రాజ్యవాద, హిందుత్వ, భూస్వామ్య సంస్కృతిని ధ్వంసం చేసి నూతన ప్రజాస్వామిక ప్రజా సంస్కృతిని నెలకొలిపే కృషి చేయాలి.

7. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, అందులోని అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలి.

8. ఆదివాసీ ప్రాంతాలలోకి ప్రవేశిస్తున్న అభివృద్ధి నిరోధకమైన అన్ని మతాలకు వ్యతిరేకంగా (ప్రధానంగా హిందూ మతానికి వ్యతిరేకంగా) పోరాడేలా ప్రజలను సన్నద్ధం చేయాలి.

9. ప్రజల మౌళిక అవసరాలకు సంబంధం లేని వస్తు వ్యామోహ పెట్టుబడిదారి మార్కెట్ సంస్కృతికి వ్యతిరేకంగా సాంస్కృతిక పోరాటం చేపట్టాలి.

10. వివిధ రకాల ఎన్.జి.ఒ.లను బహిర్గతం చేసి, ప్రజలను వాటి పట్టులోకి పోకుండా చూడాలి.

11. విప్లవకర ప్రజాకమిటీలను నిర్మించే లక్ష్యంతో ప్రజలను సాయుధుల్ని చేసి ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయాలి.

*

**నేను గెరిల్లానెందుకయ్యానంటే?**

## వాళ్ళిప్పుడు హుందాగా తమ తలలు పైకెత్తి నిటారుగా నిల్చున్నారు



# వాళ్ళే ప్రజా గెరిల్లాలు

నాపేరు ఉంగి. వయస్సు 18. చత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా, గీదం టౌన్‌కి దగ్గరలో ఉన్న గ్రామంలో ఉండేది మా కుటుంబం. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు మావి. ఒక్కో రోజు పని దొరకకపోతే పస్తులుండేవాళ్ళం. వయస్సు పెరిగినా దాన్ని లెక్క చేయకుండా తాతయ్య (నాన్న తండ్రి)కూడా కూలీకి పోయేవాడు. మా అమ్మ దగ్గర పాలు లేక నేనెప్పుడు ఏడ్చేదాన్ని. అలాంటి సమయంలో కూడా నన్ను అంగన్‌వాడీ దగ్గర వదిలేసి కూలీ పనికి పోయేది అమ్మ. అప్పటికే అమ్మ రక్తహీనతతో బాధపడుతుండేది. దానికి కారణం తిండి సరిగా లేకపోవడం, నిరంతరం పని చేయడం. ఎప్పుడు ఏడ్చే నన్ను చూసి చనిపోతుందేమోనని బయపడేవారట మా కుటుంబ సభ్యులు. “భూమి ఉంటే కష్టపడి పంట పండించుకునేవాళ్ళం. భూమి లేకపోవడంతో ఎన్నాళ్ళు ఇలా కూలీ చేసి బతకడం? వేరే ఊరికి వెళ్ళి పోదామని” అమ్మ, నాన్న నిర్ణయించుకున్నారు. వారి నిర్ణయానికనుగుణంగానే బీజాపూర్ జిల్లా (భైరన్‌గడ్ ఏరియా) సురకడకు మారింది మా కుటుంబం. అక్కడ పెద్దాల్ (గ్రామ పెద్దలు) వాళ్ళను కలిసాడు మా నాన్న. కానీ లాభం లేకపోయింది. భూమి ఇవ్వాలంటే ఆ ఊరి పెద్దాల్ వాళ్ళకు మేకలు, కోళ్ళు, కల్లు ఇవ్వాలనే షరతు. కాబట్టి మాకు అలాంటివి లేకపోవడంతో భూమి ఇవ్వలేదు ఆ ఊరిపెద్దలు. అక్కడున్నన్ని రోజులు (ఒక సంవత్సరం)కూలీ పనికే పరిమితమయ్యాం. అక్కడ కూడా బతకడం కష్టమవ్వడంతో అదే ఏరియాలోని కేశూర్‌కి బదిలి అయ్యాం. అప్పుడు నాకు మూడు సంవత్సరాలు. నాకు ఏమి గుర్తు లేదు. అమ్మ నాన్నల సమస్య మాత్రం తీరలేదు. అప్పటికే పార్టీ ప్రభావం వున్న గ్రామం కేశూర్. కొత్తగా వచ్చాం కాబట్టి సంఘం నాయకులు మా గురించి తెలుసుకొని ఆ ఊరిలో ఆశ్రయమిచ్చారు. కొద్ది రోజులు గడిచాక మా ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకున్న వారు పార్టీతో చర్చించి మా బతుకుదెరువు కోసం ఐదు ఎకరాల భూమిని ఇచ్చారు. ఒక సంవత్సరం గడిచిపోయింది. వ్యవసాయానికి అవసరమైన ఎడ్లు, నాగళ్ళు లేకపోవడంతో నాన్న ఎప్పటిలాగే కూలీ పనులు చేస్తున్నాడు. నాన్న సంపాదించే కూలీ డబ్బులు తిండికి తప్ప మరో దానికి చాలేవి కావు. ఆ క్రమంలో అమ్మ ఆరోగ్యం నయం చేయడానికి నాన్న అవసరమైన డబ్బు కూడగట్టలేకపోయాడు. నా తర్వాత చెల్లికి రెండు సంవత్సరాలు. తమ్ముడు పుట్టి ఆరు నెలలు గడిచింది. అమ్మ నుండి పాలు మాత్రం అంతంత మాత్రమే. వాడి ఏడుపుకు అంతే లేదు. సరిగ్గా నాకు ఆరు సంవత్సరాలు ఉంటాయనుకుంటా. తెలివి తేటలు వస్తున్న సమయం. పై విషయాలన్ని నేను పెద్దాయ్యాక నాన్న, నాన్నమ్మ మాటల ద్వారా అర్థమయ్యేవి.

అమ్మకు అనారోగ్యం తగ్గాలని పూజలు చేసేవాళ్ళం. గ్రామ పూజారి దగ్గరకు కూడా తీసుకెళ్ళేవాడు నాన్న. అమ్మకు అనారోగ్యం తగ్గి తమ్ముడు ఏడుపు మానితే పూజారికి మరింత ఎక్కువ కల్లు దానితో పాటు కోళ్ళు ఇస్తానని మొక్కుకునేవాడు. పూజారి కూడా అమ్మ బతుకుతుందని, రోగం తగ్గుతుందని చెప్పేవాడు. కళ్ళ ముందు అమ్మ నిరంతరం బాధపడుతుండేది. నేను బాధపడ్తూ ఏడ్చేదాన్ని. ఏడవడం తప్ప ఇంకేమి తెలియని వయసు నాది. అప్పటికే నాన్న పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజాసంఘాలలో పని చేయడం ప్రారంభించాడు. నాన్న ఉదయాన్నే వంట పని చేసి కూలీకి పోయేవాడు. అయినప్పటికీ మిగతా ఇంటి పనులు నాపై పడ్డాయి. ఇంటి పని చేస్తునే తమ్ముడిని సముదాయించేదాన్ని. ఇలా రోజులు గడుస్తున్న కొద్ది అమ్మ అనారోగ్యం బాగా విషమించింది. వారం రోజుల పాటు శ్వాస సరిగా ఆడక ఇబ్బంది పడింది. మరోసారి పూజారికి చూపించాడు నాన్న. తగ్గకపోగ బాధపడుతూనే ఒక రోజు కన్ను మూసింది. అమ్మ చనిపోయిన 15 రోజుల తర్వాత దినకర్మ ముగిసాక తమ్ముడిని నేను సరిగా చూసుకోలేనని మా నాన్నమ్మ (చిన్నాన్న దగ్గర వుండేది) తీసుకెళ్ళింది. అప్పటికే వాడు పాలు లేక ఏడుస్తూ అనారోగ్యంగా వుండేవాడు. దాంతో నాన్నమ్మతో వుంటున్న క్రమంలో మలేరియా బారిన పడటం, అమ్మ చనిపోయి సంవత్సరం తిరగక ముందే తమ్ముడు చనిపోయాడనే వార్త మమ్మల్ని చేరింది. నాన్న, నేను, చెల్లి మా సొంతూరుకు వెళ్ళాం. తమ్ముడు అంత్యక్రియలు ముగిసాక బంధువులు, ఊరివాళ్ళు నాన్నమ్మని మా వెంట తీసుకెళ్ళమని చెప్పారు. కానీ అందుకు నాన్నమ్మ ఒప్పుకోలేదు. అప్పటికే మేమున్న కేశూర్‌కి పార్టీనీ, పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంఘాలను దెబ్బతీయడం కోసం పోలీసుల కూంబింగ్‌లు కొనసాగుతుండేవి. తను మా వెంట రావడానికి ఒప్పుకోలేదు. “తల్లిలేని పిల్లలకు తోడుగా వుంటావు వెళ్ళు” అని చాలా మంది చెప్పారు నాన్నమ్మకి. “మీతో వుంటే నేను చనిపోతా. ఎప్పుడు పోలీసుల బూట్ల చప్పుడు, నిత్యం ఎవరినో ఒకరిని చంపడం. ఇవన్నీ చూడటం నావల్ల కాదు. మీరే ఇక్కడుండండి” అంది. అందుకు నాన్న ఒప్పుకోలేదు. కేశూర్‌కి తిరిగి వెళ్ళిపోయాం.

అమ్మ మరణం తర్వాత నాపై పనుల బారం మరింత పెరిగింది. వడ్లను దంచి అన్నం వండాలి. ఆ విధంగా చేయడం అసలే రాదు నాకు. అమ్మ ఉన్నప్పుడు నాకు దంచడం రాదని నాన్నతో మిల్లు పట్టించుకు రమ్మనేది. కాలినడకనే వెళ్ళి నాన్న నెలకొసారి పట్టించుకొచ్చేవాడు. ఆ విధంగా మిల్లుకు పట్టించినవి వండటం ఎలాగోలా కష్టపడతా. కానీ వడ్లను దంచి వండటం ఎలా? ఈ విషయాన్ని నాన్నతో ఎలా చెప్పాలన్న ప్రశ్న? చివరకు పక్కవాళ్ళనడిగా. ఇలా ఒక వారం రోజులు పక్కవాళ్ళ సహకారంతో గడిచిపోయింది. తరువాత రోజు తప్పక నేను చెల్లి దంచడానికి

సిద్ధమయ్యాం. తను రోకలిని పైన, నేను కింద పట్టుకొని దంచడం ప్రారంభించాం. ఎంత దంచిన వడ్లు పొట్టు వదలడం లేదు. చుట్టుపక్కల ఇళ్ళలో అమ్మ వయస్సు గల వాళ్ళందరూ దంచుతున్నారు. వాళ్ళను చూస్తే అమ్మ గుర్తొచింది. అమ్మ ఉంటే మాకు ఈ పని తప్పేది. పనులన్నీ అమ్మే చేసిపెట్టేది. ఎందుకు చనిపోయిందో అని ఏడుస్తూ కూర్చుండిపోయాం. అప్పటికే చీకటి పడింది. సంఘం పనులు ముగించుకొని ఇంటికొచ్చిన నాన్న ఏడుస్తున్న మమ్మల్ని ఓదార్చి ''ఈ పనులు మిమ్మల్ని ఎవరు చేయమన్నారు? నేను వచ్చాక చేసిపెడతాగా. ఇంకెప్పుడు ఇలాంటి పనులు చేయకండి. పెద్ద పెద్ద పనులకు మీ శక్తి సరిపోదు" అని మాకు ధైర్యం చెప్పి వడ్లను దంచి, అన్నం వండి పడుకున్న మమ్మల్ని లేపి తినిపించాడు. నాకప్పుడు అనిపించింది. నాన్న ఎప్పుడు ఇంటిదగ్గరే వుంటే బాగుండేదని.

ఊరివాళ్ళందరూ మామూలుగానే మమ్మల్ని చూసి బాధపడేవారు. ఎవరు ఇంటికొచ్చినా నాన్నను మళ్ళీ పెళ్ళి చేసుకోమని సలహాలిచ్చేవారు. నాన్న పట్టించుకునేవాడు కాదు. ఒక రోజు ఏకంగా 7, 8 మంది వచ్చారు. " నీవెప్పుడు ఇంటి పట్టున ఉంటావా? ఉన్న ఈ ఇద్దరి పిల్లలు కూడా సచ్చిపోతరు. మా మాట విను. మేము మంచి అమ్మాయిని చూసి పెళ్ళి చేస్తాం. నీకు తోడుగా, ఈ పిల్లలకు తల్లిగా వుంటూ ఇంటి పని చేసుకుంటూ ఉంటుంది'' అని బలవంతంగా నాన్నను పెళ్ళికి ఒప్పించారు. మా ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం అమ్మాయి వాళ్ళు కల్లు తెచ్చారు. నాన్న తరపున కల్లు పుచ్చుకున్నారు పెద్దమనుషులు. అప్పటి నుండి నాన్న ఏదో ఆలోచనా ధోరణిలో వున్నాడు. పార్టీ వాళ్ళు ఏం చెప్పారో నాన్న ఏం ఆలోచించాడో తెలియదు. కానీ కొద్ది రోజుల్లోనే "నేను పెళ్ళి చేసుకోను" అని చెప్పేసాడు పెద్దమనుషులకి. "నీకేమైనా పిచ్చా, మేము మాటిచ్చాం. కల్లు కూడా తాగం. ఇప్పుడెందుకు ఇలా మాట్లాడుతున్నావ్? అయినా నీ కుటుంబం బాగు కోరేకదా మేము నీ పెళ్ళి గురించి ఆలోచించి కుదిర్చాం" అన్నారు. "వచ్చిన భార్య నా పిల్లల్ని బాగా చూసుకుంటుందని గ్యారంటీ ఏమిటి? నాకు ఆ నమ్మకం లేదు. అన్ని నేనే అయి చూసుకుంటా నా పిల్లల్ని. నాకు మరో పెళ్ళి అవసరం లేదు" అని గట్టిగానే చెప్పాడు వారికి. "నీ ఇష్టం నాయనా నీకు చెప్పడం మా వల్ల కాదంటూ కోపంతో వెళ్ళిపోయారు పెద్దలు.

అప్పటికీ మాకు 6 గొడ్లు, 15 మేకలు వుండేవి. వాటిని మేపడానికి వెళ్ళేదాన్ని నేను. పొలం దగ్గర నాన్న వడ్లు పండించేవాడు. వర్షాకాలం మాత్రమే పొలం పని. కాబట్టి పని వున్నప్పుడు నేను పొలం పనుల్లో నాన్నతో పాటు పని చేసేదాన్ని. ఇలా వుంటున్న క్రమంలో మిలీషియాలో నాన్న చురుగ్గా పని చేయడం పెరిగింది. అలా పని చేస్తూనే కమాండర్ స్థాయికి ఎదిగాడు నాన్న. నాన్న వెనకాల చాలా మంది మిలీషియా కామ్రేడ్స్ వచ్చేవాళ్ళు. నేను పని చేస్తుంటే వాళ్ళు నన్ను పక్కకు నెట్టి ఆ పనిని చేసేవాళ్ళు. వాళ్ళు మా ఇంటికి రావడంతో మా ఇంట్లో పండుగ వాతావరణం నెలకొనేది. నన్ను చెల్లిని బాగా చూసుకునేవాళ్ళు. ఏ సమయంలో ఇంటికొచ్చినా ఇంటి పనులు చేయడంతో పాటు నాకు చెల్లికి స్నానం చేయించి బట్టలుతికేవాళ్ళు. వాళ్ళొస్తే చాలు నాకు ఎంతో ధైర్యం. చెప్పలేని సంతోషం. నాన్న కమాండర్ కాబట్టి ఇంటి పనుల్లో పాల్గొనడం చాలా తగ్గిపోయింది. కాని నాన్నతో పని చేసే సహచర కామ్రేడ్స్ మాత్రం రోజు తప్పి రోజు ఇంటికొచ్చి మా బాగోగులు చూసేవాళ్ళు. వీరు నిత్యం ఇంటికొచ్చి మా బాగోగులు చూడటం, ఇంటి పనులు చేసి పెట్టడం వంటివి నాకు మేం ఒంటరివాళ్ళం అనే ఆలోచనను దూరం చేసాయి.

మా ఊరిలో ప్రతి నెలకు దళం మీటింగ్ జరిగేది. ఆ మీటింగ్‌కి కావాల్సిన ఏర్పాట్లన్ని నాన్నే చూసేవాడు. ఆరోజు ఏ రాత్రికో ఇంటికొస్తాడు నాన్న. మీటింగ్ సమయంలో సి.ఎన్.ఎమ్. (చేతన్ నాట్య మంచ్)వాళ్ళు పాటలు పాడటం విని నేను ఉత్సాహంతో పరుగెత్తుకొని వెళ్ళేదాన్ని. దళ కామ్రేడ్స్ నన్ను చూసి "నీవు బాలల సంఘంలో పని చేయొచ్చు కదా" అని అనేవాళ్ళు. మా నాన్న పూర్తిగా మిలీషియాలో పని చేస్తాడు. మరీ నేను కూడా బాలల సంఘంలో పని చేస్తే ఇల్లు, పొలం, గొడ్లు, మేకలు ఎవరు చూసుకుంటారు అని నేనన్న మాటలకు "అబ్బో ఇంటి పనులపై ఎంత బాధ్యతుందో" అని నవ్వుతూ తలనిమిరేవాళ్ళు. ఆ తర్వాత ఇంటికెళ్ళి ఆలోచించేదాన్ని. నాతోటి వయస్సుగల మిత్రులందరూ బాలల సంఘంలో పని చేస్తున్నారు. నేను కూడా దళం వాళ్ళన్నట్లుగా బాలల సంఘంలో పని చేస్తే బాగుండేది అని ఆలోచించేదాన్ని. కానీ మరీ 15 మేకల పరిస్థితి ఏంటి? గొడ్లు ఏమై పోవాలి? వాటిని రోజు మేపేది నేనేకదా! అని వాటి గురించి ఆలోచించేదాన్ని. నాన్న పూర్తిగా చేస్తున్నాడు కదా సరిపోతుందిలే అని నాకు నేనే సమాధానం చెప్పుకునేదాన్ని. కానీ మళ్ళీ వాళ్ళొచ్చి(దళం వాళ్ళు) మీటింగ్ చేస్తుంటే, సి.ఎన్.ఎమ్ పాటలు వింటుంటే వెళ్ళి చూడటమే కాక చాలా సంతోషంగా వారి పాటలను ఆస్వాదించేదాన్ని. వారి పాటలు వింటుంటే నాక్కూడా వాళ్ళలా సి.ఎన్.ఎమ్. డ్రస్ వేసుకుని పాటలు పాడాలనిపించేది. దళ కామ్రేడ్స్ కనబడగానే నేను కూడా ఆ డ్రస్సు వేసుకోవాలనే ఆశలు రేకెత్తేవి. మీటింగ్ ముగిసాక ఇంటికెల్లగానే నాకు ముందుగా ఎదురొచ్చే మేకలు, గొడ్లు చూసి నేను దళంకి వెళ్తే ఇవి ఏమై పోవాలి? అని నా ప్రేమంతా ఒక్కసారిగా వాటివైపు మళ్ళేది.

2005 సల్వాజుడుం ప్రారంభదశ. బీజాపూర్, సుక్మా, దంతెవాడ జిల్లాల్లో ప్రజలను రమణసింగ్ సర్కార్ సల్వాజుడుం పేరుతో అన్ని విధాలా నష్టపరుస్తున్న రోజులవి. కోళ్ళు, మేకలు, గొడ్లు, పందులు, కుక్కలు, ప్రజలు ఎండబెట్టుకున్న మంసాహార ముక్కలను సైతం వదలకుండా ఇండ్లలోకి చొరబడి తినే వస్తువులన్నింటిని తిన్నంత తిని, దోచుకుని, ఎన్నో ఇండ్లను ధ్వంసం చేసారు పోలీసులు. నిత్యం మా గ్రామమే కాకుండా చుట్టుపక్కల గ్రామాలన్నీ కూడా పోలీసు పహారాలో విలయతాండవం చేస్తుండటం నిత్యకృత్యమైపోయింది. వారి చేతికి దొరికిన వారిని పట్టుకొని ఒక్కొక్కరిని ఒక్కో విధంగా హింసించి చంపడం అనేది వారికి సాధారణమైపోయింది. కన్న తల్లిదండ్రుల ముందే కూతురిని అత్యాచారం చేయడం, భార్యా పిల్లల ముందే భర్తను కళ్ళు పీకేసి తుపాకీ బట్టులతో కొట్టడం, మరి కొందరిని ముక్కు, చెవులు కోసి కారం చల్లి చిత్రహింసలకు గురిచేసి చంపడం మొదలైన రూపాల్లో మా అమాయక ఆదివాసీ ప్రజల ప్రాణాలను బలిగొన్నారు. మహిళల వయస్సుతో సంబంధం లేకుండా అత్యాచారం చేసి వారిని చంపేసేవారు. పోలీసులు ఊర్లోకి ప్రవేశిస్తున్నరనగానే సంఘం, మిలీషియా వాళ్ళు కాషన్

ఇచ్చేవాళ్ళు. ఆ కాషన్‌తో ఊర్లో ఉన్న వాళ్ళందరం ఆ సమయానికి చేతికి దొరికిన వస్తువులను చేతనైనన్ని పట్టుకొని ఆడవికి పోరిపోయేవాళ్ళం. చేతగాని ముసలివాళ్ళు, చిన్న పిల్లలు ఊర్లోనే ఉండేవాళ్ళు. వాళ్ళను కూడా వదిలేవారు కాదు ఆ నరహంతకులు. ఒక రోజు సంతకెళ్ళి సాయంత్రం నాతోటి మిత్రులతో ఊరొచ్చేసా. కొద్ది సేపటికే మా వెనకాల వచ్చే మరో గుంపులోని మహిళలను దారిలో వున్న పోలీసులు అత్యాచారం చేసి, వారితో వున్న పురుషులను బట్టలు విప్పేసి కొట్టారు. ఈ వార్త నేను ఇంట్లో కాలు వోపానో లేదో ఆయా కుటుంబాల వాళ్ళు చెబుతూ ఏడుస్తున్నారు. ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నాం. మేం క్షణాల్లో తప్పించుకున్నామని. కానీ జరిగిన అన్యాయం ఎవరికైతేనేమి చాలా బాధపడ్డాను. ఏడ్చాను. ఇలాంటి విషయాలు ఇంకా ఎన్ని వినాల్సివస్తుందో ననిపించింది. అప్పటినుండి సంతకెల్లాలంటే భయం వెంటాడేది. వెళ్ళక తప్పేది కాదు. నాన్నేమో ఆ సమయంలో అసలు ఇంటికొచ్చేవాడే కాదు. అంబుష్‌లు వుండటం, పోలీసుల కదలికలు పసిగట్టి వారిపైకి ఎదురుదాడి చేయడం, పోలీసుల దాడులకు బయపడుతున్న ప్రజలకు మీటింగ్‌లు చేసి ధైర్యం చెప్పడం వంటి వాటిపైనే నాన్న, తన సహచర కామ్రేడ్స్ ధ్యాసంతా. కానీ వారి (పోలీసు)బలం ముందు వీరి బలం సరిపోయేది కాదు. ఇక అన్ని ఊర్లల్లో పార్టీ సంఘం, మిలీషియా నాయకులను అరెస్టులు, సరెండర్లు చేయించుకుంటున్నారు. అలా లొంగని వారిని ప్రజలందరూ చూస్తుండగానే కళ్ళు పీకేయడం, కాళ్ళు, చేతులు నరికేయడం, వారిపై కాల్పులు జరపడం వంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఊరి పెద్దాల్‌లు పూర్తిగా వారి కనుసన్నల్లోనే ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి ఎంతో మంది అమాయక జన్నాన్ని వారివైపు తిప్పుకున్నారు. అప్పటి వరకు కలిసి మెలసి వున్న ఇరుగు పొరుగు వాళ్ళే శతృవులయ్యారు. ఇవన్నీ చూస్తుంటే నాన్నకేమవుతుందోనని భయమేసింది. అమ్మను పోగొట్టుకొని ఎన్నో బాధలు పడ్డాం. ఇప్పుడు నాన్నకేమైనా జరిగితే నేను చెల్లి మా పరిస్థితి ఏమిటి? ఈ ఆలోచనల్లోంచి దుఃఖం తన్నుకొచ్చింది. జరిగే విధ్వంసాలను చూడటం తప్ప ఏమి చేయలేని పరిస్థితి. నాన్నని పోలీసులు ఏం చేస్తారో అనే దిగులు ఒకటైతే మరోవైపు చెల్లి గురించి ఆలోచన. తను నాలా పరుగెత్తడం కష్టం. చాలాసార్లు పోలీసులు వస్తున్నారన్న కాషన్ రాగానే ముందుగానే చెల్లిని కొండపై దింపేసి వచ్చి నేను బియ్యం, చింతపండు తీసుకెళ్ళేదాన్ని. వాటిని పక్కవాళ్ళు వండేటప్పుడు మావి కూడా కలిపి వండిచ్చేవాళ్ళు. నాన్న గురించి నేనూహించినట్లుగానే ఒక రోజు నేను అన్నం వండుతున్న సమయానికి నాన్న (ఉదయం) ఇంటికొచ్చాడు. అంతలోనే పోలీసులు ఎప్పుడొచ్చారో మేం పసిగట్టలేకపోయాం. ఇంట్లోకి దూసుకొని పోయి నాన్నని ఎంతగా కొట్టారో మాటల్లో చెప్పలేను. ఒక మూలన కూర్చుండిపోయా. 50 మందికి ఎక్కువగానే ఉంటారేమో. కొందరు ఇంట్లోకి దూసుకెళ్ళగా మరికొందరు ఇంటి చుట్టుపక్కల ఉన్నారు. వాళ్ళు తిడుతున్న తిట్లు అర్థం కాలేదు. కానీ ఒక విషయం మాత్రం అర్థమైంది. నాన్నని పార్టీలో పని చేయడం మానుకోవాలనీ, సరెండర్ అవ్వమని అంటున్నారనీ. అందుకు నాన్న ఒప్పుకోలేదు. మరింత చితగొట్టారు. చంపేస్తారేమనుకున్నా. ఏడుపు శబ్దాన్ని బయటకు రానియ్యకుండా నోటిని చేత్తో గట్టిగా మూసుకున్నా. కసిదీరా నాన్నని కొట్టి వెళ్ళిపోయారు. వెంటనే నాన్న దగ్గరకు పరుగెత్తా. పట్టుకొని బాగా ఏడ్చా. "ఏడవద్దు, ఏడుపు పిరికితనం" అన్నాడు. "నాకేం కాదు పార్టీ వుండగా. పార్టీ మనకోసం ప్రజలకోసం పని చేస్తుంది. అవసరమైతే ప్రాణమిద్దాం" అంటూ గోడకు వేలాడుతున్న విల్లును తీసుకుని వెళ్ళిపోయాడు. నాకేం అర్థం కాలేదు. కానీ అంత దెబ్బలతో కూడా నాతో గట్టిగా మాట్లాడి విల్లు తీసుకుని పోవడం మాత్రం ధైర్యానిచ్చింది.

పై సమస్యలన్నీ రెండు సంవత్సరాల పాటు నిత్యకృత్య మయ్యాయి. అప్పటికీ ఎంతో మంది సంఘ నాయకత్వం సరెండర్లు అయ్యారు. వారిచ్చిన సమాచారంతోనే 2006 చివరలో నాన్నని పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్ళారు. బందీగా పెట్టిన ఆ క్యాంపులో దొడ్డికి తీసుకెళ్ళేటప్పుడు, తినడానికి వెళ్ళేటప్పుడు ప్రతిసారి కొట్టాకే తీసుకెళ్ళేవారట. నాన్న అరెస్ట్ నన్ను చెల్లిని మరింత వేదనకు గురి చేసింది. ఆ సమయంలో నాన్నకి సన్నిహితంగా వుండే ఒక కుటుంబికులు మమ్మల్ని చేరదీసారు. వాళ్ళతోనే ఉండేవాళ్ళం. నాన్నను చూడటానికి ఊరివాళ్ళతో నేను చెల్లి వెళ్ళేవాళ్ళం. నాన్నను చూడగానే నేను చెల్లి ఏడ్చేవాళ్ళం. మాకు ధైర్యం చెబుతూనే మా బాగోగులడిగి కన్నీరు పెట్టుకునేవాడు నాన్న. ఆ చుట్టుపక్కల మొత్తం పోలీసులే. వీళ్ళందరూ నాన్నని రోజు కొడతారేమో అని మనసులో అనుకుంటూనే ఇంత మంది పోలీసుల మధ్య ఎలా ఉన్నావ్ నాన్న! అని అడిగేదాన్ని. నా ప్రశ్నలకి నాన్న చిన్నగా నవ్వేవాడు.

5 నెలల తర్వాత నాన్న జైలు నుండి పారిపోయి వచ్చాడు. ఆ వెంటనే ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో మళ్ళీ అరెస్ట్ చేశారు. ఈసారి 2 సంవత్సరాలు జైలులోనే వున్నాడు. మేము సంతకెళ్ళే ఊరిలోనే క్యాంపు వుండేది. ఆ క్యాంపులోనే నాన్నని బంధించింది. సంతకెళ్ళే ప్రతిసారి నాన్నని కలిసేవాళ్ళం. కలిసినప్పుడల్లా ఏడ్చేవాళ్ళం. నాకన్నా చెల్లి ఏడుపు ఎక్కువైంది. అమ్మ గుర్తొచ్చేది. అమ్మేమో మాకు పూర్తిగా దూరమైంది. వున్న నాన్నను పోలీసులు దూరం చేసారు. మేమెందుకు బతకడం అనిపించేది. యధావిధిగా గొడ్ల కాపుకెళ్ళేదాన్ని. నాన్నలేని పొలాన్ని చూస్తే దుఃఖమొచ్చేది. 24 నెలలు నాన్న పోలీసు క్యాంపులో, మేము తెలిసిన వాళ్ళ ఇంట్లో. ఆ రోజులన్నీ దిన దిన గండంగా గడిచిపోయాయి.

2009లో నాన్న విడుదలై ఇంటికొచ్చాడు. శతృ నిర్బంధాన్ని చవి చూసినప్పటికీ నాన్నలో పార్టీ, ప్రజలపై ప్రేమ ఏ మాత్రం తగ్గలేదు. సంఘంలో, శతృవుపై కసితో మరింత చురుగ్గా పని చేయసాగాడు. అనుకోకుండా ఒక రోజు ఊరి పెద్దాల్‌లను వెంటపెట్టుకొని కొందరు పోలీసులు మా ఇంటికొచ్చారు. నాన్నని అరెస్టు చేస్తారేమోనని భయం వేసింది. కానీ వాళ్ళు మాతో చాలా సామరస్యంగా మాట్లాడటం ప్రారంభించారు. "మీ పొలం మేము తీసుకుంటున్నాం. క్యాంపు అవసరాల రీత్యా అవసరం వుంది" అని పెద్దాల్‌లతో మాట్లాడించారు. ఒక్కసారిగా ఆ మాటలు విన్న నేను మా నాన్న కుప్పకూలిపోయాం. గుండెలవిసేలా ఏడ్చాం. పొట్టగడవక ఈ ఊరొచ్చినప్పుడు పుట్టెడు కష్టాల్లో వున్న మాకు పార్టీ ఆ 5 ఎకరాల భూమి ఇచ్చి మమ్మల్ని ఆదుకుంది. భూమి ఇచ్చాక మేము బియ్యం కొన్నది లేదు. దాంట్లో పండిన (వడ్లు) పంటనే మా తిండి, ఆ ధాన్యానికి(అన్నం)తోడు అడవి నుండి లభించే ఆకుకూరలు, దుంపలు అన్నానికి తోడుగా వండుకుంటాం.

అలా పూర్తిగా గతం గుర్తొచ్చింది. కాని ఏంచేస్తాం. వాళ్ళను బెదిరించే ధైర్యం మాకు లేదు. దోపిడీ సర్కారుపై, అది మేపే కాపలా కుక్కలపై మరింత కసి పెరిగింది నాకు నాన్నకు. మా పొలంలో ఏదో నిర్మాణం జరుగుతుందని ఊరివాళ్ళు చూసి మాతో అన్నారు. నాన్న నేను కలిసి మా పొలానికి వెళ్ళాం. అప్పటికే మా ఊర్లో పోలీసుక్యాంపు నిర్మాణం పూర్తి చేశారు. క్యాంపుకు దగ్గరలో వున్న మా పొలంలో ఆశ్రమ పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభించారు. అది పూర్తికాగా మా భూమి ఇంకా మిగిలి ఉంది. చేసేదేంలేక భూమిని చదును చేసుకుని పండించుకోవడం ప్రారంభించాం. యధావిధిగా పొలం పనులు నేను నాన్న కలిసి చేసుకునేవాళ్ళం. ఈ క్రమంలో ఓ రోజు చిన్నాన్న వచ్చాడు (తను కొంత చదువున్న వ్యక్తి. ఊరిలో స్కూల్ చెబుతుంటాడు). ''చిన్నమ్మాయిని నా వెంట తీసుకెళ్ళి చదివిస్తా. లోకజ్ఞానం తెలుసుకుంటుంది. పెద్దయాక తన కాళ్ళ మీద తను నిలబడుతుంది'' అన్నాడు. నాకు నాన్నకు సరైందేననిపించింది. చదువుకొని ప్రయోజకురాలైతే మాలాంటి ప్రజలకు సహాయపడుతుందని. అందుకు నేను నాన్న సరేనన్నాము. కాని చెల్లి వెళ్ళాక మరచిపోవడానికి కొంత సమయమే పట్టింది. పార్టీ పనులుంటే నాన్న 2,3 రోజుల వరకు ఇంటికే రాడు. వచ్చినా ఏ రాత్రికి వచ్చి ఎప్పుడెళతాడో తెలియదు. చెల్లి వుంటే ఇద్దరం కలిసుండేవాళ్ళం. పనుల్లో కూడా కొంత నాకు సహకరించేది. అలా తన జ్ఞాపకాలు వెంటాడేవి. చెల్లి వెళ్ళిపోవడం ఒకటైతే నాన్న గతం కన్నా ఎక్కువగా పార్టీ పనుల్లో లీనమయ్యాడు. తన సహచర కామ్రేడ్స్ మాత్రం వచ్చిపోతున్నారు. పార్టీలో పని చేస్తున్న నాన్నను చూస్తే నాక్కూడా పార్టీలో పని చేయాలనే ఆసక్తి పెరిగింది. నాన్న పని గురించి సహచర కామ్రేడ్స్ చెప్పడం నాకు మరింత ఉత్సాహానిచ్చేది. ఎలాగైనా నాన్నతో చెప్పాలనుకున్నా నా మనసులో మాట. పార్టీ పనులు ముగించుకొని ఇంటికొచ్చిన నాన్నను ధైర్యంగానే 'నాన్న నేను కూడా పార్టీలో పని చేస్తా' అని అడిగా. అందుకు నాన్న సంతోషంగా అంగీకరించాడు.

దాంతో 2014లో నేను మిలీషియాలో సభ్యురాలినయ్యాను. అప్పుడర్థమైంది నాకు నాన్న ఆర్.పి.సి(రెవల్యూషనరీ పీపుల్స్ కమిటీ)అధ్యక్షుడని. మిలీషియాలో పని చేస్తునే ఇంటి పని, పొలంపని చేసేదాన్ని. దళం గ్రామానికి ప్రవేశించగానే వారికి కావాల్సిన అవసరాలు తీర్చడంలో భాగమయ్యేదాన్ని. సెంట్రీలు చేసేదాన్ని. పార్టీ నిర్వహించే కార్యక్రమాలన్నింటిలో నాన్నతో పాటు పాల్గొనేదాన్ని.

నాకు ఊహ తెలిసినప్పటి నుండి మేము భూమి సమస్య, వలస పోవడం, పెద్దాళ్ళ బెదిరింపులు, అనారోగ్య మరణాలు మొదలైన సమస్యలతో సతమతమవుతూ వచ్చాం. ఈ బతుకుల గురించి ఆలోచించే అమ్మ అనారోగ్యం పాలై మరణించింది. ఇవన్నీ ఒక ఎత్తైతే సల్వాజుడుం మరొక ఎత్తు. సల్వాజుడుం బాధలు ఒక రోజు కాదు, ఒక నెల కాదు. ఏకంగా రెండు సంవత్సరాలు. అనునిత్యం మృత్యువుతో బతుకులెల్లదీసాం. ఇంకెన్నాళ్ళు ఈ బతుకు? రాజ్యానికి భయపడుతూ బతకడం అని గతంలో నాన్న అన్న మాటలు గుర్తొచ్చాయి. తిరగబడాలి. పోరాడాలి. అనే కసి నాలో క్రమ క్రమంగా రగులుకున్నది. మొదట్లో దళం చెప్పే లూటీ సర్కార్ గురించి అర్థమయ్యేది కాదు. కాని క్రమంగా అర్థం అయింది. సమస్యలన్నింటికి కారణం లూటీ సర్కారే. మరి నేనేం చేయగలను? మిలీషియాలో పని చేస్తే సరిపోతుందా? చాలదు అంతకన్నా ఉన్నతమైనది పూర్తికాల కార్యకర్తగా అజ్ఞాతంలోకి వెళ్ళడం, తుపాకీ పట్టడమే. అయితే ఇది ఎలా సాధ్యం? నేను చేయగలనా లేదా? అని చాలా రోజులు ఆలోచించాను. ఒక రోజు ఈ విషయాన్ని నాన్నతో ఎలాగైనా చెప్పాలని నిర్ణయించుకున్నా. అప్పుడే మిలీషియాలో పని చేసి సంవత్సరం గడిచిపోయింది. రిక్రూట్ సన్నాహాలు మొదలయ్యాయి. 2, 3 నెలలుగా నా మనస్సులో ఏదైతే అనుకుంటున్నానో అదే విషయాన్ని మా మిలీషియా కమాండర్ నా ముందుంచాడు. సంతోషంగా ఒప్పుకున్న. రెండో మాట చెప్పలేదు. విషయాన్ని నాన్నతో చర్చించాడు మా కమాండర్. నాన్న బాధపడ్డాడు. "చిన్నప్పటినుండి నాకు ప్రతి పనిలో, నా సుఖంలో దుఃఖంలో పాలుపంచుకుంటూ కొండత అండగా వుండే నా బిడ్డని ఎలా మరిచిపోవాలి? తల్లి లేకపోయినా అన్ని తనై నెట్టుకొచ్చింది. సంఘం పనుల్లో పడి నేను ఇల్లు మరిచిపోయినా, ఎంత రాత్రికొచ్చినా ఏనాడు నన్ను ప్రశ్నించేది కాదు. నా బిడ్డ నాకన్నా చిన్నదైనా ఇంటికి పెద్ద దిక్కైంది. నేను రెండు సంవత్సరాలు అరెస్టయి దూరంగా వున్నా ఇంటిని, గొడ్లను కంటికి రెప్పలా కాపాడింది'' అంటూ బాధపడ్డాడు. ఏడ్చాడు. "అన్నా నీ బిడ్డ ఇప్పుడు పెరిగి పెద్దదైంది. రేపైనా ఓ ఇంటికి ఇచ్చేస్తావ్‌గా! అప్పుడు కూడా నీకు దూరం అవుతుంది. కదా! మరీ నీవు ఏమి తెలియని వాడివికాదు. నీవు కూడా ప్రజలకోసం పని చేస్తున్నావ్. ఇక్కడ పార్టీలో పని చేసేవాళ్ళందరిది ఏ రాజ్యమో తెలియదు, ఏ ప్రాంతమో తెలియదు. మనలాంటి ఎంతో మంది పేద ప్రజల కోసం మన కళ్ళముందే మన దండకారణ్యంలో ప్రాణాలిస్తున్నారు. వాళ్ళందరు కూడా తల్లిదండ్రులను వదిలి వచ్చినోళ్ళేకదన్నా! నీకన్నా ఉన్నతమైన పని నీ బిడ్డ చేయాలనుకుంటున్నది. అందుకు సంతోషంగా పంపన్నా'' అని కమిటీ వాళ్ళు నాన్నని ఓదార్చారు. నాన్న బాధపడటమే కాదు. నాక్కూడా బాధగానే ఉంది. నా చిన్నప్పుడు పని చేయటానికి శక్తి సరిపోనప్పుడు నాన్న పని చేయనిచ్చేవాడు కాదు. నేనున్నానుగా అనేవాడు. అమ్మ చనిపోయాక అమ్మ పనులు చేయడమే గాక అమ్మ ప్రేమను కూడా పంచి మమ్మల్ని పెంచాడు. ఊరోళ్ళు మా చిన్నతనాన్ని చూసి, నాన్నకు పెళ్ళి చేస్తామన్నప్పుడు వచ్చే వ్యక్తి మమ్మల్ని సరిగా చూసుకుంటుందో లేదో అనే సంశయంతో మా కోసం ఆలోచించి పెళ్ళి విరమించుకున్నాడు. చెల్లి దూరంగా ఉంది. నేను కూడా దూరమయితే నాన్న ఒంటరవుతాడు. ఈ ఆలోచనలన్నీ నన్ను కూడా చుట్టుముట్టాయి. ఒక రోజు ''15 రోజులు మిలటరీ ట్రైనింగ్ వుందని'' మా కమాండర్ నుండి కబురు. ఇంకేం ఆలోచించలేదు. నాన్నకి విషయం చెబుతున్నప్పుడు తను పడుతున్న ఘర్షణ నాకు అర్థమైంది. అయినా వెళ్ళడానికే నిర్ణయించుకున్నా. విజయవంతంగా ట్రైనింగ్ ముగించుకొని తిరుగు ప్రయాణం అవుతున్నాం. కమాండర్ మా బ్యాచ్‌ని పిలిచి "వచ్చే నెల మొదటి వారంలో మీరు ఎ.ఒ.బి.కి వెళ్ళి అక్కడ పని చేయాల్సి వుంటుంది. ఇది పార్టీ నిర్ణయం" అని చెప్పి మా నుండి సెలవు తీసుకున్నాడు. అందరం చాలా సంతోషపడ్డాం. ఆ సంతోషంలో మా సాంప్రదాయ నృత్యం దాకా వేసాం. ఇంటికెళ్ళా. చూస్తుండగానే రోజులు క్షణాల్లా

33వ పేజీలో...

## సామ్రాజ్యవాదుల తొత్తులైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య పాలకవర్గాల కిరాయి సాయుధ బలగాలు చుట్టుముట్టి జరిపిన సాయుధ దాడిని వీరోచితంగా తిప్పికొడుతూ అమరులైన రాంగూడ

# అమరులకు అరుణారుణ జోహార్లు

### కామ్రేడ్ చామల కిష్టయ్య (భాస్కర్, దయ, పూర్ణో, రాము)



నాటి తెలంగాణా సాయుధ పోరాటంలోనే కాక నేటి ప్రత్యేక, ప్రజాస్వామిక తెలంగాణ పోరాటంలోనూ వీరోచిత పాత్ర వహించిన పోరాటాల ఖిల్లా నల్గొండ జిల్లాలోని, వలిగొండ మండలం, దాసిరెడ్డిగూడం గ్రామంలో నిరుపేద కుటుంబంలో చామల చంద్రమ్మ, రామయ్య దంపతుల కడుపు పంటగా దాదాపు 45 సంııల క్రితం కామ్రేడ్ దయ జన్మించాడు. తల్లిదండ్రులు తమ బిడ్డకు ప్రేమగా కిష్టయ్య అనే పేరు పెట్టుకున్నారు.

కామ్రేడ్ దయ భువనగిరిలో డిగ్రీ చదువుతున్న క్రమంలో రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్.ఎస్.యు) కార్యకలాపాలకు ఆకర్షితుడయ్యాడు. అప్పటికే విప్లవోద్యమం పని చేస్తున్న ప్రాంతం కావడంతో 1990లో పూర్తికాల కార్యకర్తగా విప్లవోద్యమంలో భర్తీ అయ్యాడు. దక్షిణ తెలంగాణా ఉద్యమంలో నాలుగు సంవత్సరాలు పాటు రాచకొండ, కృష్ణపట్టి ఏరియాలలో పని చేసాడు. ఆ తర్వాత పార్టీ అవసరాల రీత్యా నల్లమలకు బదిలీ అయ్యాడు. అక్కడనుండి 1994లో కామ్రేడ్ దయ శ్రీకాకుళం డివిజన్ ఉద్యమంలో భాగమయ్యాడు. కొద్దికాలానికి ఆ డివిజన్‌లోని ఉద్దానం దళానికి డిప్యూటీ కమాండర్‌గా కామ్రేడ్ దయ బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఉద్దానం ఏరియాలో భాస్కర్ పేరుతో ప్రజలకు చేరువయ్యాడు. 96లో అదే దళానికి కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు.

ఉద్దానం ఏరియాలోని వజ్రపు కొత్తూరు, పలాస, మందస, సోంపేట, ఇచ్ఛాపురం మండలాలలో వున్నటువంటి ప్రజలతో ఐక్యమవుతూ, వారి సమస్యలకు స్పందిస్తూ అనేక పోరాటాల్లో వారిని కదిలించే కృషి చేశాడు.

వ్యవసాయక విప్లవంలో భాగంగా దున్నేవారికే భూమి ప్రాతిపాదికగా పార్టీ ఆధ్వర్యంలో అనేక భూపోరాటాలు జరిగిన చరిత్ర ఈ ప్రాంతానికి వుంది. దాంట్లో భాగంగా ఉద్దానం ఏరియాలో

---

32 తరువాయి...

గడిచిపోతున్నాయి. సరిగ్గా 3 రోజుల్లో నా ప్రయాణం. దానికి కావలిసిన ఏర్పాట్లు చేసుకుంటూనే ఉన్నా నామనసు కుదురుగా లేదు. నాన్న ఏం ఆలోచించాడో తెలియదు. కానీ బయల్దేరే రోజు నవ్వుతూ నా ముందుకొచ్చాడు. సాయంకాల సమయం వాకిట్లో కూర్చున్నామిద్దరం. నాన్న మాట్లాడటం ప్రారంభించాడు. గొడ్లు, మేకలు ఇంటికి చేరుకున్నాయి. పిల్లమేకలు అరుస్తూ, చెంగుచెంగున గెంతుతూ మా మధ్యలో నుండి అటుఇటూ పరుగెడుతున్నాయి. “పార్టీ మన లాంటి ఎంతో మంది పేద వాళ్ళకోసం పని చేస్తున్నది. అలాంటి పార్టీలో నీవు చాలా ధైర్యంగా, చురుగ్గా పని చేయాలి. మిలటరీ పరంగా బాగా ఎదగాలి. ఏ సయమంలోనైనా శతృవు నెదుర్కోవడానికి సిద్ధంగా వుండాలి. ముఖ్య విషయమేమంటే ఎప్పుడు కూడా ఊగిసలాటకు గురి కావద్దు. సమస్యలు వచ్చినప్పుడు మరింత ధైర్యంగా వాటిని తట్టుకొని ముందుకెళ్ళాలి. ఇంటికెళ్ళాలనే ఆలోచన ఎట్టి పరిస్థితుల్లో రానియకూడదు. నీ ప్రాణం వున్నంత వరకు నిన్ను నమ్మిన ప్రజల కోసం పని చేయి. ఇక నేను ఒంటరినవుతానని బాధపడకు. ఎప్పుడు ప్రజల్లో వుండే నేను ఒంటరి కాను'' అంటూ తల నిమిరాడు నాన్న. నాన్న మాట్లాడిన మాటాలకు నాకు కళ్ళు చెమర్చాయి. లేచి నిటారుగా నించున్నాను. తలెత్తి నాన్నను చూస్తే నా కన్నా ఎత్తుగా, ఎంతో ఉన్నతంగా కన్పించాడు. చేతులు కలిపాను. చేతి సంచి భూజాన తగిలించుకుని నాలుగడుగులు ముందుకు వేసి వెనుదిరిగాను. మా ఇల్లు, నాన్న, మేకలు, గొడ్లు అన్నీ నా కన్నీటిలో మసక మసకగా కన్పిస్తున్నాయి. కానీ మాలాంటి లక్షలాది గ్రామాల్లో విప్లవ రాజకీయాలను ప్రతిష్టించాలనే నా ఆశయం స్పష్టంగా దారి చూపిస్తుండగా వడివడిగా ముందుకు నడిచాను. ✱

పంజాబ్ సింగ్ అనే భూస్వామికి 100 ఎకరాలకు పైగా కొబ్బరితోట వుండేది. ఆ తోటను ఆక్రమించుకోవడంలో భాగంగా ప్రజలను కదిలించి భూమితో పాటు తోటను ఆక్రమించుకోవడం జరిగింది. రెట్టికొండ, మెట్టిలలో పోరాటాల ద్వారా వేలాది ఎకరాల ప్రభుత్వ జీడితోటలను స్వాధీనం చేసుకోవడం జరిగింది.

జీడిపిక్కలు, కొబ్బరికాయలు వంటి వాణిజ్య పంటల గిట్టుబాటు ధరకోసం వందలాది మంది ప్రజలను కదిలించి 80 కేజీల బస్తాకి రెండు మూడు వేల రూ॥ల నుండి ఐదు వేల రూ॥ల వరకు పెంచాలనీ, షావుకార్లు కాకుండా ప్రభుత్వమే కొనాలనీ, ప్రభుత్వమే గిడ్డంగులు తెరవాలనీ మొదలైన డిమాండ్లతో ర్యాలీలు, ఊరేగింపులు చేయించి పై డిమాండ్లన్నింటిని సాధించడం జరిగింది.

1998 కోపర్‌డంగ్ ఎన్‌కౌంటర్ తర్వాత పార్టీ నష్టాలను దృష్టిలో వుంచుకొని కామ్రేడ్ భాస్కర్‌ను ఉద్దానం ఏరియా నుండి నాగావళి ఏరియాకు బదిలీ చేయడం జరిగింది. అక్కడ గొట్ట, ముకుందాపురం, పాండ్రతల వంటి గ్రామాలలో భూ పోరాటాలు చేపట్టడం జరిగింది. విశ్వ అనే భూస్వామికి వ్యతిరేకంగా ప్రజలను కదిలించి 600 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ పోరాటాల్లో కామ్రేడ్ దయ పాత్ర కీలకమైనది.

కోరాపుట్‌లో రాయ్‌గఢ, విజయనగరంలో కువ్వి ప్రజలను ఐక్యం చేసి చింతపండుకు గిట్టుబాటు ధరకోసం కదిలించడం జరిగింది.

నారాయణపట్నాలో సొండి భూస్వాములు సారాను తయారు చేస్తూ అక్కడి ప్రజలను మత్తులో ముంచుతూ వారికి భ్రమలు కల్పిస్తూ ప్రజల భూములను అక్రమంగా ఆక్రమించుకున్నారు. ప్రజలకు కూడు, గుడ్డ, గూడు లేకుండా చేసి అనేక మోసాలకు పాల్పడ్డారు. ఆ క్రమంలో పార్టీ ప్రజలను సారాకు వ్యతిరేకంగా కదిలించడం జరిగింది. దీంతో సొండీలు సారాను బందు పెట్టారు. ఆ తర్వాత ప్రజల వద్ద అక్రమంగా లాక్కున్న భూములను విప్లవోద్యమ నాయకత్వంలో సొండి భూస్వాముల నుండి లాక్కొని ప్రజలకు పంచడం జరిగింది. వీటి రక్షణకై కోరాపుట్‌లో ఘెనువా బాహిని అనే పేరుతో మిలీషియను ఏర్పాటు చేయడం జరిగింది.

దళాలు తిరిగే ఏరియాల్లో కాకుండా దళాలు వెళ్ళ లేని ప్రాంతాలలో విస్థాపన సమస్య తీవ్రంగా వుంది. మాలి, దేవమాలి, రక్తఖండి, వంటి ప్రాంతాలలో ప్రజలను చైతన్యపరిచి, నిరంతరం పోరాటాలు చేయించడం, సకాలంలో కార్యక్రమాలు ఇవ్వడం జరిగింది. సామ్రాజ్యవాద విషసంస్కృతికి వ్యతిరేకంగా సినిమాహాల్‌ను పేల్చడం జరిగింది.

భూపోరాటాలు, సారా పోరాటాలు, గిట్టుబాటు ధర పోరాటాలు, విస్థాపన పోరాటాలలో విస్తృతంగా వ్యవసాయ కూలీలు, రైతాంగం, మహిళలను కదిలించడంలో కామ్రేడ్ దయ పాత్ర కీలకమైంది. ప్రజాసంఘాలనూ, మిలీషియాను ఏర్పాటు చేయడం, ప్రజల సమస్యల్ని ప్రజా కోర్టులలో పరిష్కరించడం వంటి కార్యకలాపాలను క్రియాశీలంగా నిర్వహించాడు.

మిలటరీ రంగంలో కూడా కామ్రేడ్ దయ ప్రముఖ పాత్ర వహించాడు. అనేక దాడుల్లో కామ్రేడ్ దయది ప్రత్యక్ష, పరోక్ష భాగస్వామ్యం వుంది.

1994లో మొట్టమొదట శ్రీకాకుళం జిల్లా నీలభద్ర రైడ్‌లో గన్నా ఎర్రయ్య అనే బడా భూస్వామిపై దాడి చేసి, అతనికి రక్షణ వున్న ఐదుగురు పోలీసులలో ముగ్గురుని గాయపర్చి, ఇద్దరిని చంపి ఐదు .303 తుపాకులూ, 200 తూటాలు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

ఉద్దానం ప్రాంతం పలాసా టౌన్‌లోని కాశీబుగ్గ ఏరియాలో ఉద్యమాన్ని అణచివేయడంలో భాగంగా ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ తయారు చేయడంలోనూ, ప్రజలను హింసించడంలోనూ ఎస్.ఐ.బి. కానిస్టేబుల్ ఎమ్.ఎన్. దాస్ ముఖ్యపాత్ర వహించాడు. వీడిని 1996లో కాశీబుగ్గ నడిరోడ్డులో వేలాది మంది ప్రజలు చూస్తుండగానే ఖతం చేయడం జరిగింది. 1998లో బుడిగడ్డ, బొడిపడ పోలీస్ స్టేషన్స్‌పై ఆయుధాల కోసం జంట రైడ్స్ చేయడం జరిగింది. ఈ దాడులన్నింటిలో కామ్రేడ్ దయ ముఖ్య పాత్ర వహించాడు.

2005లో నాగావళి ఏరియాలో శత్రువు కూంబింగ్‌కు వచ్చి తిరిగి వెళుతున్న క్రమంలో దయ నేతృత్వంలో ఆపర్చునిటీ ఆంబుష్ చేయడం జరిగింది. ఈ దాడిలో ఒక పోలీస్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డాడు.

2004లో జరిగిన కోరాపుట్ మల్టీరైడ్‌లో కామ్రేడ్ దయ ప్రత్యక్షంగా పాల్గొనక పోయినా, తన పరోక్ష సహకారం చాలా ముఖ్యమైనది. 2009 నాల్కో రైడ్‌లోనూ ముఖ్య పాత్ర వహించాడు.

ప్రజలను ప్రేమించడంలో, ప్రజలతో సజీవ సంబంధాలు కొనసాగించడంలో ఆయనకాయనే సాటి. 2009 నారాయణపట్నా ఏరియాలోని ఒక వూరిలో ఒక పెద్దమనిషి దళం దగ్గరకు వచ్చి తనకు కాళ్ళు పగిలాయనీ, మందివ్వమని అడిగాడు. దళ కామ్రేడ్స్ మందు లేదని చెప్పగా తిరిగి వెళుతున్న ఆయనను దయ పిలిచి 100 రూ॥లు ఇచ్చి, ప్లాస్టిక్ బూట్లు కొనుక్కోమనీ, ప్రతిరోజూ కాళ్ళకు పసుపు రాసుకోమని సూచనలు చేసి పంపించాడు. ఆ తర్వాత ఎప్పుడు దళం వెళ్లినా అతను దళం దగ్గరికి వచ్చి పూర్ణో వచ్చాడా అని అడుగుతాడు. "నేను పూర్ణో చెప్పినట్టుగానే ప్లాస్టిక్ బూట్లు తెచ్చుకున్నా, పసుసు రాసుకున్న ఇప్పుడు నా కాళ్లు తగ్గాయి" అని తన సంతోషాన్ని వెలిబుచ్చాడు. మరోసారి దళం వెళ్ళినప్పుడు ఆ పెద్దమనిషి నడవలేని స్థితిలో వున్నప్పటికీ తన భార్యను వెంటబెట్టుకొని జొన్నలు తీసుకొని డేరాకు వచ్చాడు. కామ్రేడ్ దయ ప్రజలతో ఎంత సన్నిహిత సంబంధాలు ఏర్పర్చుకుంటాడో ఈ సంఘటన ద్వారా అర్థం చేసుకోవచ్చు. ఏ మీటింగు జరిగినా తను ఉండాలని ప్రజలూ, క్యాడరే కాకుండా తను కూడా కోరుకునేవాడు. అభివృద్ధిలో వెనకబడుతున్న మహిళా కామ్రేడ్స్‌కు సహకరించే విషయంలో గానీ, సహచరులను కోల్పోయిన కామ్రేడ్స్‌కు తోడ్పాటునందించి వారిని నిలబెట్టుకునే విషయంలో గానీ, కొత్తగా వచ్చిన కామ్రేడ్స్‌ను అభివృద్ధి చేయడంలో గానీ, సమస్యలు ఎదుర్కొంటున్న కామ్రేడ్స్ విషయంలో ఆదరాభిమానాలు కనబర్చడం, వారితో విడిగా మాట్లాడటం, విషయాన్ని అర్థం చేయించడం, రాజకీయంగా వారి ఎదుగుదలకు సహకారాన్నందించడం తనలో వున్నటువంటి మరో మంచి లక్షణం. కామ్రేడ్ మంగన్న అమరుడైన తర్వాత ఆయన సహచరి కామ్రేడ్ స్వర్ణను పెళ్లి చేసుకునే విషయంలో కూడా కామ్రేడ్ దయ ఆదర్శంగా ఆలోచించాడు.

పోలీసులు ప్రజలను అరెస్టు చేసిన సందర్భాలలో వారి కుటుంబాలను కలవడం, ఓదార్చడం, ధైర్యం చెప్పడం, రాజకీయంగా అర్థం చేయించడం, వారిని ఉద్యమం వైపు

నిలబెట్టడం, జైలు నుండి విడుదలై వచ్చిన వారిని కలిసి రాజకీయంగా అర్థం చేయించడం, వారిని ఉద్యమ పక్షాన నిలబెట్టడం పట్ల శ్రద్ధ పెట్టేవాడు. ప్రజలను ఎంత ప్రేమిస్తాడో శత్రువుపై అంతే కసితో వుండేవాడు.

కామ్రేడ్ దయ నిరంతరం క్యాడర్, ప్రజలకు దగ్గరగా వుండేవాడు. అందుకే ప్రజల, కామ్రేడ్స్, పై కమిటీ విశ్వాసాన్ని అపారంగా చూరగొన్నాడు. తను ఏ ప్రాంతంలో పని చేస్తే ఆ ప్రాంత భాషను సొంతం చేసుకునేవాడు. ప్రజల భాషలో చొరవగా మాట్లాడుతూ వాళ్లలో ఒకడుగా మెలిగేవాడు. ఎక్కడ పని చేసినా ఆ ఏరియాలోని టెర్రయిన్ మీద పట్టు సంపాదించాడు. నారాయణపట్నా భూపోరాటంలో కూడా కామ్రేడ్ దయ పాత్ర చెప్పుకోదగ్గది. తన ఉపన్యాసాలతో ప్రజలను ఉత్తేజ పర్చడమే కాక పాటలతో కూడా ప్రజల హృదయాల్లో నిలిచిపోయాడు. దయ జీవితాన్ని శ్రీకాకుళ ఉద్యమంతో విడదీసి చూడలేము. కామ్రేడ్ దయ తన లోపాలను సరిచేసుకోవడంలో ఘర్షణ పడుతూ ఎప్పటికప్పుడు స్వయం విమర్శ చేసుకోవడమే కాక వాటి నుండి బయటపడటానికి కృషి చేసేవాడు. ఉద్దానంలో భాస్కర్‌గా, విజయనగరం, రాయ్‌గఢలో దయగా, నారాయణపట్నాలో పూర్ణోగా, నందపూర్‌లో ప్రజలకు రాముగా ప్రజల హృదయాల్లో చెరిగిపోని ముద్ర వేశాడు.

2016 ఆగస్టు ఎస్.జడ్.సి. సమావేశం తర్వాత కటాఫ్ ఏరియాను కేంద్రంగా ఎమ్.కె.వి.బి. డివిజన్‌కి నాయకత్వం వహిస్తున్న క్రమంలోనే రాంగూడలో శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ అమరుడయ్యాడు.

## కామ్రేడ్ బాకూరి వెంకటరమణరాజు (గణేష్, ప్రసాద్)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖ జిల్లా, హుకుంపేట మండలం, బాకూరు గ్రామంలో, మధ్య తరగతి ఆదివాసీ కుటుంబంలో ప్రసాద్ జన్మించాడు. తనకు తల్లిదండ్రులు ప్రేమతో పెట్టిన పేరు వెంకటరమణరాజు. తనతో పాటు ఒక అక్క, ఇద్దరు తమ్ముళ్లు వున్నారు.

1922-24లో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో మన్యం పితూరిగా పేరుగాంచిన ఒక గొప్ప తిరుగుబాటు జరిగింది. నేటికి అది ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. దాని వారసత్వాన్ని కొనసాగిస్తూ మళ్ళీ నాటి సి.పి.ఐ.(ఎల్-ఎల్) (పీపుల్స్‌వార్) నేతృత్వంలో, దండకారణ్య ఉద్యమంలో భాగంగా తూర్పు కనుమల్లో 1980లో ఉద్యమం మొదలైంది. గెరిల్లా దళాలు ప్రవేశించి విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల్లోని అనేక ఆదివాసీ గూడాల్లో ఆదివాసీ సమస్యల మీద పెద్ద ఎత్తున రైతాంగాన్ని ఉద్యమంలోకి కదిలింపజేసిన కాలం అది. తమ మీద జరుగుతున్న దోపిడీ, అణచివేతలు ఇక చెల్లవని ఆదివాసులు నడుంకట్టిన కాలం. 1980-1990 మధ్య విప్లవోద్యమ నేతృత్వంలో జరిగిన మన్యం ఆదివాసీ ఉద్యమాల నేపథ్యంలో 'మిన్నంటుతున్న మన్యం గిరిజన పోరాటాలు' అనే పేరుతో పుస్తకం వచ్చింది. అలా ఆదివాసీ ఉద్యమాలు పెల్లుబుకినటువంటి కాలంలో కామ్రేడ్ ప్రసాద్ పుట్టి, పెరిగి, విద్యాభ్యాసం కొనసాగించాడు. అనేక సెక్షన్ల ప్రజలను ప్రభావితం చేసిన ఆ పోరాటాలు కామ్రేడ్ ప్రసాద్‌ను కూడా ఆకర్షించాయి. ఫలితంగా విద్యార్థి దశలో వున్న కామ్రేడ్ ప్రసాద్ ఆర్.ఎస్.యు.లో చేరి దాని కార్యకలాపాల్లో చురుగ్గా పాలుపంచుకున్నాడు. 1990లలో, ముఖ్యంగా విశాఖ ప్రాంతంలో 'గిరిజన హక్కుల పరిరక్షణ సంస్థ' (ఒ.పి.జి.ఆర్.) అనే ఒక సంఘం పని చేస్తుండేది. నేడు ప్రజల్లో పార్టీ ఎలా ప్రఖ్యాతి పొందిందో, అలాగే ఆ రోజుల్లో విప్లవోద్యమ గైడెన్స్‌లో నడిచినటువంటి ఒ.పి.జి.ఆర్. ప్రభావం కూడా అంతగా వుండేది. అది అనేక ప్రజల సమస్యల్ని తీసుకుని పని చేసింది. కామ్రేడ్ ప్రసాద్ డిగ్రీ పూర్తయిన తర్వాత ఒ.పి.జి.ఆర్. కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొన్నాడు. విప్లవోద్యమం మీద 1985 నుండి ప్రభుత్వం అప్రకటిత నిషేధాన్ని, దమనకాండను కొనసాగిస్తూ వస్తున్నది. ముఖ్యంగా ఈస్ట్ డివిజన్ ప్రాంతంలో వందలాది గూడాల్నీ తగులబెట్టి ఉద్యమ అణచివేతకు పాల్పడ్డాయి. ఇక చట్టం ప్రకారం 1992లో పార్టీని నిషేధించడమే కాక ప్రజా సంఘాలను కూడా నిషేధించింది. అట్లా ఒ.పి.జి.ఆర్. కార్యకలాపాలను కూడా నిషేధించింది. దానితో ఒ.పి.జి.ఆర్. కూడా బహిరంగంగా పని చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఆ తర్వాత స్తబ్దతకు గురైంది. ఒ.పి.జి.ఆర్. రద్దయిన తర్వాత కొందరు దిగజారిపోతే, మరికొందరు పార్టీ రాజకీయాలతో కొనసాగారు. పార్టీ రాజకీయాలతో కొనసాగిన వ్యక్తులు, ఉద్యోగులు, విద్యార్థులు వంటి కొన్ని సెక్షన్‌ల వారిని పార్టీ రహస్యంగా గైడ్ చేసేది. అందుకు ముగ్గురితో కూడిన ఒక సెల్‌ను ఏర్పాటు చేసింది. దానికి కామ్రేడ్ ప్రసాద్ కార్యదర్శిగా పని చేశాడు. ఒ.పి.జి.ఆర్.కి అనుబంధంగా వున్న గిరిజన విద్యార్థి సంఘం (జి.ఎస్.యు.) చురుగ్గా పనిచేస్తుండేది. 2000ల వరకు కూడా ఆ విద్యార్థి సంఘాన్ని ఉపయోగించుకొని పార్టీ ఆ కవర్‌లో పని చేసింది. జి.ఎస్.యు. కార్యకలాపాలు నడిపించడంలో గానీ, వుద్యోగ సెక్షన్స్‌ను ఆర్గనైజ్ చేయడంలో గానీ కామ్రేడ్ ప్రసాద్ పాత్ర కీలకమైనది.

1996లో ఈస్ట్ డివిజన్ మొదటి కాన్ఫరెన్స్ జరిగింది. కాన్ఫరెన్స్‌లో తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా ఏలేశ్వరం రైడ్ తర్వాత మిలటరీ క్యాంప్ జరిగింది. ఈ క్యాంపులో బయట సెల్‌లో పని చేస్తున్న ఇద్దరు వ్యక్తులు విద్యార్థులుగా పాల్గొన్నారు. ఆ ఇద్దరిలో ఒకరు కామ్రేడ్ ప్రసాద్. క్యాంపు ముగిసాక ఒకరు ఇంటికి వెళ్ళారు. ప్రసాద్ మాత్రం ఇంటికి తిరిగి వెళ్లలేదు. పూర్తికాలం కార్యకర్తగా లోపలే వుండాలని నిర్ణయించుకున్నాడు. అలా తన గెరిల్లా జీవితం ప్రారంభమైంది.

1997లో జి.మాడుగుల నుండి మొదలుకొంటే సాలూరు, పాచిపెంట, అంపవల్లిని కవర్ చేస్తూ అరకు దళం పని చేసేది. ఆ దళంలో కామ్రేడ్ ప్రసాద్‌ను సభ్యుడిగా తీసుకోవడం జరిగింది.

అదే దళంలో 1999 వరకు పని చేస్తూ ఏరియా కమిటీ సభ్యుడిగా ఎదిగాడు. ఆ తర్వాత అరకు దళం రద్దయ్యింది. అప్పటి నుండి తన కార్యాచరణ కోరుకొండ ప్రాంతంలో కొనసాగింది. అక్కడ పని చేస్తూనే ఎ.సి సెక్రటరీగా, డి.సి సభ్యుడిగా ఎదిగాడు. ఆనాటికి ఈస్ట్ డివిజన్ కమిటీలో ఏడుగురు సభ్యులుండేవారు. అందులో ముగ్గరితో కూడిన సెక్రెటేరియట్ వుండేది. కామ్రేడ్ ప్రసాద్ సెక్రటేరియట్ సభ్యుడుగా కొనసాగాడు. కోరుకొండ ఏరియా ప్రజలతో మమేకమై అక్కడి సమస్యల పరిష్కారానికై ప్రజలను పోరాటోన్ముఖులను చేస్తూ, ఆ పోరాటాలకు సరైన గైడెన్స్ ఇస్తూ ప్రజలకు తల్లోనాలుకయ్యాడు.

2006లో ఎ.ఒ.బి. 3వ మహాసభలో కామ్రేడ్ ప్రసాద్‌ను ఎస్.జడ్.సి.లోకి ఎన్నుకోవడం జరిగింది. ఆ సభలో తీసుకున్న నూతన ఎత్తుగడల్లో భాగంగా ఈస్ట్, విశాఖ డివిజన్‌లు వేరయ్యాయి. విశాఖ డివిజన్‌కు కామ్రేడ్ ప్రసాద్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. 2008లో ఈస్ట్ డివిజన్ కార్యదర్శిగా పనిచేస్తుండిన విజయ్ గాయపడటంతో ఆ ఏరియాను తను నడిపించలేని పరిస్థితి ఏర్పడింది. ఆ నేపథ్యంలో ఆ రెండు డివిజన్‌లను కామ్రేడ్ ప్రసాదే చూడాలనే పార్టీ నిర్ణయాన్ని స్వీకరించి రెండు డివిజన్లకు తానే నాయకత్వం వహించాడు. ఆ విధంగా కామ్రేడ్ ప్రసాద్ జీవితం ఈస్ట్ డివిజన్ ఉద్యమంతో పెనవేసుకుపోయింది.

2013 వరకు ఎస్.జడ్.సి. నుండి ఉమ్మడి డివిజన్‌ను చూసే బాధ్యతను కొనసాగించాడు. అదే సంవత్సరం జరిగిన ఎ.ఒ.బి. ప్లీనం తర్వాత ప్రజా సంఘాలను సమన్వయం చేసే బాధ్యతను పార్టీ అతనికి అప్పగించింది. మిలటరీ నైపుణ్యం కలిగి వుండటంతో ఎస్.ఎమ్.సి. సభ్యుడిగా కొంతకాలం పని చేశాడు. పలు సాయుధ దాడులకు నాయకత్వం వహించాడు. ఆ తర్వాత ఎస్.జడ్.సి. వర్క్ డివిజన్‌లో భాగంగా సాంస్కృతిక రంగానికి సంబంధించిన బాధ్యతను స్వీకరించాడు. ఆ సమయంలో సాంస్కృతిక వర్క్‌షాప్ నిర్వహించడం జరిగింది. ఆ వర్క్‌షాప్‌లో పాటల క్యాసెట్‌ను వెలువరించాలనే నిర్ణయానికనుగుణంగా పాటల క్యాసెట్‌ను తయారు చేశారు. దీంట్లో కామ్రేడ్ ప్రసాద్ ప్రధాన పాత్ర పోషించాడు. ఈ విధంగా ఎస్.జడ్.సి. సభ్యుడిగా పరిస్థితులకు అనుగుణంగా అనేక బాధ్యతలు నిర్వహించాడు. డివిజన్ సెక్రటరీగా పనిచేస్తూనే ఐక్య సంఘటన పోరాటాలను సమన్వయం చేసేవాడు. ఐక్య సంఘటనలో పని చేస్తున్న ఇతర కామ్రేడ్స్‌కు సరైన మార్గదర్శకత్వం అందించాడు.

కామ్రేడ్ ప్రసాద్ డిగ్రీ పూర్తయ్యాక విలేఖరిగా కొన్నాళ్లు పని చేశాడు. విద్యార్థి నేపథ్యంతో పాటు, విలేకరిగా పని చేసిన అనుభవం కలిగివుండటంతో రచనలు చేసే నైపుణ్యం సంపాదించాడు. ఉద్యమ ప్రాంతంలో ప్రభుత్వ అణచివేత, బాక్సైట్ పోరాటం తదితర విషయాలపై మత్రికామయ్య, నాగమణి తదితర పలు కలం పేర్లతో అనేక సామాజిక పత్రికలకు రచనలు చేశాడు. ఎ.ఒ.బి. జోన్ పత్రిక – బోల్షివిక్‌కు కూడా రచనలు చేసాడు. 2015 జులై–డిసెంబర్ 6వ బులిటెన్ తీసుకురావడంతో కామ్రేడ్ ప్రసాద్ పాత్ర కీలకమైనది.

ఏ ఉద్యమమైనా అక్కడున్నటువంటి స్థానిక నాయకత్వం నుండి ఉన్నతస్థాయికి ఎదిగి ఆ వుద్యమానికి నేతృత్వం వహించడం వల్ల ఆ ఉద్యమ పురోగమనానికి దోహదపడుతుంది. ఆ విధంగా స్థానిక ఆదివాసీ నేపథ్యంతో పాటు ఒక సాధారణ కార్యకర్త నుండి రాష్ట్ర స్థాయి వరకు అంచెలంచెలుగా ఎదిగాడు. కామ్రేడ్ ప్రసాద్ ఈ రోజు ఎస్.జడ్.సి స్థాయికి ఎదగడానికి పార్టీ సహకారంతో పాటు తన కృషి ప్రధానమైంది. ఎల్.ఐ.సి. పాలసీలో భాగంగా తన సహచరి ద్వారా శత్రువు సరెండర్ పాలసీని ముందుకు తెచ్చినా, కుటుంబాన్ని కూడా మానసికంగా కృంగదీసినా ఎలాంటి ఊగిసలాటకు గురి కాకుండా వర్గపోరాట రాజకీయాలను దృఢంగా ఎత్తిపడుతూ చివరి ఊపిరి వరకూ విప్లవోద్యమంలో కొనసాగాడు. విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోయే క్రమంలో ఎదురుపడిన అనేక ఎగుడుదిగుళ్ళను దృఢంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాడు. సహచర కామ్రేడ్స్‌కు ప్రేమ, ఆప్యాయత, స్వేచ్ఛ, భరోసాను అందించడంలో కామ్రేడ్ ప్రసాద్ అందరికీ ఆదర్శంగా వుండేవాడు.

## కామ్రేడ్ ప్రభాకర్ (అరవిందు, హరి, గంగాధర్)



రంగారెడ్డి జిల్లా యాప్రాల్ గ్రామానికి చెందిన కాపుక అంజయ్య, రత్నమ్మల కొడుకు మన ప్రభాకర్. కామ్రేడ్ ప్రభాకర్ అసలు పేరు అరవిందు. అందరు హరి అనేవాళ్ళు. ప్రభాకర్ యాప్రాల్‌లోనే 10వ తరగతి పూర్తి చేసాడు. తర్వాత సివిల్ ఇంజనీరింగ్‌లో చేరాడు. చదువుకుంటూనే పని పాటలు నేర్చుకున్నాడు. పనిలో శ్రద్ధ, నేర్చుకోవడంలో వినయం విద్యార్థికుండాల్సిన ఈ ప్రాథమిక గుణాలు ప్రభాకర్‌కు జీవితాంతం కొనసాగాయి. ప్రభాకర్ బహుముఖ ప్రజ్ఞాశాలిగా రూపొందాడు. ఇల్లు నిర్మాణంలో సెంట్రింగ్, ఎలక్ట్రికల్ పనితోపాటు టైలరింగ్ నేర్చుకొని కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచాడు. చదువులో తను నేర్చుకున్న భూమి కొలతలు, ప్రాజెక్టు నిర్మాణాల జ్ఞానాన్ని దండకారణ్యంలో, ఎ.ఒ.బి.లో జనతనసర్కార్ ఏర్పడిన చోట ప్రజలకు చెక్ డ్యాంలు కట్టడానికీ, భూమి కొలతలు నేర్పడానికి ఉపయోగపడ్డాయి. చిన్నవయస్సులోనే భజన సంఘంలో చేరి దానినే కళారంగ పాఠశాలగా ఎంచుకొని పాట పాడటం, రాయటం, డప్పు డోలక్ వాయిద్యాలు వాయించడం నేర్చుకొని తర్వాత కాలంలో తానే ఆయా రంగాలలో శిక్షణనిచ్చే స్థాయికి, ప్రామాణిక రచనలు చేసే స్థాయికి ఎదిగాడు. జె.ఎన్.ఎమ్. పాటలు, కార్యక్రమాలు ప్రభాకర్‌ని ఆకర్షించి ఆయన ఆలోచనల్లో మెరుగుదలను తెచ్చాయి. వాస్తవ దృష్టితో ఆలోచించిన ప్రభాకర్ విప్లవ ప్రజా ఉద్యమాల్లో చురుకైన కార్యకర్తగా ఎదిగాడు.

కామ్రేడ్ ప్రభాకర్ మంచి విద్యార్థిగా, నిత్యసత్యాన్వేషిగా, ఆచరణవాదిగా, బతుకు బాధల నుండి ఎదిగి వచ్చిన కష్టజీవిగా, కార్మికవర్గ రాజకీయాలు అందిపుచుకున్న శ్రామికవర్గ మేధావిగా ఎదిగాడు. అందుకే ఓపిక, సహనం, నిబ్బరం, పట్టుదల, విశ్వాసాలతో అన్ని పనుల్లో బాధ్యతగా వుండేవాడు. 1997 వరంగల్ తెలంగాణా డిక్లరేషన్ సభ జరిగిన నాటి ప్రత్యేక తెలంగాణ

మలిదశ ఉద్యమం నుండి మంచి కార్యకర్తగా, అనేక సంఘాల సమన్వయకర్తగా క్రియాశీల భూమిక నిర్వహించాడు. 1997లోనే ఏర్పడిన ప్రజాకళామండలికి వ్యవస్థాపక సభ్యుడిగా తర్వాత కాలంలో రాష్ట్ర ఉద్యమ నాయకత్వంలో కీలకవ్యక్తిగా బాధ్యతను పోషించాడు. 'తెలంగాణా లొల్లి' పాటల క్యాసెట్, 'నిగురుగప్పిన నిప్పు' డాక్యుమెంటరీ నిర్మాణాల్లో తనే ముఖ్యుడుగా అన్ని పనులు సమన్వయించి పని చేసాడు. ఆ అనుభవంతో సి.ఆర్.బి. తయారు చేసిన 'విప్లవ తరంగం' డాక్యుమెంటరీ సినిమాకు అమరుడు లచ్చాల్‌తో కలిసి స్క్రిప్ట్ తయారు చేసాడు. డి.కెలో వున్న కొద్ది కాలంలోనే తన ఆట, పాటలతో డప్పు, డోలు జ్ఞానంతో భూమి కొలతల పరిజ్ఞానంతో జనతనసర్కార్‌ల మరియు సి.ఎన్.ఎమ్. క్యాడర్‌ల, పి.ఎల్.జి.ఎ. శ్రేణులకు అవసరమైన శిక్షణను, ఉత్తేజాన్ని అందించి డి.కె ప్రజలకు బాగా సన్నిహితమయ్యాడు. అలాగే ఎ.ఒ.బి.లో చెక్‌డ్యాం నిర్మాణాల్లో, వ్యవసాయ రైతాంగ సదస్సుల్లో, వర్గవిశ్లేషణ పరిశోధనలో క్రియాశీలంగా పాల్గొన్నాడు.

రెండు దశాబ్దాలుగా ప్రజాసంఘ కార్యకలాపాలలో రాటుదేలిన ప్రభాకర్ ఎ.ఒ.బి. నాయకత్వంతో చేరి ఐక్య సంఘటన నిర్మాణాల సమన్వయానికి బాధ్యత తీసుకున్నాడు. పార్టీలోకి వచ్చే కొత్త క్యాడర్ అభివృద్ధికి తనదైన శైలిలో కొన్ని పథకాలు రూపొందించుకున్నాడు. సమస్యల మీద పాటలు రాసిన ప్రభాకర్ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విషయాలలో తన అవగాహనను పెంచుకుంటూ అనేక అంశాలపై పరిశోధక స్థాయిలో వ్యాసాలు రాసాడు. 'శబ్దం' పత్రికను తేవడానికి విశేషంగా కృషి చేసాడు. మహిళా మార్గం, నడుస్తున్న తెలంగాణ లాంటి ప్రగతిశీల, విప్లవ పత్రికలకు రచనలు చేసి పంపేవాడు. కామ్రేడ్ ప్రభాకర్ గొప్ప శైలితో రాసిన పాటలు, రచనలు, ప్రత్యేక గొంతుతో పాడిన పాటల క్యాసెట్లు తీసిన డాక్యుమెంటరీలు మనకున్నాయి. వీటితో పాటు అంతకంటే విలువైన ప్రభాకర్ పెనవేసుకున్న మానవ సంబంధాలు, విప్లవ రాజకీయ చైతన్యం కలగలిసిన వ్యక్తిత్వం సజీవంగా మనకు దారి చూపిస్తాయి.

## కామ్రేడ్ కొండమంచిలి సువర్ణరాజు (కిరణ్, రమేష్)



కామ్రేడ్ కిరణ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పశ్చిమ గోదావరి జిల్లా, పల్లంట్లకు చెందినవాడు. తన అక్క, బావ విప్లవోద్యమంలో వుండటంతో వారిని చూడటానికి శ్రీకాకుళం అడవికి వచ్చాడు. దళాల్ని, ప్రజల్ని అక్కడి పరిస్థితుల్ని చూశాడు. అప్పటికతను మైనారిటీ తీరని టీనేజ్ విద్యార్థి. దళిత కుటుంబంలో పుట్టిన కారణంగా వివక్షతను అనుభవించాడు. పేద కుటుంబం కాబట్టి శ్రమ మీద ఆధారపడి జీవించడంలో ఉన్న గౌరవాన్ని, ఇబ్బందుల్ని అర్థం చేసుకుంటున్నాడు. భావాలు రూపొంది, సరైన జీవిత మార్గాన్ని అన్వేషిస్తున్న క్రమంలో తన వాళ్ళు ఉద్యమంలో ఉండటం, ఆ వాతావరణం కిరణ్‌ను బాగా ప్రభావితం చేశాయి. ఉద్యమంతోనే ఉండాలని గాఢంగా నిర్ణయించుకున్నాడు. ఇంటికి పంపిస్తే కూడా ఒంటరిగా వెదుక్కుంటూ మరల అడవికి చేరి దళాన్ని పట్టుకుని ఉండిపోయాడు.

చిన్నవయస్సు కాబట్టి భర్తీ చేసుకోలేదు. చిన్న చిన్న పనుల్లో భాగమవుతుండగా ఒకసారి పోలీసులకు దొరికాడు. దళం దగ్గర నుండే వెళ్ళినా దళం సమాచారం ఏ మాత్రం చెప్పలేదు. తనకేమి తెలియదనీ, అక్కడి స్థానికుడినని పోలీసుల్ని నమ్మించ గలిగాడు. కానీ జేబులో ఉత్తరం దొరకడంతో పోలీసులు చిత్రహింసలు పెట్టారు. బహుశా రాష్ట్రంలో మొదటిసారి ఒక మైనర్ బాలుడి మీద టాడా కేసు పెట్టారు. ఇది పెద్ద సంచలన వార్త అయ్యింది. పౌరహక్కుల సంఘాలు తీవ్రంగా స్పందించాయి. రెండు సంవత్సరాలకు పైగా జైలు జీవితాన్ని అనుభవించాక కామ్రేడ్ కిరణ్‌పై కేసు కొట్టి వేశారు. జైలు నుండి వచ్చి కుటుంబాన్ని కలిశాడు. అక్క ఉద్యమం నుండి వెనక్కి వచ్చి పిల్లలతో సాధారణ జీవితాన్ని కొనసాగిస్తున్నది. బావ (మేనమామ కూడా) మాత్రం ఉద్యమంలో కొనసాగుతున్నాడు. తను కూడా ఉద్యమంలోనే భాగం కావాలని నిర్ణయించుకుని దళాల్లో చేరతానన్నాడు.

జైలు జీవితంలో అక్కడ దొరికిన అనేక పుస్తకాలు, పత్రికలు చదివాడు. నిర్బంధంలో వుండి బయటి ప్రపంచాన్ని ఖైదీలను చదవడం ద్వారా అర్థం చేసుకున్నాడు. అక్కడి వర్కర్స్‌తో వున్న మంచి స్నేహాలతో అధికార యంత్రాంగం గురించి, రాజ్య స్వభావం గురించి తెలుసుకున్నాడు. జైలు కొచ్చిన సీనియర్ కామ్రేడ్స్ నుండి రాజకీయాలు నేర్చుకున్నాడు. రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు విప్లవోద్యమం గురించి వివరించి చెప్పేవాడు. ఇంత చిన్నవాడికి అన్ని విషయాలు తెలియడం, క్రమశిక్షణ, చురుకుదనం అందర్ని ఆకర్షించేవి. జైలులోనే తన జీవన మార్గాన్ని నిర్ణయించుకున్నాడు.

ఒక స్థిరమైన నిర్ణయంతో వచ్చిన కామ్రేడ్ కిరణ్‌ను ఉద్యమం అక్కున చేర్చుకుని నాయకత్వ రక్షణ చూస్తూనే మిలటరీ, రాజకీయ, నిర్మాణ విషయాలను నేర్చుకోవాలని చెప్పడం జరిగింది. తనకు అధ్యయనం ఒక వ్యసనంగా వుండేది. క్రమశిక్షణగా, చురుకుగా వుండటంతో తొందరగా నేర్చుకుని బాధ్యతగా ఉండేవాడు. 2006లో విజయనగరం జిల్లాలో క.వలస..........దగ్గర ఎస్.జడ్.సి. కామ్రేడ్‌పై దాడి జరిగినప్పుడు ఫైరింగ్ చేసి శత్రువును వెనక్కి నెట్టాడు. మొత్తం టీం రిట్రీట్ కావడంలో కామ్రేడ్ కిరణ్ చేసిన చొరవ కీలకంగా ఉపకరించింది. రెండు సంవత్సరాల పాటు గార్డుగా తన బాధ్యతను పట్టుదలగా నిర్వహిస్తూ నాయకత్వం, కేడర్ నుండి నేర్చుకుంటూ అభివృద్ధి చెందాడు. ప్రధాన బలగాల్లో పని చేయడానికి బదిలీ చేయడం కోసం చర్చించినప్పుడు వెంటనే సంసిద్ధతను వ్యక్తం చేశాడు.

చిన్నప్పటి నుండీ కంటి సమస్య ఉన్నప్పటికీ, రాత్రిపూట నడకలు ఇబ్బంది అయినప్పటికీ దాన్ని పట్టుదలతో అధిగమిస్తాననీ, మిలటరీ నిర్మాణాల్లో పని చేయడం ఇష్టమని ఆ పనిలోకి మారాడు. ఆంధ్ర, ఒడిశా రెండు రాష్ట్రాల్లోనూ జరిగిన అనేక ప్రతిఘటన దాడుల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారాను, కోరాపుట్, ఈస్ట్‌లలో జరిగిన అనేక పోరాటాలకు రక్షణ కల్పించడంలోను మంచి పాత్ర నిర్వహించాడు. ఆ నిర్మాణాల్లో రాజకీయాలు చెప్పడంలోనూ, స్థానిక ప్రజలతో మెలగడంలోను ఆదర్శంగా ఉండి పి.ఎల్. కమాండర్‌గా ఎదిగాడు. ఆ తర్వాత ఆర్గనైజేషన్ బాధ్యతలు స్వీకరించి డి.వి.సి.ఎమ్.గా ఎదిగి పార్టీ ఆధారపడే ఒక మంచి కమాండర్‌గా నిలిచాడు.

కామ్రేడ్ కిరణ్ తన పని, అధ్యయనం, ఎదుగుదలలో ఎదుర్కొంటున్న సమస్యలు, అన్యవర్గ ధోరణుల ప్రభావాల గురించి నిర్మాణాల్లో చర్చించడం, తన అభివృద్ధికి కృషి చేయడం ఒక నిరంతర పోరాటంగానే జరిగింది. స్థానిక ఉద్యమం నిర్బంధాలతో పాటు తన గురించి, తన సహచరి గురించి, బావ మధు గురించి అట్లాగే కుటుంబ విషయాల గురించి తనను మొదట గైడ్ చేసిన, తను గార్డుగా వున్న ఎస్.జడ్.సి. కామ్రేడ్‌కు దూరంగా వున్నప్పటికీ ఉత్తరాల ద్వారా వివరంగా రాస్తూ వుండేవాడు. 15 సంవత్సరాల ఉద్యమ జీవితంలో కామ్రేడ్ కిరణ్ ఉద్యమ పథాన ముందే వున్నాడు.

## కామ్రేడ్ బొడ్డు కుందనం (మమత)



శ్రీకాకుళం జిల్లా, మందస మండలం, ఉద్దానం ప్రాంతం, నల్లబొడ్డూరు గ్రామంలో నిరుపేద రైతాంగ కుటుంబంలో జన్మించింది. తనకు ఊహ తెలియని వయస్సులో తల్లి మరణించడంతో తండ్రి మరో పెళ్ళి చేసుకున్నాడు. ఆమెకు ముగ్గురు కొడుకులు. మమతతో కలిసి వారు నలుగురు. కుటుంబానికి వున్న వెనకబాటుతనంతో ఎవరినీ చదివించలేదు తల్లిదండ్రులు.

ఉద్దానం ఏరియా వుద్యమాలకు పుట్టినిల్లుగా విలసిల్లుతున్న రోజులవి. 1969లో పార్టీ సెట్‌బ్యాక్ అయిన ఆ ప్రాంతంలో అనేక విప్లవ గ్రూపులు వున్నాయి. భారతదేశంలో వున్న అన్ని విప్లవ గ్రూపులు ఉద్దానంలో కనిపిస్తాయి. జనశక్తి, ప్రజాపంథా, లిన్‌పియావో, లిబరేషన్ వంటి అనేక గ్రూపులు వాటి కార్యాచరణను కొనసాగిస్తూ వచ్చాయి. వాటికి మితవాద, అవకాశవాద, రివిజనిస్టు భావాలు వున్నప్పటికీ కూడా ఆ ప్రాంతంలో ఏదో ఒక విప్లవ సంబంధ కార్యచరణ అనేది కనిపిస్తుంది. వివిధ గ్రూపులు అక్కడ తమ కార్యాకలాపాలు కొనసాగించడం, ప్రజలు నిరంతరం విప్లవ కార్యక్రమాల్లో కదలడం ఇప్పటికీ కనిపిస్తుంటుంది. ఆనాటికి బలంగా పని చేస్తున్న లిన్‌పియావో గ్రూప్‌లో సాలిన మాధవరావు ప్రజాస్వామిక భావాలతో యువత అభిమానాన్ని చూరగొనేవాడు. అదే క్రమంలో కామ్రేడ్ మమత 13 సంవత్సరాల వయస్సులో సాలిన మాధవరావు పరిచయంతో ఆ గ్రూప్‌లో భాగమయ్యింది. ఉద్దానం ఏరియాలో బహడపల్లి అనే గ్రామంలో మామిడి అపర్ణ 100 ఎకరాల భూస్వామి. వీడు ఆ ప్రాంత ప్రజల మాన ప్రాణాలను దోచుకొని అధికారం చెలాయించేవాడు. అదే సమయంలో లిన్‌పియావో గ్రూప్ ఆధ్వర్యంలో ఆ ఊరి ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా సంఘటితమై వాడి మోసాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారు. అట్లా ఆ గ్రూప్ చేపట్టిన అనేక పోరాటాలలో కామ్రేడ్ మమత భాగస్వామి అయ్యింది. ఆ తరువాత ఆ గ్రూప్‌లో అనేక మార్పులు సంభవించాయి. దాంతో మాధవరావు దాని నుండి విడిపోయి అప్పుడు ఉనికిలో వున్న పీపుల్స్‌వార్ పార్టీలో భాగమయ్యాడు. కామ్రేడ్ మమత కూడా ఆ గ్రూప్ నుండి విడిపోయి మాధవరావు సంబంధాల్లో వుంటూ అనేక భూస్వామ్య వ్యతిరేక పోరాటాలలో పాల్గొంటూ వుండేది. అలా మాధవరావు ద్వారా పీపుల్స్‌వార్ రాజకీయాలతో పరిచయం ఏర్పర్చుకుంది. అనేక మంది ప్రజావ్యతిరేకులను ఎదిరించి ప్రజలను చైతన్యం చేస్తున్న క్రమంలో మాధవరావును భూస్వాములు చంపేసారు. మాధవరావు మరణం కామ్రేడ్ మమతను కలచివేసింది. ఆ తర్వాత అతని స్ఫూర్తితో, పీపుల్స్‌వార్ రాజకీయాలతో 1989లో వృత్తి విప్లవకారిణిగా మారింది.

కామ్రేడ్ మమత పార్టీ సంబంధాల్లో ఉంటూ మహిళా సంఘాలలో పని చేసింది. అందులో భాగంగా పార్టీ నిర్ణయం మేరకు విశాఖపట్నంలోని బిస్కట్ ఫ్యాక్టరీలో కామ్రేడ్ కమల (అమరురాలు అక్కుపల్లి కమల)తో పాటు మహిళలను ఆర్గనైజ్ చేసింది. 1990లో లీగల్ అవకాశాలు రావడంతో పార్టీ బయట అనేక కార్యకలాపాలు నిర్వహించింది. వాటన్నింటిలో కామ్రేడ్ మమత భాగమయింది. అదే సమయంలో పూర్తికాల కార్యకర్తగా టెక్నికల్ రంగంలో పని చేస్తున్న కామ్రేడ్‌ను పెళ్ళి చేసుకుంది. రెండు సంవత్సరాల తర్వాత అతను అనారోగ్యంతో అమరుడయ్యాడు. ఆ సమయంలో తను రహస్యంగా వుంటూ బయట పని చేయలేనని పార్టీతో చెప్పి 1992లో గెరిల్లాదళంలోకి వచ్చింది.

ఉద్దానం ఏరియాలో ఆనాటికి చురుగ్గా పని చేస్తున్న కొండబారెడు దళంలో సభ్యురాలైంది. అక్కడున్న సవర ప్రజలతో కలిసిపోతూ వారి సమస్యలను తెలుసుకునేది. మిలటరీ రంగంలో చురుగ్గా ఎదుగుదల సాధించింది. ఈ క్రమంలో తన మిలటరీ నైపుణ్యాన్ని గమనించి ఆ దళానికి పైలెట్‌గా నిర్ణయించింది. సవర ప్రజల్ని ప్రేమిస్తూ కొండబారెడు దళంలో చాలా క్రియాశీలక పాత్ర పోషించింది.

1992లో అనారోగ్య సమస్యల రీత్యా ఇంటికెళ్ళింది. రెండు సంవత్సరాలు ఇంటి దగ్గరే వున్నది. ఈ క్రమంలో ఇంటివాళ్ళు మరో పెళ్ళి చేసుకొమ్మనీ, ఇంటి దగ్గర ఉండిపొమ్మనీ చెప్పారు. "మీ ఇష్టమైతే ఇంట్లో వుంచుకొండి లేదంటే నేను ఒంటరిగా వుంటాను అంతే కానీ ఇలాంటి సలహాలు ఇవ్వద్దంటూ''

వ్యతిరేకించింది. ఆ తర్వాత పార్టీ సంబంధిత మహిళా సంఘాలలో కార్యాచరణ మొదలు పెట్టింది. ఉద్దానంలోని అనేక గ్రామాలు తిరిగి మహిళలను ఆర్గనైజ్ చేస్తూ పార్టీ రాజకీయాలతో చైతన్యపరిచింది. తను చురుగ్గా పని చేస్తున్న క్రమంలో శత్రు నిఘా పెరిగి 1996లో మళ్ళీ అజ్ఞాతంలోకి అడుగు పెట్టింది.

1996 కొండబారెడు దళంలోనే పని చేస్తూ 98లో ఏరియా కమిటీ (ఎ.సి.)సభ్యురాలిగా ఎదిగింది. ఆ తర్వాత అప్పటికే తనకు మిలటరీ నైపుణ్యం వుండటంతో లోకల్ గెరిల్లా స్క్వాడ్ (ఎల్.జి.ఎస్)లోకి సభ్యురాలిగా చేరింది. ఎల్.జి.ఎస్.లో పని చేస్తూ పలువురు ప్రజా శత్రువులను మట్టుబెట్టడంలో, శత్రువు దాడులలో పాల్గొన్నది. 1999లో ఆమె తిరిగి వివాహం చేసుకుంది.

ఉద్దానం ప్రాంతంలో, కొండబారెడు దళంలో, మిలటరీ రంగంలో, ఈస్ట్ డివిజన్‌లో టెక్నికల్ రంగంలో, సీఆర్‌సీ 3వ కంపెనీలో ఇలా అనేక రంగాలలో కామ్రేడ్ మమత సేవలందించింది. మిలటరీ రంగం విషయానికొస్తే 2001 లక్ష్మిపూర్ ఆంబుష్, పొలాడ్ రైడ్ (10-ఎస్.ఎల్.ఆర్. లు, 1-పిస్టల్ పి.ఎల్.జి.ఎ.స్వాధీనం అయ్యాయి) 2002లో గొట్లబద్ర ఆంబుష్, 2004లో కొరాపుట్ మల్టిరైడ్, 2009లో పాలుర్ ఆంబుష్, 2009లో నాల్కో రెయిడ్ తదితర మిలటరీ చర్యలలో కామ్రేడ్ మమత భాగమయ్యింది.

కామ్రేడ్ మమత తన 25 సంవత్సరాల సుదీర్ఘ విప్లవ జీవితంలో రాజకీయంగా ఎదగడంలో కొన్ని సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ సమిష్టి పనులు, సెంట్రీలు చేయడం, కిచెన్ బాధ్యతలు నిర్వహించడం, సహచర కామ్రేడ్స్‌తో కలిసిపోవడం, ప్రజలతో కలిసిపోవడం, చదువు నేర్చుకునే కృషి, సమిష్టి అధ్యయనం వంటి అనేక పనులలో మంచి పాత్రనే పోషించింది. కొత్తగా వచ్చిన కామ్రేడ్స్‌కు సహకరించడమే కాక ప్రాథమిక విషయాలను రాజకీయంగా అర్థం చేయించేది. ఎ.ఒ.బి. ఉద్యమానికి చెందిన మొదటి తరం మహిళలలో కామ్రేడ్ మమత ఒకరు. ఆడపిల్ల గడప దాటకూడదని భావించే రోజుల్లో కామ్రేడ్ మమత ఇల్లు వదిలి సంఘాలలో పని చేయడమంటే చాలా గొప్ప విషయం. తను మిలటరీ రంగంలో ఎదుగుతున్న క్రమంలో ఆయా ఏరియా మిలీషియాకు మిలటరీ ట్రైనింగ్‌లో తర్ఫీదునందించింది. ఇతరుల తప్పులను ఎత్తిచూపడమే కాకుండా తన తప్పును ఎప్పటికప్పుడు స్వయం విమర్శ చేసుకునేది. పార్టీకి సంబంధించిన విషయాలలో లోపాలున్నట్లుగా భావిస్తే గట్టిగానే కొట్లాడేది. తను అమరురాలయ్యే నాటికి కూడా వయస్సుతో సంబంధం లేకుండా అన్ని పనుల్లో భాగమయ్యింది. క్యాంపుల సమయంలో నాయకత్వం కిచెన్ బాధ్యతలు గురించి ఆలోచించినప్పుడు వారికి మొదట గుర్తుకు వచ్చేది కామ్రేడ్ మమత. నాయకత్వ నిర్ణయం మేరకు అనేక సందర్భాలలో కిచెన్ బాధ్యతలు చేపట్టి వంటలలో డ్యూటీ కామ్రేడ్స్‌తో భాగమవుతూ తన విధిని సమగ్రంగా నిర్వహించేది. పార్టీ పట్ల, పార్టీ రాజకీయాల పట్ల కామ్రేడ్ మమత అచంచల విశ్వాసం కలిగి వుండేది. శత్రు నిర్బంధం పెరుగుతున్న క్రమంలో కూడా పార్టీ పట్ల, పార్టీ రాజకీయాల పట్ల మరింత నమ్మకంతో వుంటూ "ఎప్పటికైనా దేశంలో మన పార్టీ విముక్తిని సాధిస్తుంది, ప్రజలే గెలుస్తారు, ప్రజారాజ్యాన్ని సాధిస్తాం" అని గొప్ప కమిట్‌మెంట్‌ను కనబరిచేది.

కామ్రేడ్ మమత నమ్మకాన్నీ, పార్టీ గెసుస్తదనే తన దృఢసంకల్పాన్ని సాకారం అయ్యేంత వరకు విరామమెరుగక పోరాడుదాం! అమరులు ఎరుపెక్కించిన ఎర్రబాటలను మరింత ఎరుపెక్కిద్దాం!!

### కామ్రేడ్ దాసు (టెక్కు మధు)



కామ్రేడ్ మధు పేద దళిత కుటుంబంలో పుట్టి పేదరికాన్ని వివక్షతను అనుభవించాడు. కుల వివక్షతను, వర్గ అణచివేతను ఎదుర్కొనే క్రమంలో తనే కేంద్రంగా ఒక దళిత యువజన సంఘం నిర్మాణమయ్యింది. అక్కడ అగ్రకుల భూస్వామ్యాన్ని ఎదుర్కోవడం కోసం యువకులకు కర్రసామునేర్పి గురువు అయ్యాడు. గునపాన్ని కర్రలా తిప్పి స్థానిక శతృవుల్లో భయాన్ని పుట్టించాడు. ధైర్య సాహసాలతో కొట్లాటల్లో ముందుండే మధును లక్ష్యంగా పెట్టుకున్న భూస్వామ్య వర్గం పోలీసు కేసులు పెట్టి ఇబ్బందుల పాలు చేసింది. ఈ పరిస్థితుల్లో తనకు లభించిన పరిచయాల్లో నుండి విప్లవోద్యమ సంబంధాల్లోకి వచ్చాడు. భార్యకి అర్థం చేయించినప్పుడు ఆమె కూడా ఉద్యమంలోకి పని చేయడానికి సిద్ధపడటంతో ఇద్దరు చిన్నపిల్లలను కుటుంబీకులకు అప్పజెప్పి శ్రీకాకుళం ఉద్యమంలో భాగమయ్యారు.

కొంతకాలం తర్వాత మధు సహచరి పిల్లల్ని విడిచి ఉండలేకపోయింది. తను ఇంటి దగ్గరే ఉండటానికి నిర్ణయించుకుంది. తను మాత్రం 15 సంవత్సరాల పాటు పిల్లలకు దూరంగా వుంటూనే రాజకీయ పట్టుదలతో విప్లవోద్యమంలో కొనసాగాడు. క్రమంగా చదువు నేర్చుకున్నాడు. విప్లవ సాహిత్యాన్ని నిరంతరం చదవడంతో పాటు అర్థమైన మేరకు చర్చిస్తూ వుండేవాడు. పార్టీ పనులన్నింటిలో భాగమవుతూ ఎ.సి.ఎమ్.గా ఎదిగాడు. మంచి ప్రవర్తన, క్రమశిక్షణ, పట్టుదల కలిగిన మధును అందరూ ఆప్యాయంగా, ప్రేమగా, ఆదర్శంగా గుర్తించి గౌరవించేవాళ్ళు. కామ్రేడ్ మధు ఎస్.జడ్.సి. కామ్రేడ్ మస్తాన్‌రావు (ఎన్.ఆర్)కు గార్డుగా ఎంతో సహకారంగా వున్నాడు. చాలా కాలం పాటు ఆయుధాల తయారీ రంగంలో వుండి గ్రెనేడ్స్, తుపాకులు మొదలైనవి తయారు చేయడంలో నైపుణ్యం సంపాదించాడు. ఏ రంగంలో వున్నా సహచర కామ్రేడ్స్‌కు తనకు తెలిసిన రాజకీయ విషయాలను వివరించడం, పెద్ద దిక్కుగా వుండటం చేసేవాడు. తనకు చెవులు పని చేయకపోవడంతో మిషన్ పెట్టుకునేవాడు. ఆ మిషన్‌కు కూడా ఎప్పుడు ఏదో ఒక సమస్య వస్తూనే వుండేది. అయినప్పటికీ శత్రు నిర్బంధం పెరగడంతో పెట్టక తప్పని పరిస్థితి. నిర్బంధ కారణంగా చాలా కాలంగా భార్యా, పిల్లలు కలవకపోవడం లాంటి సమస్యలను అర్థం చేసుకొని ఓపికగా ఉండటం ద్వారా పార్టీ పట్ల, ప్రజల పట్ల తన అంకిత భావాన్ని

ప్రదర్శించుకున్నాడు. ఆదర్శవంతమైన కామ్రేడ్ మధు ఆచరణ ఒక మంచి నమూనాగా వుండి విప్లవం పట్ల కేడర్‌కు, ప్రజలకు నమ్మకాన్ని పెంచేది. తన ప్రవర్తన ద్వారా అందరి మనస్సుల్లో గాఢమైన ముద్ర వేసిన ఆదర్శ విప్లవ మూర్తి మధు. నాయకత్వం పట్ల విశ్వాసంతో నాయకత్వ రక్షణ బాధ్యతను ఎప్పుడు ప్రథమ కర్తవ్యంగా భావించేవాడు. ఆ కామ్రేడ్‌కు వయసు పెరుగుతున్న రీత్యా కొన్ని పరిమితులు వచ్చాయేగాని కార్మిక వర్గతత్వంలో ఎటువంటి సడలింపులు రాలేదు. 20 సంవత్సరాల పాటు విప్లవ లక్ష్యంతో పోరాడినవాడు. ఎటువంటి భేషజాలు లేని ఉత్తమ కమ్యూనిస్టు.

## కామ్రేడ్ యనమలపల్లి సింహాచలం

**(హరి, మురళి, తాత, రవి)**



విజయనగరం జిల్లా, బొబ్బిలి మండలం, చిన్ననందవలస గ్రామంలో నిరుపేద రైతాంగ కుటుంబంలో కామ్రేడ్ సింహాచలం జన్మించాడు. ఆ కాలంలో 5వ తరగతి వరకు చదువుకున్నాడు. అతని చిన్నతనంలోనే తల్లి మరణించడంతో చదువు మానేసి ఇంటి పనుల్లో తండ్రికి సహకారంగా వుంటూ వ్యవసాయ పనుల్లో సహకరించేవాడు. 18 సంవత్సరాల వయసులో వివాహమయ్యింది. వారికి ఒక కూతురు, ఇద్దరు కొడుకులు కల్గారు. పిల్లలను కష్టపడి చదివించారు.

పోరాటాల నేపథ్యం వున్న ప్రాంతంలో పుట్టి పెరిగిన కామ్రేడ్ సింహాచలం మొదట సి.పి.ఐ(ఎమ్.ఎల్) (పార్టీ యూనిటీ)లో పని చేసేవాడు. కామ్రేడ్ గంటి ప్రసాదం ఆధ్వర్యంలో పని చేసేవాడు. బయటే వుంటూ గంటి ప్రసాదం నాయకత్వంలో అనేక భూపోరాటాలలో పాల్గొన్నాడు. దళితులపై భూస్వాముల అన్యాయాలను అరికట్టాలనే కసితో అనేక మంది ప్రజలను ఐక్యం చేసేవాడు. పాటలలో తనకున్న మక్కువతో జె.ఎన్.ఎమ్.లో పని చేసాడు. దేశవ్యాప్తంగా జరిగిన అనేక మీటింగ్‌లలో జె.ఎన్.ఎమ్. తరపున పాల్గొన్నాడు. కలకత్తా, ఢిల్లీ లాంటి పట్టణాలలో కూడా తన ప్రదర్శనలు ఇచ్చాడు. కోలాటం, బాగోతం వంటి కళా రూపాల్లో తనకు ప్రవేశం వుండేది. వివిధ కళారూపాల ద్వారా పార్టీ పిలుపును ప్రజల్లోకి తీసుకెళ్ళడం వంటి పనులలో కామ్రేడ్ సింహాచలం పాత్ర కీలకమైనది.

పార్టీ యూనిటీ, పీపుల్స్‌వార్‌లు ఏకమైన తర్వాత కామ్రేడ్ సింహాచలం పార్టీ పిలుపునందుకొని తూర్పు కనుమల ఉద్యమంలోకి అడుగుపెట్టాడు. మురళి పేరుతో అక్కడ ప్రజలూ, పార్టీ శ్రేణులకు ఆత్మీయుడయ్యాడు. కొన్నాళ్లకు తన కొడుకును కూడా ఉద్యమంలోకి తీసుకువచ్చాడు. తండ్రీ కొడుకులిద్దరు జె.ఎన్.ఎమ్.లో పని చేస్తూ కువ్వి, తెలుగు ప్రజలను చైతన్యం చేస్తుండేవారు. ఒక నాటిక ప్రదర్శన సందర్భంగా కొడుకు భార్యగా, తండ్రి భర్తగా నటించి రక్తి కట్టించారు. కొన్నాళ్ళకు కొడుకు రాజకీయ బలహీనత కారణంగా పార్టీని వదిలి వెళ్ళిపోయాడు. ఆ పరిణామానికి కామ్రేడ్ మురళి బాధపడ్డాడే గాని అతని విప్లవ దీక్ష కించిత్తు కూడా సడలలేదు. ప్రజా సమస్యల పట్ల సున్నితంగా స్పందించే స్వభావం, సేవా దృక్పథం, చొరవ మూలంగా వ్యవసాయంలో ప్రజలకు తరచూ సూచనలు చేసేవాడు. తన నైపుణ్యాన్ని, అభిరుచిని గమనించిన పార్టీ ఆయనకు వ్యవసాయ రంగ బాధ్యతలు అప్పజెప్పింది.

ఈ రంగంలో పని చేస్తూ ఈస్ట్ డివిజన్ మైనుకోటలో చెక్ డ్యాం కట్టించి, అక్కడి ప్రజలకు నూతన పంటలను పరిచయం చేయడమే కాక దగ్గరుండి పంట పొలాలను తయారు చేయించాడు.

గాలికొండ, మండపల్లి ప్రజలను చూసి అక్కడి ప్రజలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారని గుర్తించి పార్టీ కమిటీలో చర్చించి అక్కడి ప్రజల చేత వేరుశనగ, చిరు ధాన్యాల పంటలు వేయించి, దిగుబడి పెంచడం కోసం సలహాలిచ్చేవాడు. గాలికొండ, పలకజీడి ఏరియాలలో విప్లవ సంస్కరణలలో భాగంగా చెరువులు తవ్వించాడు. బీడు భూములను చదును చేయించి పంట పొలాలు తయారు చేయించాడు. రేవులకోట, పెద్దపల్లి, మండపల్లి, మైనుకోట, గొందికోట, ఈదులబంద, మొదలైన ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో ప్రజలకు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందిస్తూ కొత్త పంటలను పరిచయం చేసాడు. మామిడి మొక్కలను తెప్పించి నాటించాడు. ఎరువుల వాడకం తెలియని ప్రజలకు సేంద్రీయ ఎరువులను పరిచయం చేశాడు.

పార్టీ అవసరాల రీత్యా కామ్రేడ్ మురళి కోరాపుట్-శ్రీకాకుళం డివిజన్‌లోని నారాయణపట్నా ఏరియాకు బదిలీ అయ్యాడు. అక్కడ కూడా ఆయన వ్యవసాయ రంగంలోనే పని చేశాడు. అక్కడి కువ్వి, ఒడియా, తెలుగు ప్రజలతో కలిసిపోతూ వారి సమస్యలను పట్టించుకొనేవాడు. జబ్బులతో, పౌష్టికాహార లోపంతో బాధపడే ప్రజలకు ఆయుర్వేద వైద్యం ద్వారా మందులు ఇచ్చేవాడు.

బొరిగి, నాగులబేడ, మంజరిగూడ వంటి గ్రామాలలో విప్లవోద్యమ నేతృత్వంలో ప్రజలు భూస్వాముల భూములనాక్ర మించుకున్నారు. ఆ భూముల్లో ఏ పంటలు వేస్తే మంచి దిగుబడి వస్తుందో ప్రజలకు చెప్పి ఆ విత్తనాలను తెప్పించి వేయించాడు.

నకిటిపాయ, అమ్లియాంబా, తుర్లి వంటి (పొడపొదర్, తెంతులిపొదర్ పంచాయితీలలో) ప్రాంతాలలో మెట్టభూములే అయినప్పటికీ పార్టీ తీసుకున్న కార్యక్రమాల్లో భాగంగా ఆ భూములను దగ్గరుండి చదును చేయించాడు. ప్రస్తుతం ఆ భూములలో ప్రజలు సంవత్సరానికి రెండు పంటలను పండిస్తున్నారు.

కమిటీ నిర్ణయం ప్రకారం నందపూర్ ఏరియాలోని పందిరిచింత,

వేపలపాడులలో చెక్‌డ్యాంలు నిర్మించి, పొలాలలను తయారు చేయించాడు. ప్రజలకు అందుబాటులో ఔషధ మొక్కలను పరిచయం చేస్తూ నిరంతరం వారి బాగోగులు పట్టించుకునేవాడు.

కామ్రేడ్ సింహాచలం తూర్పు కనుమలలో మురళిగా, నారాయణపట్నాలో హరిగా, నందపూర్‌లో తాతగా, అమరుడయ్యే నాటికి కటాఫ్ ఏరియాలో రవిగా కువ్వి, ఒడియా, తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్రయ్యాడు. తాత జె.ఎన్.ఎమ్.లో పని చేసేటప్పుడు తన వెంట ఎల్లప్పుడూ ఒక కంజెరను పట్టుకునేవాడు. ప్రజల కోసం పాటతో పాటు గజ్జె కట్టి అనేక మంది ప్రజలను ఆకర్షించేవాడు. గాలికొండ, కోరుకొండ ఏరియా కమిటీలలో పాట అనగానే ప్రజలకు గుర్తుకు వచ్చేది కామ్రేడ్ తాతే. నందపూర్‌లోని వల్లపార, కమలతోట గ్రామాలలోని యువతకు సులభమైన బాణీలతో పాటలు నేర్పించేవాడు. పాడటమే కాకుండా వ్యవసాయంపై, రైతులపై, ఆయుర్వేదంపై పాటలు రాసి ప్రజలలో ప్రచారం చేసేవాడు. ఒకసారి ప్రజలకు కొత్త పంటలు నేర్పించాలనే ఆలోచనతో, ఎలాగైనా విత్తనాలు తీసుకురావాలని దళంతో కూడా చెప్పకుండా కొయ్యూరుకు వెళ్ళాడు. అక్కడ పోలీస్ స్టేషన్ వుందన్న విషయం తనకు తెలియదు. వెళ్ళాక అర్థమైంది. కానీ ఏమి చేయలేని పరిస్థితి. “ఎలాగైనా సరే చస్తే చస్తా, వచ్చాను కాబట్టి విత్తనాలు తీసుకొనే వెళతాను” అని ఆలోచించి ఎరువుల దుకాణంకు వెళ్ళి వివిధ రకాల కూరగాయల విత్తనాలను తీసుకొనిపోయాడు. శత్రువు నుండి ఎలాంటి హాని జరగలేదు కానీ దళ కామ్రేడ్స్ విమర్శించారు. “నిజమే నాది తప్పేనని” ఆత్మవిమర్శ చేసుకున్నాడు. దీన్ని బట్టి తనకు ప్రజలపై వున్న ప్రేమను అర్థం చేసుకోవచ్చు. అనేక చోట్ల ప్రజలు వదిలేసిన బీడు భూములని తాత దగ్గరుండి వాటిని చదును చేయించి, పంటలు పండించాడు.

కొంత మంది ప్రజా శత్రువులను మట్టుబెట్టడంలో కూడా కామ్రేడ్ మురళి పాల్గొన్నాడు. తోటి కామ్రేడ్స్‌ను, ప్రజలను ప్రేమించడంలో, వాళ్లతో ఆత్మీయ సంబంధాన్ని నెలకొల్పుకోవడంలో కామ్రేడ్ మురళి తనకు తానే సాటి. కామ్రేడ్ మురళికి తెలుగు తప్ప మరే భాష వచ్చేది కాదు. అయినప్పటికీ ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఏర్పర్చుకోవడానికి అదొక ఆటంకంగా మారలేదు. భాషకు అందని భావ ప్రసారం ప్రజలకూ, తనకూ మధ్య నిరంతరం జరుగుతూనే వుండేది. వయసు పెరిగినప్పటికీ నిరంతరం ఎక్సర్‌సైజ్‌లు చేసేవాడు. కామ్రేడ్ మురళి కొంత కాలం పాటు అనారోగ్యంతో బాధపడుతూ దళం వెంట తిరగలేని పరిస్థితి వుండింది. అ సమయంలో ప్రజల దగ్గర వుండాలని పార్టీ నిర్ణయించి ఒక ఊర్లో పెట్టింది. ఆ సమయంలో ప్రజలు ఆయనను తమ కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ప్రేమగా తాత అని పిలుచుకున్నారు. ఆ పిలుపే ఆ తర్వాతి కాలంలో ఆయన పేరుగా స్థిరపడింది. అనారోగ్యంతో, విశ్రాంతిలో వున్నప్పటికీ ఊరి ప్రజలకు వ్యవసాయంలో అవసరమైన గైడెన్స్ ఇస్తూ, అనారోగ్యంతో బాధపడే ఊరి ప్రజలకు ఆయుర్వేదంతో వైద్యం చేస్తూ ప్రజల ప్రేమాభిమానాలను మరింతగా చూరగొన్నాడు. ప్రజలను ఎంత ప్రేమించేవాడో శతృవుపై అంతే కసితో వుండేవాడు. ప్రజలతో కలిసి పని చేస్తున్న క్రమంలో పలు సందర్భాల్లో శత్రువు నుండి తృటిలో తప్పించుకున్నాడు. మిలటరీ రంగంలో తాత భాగస్వామ్యం ప్రత్యక్షంగా తక్కువే అయినప్పటికీ పరోక్షంగా భాగమయ్యేవాడు. ఒర్ద ఫైరింగ్‌లో శత్రు తూటాలకు ముగ్గురు కామ్రేడ్స్ అమరులయ్యారు. ఆ ఘటనలో కమాండర్ నుండి కాషన్ రాకపోయినప్పటికీ, తను చొరవ చేసి తన దగ్గరున్న గ్రెనేడ్‌ను దూకుడుగా వస్తున్న శత్రు బలగాలపై విసిరాడు. దాంతో వాడు వెనక్కి తగ్గాడు, ఆ సమయంలో మిగిలిన కామ్రేడ్స్ క్షేమంగా రిట్రీట్ అయ్యారు.

ఇలా అనేక రంగాలలో విశేష అనుభవం కలిగిన కామ్రేడ్ మురళి అమరత్వం పీడిత ప్రజలకు తీరని దు:ఖాన్ని కలిగించింది. ఆ కామ్రేడ్ అనుభవాన్ని తుదకంట కొనసాగిద్దాం!

## కామ్రేడ్ యాదమ్మ/భారతి (లత)



కామ్రేడ్ లత మెదక్ జిల్లాలోని ఉల్లితమ్మాయిపల్లి గ్రామంలో పుట్టింది. తండ్రి రైల్వేలో నాల్గవ తరగతి ఉద్యోగి కావడంతో హైదరాబాద్‌లోని లాలాపేటలో స్థిరపడ్డారు. లతకు ఒక చెల్లి, ముగ్గురు తమ్ముళ్ళు ఉన్నారు. కన్నవారు పెట్టిన పేరు యాదమ్మ కాగా పెళ్ళయిన తర్వాత అత్తవారింట భారతిగా పేరు మార్చుకుంది. లతకు 11వ ఏటనే పెళ్ళయింది. 15 వ ఏటనే తల్లయ్యింది. భర్త పీపుల్స్‌వార్ పార్టీ కార్యకర్తగా వెళ్ళడం మొదట్లో లతకు కోపం తెప్పించినా తర్వాత క్రమంగా చైతన్యవంతంగా అర్థం చేసుకొని భర్త ప్రేమించిన ప్రజల్ని, ఉద్యమాన్ని సొంతం చేసుకొని తను కూడా అదే బాటలో నడిచింది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల రీత్యా బీడీలు చుట్టి, సేల్స్ గర్ల్‌గా పని చేసి కుటుంబాన్ని నెట్టుకొచ్చింది. ఆ తర్వాత క్రమంలో మహిళా సంఘ కార్యకలాపాలలో పాల్గొంటూ క్రియాశీల కార్యకర్తగా మారింది. తను చదువుకున్న 10వ తరగతి జ్ఞానంతో నర్స్ ట్రైనింగ్‌తో ఉస్మానియా యూనివర్సిటీ చుట్టూ వున్న బస్తీలు తిరిగి మహిళా హక్కుల గురించి చెబుతూ వైద్య సేవలు అందించింది. ఆ క్రమంలోనే హైదరాబాద్ జిల్లాకు మహిళా సంఘం అధ్యక్షురాలయ్యింది. కుటుంబ బాధ్యతల్లో భాగం పంచుకుంటునే కొడుకును పెద్ద చేసి విద్యా బుద్ధులు నేర్పి పెళ్ళి చేసింది. కొడుకు, కోడలు ఉద్యమ పథంలోనే వుంటూ తల్లిదండ్రుల మార్గాన్ని అనుసరిస్తామని నిర్ణయించుకున్నందుకు లత గర్వపడ్డది.

2011లో వయస్సు పెరిగినప్పటికీ, అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నప్పటికీ ఆశయ సాధనకు అంకితమై కష్ట భరితమైన గెరిల్లా జీవితాన్ని ఎంచుకొని ఎ.ఒ.బి. ఉద్యమంలో భాగం అయ్యింది.

అక్కడ ఒక డాక్టర్‌గా 5 సంవత్సరాల పాటు సేవలందిస్తూ పొడియా, కలిమెల, కటాఫ్ ఏరియాలలోని ప్రజలకూ, విప్లవ శ్రేణులకు అవసరమైన వైద్యసేవలు అందించింది. ఆమె స్వభావంలో భాగమైన ప్రేమ, ఆప్యాయత, సహకార గుణం, సేవా తత్పరత ఈ వృత్తిలో ఆమెకు ఉపయోగాపడ్డాయి. కామ్రేడ్ లత ఓపిక, వినయం, క్రమశిక్షణ కలిగిన ఉత్తమ గెరిల్లాగా, మంచి డాక్టర్‌గా మన్ననలు పొందింది. రాంగూడ సంఘటన సందర్భంగా కామ్రేడ్ లత తన దగ్గర ఆయుధం లేకున్నా నాయకత్వాన్ని రక్షించాలనే బాధ్యతతో నాయకత్వానికి రక్షణ కవచంగా నిలబడుతూ రిట్రీట్ కావడానికి సహకరించింది. కామ్రేడ్ లత జీవిత పయనంలో కష్టాలు తెలిసి నడిచింది. ఉన్నత ఆదర్శంతో ప్రజా వైద్య రంగంలో నిలిచిన మంచి యోధా సైనికురాలు.

## కామ్రేడ్ సుర్జిత్ దర్రో (గౌతమ్)



ఛత్తీస్‌గడ్ రాష్ట్రం, ఉత్తర బస్తర్ డివిజన్, రావ్‌ఘాట్ ఏరియా, కొయిలిబెడ బ్లాక్, కందాడి గ్రామంలో ఆదివాసీ మధ్య తరగతి రైతు కుటుంబంలో దాదాపు 40 ఏళ్ల క్రితం కామ్రేడ్ గౌతమ్ జన్మించాడు. 6వ తరగతి వరకు చదువుకొన్నాడు. పార్టీ, విప్లవ ప్రజా సంఘాలు బలంగా వున్న గ్రామమది. తన కుటుంబం కూడా విప్లవ కుటుంబం. తన తల్లి కె.ఎ.ఎమ్.ఎస్.(క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్)లో చురుగ్గా పని చేస్తూ, ప్రజా విశ్వాసాన్ని చూరగొని, ప్రజలను ఐక్యం చేస్తూ ఆర్.పి.సి. స్థాయి వరకు ఎదిగింది. ఆర్.పి.సి అధ్యక్షురాలిగా, జి.పి.సి. సభ్యురాలిగా క్రియాశీలక పాత్ర పోషించింది. 2013లో తల్లి అమరురాలైంది. కుటుంబ, గ్రామ విప్లవ వారసత్వాన్ని కొనసాగిస్తూ కామ్రేడ్ గౌతం డి.ఎ.కె.ఎమ్.ఎస్. (దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన్)లో సభ్యుడయ్యాడు. సంఘంలో పని చేస్తూనే పొలం పనుల్లో తల్లిదండ్రులకు సహకరించేవాడు. రోజులు గడిచేకొద్దీ సంఘంలోని తన పని విధానం, దాని తాలుకు అభివృద్ధి మెరుగుదలలో పట్టు సాధించాడు. గ్రామంలో ప్రేమాభిమానాలు చూరగొన్నాడు. గ్రామ ప్రజలందరితో చిన్న పెద్ద తేడా లేకుండా కలిసిపోతూ సమస్యలను తీర్చడంలో తన వంతు కృషి చేసేవాడు. ఈ క్రమంలోనే ప్రేమ వివాహం చేసుకున్నాడు.

2000 సంవత్సరంలో విప్లవోద్యమ అవసరాల రీత్యా కామ్రేడ్ గౌతమ్‌ను పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా భర్తీ చేసుకుంది. అప్పటికీ అతని వయస్సు 23 సంవత్సరాలు. తనతో పాటు అతని సహచరి కూడా పార్టీలోకి వచ్చింది. తన జ్ఞానం, చురుకుదనాన్ని గమనించిన పార్టీ 2001లో దండకారణ్యంలోని ఉత్తర బస్తర్ డివిజన్ టెక్నికల్ రంగంలోకి సభ్యుడిగా బదిలీ చేసింది. ఆ రంగానికి సంబంధించిన పనులను చాకచక్యంగా నిర్వర్తిస్తూనే మిగతా సమయాల్లో అధ్యయనం, సమిష్టి పనుల్లో భాగమయ్యేవాడు. రోజులు గడుస్తున్న క్రమంలో తన సహచరి మానసిక వేదనకు గురై ఆత్మహత్మ చేసుకుంది. కామ్రేడ్ గౌతమ్ ఆ వేదన నుండి తేరుకొని తన బాధ్యతల్లో నిమగ్నమయ్యాడు. కొద్ది కాలానికి తన పనిలోని అభివృద్ధిని పరిగణనలోకి తీసుకొని జోన్ టి.డి.లోకి బదిలీ చేశారు. దాదాపు 2 సంవత్సరాలు అక్కడ పని చేసి, టెక్నికల్ రంగంలో మంచి నైపుణ్యాన్ని సంపాదించాడు. అతను టెక్నికల్ రంగంలో ఎదిగే అవకాశాలున్నాయని అంచనా వేసిన ఎస్.జడ్.సి. సెంట్రల్ టెక్నికల్ డిపార్ట్‌మెంట్ అవసరాల కోసం కామ్రేడ్ గౌతమ్‌ను ఎంపిక చేసింది.

2003 నుండి సెంట్రల్ టెక్నికల్ డిపార్ట్‌మెంట్‌లోని భోపాల్ యూనిట్‌లో పని చేశాడు. తన పనిలో భాగంగా వెల్డింగ్ చేయడం, లేత్ మిషన్ నడపడం, తుపాకులకు సంబంధించిన భాగాలన్నింటిని అసెంబ్లింగ్ చేయడం, లేత్ మిషన్‌పైనా వివిధ రకాల భాగాల్ని (కాంపోనెట్స్), స్పేర్స్, టూల్స్ వంటివి తయారు చేయడం నేర్చుకున్నాడు. డి.కె. జోనల్ టి.డి.లో వుండగానే తుపాకుల రిపేరింగ్, అసెంబ్లింగ్ నేర్చుకున్న అనుభవం వుండటంతో తనకు ఇక్కడ చాలా పనులు సులభంగానే నేర్చుకోగలిగాడు. 2007 జనవరిలో పార్టీ అవసరాల రీత్యా వేరే చోటుకు వెళ్లాల్సి వచ్చింది. ప్రయాణంలో వున్న సమయంలో శత్రువు వెంబడించి రూర్కేలా, టాటానగర్ రైల్వేస్టేషన్‌లో అరెస్టు చేసి వరంగల్ జైల్లో పెట్టాడు. పోలీసులు ఎన్ని చిత్రహింసలు పెట్టినా శత్రువుకు తలొంచలేదు. 2009 వరకు జైలు జీవితాన్ని గడిపి, విడుదలైన వెంటనే తిరిగి ఉద్యమంలో భాగమయ్యాడు. పార్టీ అవసరాల రీత్యా ఎ.ఒ.బి. టెక్నికల్ యూనిట్‌లో భాగమయ్యాడు.

కామ్రేడ్ గౌతమ్ తన ఇష్టాయిష్టాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా పార్టీ అవసరాలను గుర్తించి 2010లో ఎ.ఒ.బి. టెక్నికల్ రంగంలో అడుగు పెట్టాడు. అప్పటికే తను ఏరియా కమిటీ సభ్యుడు. అక్కడి టెక్నికల్ యూనిట్ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టి యూనిట్ కామ్రేడ్స్‌కు శ్రద్ధగా, ఓపిగ్గా విషయాలను వివరించేవాడు. జోన్ అవసరాలు తీరుస్తూ మరింత సృజనాత్మకతను సంపాదించాడు. ఏ డివిజన్‌లో పని వున్నా అవసరాన్ని గుర్తించి వెంటనే వెళ్ళేవాడు. ఆ రంగంలో పని చేస్తున్న క్రమంలో వివాహం కూడా చేసుకున్నాడు. ఆయుధాలకు సంబంధించిన పనులే కాకుండా ఎలక్ట్రానిక్, మిలటరీ, కమ్యూనికేషన్ రంగాల్లో కూడా జ్ఞానాన్ని సంపాదించాడు.

కామ్రేడ్ గౌతమ్ ఉత్తర బస్తర్ డివిజన్, డి.కె. జోన్, సెంట్రల్ టెక్నికల్ డిపార్ట్‌మెంట్, ఎ.ఒ.బి టెక్నికల్ రంగం... ఇలా వివిధ చోట్ల పని చేస్తూ, పార్టీ అవసరాలకు అనుగుణంగా సృజనాత్మకతను సంపాదించి ఎదగడంలో తన కృషి గొప్పది. మిలటరీ రంగంలో వివిధ ఆంబుష్‌లలో పాల్గొన్నాడు. నిరంతర అధ్యయనం, సహచర కామ్రేడ్స్‌తో, ప్రజలతో ఐక్యం అవ్వడం, కష్టపడి పని చేయడంలో కామ్రేడ్ గౌతం ఆదర్శంగా వుండేవాడు. నిరంతర కృషితో పార్టీకి ఒక ఆధారపడ తగిన కామ్రేడ్‌గా ఎదిగాడు. 2014లో గౌతమ్

ఇంటికి వెళ్ళాడు. తన తమ్ముడు క్రమశిక్షణా రాహిత్యంగా వున్నాడనీ మందలించడమే కాక ప్రజలందరి ముందే కొట్టి "బుద్ధిగా వుంటూ, పార్టీకి నీకు చేతనైనంత సహకరించమని" హెచ్చరించి వచ్చాడు. పార్టీకి విశ్వాసనీయంగా పని చేయడం అనేది కామ్రేడ్ గౌతమ్ నుండి ప్రతి ఒక్కరు నేర్చుకోవాల్సిందే. క్రమశిక్షణా సూత్రాలకనుగుణంగా మెలగడంలో కామ్రేడ్ గౌతమ్ అందరికీ ఆదర్శంగా నిలిచాడు. తన అమరత్వం ఎ.ఒ.బి. జోన్‌కే కాక పార్టీకే లోటు అనడంలో అతిశయోక్తి లేదు.

**కామ్రేడ్ పృథ్వీ (మున్నా)**



కామ్రేడ్స్ శిరీష-అక్కిరాజు హరగోపాల్‌ల ఏకైక సంతానంగా ఆలకూరపాడులో కామ్రేడ్ పృథ్వీ జన్మించాడు. కామ్రేడ్ శిరీషది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలం, ఆలకూరపాడు గ్రామం. తండ్రి అజ్ఞాత జీవితంలో వుండడం మూలంగా తల్లి పెంపకంలోనే పృథ్వీ పెరిగి పెద్దయ్యాడు. ఇంటర్ వరకూ చదువుకున్నాడు. ఎప్పుడో అరుదుగా కలిసే జీవిత సహచరుడి ఎడబాటును కూడా కొడుకు సాన్నిహిత్యంలోనే పూడ్చుకున్న ఆ తల్లి పంచ ప్రాణాలుగా కొడుకును పెంచుకుంది. తన తండ్రి ఎక్కడ వుంటాడో, ఏం చేస్తాడో, అందరి తండ్రుల వలె నిరంతరం తమతో ఎందుకు వుండడో... బాల్యంలో అంతుచిక్కకుండా వేధించిన ఈ ప్రశ్నలకు సమాధానం దొరికింది పెద్దయ్యాకే. అయితే దొరికిన ఆ సమాధానం అతనిలో మరెన్నో ప్రశ్నలను రేకెత్తించింది. అయితే ఇప్పుడా ప్రశ్నలు వ్యక్తిగతమైనవి కావు. సామాజికమైనవి. ఆ ప్రశ్నలకు తండ్రి మార్గమే సరైన సమాధానమని దృఢంగా విశ్వసించాడు. ఆ మార్గంలో అడుగుపెట్టడానికి మున్నాకు తల్లి మమకారం ఆటంకం కాలేదు.

2008లో నూనూగు మీసాల నూత్న యవ్వనపు తొలి సంధ్యలో దండకారణ్యంలోకి అడుగు పెట్టడంతో తన విప్లవ ప్రస్థానం ప్రారంభమైంది. దండకారణ్య ప్రాంతం ఆనాటికి సల్వాజుడుం విధ్వంసాన్ని చవిచూసి వున్నది. సల్వాజుడుం బీభత్సాన్నీ, దాన్ని ఓడించేందుకు అక్కడి పోరాట ప్రజలు చేసిన వీరోచిత ప్రతిఘటనను కథలు కథలుగా విన్నాడు. మొత్తంగా ప్రజలు నిర్మిస్తున్న త్యాగభరిత చరిత్ర ఆ యువ కిశోరంలో మరింత ఉత్తేజాన్ని నింపింది.

దండకారణ్యం, ఆ తర్వాత ఎ.ఒ.బి.లోని ప్రజలకూ, పార్టీ శ్రేణులకూ మున్నాగా పరిచయమయ్యాడు. తన స్నేహితులు తనను ప్రేమగా మున్నా అని పిలిచేవారట. స్నేహితులను, వాళ్లతో చేసిన అల్లరీ, ఆకతాయితనాలను వదులుకొని, వాటన్నింటికీ భిన్నమైన మార్గాన్ని చైతన్యవంతంగా ఎంచుకొన్న పృథ్వీ బహుశా వాటిన్నింటి తీపి గుర్తుగా తన ముద్దుపేరును పదిలపర్చుకొని వుంటాడు.

కామ్రేడ్ మున్నా చురుకుదనం, తెలివితేటలు, సాంకేతిక పరిజ్ఞానం, ఆసక్తిని గమనించిన పార్టీ అతన్ని మిలటరీ ఇంటెలిజెన్సీలో సభ్యుడిగా నియమించింది. ఒక సంవత్సర కాలం పాటు పని చేసిన తర్వాత పార్టీ అవసరాల రీత్యా ఎ.ఒ.బి.కి బదిలీ అయ్యాడు.

2009లో ఎ.ఒ.బి.లోని, కోరాపుట్-శ్రీకాకుళం డివిజన్, నారాయణపట్నాలో యాక్షన్ టీంలో వుంటూ సి.ఆర్.సి. 3వ కంపెనీలో సభ్యుడయ్యాడు. కొంతకాలం పాటు జన మిలీషియా కమాండర్ బాధ్యతలు నిర్వర్తించాడు. అతి తక్కువ సమయంలో స్థానిక కువ్వి, ఒడియా భాషలు నేర్చుకున్నాడు. సమిష్టి అధ్యయనం నిర్వహించడంలో గానీ, పార్టీ రాజకీయాలను బోధించడంలో గానీ, మిలటరీ తర్ఫీదునివ్వడంలో గానీ మంచి నేర్పరి. మిలీషియా సభ్యులను రాజకీయ కార్యకర్తలుగా తీర్చిదిద్దడంలో కామ్రేడ్ మున్నా పాత్ర క్రియాశీలకమైనది. ఆ కృషి ఫలితంగా 10 మందికి పైగా మిలీషియా సభ్యులు పూర్తి కాలం కార్యకర్తలుగా రిక్రూట్ అయ్యారు.

తన రాజకీయ చైతన్యం, క్రమశిక్షణ, సమర్థతల రీత్యా 2013 జనవరిలో ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యుడిగా పదోన్నతిని పొందాడు. ఆ నిర్మాణంలో వుంటూ మిలిటరీ ఇంటలిజెన్సీ బాధ్యతలను నిర్వర్తిస్తూ, పలు మిలటరీ చర్యల్లో పాల్గొన్నాడు. కొన్ని చర్యలకు తానే నాయకత్వం వహించాడు. కట్నాండ్ ఆంబుష్, ప్రజా ద్రోహి దళారీ బలరాంను ఖతం చేయడం, ప్రజా శతృవులను శిక్షించడం వంటి చర్యల్లో తన పాత్ర ముఖ్యమైనది. 2014 జూన్‌లో మాచ్‌ఖండ్‌లో చేసిన ఆంబుష్‌లో ఒక అసిస్టెంట్ కమాండెంట్‌ను మట్టిగరిపించి మరొకడిని గాయపరిచడం జరిగింది. ఈ చర్యకు కామ్రేడ్ మున్నా కమాండర్‌గా నాయకత్వం వహించాడు.

2014లో ఎమ్.కె.బి. డివిజన్, కటాఫ్ ఏరియా ఎల్.జి.ఎస్. (లోకల్ గెరిల్లా స్క్వాడ్)లోకి కామ్రేడ్ మున్నాను బదిలీ చేయడం జరిగింది. ఎల్.జి.ఎస్.లో పని చేస్తూ ఆర్గనైజర్‌గా కూడా ప్రజలల్లో చెరగని ముద్ర వేసాడు. కటాఫ్‌లో జరిగిన అనేక మీటింగులలో ఒడియా భాషలో ప్రసంగిస్తూ, సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా పాలకుల మోసాలనూ, ముఖ్యంగా బూటకపు సంస్కరణల పేరుతో ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, కేంద్రంలో మోడీ ప్రజలను ఏ విధంగా మోసం చేస్తున్నారో విప్పి చెప్పి ప్రజల మన్ననలు పొందాడు. ఆ ఏరియాలో కూడా మిలీషియా కామ్రేడ్స్‌కు సమిష్టి అధ్యయనం నిర్వహించడంలో, మిలటరీ తర్ఫీదునివ్వడంలో కామ్రేడ్ మున్నా పాత్ర ఎంతో ఉంది. మిలీషియా కామ్రేడ్స్ దళం మకాంకు రాగానే ముందుగా మున్నానే వెతుక్కునే వాళ్లు. వాళ్ళతో

కలిసి వున్నప్పుడు గానీ, వారికి వివిధ రంగాల్లో తర్ఫీదు నిచ్చినప్పుడు గానీ వాళ్ళకు గురువుగా గాక ఒక సన్నిహిత మిత్రుడిలాగే వుండేవాడు.

కామ్రేడ్ మున్నా చదువుకున్న నేపథ్యం నుండి వచ్చినప్పటికీ ఆదివాసీ కామ్రేడ్స్‌లో ఒకడిగా మెలిగాడు. అగ్రనేత కొడుకుగా ఎటువంటి ప్రత్యేకతనూ, గుర్తింపునూ కోరుకోలేదు. తన స్థాయి కామ్రేడ్సందరి వలెనే వంట, సెంట్రీ సహా అన్ని పనులూ చేశాడు, బరువులు మోశాడు. అన్యవర్గ ధోరణులతో పోరాడుతూ కార్మిక వర్గ పుత్రుడిగా తనను తాను మలుచుకున్నాడు.

''నాకు మిలటరీ రంగమంటే ఇష్టం, నన్ను దానికి కేటాయించండి, దాంట్లో మంచి ఫలితాలు సాధిస్తాం'' అని పార్టీకి ప్రతిపాదన పెట్టి ఆ రంగంలో తనన్నట్లుగానే అమరుడయ్యేంత వరకు అనేక దాడులలో విజయం సాధించే వైపుగా తన పాత్రను పోషించాడు.

రాంగూడ వద్ద జరిగిన శత్రు మూకుమ్మడి దాడిని వీరోచితంగా ప్రతిఘటిస్తూ, ఆ దాడి నుండి తన తండ్రితో పాటు ఇతర నాయకత్వ కామ్రేడ్స్‌ను కాపాడే కర్తవ్యాన్ని నెరవేర్చే క్రమంలో తన నవ యవ్వనాన్ని తృణప్రాణంగా అర్పించిన వీర కిషోరం కామ్రేడ్ మున్నా. పోటీ పరీక్షలు, ర్యాంకులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, విదేశీ అవకాశాలు... మొత్తంగా వ్యక్తి ప్రయోజనాలే పరమావధిగా భావిస్తూ, ఆశల పల్లకీల్లో ఊరేగుతున్న నేటి తరానికి భిన్నంగా సామూహిక శక్తికి ప్రతీకలుగా వివేక్, శృతి, సాగర్, సూర్యం, ఆజాద్ ఇప్పుడు మున్నా వేకువను వాగ్దానం చేస్తూ తూర్పుకేసి సాగిపోయారు.

## కామ్రేడ్ గెమ్మిలి కేశవరావు (బిర్సు)



విశాఖ జిల్లా, జి.మాడుగుల మండలం, తాడిపాలెం గ్రామం కామ్రేడ్ బిర్సుది. బతుకుదెరువు కోసం గాలికొండ ఏరియాలోని గర్మిబంద గ్రామానికి వచ్చాడు. ఇతనికి ఇద్దరు తమ్ముళ్లు వున్నారు. పార్టీ ప్రభావం వున్న ప్రాంతం కావడంతో దళం నిర్వహించే మీటింగులకు హాజరయ్యేవాడు. గ్రామ పరిసర ప్రాంతాల్లోకి దళం వెళ్ళినప్పుడు సహకరించేవాడు. ఇతనికి కల్లు వ్యసనం వుండేది. తాగవద్దని ఎంత చెప్పినా వినేవాడు కాదు. 2004లో ప్రభుత్వంతో జరిగిన చర్చల సమయంలో పార్టీకి అనేక విధాలుగా కామ్రేడ్ బిర్సు సహకరించాడు.

2006లో పూర్తికాల కార్యకర్తగా రిక్రూట్ అయ్యాడు. అయితే కొందరు కామ్రేడ్స్ ''ఇతను పార్టీలో వుండడు, కల్లుకు బానిసైన వ్యక్తి ఇక్కడేం వుండగలుగుతాడు, కల్లు మీద వున్న ప్రాణంతో ఏదో ఒక రోజు వెళ్ళిపోతాడు'' అని మొదట్లో అనేవాళ్ళు. కానీ పార్టీ పట్ల కామ్రేడ్ బిర్సులో పెరిగిన విశ్వాసం అతన్ని కల్లుకు దూరం చేయడమే కాదు, ఓ మంచి విప్లవ కార్యకర్తగా మలిచింది. గాలికొండ దళంలో పనిచేస్తూ స్థానిక ప్రజలతో మమేకమయ్యాడు.

పార్టీ అవసరాల రీత్యా ఎస్.జడ్.సి. కామ్రేడ్‌కు కొంతకాలం గార్డుగా పని చేశాడు. నాయకత్వ రక్షణకు ప్రాధాన్యతనిస్తూ తన బాధ్యుడికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించేవాడు. గార్డుగా తన బాధ్యతలను నిర్వహిస్తూనే ఇతర అనేక పనుల్లో భాగమయ్యేవాడు. పార్టీ క్రమశిక్షణను పాటిస్తూ సిద్ధాంత, రాజకీయాలను తెలుసుకునే ప్రయత్నం చేసేవాడు. ఆ తర్వాత ఈస్ట్ డివిజన్ కంపెనీలోకి పార్టీ అతన్ని బదిలీ చేసింది. కంపెనీలో వుంటూ మిలటరీ నైపుణ్యాన్ని పెంచుకున్నాడు. గాలికొండ, కోరుకొండ ప్రజలకు ఆత్మీయుడయ్యాడు. స్థానిక ఆర్గనైజర్‌లా వారి హృదయాల్లో చెరగని ముద్ర వేశాడు. దళం మీటింగులు నిర్వహించినప్పుడు పార్టీ రాజకీయాలను చాలా స్పష్టంగా ప్రజలకు విప్పిచెప్పేవాడు.

జోన్‌లో పి.ఎల్.జి.ఎ. చేపట్టిన అనేక దాడులలో, ప్రజా వ్యతిరేకుల్ని శిక్షించడంలో కంపెనీ సభ్యుడిగా కామ్రేడ్ బిర్సు ప్రత్యేక భూమిక నిర్వహించాడు. ప్రజలను ఎంత ప్రేమించేవాడో శత్రువంటే అంతే కసితో ఉండేవాడు. అనేక ఫైరింగ్‌లలో తప్పించుని తర్వాత మరింత ధైర్యంగా శత్రువును ఎదుర్కొన్నాడు. శత్రువంటే ఓ అడుగు ముందుండేవాడు. శత్రు నిర్బంధం వెంటాడినా ఏనాడు కూడా వెనకడుగు వేయని వ్యక్తి కామ్రేడ్ బిర్సు.

మొదట్లో చదువుకొమ్మని చెప్పినప్పుడు ''చదివితేనే పార్టీలో వుండాలా, వ్యవసాయం చేసేవాడికి చదువొస్తాదా, కూలీ చేసేటోనికి చదువొస్తాదా'' అని వాదించిన వ్యక్తి కొంత కాలానికి తెలుగు నేర్చుకుని పార్టీ సిద్ధాంత, రాజకీయాలను అధ్యయనం చేసేవాడు. ఒడియా, కువ్వి, కోయ, తెలుగు ప్రజలందరితో కలిసిపోతూ అన్ని భాషలు నేర్చుకున్నాడు.

సెంట్రీ, కిచెన్, బరువులు మోయడం, అవసరాల రీత్యా సివిల్ దుస్తుల్లో గ్రామాలకు వెళ్ళడం, ఆంబుష్‌లు, దాడులు ఇలా అన్ని పనుల్లో భాగమవుతూ ఓ ఆదర్శ కమ్యూనిస్టుగా ఎదిగిన వ్యక్తి కామ్రేడ్ బిర్సు. ఏనాడు కూడా ఈ పని చేయలేనని చెప్పిన వ్యక్తి కాదు బిర్సు. ''ప్రజల కోసం గొడ్డులా పని చేయాలి'' అన్న మావో మాటకు కామ్రేడ్ బిర్సు ఒక మంచి ఉదాహరణగా నిలుస్తాడు.

పార్టీ సభ్యుడి నుండి ఎ.సి. స్థాయికీ, ఆ తర్వాత సెక్షన్ కమాండర్‌గా ఎదిగిన బిర్సు పార్టీకి ఆధారపడతగిన కామ్రేడ్ అయ్యాడు. పార్టీ చరిత్రలోనే పెద్ద ఘటన అయిన రాంగూడ ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ బిర్సు శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ శత్రుతూటకు బదులిస్తూ అమరుడయ్యాడు.

## కామ్రేడ్ భీమాల్, రాజేష్

దండకారణ్యంలోని పశ్చిమ బస్తర్ డివిజన్ (ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా), భైరంగఢ్ ఏరియా, మాట్వాడ పంచాయితీ కోత్రపాల్ గ్రామస్తుడు. కామ్రేడ్ రాజేష్ కుటుంబం కట్టెకళ్యాణ్ ఏరియా నుండి కోత్రపాల్ వచ్చి స్థిరపడింది.

సల్వాజుడుంను వీరోచితంగా ప్రతిఘటించిన చరిత్ర కల్గిన గ్రామం కోత్రపాల్. సల్వాజుడుం నాటికి పదమూడేళ్ల బాలుడు కామ్రేడ్ రాజేష్. అయినప్పటికీ సల్వాజుడుం విధ్వంసానికి చలించిపోయి



దాన్ని ఓడించడం కోసం విప్లవోద్యమంలో పూర్తి కాలం పని చేయాలనే సంకల్పంతో దళాన్ని చేరుకున్నాడు. అయితే చిన్న వయసువాడు కావడంతో ఇప్పుడే పూర్తి కాలం కార్యకర్తగా వద్దనీ, కొన్నాళ్ళు మిలీషియాలో పని చేయమని అర్థం చేయించి ఇంటికి పంపించింది దళం.

దళం చెప్పినట్టుగానే మిలీషియాలో చేరిన కామ్రేడ్ రాజేష్ సల్వాజుడుంని ధ్వంసం చేయడానికి జన మిలీషియా వేస్తున్న ఎత్తుగడలలో తాను కూడా భాగమవుతూ అది నిర్వహించిన అన్ని దాడుల్లో పాల్గొన్నాడు. గ్రామ రక్షణ కోసం రాత్రింబవళ్ళు సెంట్రీలు, ఆంబుష్‌లు చేస్తూ ప్రజలను కాపాడడంలో తన వంతు పాత్ర పోషించాడు. 17 మంది సల్వాజుడుం గూండాలను మిలీషియా మట్టి గరిపించిన ఘటనలో కామ్రేడ్ రాజేష్ కూడా పాల్గొన్నాడు.

2006లో దళంలోకి పూర్తికాల కార్యకర్తగా రిక్రూట్ అయ్యాడు. మొదట మద్దేడు ప్లాటూన్‌లో పని చేస్తూ పలు దాడులలో పాల్గొన్నాడు. అదే సమయంలో చేపట్టిన రాణిబోదిలి రెయిడ్‌లో కూడా కామ్రేడ్ రాజేష్ పాల్గొన్నాడు. అన్ని పనుల్లో చురుగ్గా పాల్గొంటూ తనకు తెలియని విషయాలను నేర్చుకునేవాడు. 2007లో కామ్రేడ్ రాజేష్ ఎ.ఒ.బికి బదిలీ అయ్యాడు.

కామ్రేడ్ రాజేష్‌ను బదిలీ సందర్భంగా మాట్లాడినప్పుడు “పార్టీలోకి వచ్చాక పార్టీ అవసరాలే ముఖ్యం, పార్టీ ఎక్కడికి పంపిస్తే అక్కడికి వెళ్ళడమే” అని చైతన్యయుతంగా మాట్లాడాడు. ఎ.ఒ.బిలోని సీఆర్‌సీ కంపెనీ-1లో భాగమయ్యాడు. అతి తక్కువ సమయంలోనే ఆంధ్ర-ఒడిశా కొండలకు అలవాటు పడ్డాడు. కంపెనీలో వుంటూ మిలటరీ తర్ఫీదు పొందాడు. మిలటరీ క్యాంపుల్లో విద్యార్థిగా పాల్గొని కొత్త కొత్త విషయాలను నేర్చుకున్నాడు. ఆ తర్వాత కూడా మిలటరీ పుస్తకాలను అధ్యయనం చేసేవాడు. తెలియని ఇంగ్లీషు పదాలను చొరవగా అడిగి తెలుసుకునేవాడు. మొదట్లో ఇబ్బంది పడ్డా ప్రజలతో మాట్లాడుతూ తెలుగు, కువ్వి, ఒడియా భాషలను నేర్చుకున్నాడు. మిలటరీ రంగం అయినప్పటికీ ఈస్ట్ డివిజన్ ప్రజలతో ఒక ఆర్గనైజర్‌లాగే కలిసిపోతూ మమేకమయ్యేవాడు. 2012లో పి.పి.సి. సభ్యుడిగా పదోన్నతి పొందాడు.

నయాగఢ్ దాడిలో, గునుకురాయి ఆంబుష్‌లో అసాల్ట్ పార్టీలో సభ్యుడిగా వున్నాడు. ఈస్ట్ డివిజన్‌లో కంపెనీ చేపట్టిన అన్ని దాడుల్లో కామ్రేడ్ రాజేష్ మంచి పాత్ర పోషించాడు. శత్రువు డేరాపై దాడి చేసిన సందర్భంలో ఫైరింగ్ చేస్తూ, తూటాలు తగిలి గాయపడిన కామ్రేడ్స్‌ను రిట్రీట్ చేయించాడు. మరో ఫైరింగ్‌లో తనకు తూటా తగిలి గాయపడ్డప్పటికీ ఫైరింగ్ చేస్తూనే రిట్రీట్ అయ్యాడు. శత్రువును ఎదుర్కోవడంలో ఏ మాత్రం వెనకడుగు వేసేవాడు కాదు.

ద్వంద ప్రభుత్వాలు (ఆంధ్ర, ఒడిశా) కుట్ర పన్ని చేసిన రాంగూడ దాడిలో కామ్రేడ్ రాజేష్ శత్రువుతో హోరాహోరిగా పోరాడుతూ రిట్రీట్ అవుతున్న క్రమంలో కాళ్ళు, చేతులకు తూటాలు తగిలి కదలలేని పరిస్థితిలో నేలకొరిగాడు. మిలటరీ రంగంలో రాజేష్ నిర్వహించిన ధైర్యాసాహసాలను నేర్చుకుందాం! రాజేష్ కలలు నిజం అయ్యేంతవరకు పోరాడదాం!

**కామ్రేడ్ బుద్రి**



కామ్రేడ్ బుద్రి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, గంగులూర్ ఏరియా గోర్నం గ్రామంలో 27 సంవత్సరాల క్రితం జన్మించింది. ఆమెకు ఇద్దరు చెల్లెళ్ళు, ముగ్గురు తమ్ముళ్లు. మొదట వీరి కుటుంబం కట్టెకళ్యాణ్‌లో వుండేది. అక్కడ భూస్వాముల దోపిడీ, దౌర్జన్యాలను తట్టుకోలేక, తమకు వున్న భూమిని కూడా భూస్వాములు లాక్కోవడంతో ఆ కుటుంబమంతా గోర్నంకు వెళ్ళిపోయింది. అక్కడే కూలీపనులు చేసుకొని జీవిస్తూ భూమిని కూడా సంపాదించుకున్నారు. ఇంటిల్లిపాది కష్టపడి పొలం పనులు చేసుకుంటూ, వున్న భూమిలో పంటను పండిస్తూ, ఇతరులపై ఆధారపడకుండా జీవితం గడిపేవారు.

అప్పటికే పార్టీ ప్రభావం వున్న ప్రాంతం కావడంతో కామ్రేడ్ బుద్రి మిలీషియాలో సభ్యురాలయ్యింది. పార్టీ అప్పజెప్పిన పనులు చేస్తూనే వ్యవసాయ పనుల్లో తల్లి తండ్రులతోపాటు అన్ని పనుల్లో భాగమయ్యేది. ఇంటికి పెద్దది కావడంతో ఇంటి బాధ్యతల్లో భాగం పంచుకొనేది. ఈ క్రమంలో తన తండ్రిని పోలీసులు అరెస్ట్ చేయడంతో బుద్రిపై ఇంటి భారం పెరిగింది. తల్లికి ధైర్యం చెబుతూనే ఇంటిభారాన్ని మోసింది. తల్లి, చిన్నాన్నల సహాయంతో వ్యవసాయ బాధ్యతలను నిర్వర్తించింది. తన తండ్రిని జైలు నుండి విడిపించుకొని రావడం కోసం గొడ్డును అమ్మినప్పటికీ, డబ్బు చాలకపోవడంతో ప్రజల సహకారంతో కొంత డబ్బు జమ చేసి తండ్రిని జైలు నుండి విడిపించుకోగలిగారు. 2005 సల్వాజుడుంలో తన చిన్నాన్నను

పోలీసులు పట్టుకొని ప్రజలందరూ చూస్తుండగానే చిత్రహింసలకు గురి చేసి చంపారు. ఈ సంఘటన కామ్రేడ్ బుద్రి మనస్సును కలచివేసింది. రాజ్యంపై కసితో మిలీషియాలో మరింత చురుగ్గా పని చేయసాగింది. సల్వాజుడుం పేరుతో రాజ్యం గ్రామాలకు గ్రామాలనే తగులబెట్టడం, ప్రజల ఆస్తులను ధ్వంసం చేయడం, కోళ్ళను, మేకలను ఎత్తుకుపోవడం, కోసుకుతినడం, కనిపించిన వాళ్లను పట్టుకొని హింసించి చంపడం, అరెస్టు చేయడం, మహిళలపై అత్యాచారం చేయడం, దయ్యాలు, భూతాలు పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం వగైరా అఘాయిత్యాలు నెలకొన్న సమయంలో కూడా గ్రామ ప్రజల రక్షణ కోసం నిరంతరం సెంట్రీలలో పాల్గొనేది. ఈ క్రమంలో తన తల్లిదండ్రులు ఊరు వదిలి వెళదామన్నారు. కానీ కామ్రేడ్ బుద్రి "వెళితే మీరు వెళ్ళండి నేను మాత్రం రాను, ప్రజల కోసం పార్టీలో పని చేస్తా, పార్టీలోకి వెళ్తా" అని నిర్మొహమాటంగా చెప్పింది. బిడ్డ మాటలను గౌరవించిన తల్లిదండ్రులు అక్కడే ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో మిలీషియాలో బుద్రి పాత్ర పెరగడం గమనించిన తల్లిదండ్రులు, బంధువులు తను ఎక్కడ దూరమవుతుందోనన్న భయంతో పెళ్ళి చేసుకోమని బలవంతపెట్టారు. కాని బుద్రి ససేమిరా అంది. తనకిష్టంలేని పెళ్ళి చేసుకోనని ధైర్యంగా మనసులోని మాటను చెప్పింది. తన ప్రభావంతో తన తమ్ముడు కూడా మిలీషియాలో సభ్యుడయ్యాడు. తన చెల్లి బాలల సంఘంలో సభ్యురాలిగా చేరింది.

కామ్రేడ్ బుద్రి 2009 డిసెంబర్‌లో విప్లవోద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యింది. 2010 మార్చిలో పార్టీ అవసరాల రీత్యా ఎ.ఒ.బి.కి బదిలీ అయింది. బదిలీ సందర్భంగా ఎ.ఒ.బి. నిర్దిష్ట పరిస్థితులు వివరించి, అక్కడ కొండలు బాగా వుంటాయని బాధ్యులు చెప్పినప్పుడు ఎలాంటి ప్రాంతమైనా వెళ్తాననీ, పార్టీ నిర్ణయానికి కట్టుబడి వుంటానని చైతన్యాన్ని ప్రదర్శించింది. తను మాట్లాడిన విధంగానే ఎ.ఒ.బి.లోని కొండలకు అలవాటు పడింది. ఈ క్రమంలో తనలో మిలటరీ నైపుణ్యాన్ని చూసిన పార్టీ 3వ కంపెనీలోకి పంపింది. అక్కడి ప్రజానీకం కువ్వి తెగకు సంబంధించిన వాళ్లు కావడంతో, భాష విషయంలో మొదట్లో ఇబ్బంది పడ్డప్పటికీ కష్టపడి భాష నేర్చుకుంది. సహచర కామ్రేడ్స్‌తో, ప్రజలతో స్నేహంగా కలిసిపోయేది. సమిష్టి పనుల విషయంలో కచ్చితంగా భాగమయ్యేది. నిరంతరం ఎక్సర్‌సైజ్‌ల్లో పాల్గొనేది. స్కూల్ నేర్చుకోవడానికి ప్రత్యేక కృషి చేసేది. సెంట్రీ బాధ్యురాలిగా వున్నప్పుడు తను అప్రమత్తంగా వుండటమే కాక, తోటి సభ్యులను అప్రమత్తం చేసేది. పెద్ద క్యాంపుల సందర్భంలో కూడా కిచెన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహించేది. సమిష్టి బరువులు మోసే విషయంలో బుద్రి ఆదర్శంగా వుండేది. ఎ.ఒ.బి.లోని పార్టీ చేపట్టిన పలు ఆంబుష్‌లలో, ప్రజా శత్రువులను శిక్షించడంలో కామ్రేడ్ బుద్రి భాగమయ్యేది.

2012లో మళ్ళీ తన తండ్రిని పోలీసులు అరెస్ట్ చేసి చిత్రహింసలకు గురి చేసారు. ఉత్తరం ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న బుద్రి బాధపడిందే గానీ, అధైర్యపడలేదు. పార్టీ రహస్యం చెప్పకుండా తన తండ్రి ప్రదర్శించిన చైతన్యానికి సంతోషపడింది.

2015 ఆగస్టులో కామ్రేడ్ బుద్రి తల్లిదండ్రులను చూడడానికి ఇంటికి వెళ్లేప్పటికి తండ్రి విడుదలై ఇంటికొచ్చాడు. ఒక తమ్ముడు విప్లవోద్యమంలో పూర్తికాలం కార్యకర్తగా చేరాడు. ఈ విషయాలు సంతోషాన్ని కల్గించినప్పటికీ నెల రోజుల్లో పీఎల్‌జీఏలోకి రిక్రూట్ కావల్సిన ఒక చెల్లి, ఒక తమ్ముడు ఇద్దరు అరెస్ట్ కావడం ఆమెను బాధించింది. అయితే ఇదంతా ప్రజలకోసమేనని తల్లిదండ్రులు తనకు అర్థం చేయించిన తీరుకు ఆమె గర్వపడింది.

2016 జనవరి, మద్దేడు ఏరియాలో బుద్రి తమ్ముడు రామ్‌సు పార్టీ అవసరాల రీత్యా వెళ్తున్న క్రమంలో శత్రువు రాకను పసిగట్టి డేరాకు వచ్చి విషయం చెబుదామనేలోపే శత్రు తూటాలకు నేలకొరిగాడు. తమ్ముడి మరణం కామ్రేడ్ బుద్రిని కలచివేసినా ప్రజల కోసం జరిగే ఈ యుద్ధంలో అమరత్వాలు తప్పవని శత్రువుపై మరింత కసితో ముందుకు సాగింది.

2014 మేలో పార్టీ ఆమెను పి.ఎస్-1(ప్రొటెక్షన్ స్క్వాడ్)లోకి బదిలీ చేసింది. పి.ఎస్.లో సెంట్రీ, కిచెన్ ఇన్‌చార్జ్ బాధ్యతల్లో కొనసాగింది. సెక్షన్‌లోని అన్ని రకాల పనుల్లో బాధ్యత కనబరిచేది. నాయకత్వ రక్షణ విషయంలో అప్రమత్తంగా వుండేది. ఇంటికి పెద్దది కావడంతో చిన్నతనంలోనే ఇంటి బాధ్యత చేపట్టిన కామ్రేడ్ బుద్రి పార్టీ పనులను కూడా బాధ్యతగా నిర్వర్తించేది. 2015 జనవరిలో డిప్యూటీ కమాండర్ బాధ్యతలు చేపట్టింది. 2015 అక్టోబర్‌లో కామ్రేడ్ బుద్రిని ఏరియా కమిటీలోకి తీసుకోవడం జరిగింది.

రాంగూడ వద్ద ఆంధ్రా-ఒడిశా పోలీసులు చేపట్టిన భారీ ఆపరేషన్‌లో శతృవుతో హోరాహోరిగా పోరాడుతూ అమరురాలైన కామ్రేడ్ బుద్రికి వినమ్రంగా జోహార్లర్పిద్దాం! పీడిత ప్రజల రాజ్యం కోసం కలలుకన్న కామ్రేడ్ బుద్రి ఆశయాలను ముందుకు తీసుకుపోదాం!!

### కామ్రేడ్ మాడవి ఉంగి (మంజుల)



కామ్రేడ్ మంజుల దండకారణ్యంలోని దర్భా డివిజన్ (ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుకుమా జిల్లా), మలింగేర్ ఏరియా, బర్రెగూడెంలోని నిరుపేద ఆదివాసీ కుటుంబంలో సుమారు 23 సంవత్సరాల క్రితం జన్మించింది. ఆమె తల్లి ఉంగి, తండ్రి మాడివి జోగాల్. ఆమెకు ఒక అక్క, ముగ్గురు చెల్లెళ్ళు వున్నారు. వీరందరి చిన్నతనంలోనే తండ్రి అనారోగ్యంతో మరణించడంతో తన తల్లే కుటుంబ భారాన్ని మోసింది. ఉన్న కొద్ది పాటి భూమిలో తల్లీ పిల్లలు కష్టపడి పని చేస్తూ జీవనం కొనసాగించేవాళ్ళు. కొంత కాలానికి అక్క పెళ్ళి కావడంతో తల్లికి మంజులే ప్రధాన చేదోడు వాదోడైంది. పొలం పనుల్లో, ఇంటి పనుల్లో కీలక పాత్ర పోషించింది. కొడుకులు లేని

లోటు తీరుస్తున్నందున తల్లి మంజులను చూసి సంతోషంగానే కాక ధైర్యంగా వుండేది. ఈ క్రమంలో కామ్రేడ్ మంజులకు దళంతో పరిచయాలు ఏర్పడ్డాయి. వివిధ విప్లవ కార్యక్రమాలలో భాగం కావడం ప్రారంభించింది. క్రమంగా మిలీషియా సభ్యురాలైంది. అందుకు తల్లి బాధపడింది. ఇంటికి పెద్దదిక్కుగా వుండే బిడ్డ ఎక్కడ తనకు దూరమైపోతుందోనని ఏడ్చింది. అయినప్పటికీ మంజుల తన నిర్ణయాన్ని మార్చుకోలేకపోగా మరింత చైతన్యంగా "నేను ఇంటికి దూరమవ్వను, ఇంటి పనులు చేసుకుంటునే మిలీషియాలో పని చేస్తానని" నచ్చజెప్పింది. తల్లికిచ్చిన మాట ప్రకారమే ఇంటిపని చేస్తూనే మిలీషియాలో చురుగ్గా పని చేస్తుండేది. దాడులు సహా మిలీషియా నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో భాగమయ్యేది. కొంతకాలానికి పార్టీ ఆమెను క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘంలోకి బదిలీ చేసింది. మూడు సంవత్సరాలు మిలీషియాలో పనిచేసిన అనుభవం వున్న కామ్రేడ్ మంజుల కె.ఎ.ఎమ్.ఎస్.లో క్రియాశీలంగా పనిచేసింది. మహిళల సమస్యల పట్ల స్పందిస్తూ, పురుషాధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ, మహిళల హక్కుల కోసం చేపట్టిన అన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నది. ఒక సంవత్సరకాలం సంఘంలో పని చేసిన మంజుల పూర్తి కాలం కార్యకర్తగా పి.ఎల్.జి.ఎ.లో చేరుతాననే ప్రతిపాదనను పార్టీ ముందుంచింది. పేదప్రజల కోసం తుపాకీ పట్టి పోరాడాలనే ఆమె చైతన్యాన్ని గుర్తించిన పార్టీ ఆ ప్రతిపాదనను ఆమోదించింది. ఫలితంగా 2011 జూలైలో ఆమె పూర్తికాలపు కార్యకర్త అయింది. అప్పటికే తనకున్న ఉద్యమ అనుభవం, తెలివి తేటలు గమనించి ఇన్‌స్ట్రక్టర్స్ టీంలో నియమించడం జరిగింది.

ఒక సంవత్సర కాలం అందులో పని చేసిన కామ్రేడ్ మంజుల 2012లో ఎ.ఒ.బి.కి బదిలీ అయింది. నాయకత్వ రక్షణ కోసం ఏర్పరిచిన పి.ఎస్-2 (ప్రొటక్షన్ స్క్వాడ్)లో సభ్యురాలయింది. అందులో ఆమె డాక్టర్ బాధ్యతను నిర్వహించేది. రాష్ట్రం వేరు కావడంతో భాష కూడా వేరైంది. కామ్రేడ్ మంజుల కువ్వి, తెలుగు, ఒడియా భాషలను ఉత్సాహంగా నేర్చుకుంది. సమిష్టి పనులు, అధ్యయనం, చదువు, సెంట్రీ... దేంట్లోనైనా ముందుండేది. పార్టీ పని పద్ధతులను ఆచరిస్తూ, సహచర కామ్రేడ్స్‌తో కలిసిపోయేది. తనకు తెలియని విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస కనబరిచేది. తన అభివృద్ధిని గమనించిన పార్టీ 2016 ఆగస్టులో ఆమెను ఏరియా కమిటీలోకి ప్రమోట్ చేసింది.

రాంగూడలో శతృవు మూడంచెల చుట్టువేతలో నిబ్బరంగా హోరాహోరిగా పోరాడుతూ రెండో చుట్టువేతను ఛేదించే క్రమంలో శతృ తూటకు నేలకొరిగింది.

కామ్రేడ్ మంజుల ఏ ఆశయం కోసమైతే తుపాకీ పట్టిందో, ఏ ప్రజలకోసమైతే శత్రువుతో పోరాడిందో ఆ ఆశయాలను, ఆ పోరాటాన్నీ కొనసాగిద్దాం. అమరుల కలలను సాకారం చేద్దాం.

## కామ్రేడ్ నంగాల్ రవ్వా (ఎర్రాల్)

కామ్రేడ్ నంగాల్ దక్షిణ బస్తర్ డివిజన్, పామేడ్ ఏరియా, ఎర్రపల్లి (ఎర్రం) గ్రామంలో దాదాపు 25 ఏళ్ల క్రితం జన్మించాడు. ఎర్రపల్లి ప్రారంభం నుండీ నేటి వరకూ ఉద్యమానికి బలమైన గ్రామం. విప్లవోద్యమ ప్రవేశం తర్వాత ఈ గ్రామంలో క్రమంగా ప్రజా సంఘాలు, మిలీషియా, జనతన సర్కార్లు ఏర్పడ్డాయి. ఆ



ప్రభావంతో చిన్న వయసులోనే కామ్రేడ్ నంగాల్ సీఎన్ఎమ్, మిలీషియాలో భర్తీ అయి పని చేశాడు. సీఎన్ఎమ్‌లో పని చేస్తూ చుట్టు పక్కల గ్రామాలు తిరుగుతూ ఆట, పాట, నాటికలతో ప్రజలను జాగృతులను చేశాడు. మిలీషియాలో పని చేస్తూ జనతన సర్కార్లనూ, ప్రజలను రక్షించడంలో ముందున్నాడు. భూంకాల్ వేటలో పాల్గొని ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ పోలీసుల జాడను పట్టుకొనేవాడు. ఇన్ఫార్మర్లనూ, హంతక ముఠాలను పట్టుకుని శిక్షించడంలో పాల్గొన్నాడు. క్రమంగా తన చైతన్యాన్ని పెంచుకొని 2009లో వృత్తి విప్లవకారుడయ్యాడు. మొదట్లో పామేడ్, పువ్వర్తి ఎల్ఓఎస్ పరిధిలోని గ్రామాల్లో సివిల్ ఆర్గనైజర్‌గా పనిచేశాడు. ఒక సంవత్సరం తర్వాత డివిజన్ కమిటీ నిర్ణయం మేరకు పామేడ్ ఎల్‌జీఎస్‌లో రెండేళ్లు పని చేశాడు. ఆ తర్వాత కామ్రేడ్ నంగాల్ 9వ ప్లటూన్‌లోకి బదిలీ అయ్యాడు. అక్కడ నాలుగేళ్లు పని చేసి, రాజకీయంగా, సైనికంగా అభివృద్ధి చెందాడు. ఆ తర్వాత ఏఓబీకి బదిలీ అయ్యాడు. ఎర్రాల్ పేరుతో అక్కడ ప్రధాన బలగానికి చెందిన సీఆర్‌సీ ప్లటూన్‌లో పీపీసీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించాడు. ఒక సంవత్సరం పాటు అక్కడ పని చేసి పార్టీ, పీఎల్‌జీఏ, ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నాడు.

పూర్తికాలం కార్యకర్తగా ఎనిమిదేళ్ల పాటు విప్లవానికి సేవలందించిన కామ్రేడ్ నంగాల్ పలు సైనిక చర్యలలో క్రియాశీలక పాత్ర నిర్వహించాడు. 2010లో ఊసూర్-ఆవపల్లి రోడ్డుపై పోలీసులపై పీఎల్‌జీఏ దాడి చేసింది. ఈ దాడిలో శత్రువు ప్రయోగించిన టూ ఇంచ్ మోర్టార్ తగిలి కామ్రేడ్స్ బుద్రాం, హడ్మాల్ అమరులయ్యారు. అయినప్పటికీ భయపడకుండా మృత వీరుల శవాలను మోసుకుని రిట్రీట్ అయిన ఘటనలో కామ్రేడ్ నంగాల్‌ది ముఖ్యమైన పాత్ర. 2011లో ఇదే రోడ్డు మీద పోలీసుపై 9వ ప్లటూన్ చేసిన దాడిలో ప్లటూన్ కమాండర్ కామ్రేడ్ హిడ్మాల్ అమరుడయ్యాడు. అయినప్పటికీ కామ్రేడ్ నంగాల్ ఈ దాడిలో దృఢంగా నిలిచి పోరాడాడు. పామేడ్ పోలీసు స్టేషన్ సమీపంలోని హెలిపాడ్ భద్రతకు నియమించబడిన పోలీసు బృందంపై దాడి చేసి ఒక పోలీసును చంపి, ఇద్దరు పోలీసులను గాయపరిచి, ఒక ఎస్ఎల్ఆర్‌ను జప్తు చేసుకున్న చర్యలో కామ్రేడ్ నంగాల్ పాల్గొన్నాడు. పామేడ్, జేగుర్గుండ ఏరియాల్లో జరిగిన అనేక మిలిటరీ చర్యల్లో కామ్రేడ్ నంగాల్ పాల్గొన్నాడు. ట్రాప్స్, బూబీట్రాప్స్ ఏర్పాటు చేసి, ఇన్ఫార్మర్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేసి, ప్రజా వ్యతిరేక పెత్తందార్లను అదుపు చేసి, ఖతం చేసి విప్లవోద్యమాన్ని రక్షించడంలో, బలోపేతం చేయడంలో కామ్రేడ్ నంగాల్ పాత్ర చెప్పుకోతగ్గది. విప్లవోద్యమంలో తన బాధ్యతను నెరవేర్చుతూనే ప్రాథమిక విద్యను అభ్యసించి పార్టీ పత్రికలనూ, డాక్యుమెంట్లనూ చదువుతూ తన రాజకీయ, మిలిటరీ

పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ అభివృద్ధి చెందాడు. క్రమశిక్షణ, కఠిన పరిశ్రమతో నాయకత్వ, పార్టీ శ్రేణుల, ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నాడు.

నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం కోసం ఈ యువ విప్లవకారుడు తన నిండు జీవితాన్ని అర్పించాడు.

**కామ్రేడ్ చిలక (పాయికే)**



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, మన్కిల్ గ్రామంలో నిరుపేద ఆదివాసీ కుటుంబంలో 24 ఏళ్ల క్రితం కామ్రేడ్ చిలక జన్మించింది. అందరిలాగానే తన కుటుంబం కూడా కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడిపేది. ఎంతో కొంత భూమి కూడా వుండటంతో తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సహకరించేది. అప్పటికే పార్టీ ప్రభావం వున్న ప్రాంతం కావడంతో తన అన్న, అక్క పార్టీలో పని చేసేవారు. ఊర్లోకి దళం వచ్చినప్పుడు, మీటింగులు ఏర్పాటు చేసినప్పుడు ఉత్తేజంగా తను కూడా వెళ్ళి చూసేది. ఈ క్రమంలో పార్టీలో వున్న సి.ఎన్.ఎమ్.(చేతనా నాట్య మంచ్)ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాలకు మరింత ఉత్సాహంగా హాజరయ్యేది. సి.ఎన్.ఎమ్. సభ్యులు పాడే పాటలను శ్రద్ధగా నేర్చుకొని, సభల్లో పాడి వినిపించేది. అప్పటికే తన తోబుట్టువులు పార్టీలో వుండటం, తనకు కూడా పాటలపై ప్రత్యేక ఆసక్తి ఏర్పడడం మూలంగా సి.ఎన్.ఎమ్.లో సభ్యురాలిగా చేరింది. సి.ఎన్.ఎమ్.లో పని చేస్తూ చుట్టుపక్కల గ్రామాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించేది. దోపిడీ ప్రభుత్వాల మూలంగా ఆదివాసీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సి.ఎన్.ఎమ్. ప్రదర్శించే కళా రూపాలలో కామ్రేడ్ చిలక పాల్గొనేది. సాంస్కృతిక కార్యక్రమాలపై మక్కువ వుండటంతో నాటికలు, కొత్త పాటలు ఎప్పటికప్పుడు ఆసక్తిగా, ఇష్టంగా నేర్చుకొని ప్రజల ముందు అవలీలగా ప్రదర్శించేది. పార్టీ ప్రభావం పెరుగుతుండటంతో రమణ్‌సింగ్ సర్కార్ పార్టీని మట్టుబెట్టాలని చేపట్టిన సల్వాజుడుం క్యాంపెయిన్‌లో సుకుమా, బీజాపూర్ జిల్లాల ఆదివాసీ ప్రజలు అన్ని రకాలుగా నష్టపోయారు. వున్న కొద్దిపాటి కూడు, గుడ్డ, నీడలను ధ్వంసం చేయడం, హత్యలూ, అక్రమ అరెస్టులూ, మహిళలపై అత్యాచారాలు వంటి అనేక రకాల హింసలకు గురి అయ్యారు. ఈ ప్రజలందరిలాగానే కామ్రేడ్ చిలక కూడా శత్రువు చేపట్టిన సల్వాజుడుంలో అన్ని రకాల హింసలను చవి చూసింది.

కామ్రేడ్ చిలక 2009 డిసెంబర్‌లో పూర్తికాల కార్యకర్తగా విప్లవోద్యమంలో భర్తీ అయ్యింది. 2010 మార్చిలో విప్లవావసరాల రీత్యా కొంతమంది కామ్రేడ్స్‌ని కేంద్రకమిటీ ఎ.ఒ.బి.కి బదిలీ చేసింది. అలా బదిలీ అయిన వారిలో కామ్రేడ్ చిలక కూడా వుంది. ఎ.ఒ.బి.లోని కోరాపుట్‌లో 3వ కంపెనీలోకి తీసుకున్నారు. అక్కడి ప్రజల భాష కువ్వి కావడంతో ప్రారంభంలో ఇబ్బంది పడ్డప్పటికీ పట్టుదలతో కువ్వి భాషను నేర్చుకుంది. దళం గ్రామాలలో మీటింగులు ఏర్పాటు చేసినప్పుడు ప్రజలతో చొరవగా మాట్లాడి కలిసిపోయేది. తాను బదిలీ అయ్యే నాటికే సి.ఎన్.ఎమ్.లో పని చేసిన అనుభవం వుండటంతో దళం నిర్వహించే మీటింగులలో పాటలు పాడేది. పాట ద్వారా గ్రామాలలోని చెల్లెమ్మలకు దగ్గరయ్యేది. దీంతో 3వ కంపెనీలో ఏర్పాటు చేసిన జి.ఎన్.ఎస్.(గొనొ నాట్య సంఘ్)లో కామ్రేడ్ చిలక సభ్యురాలయింది. జి.ఎన్.ఎస్. సాంస్కృతిక కార్యకలాపాల్లో పాల్గొంటూనే పార్టీ చెప్పిన అన్ని పనుల్లో భాగమయ్యేది. పి.ఎల్.జి.ఎ. స్టాండింగ్ ఆర్డర్స్‌లో చెప్పుకునే 9 నియమాల్లో ఒకటైన కమాండర్ కాషన్‌ను ఫాలో అవ్వడంలో కామ్రేడ్ చిలక ఆదర్శంగా వుండేది. కష్టపడడం అనేది తనకు వెన్నతో పెట్టిన విద్య కావడంతో ఎంతటి పనినైనా ఇష్టంగా చేసేది. సమిష్టి పనులు, క్రమశిక్షణతో మెలగడం, స్కూల్ నేర్చుకోవడం, ఎక్సర్‌సైజ్ చేయడం వంటి వాటిలో ముందుండేది. సహచర కామ్రేడ్స్‌తో అవలీలగా కలిసిపోయేది. అన్ని పనుల్లో భాగస్వామ్యమవుతూ చివరికి ఒడియా కూడా నేర్చుకుంది. ఒడిశా ప్రజలతో కలిసిపోవడమే కాక మీటింగులలో ఒడియా పాటలు కూడా పాడేది.

2016 ఆగస్టులో పార్టీ అవసరాల రీత్యా కామ్రేడ్ చిలకను పి.ఎస్-2 (ప్రొటక్షన్ స్క్వాడ్)లోకి పార్టీ బదిలీ చేసింది. ఆమెలోని క్రమశిక్షణ, సైనిక పాటవం, సేవా దృక్పథం రీత్యా కామ్రేడ్ చిలకను పార్టీ ఎస్.జడ్.సి. మెంబర్ కామ్రేడ్ బాకూరి వెంకట రమణ (రాంగూడ ఘటనలోనే అమరుడయ్యాడు)కు గార్డుగా నియమించింది. రెండు నెలల కాలం మాత్రమే అయినప్పటికీ గార్డుగా తన విధిని చాలా అప్రమత్తంగా, చురుగ్గా నిర్వహించింది.

రాంగూడ మూకుమ్మడి దాడిలో గాయాలై కదలలేని స్థితిలో వున్న కామ్రేడ్ చిలకను అక్టోబర్ 28న పోలీసులు పట్టుకొనీ, క్రూరమైన చిత్రహింసలకు గురిచేసి కాల్చి చంపారు.

దండకారణ్యంలో జన్మించిన కామ్రేడ్ చిలక, రమణ్‌సింగ్ సర్కార్ విప్లవోద్యమాన్నీ, ప్రజలను మట్టుబెట్టాలనే లక్ష్యంతో కొనసాగించిన సల్వాజుడుం వ్యతిరేక క్యాంపెయిన్‌లో రాటుదేలి, రాజ్యంపై మరింత కసితో పార్టీలో ఎదుగుతూ, ప్రజల కోసం తృణప్రాయంగా ప్రాణాలర్పించింది. కామ్రేడ్ చిలకకు అరుణారుణ జోహార్లర్పిద్దాం! తను కలలు గన్న పేదల రాజ్యంకై తుదివరకు పోరాడుదాం!! అదే మనం అమరులకిచ్చే నిజమైన నివాళి.

**కామ్రేడ్ సాధూరాం (దాసురాం)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖ జిల్లా, జి.మాడుగుల మండలం, బొయితల్ పంచాయితీ, వాకపల్లి గ్రామంలో నిరుపేద ఆదివాసీ

కుటుంబంలో 22 ఏళ్ల క్రితం కామ్రేడ్ దాసూరాం జన్మించాడు. తనకు ఇద్దరు అక్కలున్నారు. జి.మాడుగులలోని 10వ తరగతి వరకు విద్యనభ్యసించాడు.



కామ్రేడ్ దాసూరాం సమాజంలోని అసమానతలు, బూర్జువా పాలకుల దోపిడీ పీడనలు, ఓట్ల పేరుతో పాలకులు చేసే మోసాలు, కూంబింగ్‌ల పేరుతో నిరంతరం పోలీసులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం, ఎన్‌కౌంటర్ల పేరుతో దారుణ హత్యలకు పాల్పడడం, అక్రమ అరెస్టులు చేయడం, తమ గ్రామంలో 11 మంది మహిళలపై పోలీసులు అత్యాచారం చేయడం వంటి ఎన్నో సంఘటనలు అతని చైతన్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. వాకపల్లి విప్లవోద్యమ ప్రభావం వున్న గ్రామం కావడంతో సహజంగానే విప్లవ రాజకీయాలకు దగ్గరయ్యాడు. ఈ సమాజాన్ని మార్చాలంటే, సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య పాలనను అంతమెందించాలంటే విప్లవమే సరైన మార్గమని నమ్మి బూర్జువా చదువులకు స్వస్తి పలికి విప్లవోద్యమంలో భాగమయ్యాడు.

కామ్రేడ్ దాసూరాం 2014లో విప్లవోద్యమంలోకి పూర్తికాల కార్యకర్తగా వచ్చాడు. మొదట పెదబయలు దళంలో పని చేశాడు. చదువుకున్న వ్యక్తి కావడంతో దళంలో డాక్టర్ బాధ్యతలు అప్పజెప్పారు. డాక్టర్ బాధ్యతలతో పాటు సమిష్టి పనులు, సమిష్టి అధ్యయనం, సెంట్రీలు మొదలైన బాధ్యతలు క్రమశిక్షణతో నిర్వర్తించేవాడు. మిలటరీ రంగంలోని రోజువారి రిహార్సల్స్‌లో పాల్గొనడం, ఎక్సర్‌సైజ్ చేయడంలో మంచి పట్టు సాధించాడు.

కామ్రేడ్ దాసూరాం మిలటరీ రంగంలో చురుగ్గా వుండటంతో డివిజన్‌లోని నిర్వహించిన మిలటరీ క్యాంప్‌లో విద్యార్థిగా పాల్గొన్నాడు. ఆ తర్వాత మరింత పట్టు సాధించాడు. మిలటరీ రంగంలో తన నైపుణ్యాన్ని గమనించిన పార్టీ 2016 ఆగస్టులో ఎల్.జి.ఎస్.లోకి బదిలీ చేసింది. బదిలీ అయ్యే సందర్భంగా పార్టీ తనతో మాట్లాడినప్పుడు, తన ఇష్టంతో సంబంధం లేదనీ, ఉద్యమ అవసరాలే ముఖ్యమంటూ రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించాడు.

గ్రామాల్లోకి వెళ్ళినప్పుడు ప్రజల అనారోగ్య సమస్యల గురించి తెలుసుకొని వారికి వైద్యం అందించేవాడు. కామ్రేడ్ దాసూరాం మంచి గాయకుడు. మీటింగుల సమయంలో పాటలు పాడి ప్రజలను ఆకర్షించేవాడు. పాటతో పాటు ఆదివాసీ సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగమయ్యేవాడు. ప్రజలతో పాటు డాకా, ధింసాలు వేస్తూ వారితో కలిసిపోయేవాడు. సహచర కామ్రేడ్స్‌తో స్నేహంగా వుండటమే గాక చదువురాని దళ కామ్రేడ్స్‌కు చదువు చెప్పేవాడు. తన భాష కువ్వి అయినప్పటికీ ఒడియా కూడా నేర్చుకొని ఒడియా ప్రజలతో స్నేహ సంబంధాలు కొనసాగించేవాడు. గ్రామాలలోని మిలీషియాతో ఐక్యమవుతూ శతృవుపై దాడులు చేసేందుకు వారిని ప్రోత్సహించేవాడు. ఈ క్రమంలోనే కామ్రేడ్ దాసూరాం పార్టీ తనకప్పజెప్పిన కర్తవ్యాలను విజయవంతంగా నిర్వహిస్తూ పార్టీ ఆధారపడదగిన కామ్రేడ్‌గా ఎదిగాడు. రాంగూడలో శత్రువు అకస్మాత్తుగా చేసిన దాడిని తిప్పికొట్టే క్రమంలో మొదటి వరుసలో ఉండి వీరోచితంగ పోరాడి అమరుడయ్యాడు. కామ్రేడ్ దాసూరాం ఆశయాలను తుదకంటా కొనసాగిద్దాం!

**నాచిక సూరి (నరేష్)**



2016, అక్టోబర్ 24వ తేదిన మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియాలో రాంగూడ వద్ద పాలకవర్గాల కిరాయి పోలీసు బలగాలు జరిపిన పాశవిక హత్యాకాండలో, నాయకత్వాన్ని రక్షిస్తూ పోలీసు మూకలతో హెూరాహెూరి పోరాడి అసువులు బాసిన మన ప్రియమైన కామ్రేడ్స్‌లో కామ్రేడ్ నరేష్ కూడా తన నులివెచ్చని నెత్తురు ధారపోసి అమరుడయ్యాడు.

కామ్రేడ్ నరేష్ కొరాపుట్ జిల్లా నారయణపట్నా బ్లాక్, పొడపొదర్ పంచాయితీ, సామన గ్రామంలో నిరుపేద ఆదివాసీ కువ్వి తెగకు చెందిన కుటుంబంలో పుట్టాడు. చిన్న వయసులోనే తల్లి చనిపోయింది. ముగ్గురు అన్నదమ్ముల్లో నరేష్ చిన్నవాడు. తల్లిదండ్రులు పెట్టిన పేరు నాచిక సూరి. తల్లి చిన్నప్పుడే చనిపోవటం వల్ల, తండ్రి మరో మహిళను పెళ్లి చేసుకున్నాడు. అన్నలిద్దరూ పెళ్ళిళ్ళు చేసుకుని వేరువడటం, సవతి తల్లి సరిగా చూడకపోవటంతో, తన పక్క గ్రామంలో తన మేనమామ ఇంట్లో ఉండి పశువులు కాయటం, ఇంట్లో పనులన్నీ చేయటం, ఒక రకంగా వెట్టి (గొత్తి) పని వాడిగా జీవనం గడిపాడు. 2009లో మన పార్టీ నాయకత్వంలో నారయణపట్నా ప్రాంతంలో జరిగిన భూ పోరాటాలు, దళం ఆ ఏరియాలోకి వెళ్ళి, గ్రామ గ్రామాన ఎంతో ఉత్తేజపూరితంగా జరిపిన సభలు, సమావేశాలు, ఆటపాటలు సహజంగానే కా॥నరేష్‌ను ఎంతో ఆకర్షించాయి. బ్రతుకు తెరువు కోసం గ్రామంలో వుండి వెట్టి చాకిరీ చేసి బానిసలాగ బ్రతకటం కన్నా వేరే ప్రాంతాలకు వలస పోయి కూలీపనులు చేసి బ్రతకాలనే ఆలోచనలతో, ఘర్షణ పడుతున్న నరేష్ జీవితంలో మన పార్టీ పరిచయం ఒక మలుపును తిప్పింది. అలా తాను గట్టి పట్టుదలతో ఒక స్థిరమైన నిర్ణయంతో పార్టీ ముందు తాను దళంలో చేరుతానని

ప్రతిపాదన పెట్టాడు. పార్టీ తన ప్రతిపాదనను ఆమోదించి 2009 చివరలో కొంతకాలం మిలిషియాలో పనిచేయించిన తరువాత 2010లో తనను రిక్రూట్ చేసుకున్నది. ఎల్లప్పుడూ ముఖంపై చెదరని చిరునవ్వుతో, ముసిముసిగా నవ్వుతూ వుండే కా॥నరేష్ ఎంతో క్రమశిక్షణతో, నాయకత్వం పట్ల వినయ విధేయతలతో, బాధ్యతలతో, తోటి కామ్రేడ్స్‌తో ఎంతో స్నేహ భావంతో, ప్రజల పట్ల గౌరవ మర్యాదలతో, ఉద్యమం పట్ల అంకిత భావంతో మెలిగేవాడు. తనలో ఉన్న ఈ మంచి లక్షణాలన్నీ గుర్తించిన పార్టీ తనకు 2011లో పార్టీ సభ్యత్వం ఇచ్చి తనను సి.ఆర్.సి. 3వ కంపెనీ కమాండర్‌కు గార్డుగా బాధ్యతలను ఇచ్చింది. కా॥నరేష్ ఎటువంటి శషబిషలు లేకుండా ఎంతో బాధ్యతయుతంగా తన బాధ్యతలు పూర్తయ్యేంత వరకూ గార్డుగా బాధ్యతలు నిర్వర్తించాడు. పట్టుదలగా చదువు నేర్చుకుంటూ, కమాండర్ ఆజ్ఞలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ఎంత కష్ట పరిస్థితులలోనైనా, ఏపని చెప్పినా చేయును, చేయలేనని అనకుండా ఎంతో కష్టపడి పనిచేసి చిన్నవయసులోనే ఆదర్శవంతమైన విలువలు నెలకొల్పాడు.

2015లో తనను గార్డు బాధ్యతలనుండి రిలీవ్ చేసి ఉద్యమ అవసరాల రీత్యా ఎమ్.కె.వి.బి.లోని ఎల్.జి.ఎస్‌లో సభ్యుడిగా పనిచేయాలని పార్టీ చేసిన నిర్ణయాన్ని ఎప్పటిలాగే వెనుకాముందు ఆలోచించకుండా శిరసావహించాడు. పార్టీ అవసరాల రీత్యా ఎక్కడికైనా వెళ్ళి పనిచేయాలనే అంతర్జాతీయతత్వ ఆదర్శాన్ని నిలబెట్టాడు. ఎల్.జి.ఎస్.లో కూడా క్రమశిక్షణాయుతంగా పనిచేసాడు. ఒక సందర్భంలో తన కమాండర్ "దేరాలో డిటోనేటర్స్‌ను చెక్ చేస్తున్నాం. వాటిని పేల్చి చూస్తాం. నువ్వు కొంత దూరం వెళ్ళి అక్కడ ప్రొన్ పొజిషన్‌లో కవర్ తీసుకుని ఉండాలి. మళ్ళీ పిలిచినప్పుడే రావాలి" అని సరదాగా చెప్పి పంపి తిరిగి నరేష్‌ని పిలవడం మర్చిపోయాడు. అప్పుడు కూడా తను కమాండర్ చెప్పినట్లుగా ప్రొన్ పొజిషన్‌లోనే వుండి తిరిగి కమాండర్ పిలించేంత వరకూ అక్కడే వున్నాడు. ఇది సరదాగా జరిగినదే అయినప్పటికీ కమాండర్ ఆదేశాలను తను తు.చ తప్పకుండా పాటిస్తాడు అని చెప్పటానికి ఇది ఒక నిదర్శనం. ఎల్.జి.ఎస్. చేసిన అనేక చర్యలలో, ప్రతిఘటనా కార్యక్రమాలలో తనకు ఇచ్చిన బాధ్యతలను నిబ్బరంగా చొరవగా నిర్వర్తించాడు.

కా॥నరేష్ తనను చిన్నప్పుడు సవతి తల్లి సరిగా చూడకపోయినా ఆమెకు పుట్టిన పాప పట్ల తన సొంత చెల్లెలిగా ఎంతో ప్రేమాభిమానాలతో వుండేవాడు. తనను ఎల్.జి.ఎస్.కు బదిలీ చేసినప్పుడు తన చెల్లెల్ని మాత్రం చూడాలని కోరాడు. అలాగే 2016లో చివరిసారిగా కలిసిన కొరాపుట్ కామ్రేడ్స్‌తో కొరాపుట్ డివిజన్ పరిస్థితిని, ముఖ్యంగా నారయణపట్నా పరిస్థితిని అడిగి తెలుసుకుని ఎంత నిర్బంధం ఉన్నా నారయణపట్నా భూపోరాటాన్ని విడిచిపెట్టవద్దని, నారయణపట్నా ఏరియా ప్రజలందరినీ, గ్రామాలన్నీ కలవాలనీ కోరాడు. అలాగే తన చెల్లికి వాళ్ళ అమ్మ పెళ్ళి చేయటానికి ప్రయత్నిస్తున్నదనీ, తనతో మాట్లాడి తనను పార్టీలోకి తీసుకువస్తే మంచిదనీ చెప్పాడు. ఇదంతా కా॥నరేష్‌లో పెరుగుతున్న గొప్ప కమ్యూనిస్టు చైతన్యానికి నిదర్శనం. ఇటువంటి 22 ఏళ్ళ నూనుగు మీసాల కామ్రేడ్‌ను కోల్పోవటం తీవ్ర నష్టం. కా॥నరేష్ జీవితంలోని ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని అమరుల ఆశయసాధన కోసం పునరంకితమవుదాం.

## కామ్రేడ్ గంగాల్



కామ్రేడ్ గంగాల్ ఒడిశా రాష్ట్రం, మల్కనగిరి జిల్లా, పొడియా ఏరియా, బామ్‌పల్లి పంచాయితీ, శీలకోట గ్రామంలో నిరుపేద ఆదివాసీ కుటుంబంలో జన్మించాడు. శీలకోట గ్రామంలో రైతుకూలీసంఘం, బాలల సంఘం, మహిళా సంఘాలు బలంగా వుండేవి. పార్టీ ఆధ్వర్యంలోనే పాఠశాలలు కూడా నడుస్తుండేవి. అనేక మంది భూస్వాములను ప్రజాకోర్టులో పెట్టి శిక్షించిన చరిత్ర గల ప్రాంతం పొడియా. పార్టీ ఆధ్వర్యంలో భూమిలేని నిరుపేదలకు భూములను పంచిన చరిత్ర కూడా ఉంది. పార్టీ ఆధ్వర్యంలో పలు విప్లవ సంస్కరణలు ఆ ప్రాంతంలో అమలయ్యాయి. పలు ప్రజా సమస్యలపై పోరాటాలు జరిగాయి. వీటన్నింటి ప్రభావం కామ్రేడ్ గంగాల్‌పై చిన్ననాటి నుండే వుండేది. తన తమ్ముడు, అన్న కూడా విప్లవ సంఘాల్లో పని చేస్తారు.

కామ్రేడ్ గంగాల్ ఊహ తెలిసాక బాలల సంఘంలో చేరాడు. బాలల సంఘంలో పని చేస్తూ ఇంటి పనుల్లో, వ్యవసాయ పనుల్లో భాగమయ్యేవాడు. ఆ తర్వాత మిలీషియాలోకి మారాడు. మిలీషియాలో పని చేస్తూ గ్రామ రక్షణ కర్తవ్యాలతో పాటు బ్యానర్లు వేయడం, పోస్టర్లు అతికించడం వంటి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. పార్టీ పరిసర ప్రాంతాల్లోకి వెళ్ళినప్పుడు దళానికి సహాయ సహకారాలు అందించేవాడు. 2014లో పూర్తికాల కార్యకర్తగా భర్తీ అయ్యాడు. అప్పటికి తన వయస్సు 18 సంవత్సరాలు.

2014లో కలిమెలలో స్థానిక దళంలో వుంటూ ప్రాథమికమైన మిలటరీ నైపుణ్యాలను నేర్చుకున్నాడు. దళ కామ్రేడ్స్ అందరితో ఒక మిత్రుడిలా కలిసిపోతూ తెలియని అనేక విషయాలను చొరవగా తెలుసుకునేవాడు. పార్టీ క్రమశిక్షణను తూ.చ తప్పక పాటిస్తూ నాయకత్వ విశ్వాసాన్ని చూరగొన్నాడు. కామ్రేడ్ గంగాల్ పనిపద్ధతులను గమనించిన పార్టీ 2015 ఆగస్టులో సి.సి. కామ్రేడ్‌కు గార్డుగా నియమించింది.

గార్డుగా తన విధిని నిర్వహిస్తూ స్కూల్, సెంట్రీలు, సమిష్టి అధ్యయనం, సమిష్టి పనులు వంటి అన్నింటిలో భాగమయ్యేవాడు. నాయకత్వ రక్షణ పట్ల చాలా అప్రమత్తంగా వుండేవాడు. కోపం, భయం వంటివి తెలియని వ్యక్తి కామ్రేడ్ గంగాల్. ఎప్పుడు చూసినా నవ్వుతూనే వుండేవాడు. చదువు రాకపోవడంతో మొదట్లో ఇబ్బందికి గురయ్యేవాడు. ఆ తర్వాత నేర్చుకునే కామ్రేడ్స్‌ను చూస్తూ కష్టపడితే దేనినైనా సాధిస్తాం అనే పట్టుదలతో ఆదమరవక నేర్చుకునేవాడు. కమాండర్ కాషన్‌ను తూ.చ తప్పక పాటించేవాడు.

ఎన్‌కౌంటర్ జరిగే సమయానికి కామ్రేడ్ గంగాల్ సెంట్రీలో వున్నాడు. శత్రు దాడి మొదలు కాగానే నాయకత్వాన్ని రక్షించడం కోసం సెంట్రీ పోస్టు నుండి డేరాకు పరుగెత్తుకొచ్చాడు. ఆదే సమయంలో పూర్తిగా డేరాను స్వాధీనం చేసుకున్న శత్రు బలగాలు కామ్రేడ్ గంగాల్‌ను డేరాలోనే పట్టుకొని చిత్రహింసలు పెట్టి, గాయపర్చి, దారుణంగా కాల్చి చంపేసారు. వాడు ఎన్ని చిత్రహింసలు పెట్టినా నాయకత్వం గురించిగానీ, పార్టీ గురించి గానీ ఏమాత్రం పెదవి విప్పకుండా రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించి ఆదర్శప్రాయుడిగా నిలిచాడు.

**కామ్రేడ్ రజిత (శాంతి)**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖ జిల్లా, పెదబయలు ఏరియా, ఇంజేరి పంచాయితీ, నానబరి గ్రామం కామ్రేడ్ రజితది. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన కామ్రేడ్ రజిత బంధువుల దగ్గర పెరిగి పెద్దదైంది. వాళ్ళింట్లో ఒక వ్యక్తిలా వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ జీవనం కొనసాగించింది. చిన్నప్పుడే తల్లిదండ్రుల ప్రేమకు దూరమైన రజిత దళ కామ్రేడ్స్ దగ్గర ఆ ప్రేమను పొందింది. ఆ విధంగా వారికి దగ్గరైంది. దళ మీటింగులకు వెళ్తూ, విప్లవ కార్యక్రమాల్లో భాగమయింది. చిన్నప్పటి నుండి ఆమెకు ఫిట్స్ సమస్య వుండేది. అయినప్పటికీ ఆమె ఏ మాత్రం అధైర్యపడకుండా దళంలోకి వస్తానని ప్రతిపాదించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. “ఆరోగ్యం బాగుండదు కనుక నీవు ఇంటి దగ్గరే వుంటూ నీ వంతు సహకారం అందించు, దళం పరిసర ప్రాంతాల్లోకి వచ్చినప్పుడు వచ్చి కలుస్తుండు, నిరంతరం నడక, ఎత్తయిన కొండలు, ఎక్కడం దిగడం కష్టం కాబట్టి వద్దు” అని దళ కామ్రేడ్స్ చెప్పారు. కానీ ఆమె నిర్ణయాన్ని మార్చుకోలేదు. చనిపోయినా సరే దళంలో చేరుతాననీ, శక్తి మేరకు పని చేస్తానని నిబ్బరంగా తన మనస్సులో మాటను పార్టీకి చెప్పింది.

2013లో పెదబయలు దళంలోకి పూర్తికాల కార్యకర్తగా రిక్రూట్ అయ్యింది. సెంట్రీ, సమిష్టి అధ్యయనం, చదువు, నడక అన్నింటికీ అతి తక్కువ సమయంలోనే అలవాటు పడింది. అప్పుడప్పుడు అనారోగ్యం కొంత ఇబ్బందికి గురి చేసినప్పటికీ, వెంటనే దాని నుండి తేరుకొనేది. మితభాషి అయిన కామ్రేడ్ రజిత పార్టీ క్రమశిక్షణను ఎవరు ఉల్లంఘించినా సహించేది కాదు. పార్టీ నియమాలను తను తూ.చ. తప్పక పాటించేది.

2015 ఆగస్టులో కామ్రేడ్ జ్యోతితో పాటు రజిత కూడా కటాఫ్ దళానికి బదిలీ అయ్యింది. కటాఫ్ దళంలో వుంటూ మొదట్లో ఒడియాతో ఇబ్బంది పడినా తరువాత నేర్చుకునే ప్రయత్నం చేసేది. కమాండర్ కాషన్ పాటిస్తూ దళంలోని అందరితో క్రమశిక్షణగా మెలిగేది. తాను పార్టీలోకి వచ్చినప్పటికన్న కటాఫ్ ప్రాంతానికి మారాక సహచర కామ్రేడ్స్‌తో మాట్లాడటం పెంచుకుంది. తనకు తెలియని విషయాలు ఇతరులను అడిగి తెలుసుకునేది. భాష నేర్చుకుంటూ ప్రజలతో మాట్లాడే ప్రయత్నం చేసేది. అనారోగ్యం వున్నప్పటికీ బరువులు మోయడంలో, నడకల్లో ఎలాంటి ఇబ్బంది పడేది కాదు.

రాంగూడ ఘటనలో శతృవు తూటకు తూటాను బదులిస్తూ వీరోచితంగా ప్రతిఘటిస్తూ రిట్రీట్ అవుతున్న సమయంలో 31 మంది కామ్రేడ్స్‌తో పాటు కామ్రేడ్ రజిత కూడా అమరురాలైంది. కామ్రేడ్ రజిత ఏ పీడిత ప్రజల ఆశయం కోసం పార్టీలో అడుగుపెట్టిందో, ఆ పీడిత ప్రజల ఆశయా కృషిలో కొనసాగుదాం! రజిత నడిచిన దారులను మరింత ఎరుపెక్కిద్దాం!!

**కామ్రేడ్ జ్యోతి**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖ జిల్లా, పెదబయలు ఏరియా, ఇంజెరి పంచాయితీ, గునలోవ గ్రామంలో నిరుపేద ఆదివాసీ కుటుంబంలో 18 ఏళ్ల క్రితం కామ్రేడ్ జ్యోతి జన్మించింది. తల్లిదండ్రులిద్దరూ తాగుడుకు బానిసలై కుటుంబాన్ని పట్టించుకునే వాళ్ళు కాదు. కష్టకాలంలో వున్న తన కుటుంబం కోసం ఏం చేయాలో దిక్కు తోచేది కాదామెకు. వయస్సు పెరిగే కొద్దీ కుటుంబం గురించి ఆలోచించడం పెరిగిందామెలో. “బతకాలంటే ఏదో ఒక పని చేయాలి” అని ఆలోచించి తన తోటి అమ్మాయిలతో కూలీ పనులకు వెళ్ళేది. ఊహ తెలిసిన వయస్సు నుండే కష్టాల మార్గంలో నడవక తప్పలేదు. విప్లవోద్యమ ప్రభావం బలంగా వున్న గ్రామం కావడంతో దళంతో ఆమెకు పరిచయం ఏర్పడింది. దళం వచ్చినప్పుడు బియ్యం, కర్రలు, వంట సామాగ్రి మొదలైనవన్నింటినీ సమకూర్చి పెట్టడంలో తన వంతు పాత్ర పోషించేది. దళం జరిపే మీటింగులు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఆకర్షితురాలై దళంలోకి పూర్తికాల కార్యకర్తగా భర్తీ అయ్యింది.


2013 చివరలో కామ్రేడ్ జ్యోతి విప్లవోద్యమంలోకి అడుగు పెట్టింది. తమ ఏరియాలో వున్న పెదబయలు దళంలో సభ్యురాలిగా నియమించబడింది. సెంట్రీలు, సమిష్టి పనులు, సమిష్టి అధ్యయనంలో పాల్గొంటూ చదువు నేర్చుకోవడంలో మక్కువ కనబర్చేది. తెలియని విషయాలను అడిగి తెలుసుకునేది. దళ

కామ్రేడ్స్‌తో సన్నిహితంగా కలిసిపోవడంలోనూ, కమాండర్ కాషన్ ఫాలో అవడంలోనూ, బరువులు మోయడంలోనూ ఆదర్శంగా వుండేది.

2015లో ఆగస్టులో పార్టీ అవసరాల రీత్యా కటాఫ్ దళానికి బదిలీ అయ్యింది. కటాఫ్ దళంలో పని చేస్తూ, ప్రజల భాష ఒడియా రాకపోయినప్పటికీ ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ ప్రజల నుండే ఒడియా భాషను నేర్చుకున్నది. అవసరాల రీత్యా గ్రామాల్లోకి వెళ్ళినప్పుడు వేష, భాషల్లో ఏప్రత్యేకత కనిపించకుండా ప్రజల్లో కలిసిపోయేది. గ్రామాలలోని తన వయస్సు గల చెల్లెమ్మలతో సన్నిహిత సంబంధాన్ని కొనసాగిస్తూ వారి సమస్యలను తెలుసుకోవడమే గాక తనకు తెలిసిన విప్లవ రాజకీయాలను బోధించేది. కల్మషంలేని చిరునవ్వుతో ఆమె మోహం నిరంతరం వెలుగుతూ వుండేది.

ఆంధ్రా, ఒడిశా దోపిడీ ప్రభుత్వాలు జరిపిన జాయింట్ ఆపరేషన్ (రాంగూడ దాడి)లో కామ్రేడ్ జ్యోతి శతృవును ఎదుర్కొంటూ ముందుకెలుతున్న క్రమంలో ఒక కొండ నుండి మరో కొండకు దాటేటప్పుడు పోలీసు మూకలు జరిపిన కాల్పుల్లో అమరురాలయ్యింది. కామ్రేడ్ జ్యోతి ఆశయ సాధనలో అడుగులు వేస్తూ ముందుకు కదులుదాం!

**కామ్రేడ్ మాడవి లక్కె (కమల)**



దండకారణ్యంలోని దక్షిణ బస్తర్ డివిజన్ (ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుకుమా జిల్లా)లో హలిగొండ గ్రామంలోని నిరుపేద ఆదివాసీ కుటుంబంలో 19 ఏళ్ల క్రితం కామ్రేడ్ కమల జన్మించింది. ఆమెకు ఒక చెల్లి, ఇద్దరు తమ్ముళ్లున్నారు. చిన్నతనంలోనే తన అమ్మా, నాన్న ఇద్దరూ అనారోగ్యంతో మరణించారు. మొదట వీరి కుటుంబం దర్భా డివిజన్‌లో వుండేది. అయితే భూమి లేకపోవడంతో కూలీ చేసుకొని బతకడం దిన దిన గండంగా మారింది. ఆ సమయంలో తన తాత, నాన్నమ్మలు దక్షిణ్ బస్తర్ హలిగొండకు వలస వచ్చారు. హలిగొండలో కొంత భూమి సంపాదించుకొని వ్యవసాయంతో జీవనం కొనసాగించేవాళ్ళు. తల్లిదండ్రులను కోల్పోవడంతో చిన్నతనంలోనే కమల ఆ ఇంటికి పెద్ద దిక్కయింది. అతి చిన్న వయసులోనే ఇంటిపనీ, వ్యవసాయం పనీ, తోబుట్టువుల పెంపకం... ఇలా మోయలేని భారాన్ని నెత్తినెత్తుకుంది. అయినా అధైర్యపడలేదు. కూలీ పనులు చేస్తూ చెల్లినీ, తమ్ములను పోషించింది. కూలీ దొరకనప్పుడు అడవిలో దొరికే ఆకుకూరలు, దుంపలు వంటివి తెచ్చి, సంతలో అమ్మి కుటుంబాన్ని ఈదింది. అతి చిన్న వయస్సులోనే అమ్మనాన్నల పాత్ర పోషించడమే కాక, అన్ని కష్టాలను చవిచూసింది కామ్రేడ్ కమల.

హలిగొండ గ్రామానికి పార్టీ సంబంధాలు వుండటంతో దళం రాకపోకలు, మీటింగులు నడిచేవి. గ్రామంలో పార్టీ సంఘాలుండేవి. పెద్దాల్ల ఆధిపత్యం, భూస్వాముల బెదిరింపులు వంటి అరాచకాలను ప్రత్యక్షంగా చూసిన కమలకు దళం చెప్పే మాటలు ఆలోచింపజేసాయి. ప్రజల సహకారంతో దళం భూస్వాములను శిక్షించడం, ప్రజా వ్యతిరేకులను నిలదీయడం వంటి సంఘటనలు ఆమెను ఉత్సాహపరిచాయి. ఆ ప్రభావంతో తోటి మిత్రులతో పాటు తాను కూడా బాలల సంఘంలో చేరింది.

2013లో కామ్రేడ్ కమల క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్‌లో సభ్యురాలయ్యింది. మహిళలపై జరిగే హింసకు నిరసనగా సంఘం చేపట్టే అన్ని కార్యక్రమాలకు హాజరయ్యేది. తమ గ్రామ స్థాయి సంఘ కార్యకలాపాల్లో పాల్గొనడమే కాకుండా, వివిధ సందర్భాలను పురస్కరించుకొని పార్టీ ఇచ్చే పిలుపులను చుట్టుపక్కల గ్రామాల్లో ప్రచారం చేయడంలో కామ్రేడ్ కమల ముందుండేది. తన సహచర కామ్రేడ్స్‌తో కలిసి నిరంతరం పార్టీ పనుల్లో నిమగ్నమయ్యేది.

కామ్రేడ్ కమల డిసెంబర్ 2015లో పూర్తికాల కార్యకర్తగా పార్టీలోకి భర్తీ అయ్యింది. ఈ క్రమంలో తన కార్యాచరణను చూపిన పార్టీ తన పని గురించి చర్చించి లోకల్‌గా పని చేయాలని ప్రతిపాదించింది. "ఇన్ని రోజులు ఇక్కడ పని చేశాను. ఇక చాలు, వేరే రాష్ట్రానికి పంపండనీ, ఎంత కష్టమైన ఫరవాలేదని" తన మనసులో మాటను పార్టీ ముందుంచింది. ఆమె ప్రతిపాదనను దృష్టిలో వుంచుకొని 2016 ఏప్రిల్‌లో పార్టీ ఆమెను ఎ.ఒ.బి.కి బదిలీ చేసింది.

ఎ.ఒ.బి.లోని నాయకత్వ రక్షణ రీత్యా కామ్రేడ్ కమలను పి.ఎస్-2 (ప్రొటక్షన్ స్క్వాడ్)లోకి తీసుకోవడం జరిగింది. ఒడిశా ప్రాంతం కావడంతో భాష విషయంలో ఇబ్బంది పడ్డప్పటికీ ఒడియా నేర్చుకునే ప్రయత్నం చేసింది. కిచెన్ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతూ సెంట్రీ, సమిష్టి, అధ్యయనం, ఎక్సర్‌సైజ్ కార్యకలాపాల్లో శక్తిమేరకు పాల్గొనేది. సహచర కామ్రేడ్స్‌తో కలిసిపోయేది.

రాంగూడ వద్ద శత్రువు చేసిన భారీ దాడిలో శతృవుతో పోరాడుతూ కామ్రేడ్ కమల నేలకొరిగింది. కామ్రేడ్ కమల కలలు గన్న సమాజ సాధనకై తుదకంటా పోరాడుదాం.

# మిలీషియా కామ్రేడ్స్



కామ్రేడ్ సిందే (ముకుడుపల్లి)



కామ్రేడ్ దాసు (దకడపాదర్)



కామ్రేడ్ సోమల (సిమిలిపాదర్)



కామ్రేడ్ లక్ష్మణ్ (దకడపాదర్)



కామ్రేడ్ జోమ్మి (బచ్చలపాదర్)



కామ్రేడ్ జయరాం (కొజూర్‌గూడ)



కామ్రేడ్ కొములు కొజూర్‌గూడ)



కామ్రేడ్ కమల (బచ్చలపాదర్)



కామ్రేడ్ కావేరిమొదిలి (దకడపాదర్)

54వ పేజీలో...

# టుడువ అమరులకు జోహార్లు

## నారాయణపట్నా భూపోరులో వికసించిన ఎర్ర నక్షత్రం

# కామ్రేడ్ కౌంత(పద్మ)కు జోహార్లు!

2017 మార్చి,9వ తేదీన నారాయణపట్నా ఎ.సి. పరిధిలోని లక్ష్మీపూర్ ప్రాంతంలో టుడువ అనే గ్రామం వద్ద ఒక ద్రోహి ఇచ్చిన నిర్దిష్ట సమాచారంతో పోలీసులు తెల్లవారుజామున దళంపై చేసిన సర్‌ప్రైజ్ దాడిలో కామ్రేడ్ పద్మ అమరురాలైంది.

కామ్రేడ్ పద్మ కొరాపుట్ జిల్లా నారాయణపట్నా బ్లాక్ కుంబరి పంచాయితీ దండాబడి అనే గ్రామంలో కువ్వి ఆదివాసీ కుటుంబంలో జన్మించింది. ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం తల్లిదండ్రులు సారా తాగి తనకు చిన్నప్పుడే పెళ్ళి చేసి పంపించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు బృంది. తల్లిదండ్రులు చేసిన పెళ్ళితో అత్తగారింటి కెళ్ళిన పద్మకు భర్త తాగుబోతు, పైగా తనకు పిల్లలు కలగడం లేదనే కారణంగానే రెండు సంవత్సరాలకే తనను విడిచిపెట్టాడు. తను తిరిగి వచ్చి తన తల్లిదండ్రులతోనే వుంటున్న క్రమంలో నారాయణపట్న బ్లాక్‌లోని బొరిగి పంచాయితీలో ఆదివాసీ యువజన సంఘం నాయకుడిగా, ఆదివాసీ ప్రజల సమస్యలపై, సుండిలు చేస్తున్న ఆరాచకాలకు, సారాకు వ్యతిరేకంగా పోరాడుతూ ప్రజా నాయకుడిగా పని చేస్తున్న ఆరిక నారాయణ అనే వ్యక్తితో తనకు పరిచయమయ్యింది. అప్పటికే అతనికి పెళ్ళయి భార్య వున్నప్పటికీ అతను చేస్తున్న కార్యక్రమాల పట్ల, ప్రగతిశీల భావాల పట్ల ఆకర్షితురాలయ్యి అతనికి రెండవ భార్యగా బొరిగి ప్రాంతంలోకి కంబివలస గ్రామానికి వచ్చింది. ఆనాటి నుండి భర్తకు తోడుగా అతను చేసే అన్ని కార్యక్రమాల్లోనూ తను భాగస్వామి అయ్యింది. అలా ఆ ప్రాంతంలోని సుండి భూస్వాముల, షావుకార్ల దౌర్జన్యాలను, ప్రజల దుర్భర జీవితాలను తను ప్రత్యక్షంగా చూసింది. ఆ ప్రజల జీవితంలో మార్పు కోసం భర్తతో కలిసి తన చేతనైనంత పని చేయాలని అనుకుంది. తనకు పిల్లలు లేకపోయిన మొదటి భార్య పిల్లలను సొంత తల్లి కంటే ఎక్కువగా వాళ్ళ బాగోగులను చూసింది. ఎంతో ప్రేమగా పెంచింది. ఎంతో కష్టపడి వ్యవసాయ పనులనూ, ఇంటినీ తీర్చిదిద్దుకుంది. 2017లో బొరిగి పంచాయితీలో నాయక్ సర్పంచ్‌గా పని చేసింది. చదువు రాకపోయినా తన జీవిత అనుభవంతో, తెలివి తేటలతో పేద ప్రజలకు సేవ చేయాలనే

---

53వ తరువాయి...

రాంగూడ దాడిలో స్థానిక మిలీషియా 9 మంది కామ్రేడ్స్ (నలుగురు మహిళలతో సహా) అమరులయ్యారు. వీరంతా స్థానిక ఒంద్రుపల్లి పంచాయితీలోని ఐదు గ్రామాలకు చెందినవాళ్ళు. వీళ్ళంతా టీనేజ్‌వాళ్ళే. ముక్కుడుపల్లికి చెందిన కామ్రేడ్ సిందే, డకడపొదుర్‌కు చెందిన కామ్రేడ్స్ లక్ష్మణ్, లచ్చమెుదిలి, కావేరిమెుదిలి; బచ్చులపొదుర్‌కు చెందిన కామ్రేడ్స్ కొమల, జొమ్మి, లొాయికల్; సిమిలిపొదూర్‌కు చెందిన కామ్రేడ్ శ్యామల, కొజుర్‌గూడకు చెందిన కామ్రేడ్ జైయరాంలు వున్నారు.

మిలీషియా కామ్రేడ్స్ పి.ఎల్.జి.ఎ. బలగాలు తమ ప్రాంతాలకు వచ్చినప్పుడు రక్షణలో భాగంగా సెంట్రీలు చేయడం, శత్రు సమాచారాన్ని అందజేయడం చేసేవాళ్ళు. క్యాంపు నిర్వాహణలో సహకరించేవాళ్ళు. గెరిల్లా బలగాలకు అవసరమైన తిండి ఏర్పాట్లలో సహకరించడం ఆ విధంగా పి.ఎల్.జి.ఎ. అవసరాలు సమకూర్చడంలో ముఖ్యపాత్రనే వహించారు. మిలీషియా కామ్రేడ్స్ అంతా కటాఫ్ ఏరియాలో జరిగిన అనేక ప్రజాందోళనలు, దర్నా, ప్రచార కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఆ ఏరియాలో విప్లవ ప్రచార ఆందోళన కార్యక్రమాలు సమన్వయం చేయడానికి ఎంతో తోడ్పాటునందించేవాళ్ళు. అమరుల స్థూప నిర్మాణాలు, విస్తాపన విరోధ్ కార్యకలాపాల్లో అన్నింటిలోనూ చురుకైన పాత్ర నిర్వహించారు.

అమరులైన 31 మంది కామ్రేడ్స్‌లో మెజారిటీ కామ్రేడ్స్ వర్గరీత్యా వ్యవసాయ కూలీ, పేదరైతాంగానికి చెందినవారే. కొద్ది మాత్రం మధ్యతరగతి వాళ్ళు ఉన్నారు. సామాజిక గ్రూపులుగా చూస్తే ఆదివాసీలు, దళితులు ప్రధానంగా వున్నారు. ముగ్గురు మాత్రం వెనకబడిన కులాలకు చెందినవారు. పార్టీ యొక్క వర్గ పొందిక, సామాజిక పునాది ప్రధానంగా పీడిత ప్రజానీకంలోనే వుందనేది స్పష్టమవుతుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నాలుగు రాష్ట్రాలకు చెందిన 13 జిల్లాల ప్రాతినిధ్యం గల ఈ కామ్రేడ్స్‌లో 20 మంది పురుష కామ్రేడ్స్, 11 మహిళా కామ్రేడ్స్ వున్నారు. విప్లవోద్యమంలో వారి స్థాయిని చూసినట్లయితే ఇద్దరు రాష్ట్ర స్థాయి, ఇద్దరు డివిజన్ స్థాయి, 11 మంది ఏరియా స్థాయి కమిటీలకు చెందినవారు ఉన్నారు. వారితో పాటు 7 మంది పార్టీ సభ్యులు, 9 మంది ప్రజా మిలీషియాకు చెందినవాళ్ళు ఉన్నారు. వీరంతా ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంత కమిటీ నాయకత్వంలో వివిధ ఏరియాల్లో బాధ్యతలు చూస్తున్న కామ్రేడ్స్.

అమరులైన కామ్రేడ్స్ మనందరికీ ఆదర్శప్రాయులు. వాళ్ళు కామ్రేడ్ మావో చెప్పిన "ఫైట్ ఎగనెస్ట్ సెల్ఫ్" సూత్రానికి అనుగుణంగా స్వార్థం శిరస్సును కసిగా గండ్రగొడ్డలితో నరికారు. తుదిశ్వాస విడిచే వరకూ ఆ కర్తవ్య నిర్వహణలో ఏ మాత్రం ఏమరుపాటుగా లేరు. ముఖ్యంగా స్వార్థానికి పునాదిగా వున్న ఈ దోపిడీ వర్గ సమాజాన్ని ధ్వంసం చేసేందుకు 'సాయుధ వ్యవసాయ వర్గపోరాట' ఆయుధాన్ని చివరి క్షణం వరకు వదలలేదు. వాళ్ళు సర్వం ప్రజల కోసమే అంకితమయ్యారు. అందుకే వాళ్ళు మన రోజువారీ జీవితంలో, ఆలోచనల్లో, పనుల్లో మార్గదర్శకులుగా వుండాలి. మనం వాళ్ళ విప్లవ జీవితాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలి. అలా చేయడం ప్రస్తుత సామాజిక విప్లవానికి, భవిష్యత్ సమాజ నిర్మాణానికి ఎంతో అవసరం. ఆ కామ్రేడ్స్ మనకందించిన స్ఫూర్తితో ఈ దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, సోషలిజం గుండా కమ్యూనిజం చేరేందుకు కృషి చేద్దాం.

*



దృక్పథంతో పని చేసింది. ఈ క్రమంలోనే 2007 ప్రాంతంలో పార్టీ ఆ ప్రాంతంలో సుండి భూస్వాములకు వ్యతిరేకంగా, ప్రజలను కూడగట్టి సారా పోరాటాలు, భూ పోరాటాలు తీసుకుంది. ఆ పోరాటాలలో ఆరిక నారాయణతో పాటు కామ్రేడ్ పద్మ కూడా మన పార్టీకి ఎంతో సహాయ సహకారాలను అందించటమే కాకుండా ప్రజల పక్షాన గట్టిగా నిలబడి పోరాటంలో భాగస్వాములయ్యారు.

ఈ క్రమంలోనే 2008లో సుండి భూస్వాములు, షావుకార్లు కుట్ర చేసి ఆరిక నారాయణను అడ్డు తొలగించుకోవడానికి నారాయణపట్నాకు పని మీద వెళ్ళి తిరిగి మోటర్ సైకిల్‌పై వస్తుండగా ట్రాక్టర్‌తో గుద్దించి, కొట్టి చంపి యాక్సిడెంట్‌గా చిత్రీకరించారు. కామ్రేడ్ పద్మ జీవితంలో తన సహచరుడ్ని అలా కోల్పోవడం పెద్ద షాక్‌కు గురి చేసింది. అయినా పార్టీ ఇచ్చిన మద్దతుతో త్వరలోనే కోలుకుంది. అదే సమయంలో నారాయణ హత్యకు కారకుడు, పెద్ద భూస్వామి అయిన నాగులబెద్ద మార్కండేయ చౌదరిని మన పి.ఎల్.జి.ఎ ఖతం చేయడం, ఆ ప్రాంతంలో వున్న సుండి క్రూర భూస్వాములను, షావుకార్లను వెళ్ళగొట్టడం, పెద్ద ఎత్తున ప్రజలు పోరాటం చేసి భూములను స్వాధీనం చేసుకోవడం కామ్రేడ్ పద్మపై చాలా ప్రభావం వేసింది. దాంతో పార్టీ పంథాపై, వైఖరిపై గొప్ప విశ్వాసంతో పార్టీకి మరింతగా దగ్గరయ్యింది. పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చినా ఇంటి దగ్గర వుంటూ చొరవగా, చాకచక్యంగా చేసేది. ఇలా వుంటున్న క్రమంలో బొరిగి ప్రాంతంలో వ్యవసాయ, అభివృద్ధి కార్యక్రమాలను బాధ్యత చూస్తున్న ఎ.సి మెంబర్ కామ్రేడ్ హరితో పద్మకు పరిచయం ఏర్పడి, పరస్పర సాన్నిహిత్యం, పెళ్ళి చేసుకోవాలనే అవగాహనను పార్టీ ముందు పెట్టడంతో పార్టీ ఆమోదించి 2009లో వివాహం చేయటమైంది. కొంతకాలం రహస్యంగా గ్రామంలో వుంటూ పార్టీ పని చేసినా, క్రమంగా పెరుగుతున్న నిర్బంధంతో పూర్తికాల కార్యకర్తగా పార్టీలోకి వచ్చింది. నారాయణపట్నాలో పెల్లుబికిన భూపోరాటాల్లో కదిలిన ప్రజలను సంఘటితం చేయడంలో భాగంగా ఏర్పర్చిన సంఘాలలో తను క్రియాశీలంగా పని చేసింది. నారాయణపట్నా ఏరియా మహిళా సంఘం సభ్యురాలిగా, నారాయణపట్నా ఛసిమూలియా సంఘం సభ్యురాలిగా కూడా తనకిచ్చిన బాధ్యతలను నెరవేర్చింది. తను ఎల్లప్పుడు పార్టీ రాజకీయాలు, పార్టీ పంథాపై ఎనలేని విశ్వాసంతో పార్టీ వైఖరికే కట్టుబడి వుండేది. సంఘ కార్యవర్గ సమావేశాలలో నాచికలింగ మితవాద భావాలతో చేసే చర్చలను, తీసుకునే కార్యక్రమాలను తను చాలా సూటిగా ఖండించేది. ఎప్పుడు పార్టీ పక్షానే నిలబడింది. నాచిక లింగతో పాటు, అతనికి మద్ధతునిచ్చే బుద్ధిజీవులు కొంతమంది పద్మను పార్టీ నుండి బయటకు రప్పించాలనీ, భువనేశ్వర్‌లో ఏర్పర్చిన 'కిస్' సంస్థలో ఆదివాసీ పిల్లలను చూసుకోవడానికి వెళ్ళి వుంటే ఆదివాసీలకు సేవ చేసినట్టుంటుందనీ, జీతం కూడా ఎక్కువే వుంటుందని చెబుతూ తనను అటువైపుగా మళ్ళించేందుకు చాలా ప్రయత్నాలు చేశారు. వీటన్నింటినీ పద్మ సీరియస్‌గా ఖండిస్తునే ఎప్పటికప్పుడు పార్టీకి రిపోర్టు చేసింది. చివరకు నాచికలింగ, అతని వర్గం మితవాద, అవకాశవాద రాజకీయాలలో కూరుకుపోతే తను తీవ్రంగా ఖండిస్తూ పార్టీ పక్షానే నిలబడింది.

2011 చివరలో తనకు ఎ.సి.ఎమ్.గా ప్రమోషన్ ఇచ్చి ఉద్యమ అవసరాల రీత్యా తనను పార్టీ నందపూర్ ఏరియాకు బదిలీ చేసింది. అప్పటి నుండి తను నందపూర్ ఎ.సి. సభ్యురాలిగా తనకు ఇచ్చిన ఆర్గనైజేషన్ బాధ్యతలను శక్తి మేరకు నిర్వహించింది. తనకు ఒడియా, కువ్వి భాషల్లో పట్టు వుండగా నందపూర్ ఏరియాలో నూకదొరల్ని ఆర్గనైజ్ చేయడంలో భాగంగా తక్కువ కాలంలోనే తెలుగు భాషను నేర్చుకొని పట్టును సాధించింది. ప్రజల నాడిని చాలా సునాయసంగా పసిగట్టగలిగేది. మంచి ఆర్గనైజర్‌గా కొరాపుట్ డివిజన్‌లోని ఏ ప్రాంతంలోనైనా, ఏ గ్రామంలోనైనా పద్మను తెలియనివారు వుండరంటే అతిశయోక్తి కాదు.

కామ్రేడ్ పద్మ తన 45 ఏళ్ళ వయస్సులో కూడా, కొన్ని అనారోగ్య సమస్యలు వున్నప్పటికీ సమిష్టి పనులన్నింటిలోనూ పాల్గొంటూ, తన బరువులను తానే మోసుకుంటూ, శ్రమను ఎంతో గౌరవిస్తూ, క్రమం తప్పకుండా వ్యాయమం చేస్తూ క్యాడర్‌కి ఎంతో ఆదర్శంగా వుండేది. కామ్రేడ్ హరితో తన సహచర జీవితం ఎంతో ప్రేమ, ఆప్యాయతలతో, అన్యోన్యంగా వుండింది. అయితే కామ్రేడ్ హరి పద్మలలో వయస్సు రీత్యా, కొన్ని అనారోగ్య సమస్యల రీత్యా ఎదురవుతున్న పరిమితులను దృష్టిలో పెట్టుకొని వారిరువురినీ ఒకే దగ్గర వుంచి, కొంత వెసులుబాటు వున్న ప్రాంతంలో పనిని కేటాయించాలని పార్టీ ఆలోచించింది. అందులో భాగంగానే కామ్రేడ్ హరిని 2016లో ఎమ్.కె.వి.బి డివిజన్‌కు బదిలీ చేయడం జరిగింది. కామ్రేడ్ పద్మను కూడా అక్కడికే బదిలీ చేయాలన్నది పార్టీ నిర్ణయం. అంతలోనే 2016 అక్టోబర్ 24న జరిగిన రాంగూడ ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ హరి అమరుడు కావడం కామ్రేడ్ పద్మ జీవితంలో మరో ఆశనిపాతమే. అయినా కూడా కామ్రేడ్ పద్మ సహచరుని అమరత్వాన్ని ఎంతో నిబ్బరంగా అర్థం చేసుకుంది. తను ఎంతగానో అభిమానించే కామ్రేడ్ దయతో పాటు ఎంతో మంది ప్రియమైన కామ్రేడ్స్ అమరత్వాన్ని, దుఃఖాన్ని దిగమింగుకుంటూనే మరింత కసిగా ఉద్యమంలో చివరి వరకూ గట్టిగా నిలబడాలనే నిర్ణయించుకుంది. కామ్రేడ్ ఆరిక నారాయణ, కామ్రేడ్ హరిల వారసురాలిగా ప్రజల కోసం తన ప్రాణాలు అంకితమివ్వాలనుకుంది. రాంగూడ ఘటన జరిగి 6 నెలలు తిరగకుండానే టుడువ ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ పద్మను కోల్పోవడం ఉద్యమానికి తీరని నష్టం. నారాయణపట్నా నిప్పుల కొలిమిలో పుటం పెట్టిన బంగారంలా మెరిసిన కామ్రేడ్ పద్మ జీవితం మనందరికీ ఆదర్శం. కామ్రేడ్ పద్మకు అరుణారుణ వందనాలు.

## బందుగాం భూపోరాటంలో మట్టిలో మాణిక్యంలా మెరిసిన

# కామ్రేడ్ అంకు (టుబ్రి, సబిత) అమర్ రహే!

2017, మార్చి9వ తేదీన ఒకద్రోహి ఇచ్చిన సమాచారంతో టుడువ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ పద్మతో పాటు కామ్రేడ్ సబిత కూడా అసువులు బాసింది. ఎన్‌కౌంటర్‌లో తూటాలు తగిలి కొన్ని గజాల దూరం వచ్చి తను అమరురాలు కావడంతో, తరువాత ఆ ప్రదేశంలో వెతకడం కోసం వెళ్ళిన పి.ఎల్.జి.ఎ. బలగాలకు తన మృత శరీరం దొరికింది. దాంతో అక్కడి గ్రామ ప్రజల సహకారంతో పి.ఎల్.జి.ఎ. తన అంత్యక్రియలను విప్లవ సాంప్రదాయం ప్రకారం పూర్తి చేసింది. కామ్రేడ్ సబిత బందుగాం బ్లాక్, కేరుబడి గ్రామంలో నిరుపేద ఆదివాసీ కువ్వి కుటుంబంలో పుట్టింది. నలుగురి అన్నలకు ముద్దుల చెల్లి, ఒక్కతే ఆడపిల్ల కావడంతో వున్నదాంట్లోనే ముద్దుగా పెంచారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు అంకు. పేద కుటుంబం కావడంతో చదువుకోలేదు. చిన్నప్పటి నుండీ ఇంటి పనులతో పాటు కూలీ పనులకు కూడా వెళ్ళి కుటుంబ పోషణలో తాను భాగస్వామిగా వుండేది. తమది పంచాయితీ గ్రామం కావడం, ఊర్లో పెత్తందార్ల, పెద్ద మనుషుల ఆధిపత్యం క్రింద తమ కుటుంబం అణిగిమణిగి వుండడం వల్ల సబితకు చిన్నప్పటి నుండి నెమ్మదిగా, ఓపికగా వుండే స్వభావం, బాధ్యతగా కష్టపడి పని చేసే మనస్తత్వం అలవడ్డాయి.

2009 ప్రాంతంలో మన పార్టీ నాయకత్వంలో నారాయణపట్నా బందుగాం ప్రాంతంలో జరిగిన భూ పోరాటాలు వేసిన ప్రభావంతో తను పార్టీ పట్ల ఆకర్షితురాలయ్యింది. తన అన్న మిలీషియాలో చురుకైన కార్యకర్త. తన అన్నతో పాటు ఏ కార్యక్రమంలోనైనా తనూ పాల్గొనేది. అలా తను మిలీషియా కార్యక్రమాల్లో పాలు పంచుకుంటూనే అప్పుడప్పుడు జంఝావతి ప్రాంతంలో పని చేస్తున్న కా॥సిత్రు (అమరుడు సుధీర్)తో కొంత కాలం పని చేసింది. ఆ క్రమంలో సిత్రులో వున్న తప్పుడు భావాలను తీవ్రంగా వ్యతిరేకించి అతడిని పార్టీ నుండి బహిష్కరించిన సందర్భంలో అతనితో పాటు వున్న మిలీషియా సభ్యులకు పార్టీ విషయం అర్థం చేయించి పార్టీ వైపు వుంటారా? సిత్రు వైపు వుంటారా? తేల్చుకొమ్మని చెప్పినప్పుడు అందరికంటే చిన్నదయిన కామ్రేడ్ సబిత ఎటువంటి శషబిషలు లేకుండా పార్టీ వైపు నిలబడింది. అలా 2010 చివరి నుండి తను పూర్తికాలం కార్యకర్తగా పార్టీలో పని చేసింది.

2011లో మన పార్టీ ఉద్యమ అవసరాల రీత్యా తనను నందపూర్ ఏరియాలో దళానికి పంపించింది. నందపూర్ ఏరియాలో పార్టీ సభ్యురాలిగా పార్టీ చెప్పిన పనులను బాధ్యతగా చేసేది.

ప్రజలతోనూ, తోటి కామ్రేడ్స్‌తోనూ ఎంతో కలుపుగోలుగా వుంటూ ఎవరికి ఏ కష్టం వచ్చినా, అనారోగ్య సమస్య వచ్చినా ఎంతో బాధ్యతతో, ఓపికగా, తనకు చేతనైనంత సేవ చేసే విషయంలో కామ్రేడ్ సబితను ఆదర్శంగా తీసుకోవాలి. సీనియర్ కామ్రేడ్స్ పట్ల, నాయకత్వం పట్ల ఎంతో బాధ్యతాయుతంగా మెలిగేది. సహాయ సహకారాలు అందించేది. కామ్రేడ్ సబితలో వున్న ఈ మంచి లక్షణాలను, క్రమశిక్షణను పార్టీ గుర్తించి 2013లో నాయకత్వ రక్షణ అవసరాలరీత్యా పి.ఎస్-2లోకి బదిలీ చేయడం జరిగింది. అప్పుడు కూడా పార్టీ అవసరాన్ని గుర్తించి బదిలీని సంతోషగా స్వీకరించింది. తనకిచ్చిన విధిని నిర్వహిస్తునే ఇతర సమిష్టి పనులన్నింటిలో భాగమయ్యేది. అక్కడ కూడా తను ఎంతో బాధ్యతగా పని చేసింది. ఎంత అనారోగ్య సమస్యలు వున్నా, ఎంత కష్టమయినా తనకు ఇచ్చిన బరువులను కాదనకుండా మోసేది. ఏ పని చెప్పినా కాదనకుండా చేసేది. క్రమంగా తనలో పెరుగుతున్న కమ్యూనిస్టు చైతన్యాన్ని, అభివృద్ధిని పార్టీ గమనించి, ఉద్యమ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకొని 2016లో తనకు ఎ.సి.లోకి ప్రమోట్ చేసి, నందపూర్ ఎ.సిలో సభ్యురాలిగా ఆర్గనైజేషన్ బాధ్యతలను ఇవ్వడం జరిగింది. నందపూర్ ఎ.సి. సభ్యురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్న క్రమంలో అతి కొద్ది కాలంలోనే టుడువ ఎన్‌కౌంటర్‌లో తనని కోల్పోవడం ఉద్యమానికి తీరని లోటు.

కామ్రేడ్ సబిత ఏనాడు ఇంటిని చూస్తానని పార్టీని కోరింది లేదు. ఆర్గనైజేషన్ పనుల్లో భాగంగానే తమ గ్రామానికి దళంతో పాటు వెళ్ళినప్పుడు మాత్రమే తమ కుటుంబాన్ని కలిసేది. కుటుంబ సభ్యులు తనను ఇంటికి వచ్చేయమని, అందరూ సరెండర్ అయిపోతున్నారనీ, నువ్వొక్కదానివే ఏం చేస్తావు అని తన మీద ఎంత ఒత్తిడి తీసుకువచ్చినా తను చివరి వరకు ప్రజల కోసమే పని చేస్తాననీ, మీరు కూడా గ్రామంలో పెత్తందార్లకు, పెద్దమనుషులకు అణగి మణగి వుండకుండా, వాళ్ళకు అనుకూలంగా మారకుండా పార్టీ వైపు, ప్రజల వైపు నిలబడాలనీ అర్థం చేయించి ఎంతో చైతన్యాన్ని ప్రధర్శించింది.

పునాది వర్గాల నుండి, పేద కుటుంబం నుండి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ఉద్యమంలోకి వచ్చి, పార్టీలో కూడా అంతే బాధ్యతగా పని చేసి, చిన్న వయసులోనే కామ్రేడ్ సబిత అమరురాలు కావడం ప్రస్తుత పరిస్థితిలో ఎంతో నష్టదాయకం. ఎంతో రాజకీయ భవిష్యత్తు వున్న, ఎంతో విలువైన యువ కామ్రేడ్స్‌ను కోల్పోవటం ఉద్యమానికి తీరని లోటు. అమరులు తాము వెళ్ళిపోతూ మన భుజస్కంధాలపై పెట్టిన బాధ్యతను, వారు కన్న కలలను, ఆశయాలను నెరవేర్చటమే మనం వారికి అర్పించే నిజమైన నివాళి. అమర్ రహే కామ్రేడ్ సబిత !

*

**ఈ ప్రాణ బీజాలు అత్యుత్తమమైనవి. అమూల్యమైనవి.**

**ఇవి తిరిగి ఏనాడో మొలకలెత్తి పుష్పించి జీవనోద్వేగంతో ప్రకాశిస్తాయి.**

*-జూలియస్ ఫ్యూజిక్ 'రక్తాక్షరాలు' నుండి*

# గొర్లమెట్ట అమరులకు జోహార్లు

## అల్లూరి వారసత్వాన్నందుకొని మన్యం పితూరీ సైన్యమై,

## తూర్పుకనుమల్లో ఉదయించిన ఎర్రసూర్యులు

# కామ్రేడ్ జాంబ్రి, కామ్రేడ్ చిట్టిబాబులు!

### కామ్రేడ్ జాంబ్రి

ఆదివాసీ ప్రజల, పీడిత, తాడిత ప్రజల విముక్తి కొరకు తూర్పు కనుమలలో ఎర్రమందారాలు నేలరాలాయి. ఆ ఎర్రమందారాలే కామ్రేడ్ జాంబ్రి, కామ్రేడ్ చిట్టిబాబు.

నీరు, అడవి, భూమి, ఆత్మగౌరవం, అధికారం కోసం అల్లూరి శ్రీరామరాజు వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని, తమ ఆశయ సాధనకు ఎమ్.ఎల్.ఎమ్. సిద్ధాంత వెలుగులో పోరాడి పేద ప్రజల విముక్తికి దారులను సుగమం చేస్తూ అమరులయ్యారు.



దాదాపు 200 సం॥ల ఆదివాసీ పోరాట చరిత్ర నిర్దిష్టంగా 19వ శతాబ్దం నుండి తూర్పుగోదావరి, విశాఖ ఏజెన్సీలోని దారబందాల రామచంద్రయ్య, మన్యం పితూరీ అల్లూరీ పోరాటం నుండి నేటి సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీ నేతృత్వంలో పోరాడుతున్న ఆదివాసీ, పీడిత ప్రజల చరిత్ర అంతా విముక్తి కోసం చేస్తున్న వర్గపోరాటాల చరిత్రనే. అడవిపై సర్వాధికారం కోసం చేసే పోరాటం దానిలో భాగమే. ఈ ప్రజాయుద్ధంలో వేలాదిమంది వీరులు తమ విముక్తి కొరకు అమరులవుతూనే ఉన్నారు. నాటి బ్రిటిషు సామ్రాజ్యవాదుల నుండి నేటి సామ్రాజ్యవాదుల కనుసన్నలలో కొనసాగుతూ ఈ భారత దళారీ పాలకుల వరకు ఈ అడవినీ, అడవిలోని ఖనిజ సంపదను దోచుకుంటూనే, ఈ దోపిడీకి వ్యతిరేకంగా తిరగబడుతున్న ఆదివాసీ పోరాటాలను క్రూరంగా అణిచివేస్తున్నారు. అల్లూరి నుండి నేటి కామ్రేడ్ జాంబ్రి, చిట్టిబాబుల వరకు పట్టుకొని కాల్చిచంపుతూ ఎన్‌కౌంటర్ కట్టుకథలు అల్లుతున్నారు. అలాంటి వీరుల జీవితాలు అందరికి ఆదర్శం. ముఖ్యంగా యువతకు స్ఫూర్తిదాయకం. ఆ అమరుల చరిత్రను తెలుసుకోవడం, వారి ఆశయసాధనలో క్రియాశీలకంగా పాలుపంచుకోవడం అవసరం.

కామ్రేడ్ జాంబ్రి (గెమ్మెల నారాయణరావు)ది గూడెం కొత్తవీధి మండలం, దేవారపల్లి పంచాయితీ, మెట్టగూడ గ్రామానికి చెందిన వాడు. నిరుపేద కువ్వి తెగలో జన్మించాడు. తల్లిదండ్రులకు కల్గిన 6గురు సంతానంలో 2వవాడు. జాంబ్రి కుటుంబం 1970 దశాబ్దంలో ఒడిశా రాష్ట్రం నుండి వలస వచ్చిన వీరు బ్రతుకుతెరువు కోసం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ మన్యానికి వచ్చి స్థిరపడ్డారు. బ్రతుకుతెరువుకు వలసవచ్చారే కానీ 'పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్టుగా' వీరి బ్రతుకులు మారాయి. ఇక్కడి ముఠా మునసబుల వెట్టిచాకిరీ, ఫారెస్ట్ అధికారుల దోపిడీ దౌర్జన్యాలు, అత్యాచారాలు, షావుకార్ల దోపిడీల వల్ల వీరి బ్రతుకులు నాశనం అయ్యాయి. వీటిని ఎదిరించినందుకు మూకుమ్మడి అరెస్టులు, చిత్రహింసలు, అత్యాచారాలు అనుభవించారు. ఈ వేధింపులవల్ల వీరి కుటుంబానికి అత్యంత సన్నిహితుడు పెద్దపాడు గ్రామానికి కొర్ర కుటుంబానికి చెందిన వ్యక్తి చనిపోయాడు. ఈ దారుణాలను చూస్తూ పెరిగిన జాంబ్రి ఈ వ్యవస్థ పట్ల మరింత కసిని పెంచుకున్నారు.

1980 సం॥లో విశాఖ మన్యంలో అప్పటి సి.పి.ఐ (ఎమ్.ఎల్) పీపుల్స్‌వార్ పార్టీ ప్రవేశించిన తరువాత ముఠా మునసబుల, ఫారెస్టు అధికారుల వేధింపులు ఆగిపోయాయి. అడవి నుండి ఫలసాయం అనుభవించసాగారు. ఈ విప్లవోద్యమ ప్రభావం చిన్నప్పటి నుండీ కామ్రేడ్ జాంబ్రిపై పడింది. చిన్ననాటి నుండే (రాడికల్ బాలల సంఘం) స్థానిక భూస్వాములకు, ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగా నిలిచాడు. గ్రామంలోనూ, తన పాకెట్ (10గ్రామాల పరిధి)లో ఆదివాసీ విప్లవ రైతు కూలీ సంఘం నిర్మాణాన్ని బలోపేతం చేసి వర్గపోరాటాన్ని తీవ్రతరం చేసాడు. స్థానిక భూస్వామి అయిన గెమ్మిలి భాస్కరరావ్ అక్రమంగా ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవడంలోనూ, ముఠా మునసబుల భూములను స్వాధీనం చేసుకొని ప్రజలకు పంపిణీ చేయించడంలో ముఖ్య పాత్ర పోషించాడు. ఈ క్రమంలోనే కామ్రేడ్ జాంబ్రిపై ప్రభుత్వం మరింత నిర్బంధాన్ని తీవ్రం చేసింది. ఈ నిర్బంధాన్ని ఎదిరిస్తూ ప్రజాయుద్ధంలో మరింత లీనమయ్యాడు. 2005 సం॥లో దోపిడీ ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా విప్లవ ప్రజాకమిటీని పార్టీ నిర్మాణం చేసినప్పుడు తన స్థానిక పాకెట్‌కు అధ్యక్షునిగా ఉండి దాన్ని సమర్థవంతంగా నడిపాడు. పాకెట్‌లోని అన్ని గ్రామాలలో విప్లవకర భూ సంస్కరణలు, సాగుభూమి కోసం 4 గ్రామాలలో చెక్ డ్యాంల నిర్మాణం చేయడం, వైద్య కమిటీల నిర్మాణం ద్వారా మందులు

అందించడంలో ఆయా కమిటీలకు నాయకత్వం వహించాడు. తన పాకెట్‌లోనే కాకుండా ఏరియా వ్యాప్తంగా 45 గ్రామాలలో జరిగిన భూపోరాటాలనూ, పదుల సంఖ్యలో నిర్మాణం చేసిన చెక్‌డ్యాంల నిర్మాణంలోనూ, ఇతర అభివృద్ధికర కార్యక్రమాలలో తన క్రియాశీల భాగస్వామ్యం ఉంది. అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న దైనందిన సమస్యలు రేషన్‌డిపో, విద్య, వైద్యం తదితర ప్రజా సమస్యలపై ప్రజలను కదిలిస్తూ వాటిని రాజ్య వ్యతిరేక పోరాటంగా మల్చడంలో వాటిని సాధించడంలోనూ, సీజనల్‌గా వచ్చే అపరాల పంటకు గిట్టుబాటు ధర కోసం ప్రజలతో కమిటీల నిర్మాణం చేసి తగిన రేటు సాధించడంలో కామ్రేడ్ జాంబ్రిది విశేష కృషి ఉంది.

'అడవిపై సర్వధికారం అదివాసులదే' అనే నినాదం కింద ఆదివాసీ, పీడిత ప్రజలను చైతన్యం చేస్తూ వారిని సాయుధ నిర్మాణంలో సంఘటితం చేసి దళారీ పెట్టుబడిదారులకు, భూస్వామిగా వ్యవహరిస్తూ ఆదివాసీలతో వెట్టి చాకిరి చేయించుకొని గగ్గోలు పెట్టిన ఎ.పి.ఎఫ్.డి.సి. సంస్థ చేతి నుండి స్వాధీనం చేసుకుని అడవినీ, అడవిలోని కాఫీ తోటలను ప్రజలకు పంపిణీ చేయడంలో చెప్పుకో తగ్గ పాత్ర ఉంది. తన నాయకత్వంలోనే ప్రారంభమైన (మర్రిపాకల ఎస్టేట్‌లో) కాఫీ పోరాటం గాలికొండ ఏరియా అంతటికీ సప్పర్ల, లంకపాకల, సాపరాతి, పెదవలస ఎస్టేట్‌లకు విస్తరించి దాదాపు 2వేల ఎకరాల తోటలను పంపిణీ చేయడంలో జాంబ్రి పాత్రనే కీలకం. అలాగే ప్రజల జీవన్మరణ సమస్యగా భావించిన బాక్సైట్ వెలికితీత సమస్యకు వ్యతిరేకంగా ప్రజా ఆందోళనను నిర్మించి, దానిని మిలిటెంట్‌గా ఉన్నతస్థాయికి చేరేందుకు ప్రజలను చైతన్యవంతం చేసాడు.

దళారీ పాలకవర్గాలు, బడా పెట్టుబడిదారులైన జిందాల్, ఆన్‌రాక్‌ల, బడా భూస్వామిగా వ్యవహరిస్తున్న ఎ.పి.ఎఫ్.డి.సి., ఈ వర్గాలను కాపాడుతున్న ప్రభుత్వ సాయుధ బలగాలను, వారి ఏజెంట్లను దెబ్బ తీయడం కోసం పార్టీ తీసుకున్న టి.సి.ఒ.సి. కార్యక్రమానికి స్వతంత్రంగా చర్యలు చేసాడు. 2006 కన్నవరంలో ముగ్గురు నిరాయుధ మిలీషియాను హత్య చేసి వెళ్ళిపోతున్న శత్రువుపై అంబుష్ చేసి ముగ్గురు గ్రేహౌండ్స్ పోలీసులను మట్టి గరిపించి నలుగురిని గాయపర్చిన దాంట్లోను క్రియాశీలకంగా పాల్గొన్నాడు. కాఫీతోట స్వాధీనం కోసం చేస్తున్న పోరాటాన్ని అణచివేయడం కోసం పోలీసు చర్యను ప్రయోగించిన సందర్భాలలోను పోలీసులపై ఆంబుష్‌లు, ఫైరింగ్‌లు చేస్తూ శత్రువును వెనకకు నెట్టి ప్రజలలో మనోస్థైర్యాన్ని కల్పించి కాఫీతోటలను ప్రజలు స్వాధీనం చేసుకునేలా చేసాడు. 2008లో పార్టీ తీసుకున్న టి.సి.ఒ.సి.లో గ్రేహౌండ్స్‌ను పరుగులు పెట్టించిన గునుకరాయి ఆంబుష్‌లో 2వ అస్సాల్ట్‌లో వుండి అడ్వాన్సు అయి శత్రువును దెబ్బతీసిన దాంట్లోను ఉన్నాడు. మర్రిపాకల, ఈదులబంద, గొల్లవలస లాంటి భారీ ఎన్‌కౌంటర్లలోను శత్రుదాడిని ధీటుగా ఎదుర్కొంటూ రిట్రీట్ అయ్యాడు. అలాగే శత్రువుకు కన్ను, చెవులుగా ఉపయోగపడుతున్న ఏజెంట్స్‌ను దెబ్బతీయడంలోను తన పాత్ర ఎంతో ఉంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీడిత ప్రజలపై తమ దోపిడీ పీడనలను నిరాటంకంగా కొనసాగించేందుకు పార్టీ ఆటంకంగా వుందని గుర్తించి పార్టీనీ, పి.ఎల్.జి.ఎ.నూ, ముఖ్యంగా నాయకత్వ కామ్రేడ్స్‌ను నిర్మూలించేందుకు కుట్రపద్ధతులు పన్నుతూ వచ్చాయి. ఈ కుట్రలో భాగంగానే ఎ.పి. ప్రభుత్వం కామ్రేడ్ జాంబ్రిపై గత 10 సం॥ల నుండి హత్యా ప్రయత్నాలు చేస్తూ వస్తున్నది. ఈ ప్రయత్నాలను గత రెండు సం॥రాలుగా తీవ్రం చేసింది. అయితే కామ్రేడ్ జాంబ్రికి విప్లవోద్యమం పట్ల ఉన్న అంకితభావాన్ని గుర్తించి, రాజకీయంగా ఆయన బలహీనపడడు అని అర్థం చేసుకున్న శత్రువు కామ్రేడ్ జాంబ్రిపై తప్పుడు ప్రచారం చేయడం మొదలు పెట్టాడు. చరిత్రలో బ్రిటిషు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విప్లవకారుడు అల్లూరీ శ్రీరామరాజును దోపిడీ దారులుగా, హంతకులుగా చిత్రీకరించిన తీరులో ప్రస్తుతం ఆదివాసీ, పీడిత ప్రజల బతుకు కోసం, జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికార్ కోసం పోరాడుతున్న విప్లవకారులను అదే తీరులో ఈ పాలకవర్గాలు ప్రచారం చేస్తున్నాయి. ఆ రకంగా కామ్రేడ్ జాంబ్రిపై పెద్దెత్తున ప్రచారం చేసినప్పటికీ ప్రజలు తమ నాయకుడిపై మరింత గౌరవం, విశ్వాసాన్ని కనబర్చారు. దీన్ని సహించలేని శత్రువు జాంబ్రి కుటుంబాన్ని మానసికంగా, శారీరకంగా అనేక ఇబ్బందులకు గురి చేశాడు. కామ్రేడ్ జాంబ్రి పెద్ద కొడుకు సుబ్బారావును ఆర్.వి.నగర్‌లో యాక్సిడెంట్ పేర పోలీసులు హత్యచేసినప్పటికీ తను ప్రజాఉద్యమం నుండి అమరుడయ్యే నాటికి వెనుతిరగలేదు.

## మర్రి చిట్టిబాబు

కామ్రేడ్ మర్రి చిట్టిబాబు గూడెం కొత్తవీధి మండలం, దేవారపల్లి పంచాయితీ, వీరవరం గ్రామానికి చెందినవాడు. అత్యంత నిరుపేద కువ్వి కుటుంబంలో తల్లిదండ్రులకు రెండవ సంతానంగా జన్మించాడు. చిట్టిబాబుకు భార్య, ఆరు నెలల బాబు వున్నాడు. వీరి కుటుంబం కూడా 3 దశాబ్దాల క్రితం వీరవరం గ్రామంలో స్థిరపడ్డారు. 1987 ఎన్.టి.ఆర్ ప్రభుత్వం సమయంలో గ్రామలను తగులబెట్టడం, మహిళలపై అత్యాచారాలు, పోలీసులు గ్రామాలపై పడి దోపిడీ, దౌర్జన్యాలు చేస్తున్న కాలం. ఆ క్రూర నిర్బంధ కాలాన్ని తట్టుకొని ఆదివాసీ రైతుకూలీ సంఘంలో సంఘటితం అయి దోపిడీ పాలకులను ఎదిరించినది చిట్టిబాబు కుటుంబం. ఆ కుటుంబంలో పుట్టిన చిట్టిబాబుపై విప్లవ రాజకీయాల ప్రభావం సహజంగానే పడింది. చిన్నప్పటి నుండే రాడికల్ బాలల సంఘంలో చేరి విప్లవోద్యమ రాజకీయాల ద్వారా చైతన్యవంతమయ్యాడు. యుక్త వయస్సులో మిలీషియాలో చేరి కాఫీ పోరాటంలో భాగమయ్యాడు. పాకెట్‌లో భూసంస్కరణలు అమలు చేయడంలోనూ, మర్రిపాకల ఎస్టేట్ స్వాధీనంలోను క్రియాశీలపాత్ర పోషించాడు. 2009 నుండి ప్రారంభమైన ఆపరేషన్ గ్రీన్‌హంట్ ఫాసిస్టు దాడి తీవ్రమై, తన గ్రామంపై పదే పదే దాడులు చేయడంతో గ్రామంలో దాదాపు 9 కుటుంబాలు పారిపోయాయి. ఉన్న కుటుంబాలు కూడా వెళ్ళిపోవటానికి సిద్ధంగా వున్నప్పుడు చిట్టిబాబు వారికి ధైర్యం కల్గించి నిలబెట్టాడు. గత సం॥రం తన అన్న అనారోగ్యంతో మరణించినప్పటికీ పార్టీ కార్యక్రమాలను వదులుకోలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేస్తున్న దాడిలో ఉద్యమాన్ని పురోగమింపచేయడం కోసం మరింత సమయం కేటాయించుకొని చురుగ్గా పని చేశాడు.

శత్రువు స్థానిక నాయకత్వం లేకుండా చేయడం కోసం అనేక కుట్రపూరిత పద్ధతులు అవలంభిస్తున్నాడు. దాంట్లో భాగంగా ప్రజా ద్రోహులను తయారు చేసుకుని నిరాయుధంగా వున్న కామ్రేడ్ జాంబ్రి సమాచారం సేకరించి, ఫిబ్రవరి 24న తను ఉన్న మకాంను

59వ పేజీలో...

# ఎమ్.కె.వి.బి. డివిజన్

**శత్రువు ఆలౌట్ అభియాన్ పేరుతో ఎమ్.కె.వి.బి. డివిజన్‌లో అమలు జరుపుతున్న పాశవిక దాడిని ప్రతిఘటిస్తూ ముందుకు సాగుతున్న సాయుధ వ్యవసాయక విప్లవం.**

2015 జనవరి నుండి ఎ.పి-ఒ.ఎస్. రాష్ట్రాలు సంయుక్తంగా కేంద్ర ప్రభుత్వం నాయకత్వంలో పార్టీ నాయకత్వ నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా చేసుకొని, అలాగే ఎమ్.కె.వి.బి. డివిజన్‌లో కొనసాగుతున్న సాయుధ వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని అడ్డుకోవడంలో భాగంగా ఆలౌట్ అభియాన్ పేరుతో భారీ సైనిక దాడిని ఎక్కుపెట్టి కొనసాగిస్తున్నాయి. ఈ దాడిని ఎదుర్కొంటూనే 'దున్నే వారికి భూమి-విప్లవ ప్రజా కమిటీలకే సర్వాధికారాలు' అనే కేంద్ర నినాదంతో వ్యవసాయక విప్లవ కార్యక్రమం ప్రధానంగా భూస్వాముల, ప్రజా వ్యతిరేకులైన కొందరు తెగపెద్దల, ప్రభుత్వ ఆధీనంలో వున్న వందలాది ఎకరాల భూములు ప్రజలు స్వాధీనం చేసుకొని భూమిలేని పేద రైతాంగానికి పంపిణీ చేయడం జరిగింది. వ్యవసాయిక విప్లవాన్ని ముందుకు తీసుకుపోవడంలో భాగంగా సాగునీటి సమస్యను పరిష్కరించడానికి ప్రజల భాగస్వామ్యంతో చెక్‌డ్యాంల నిర్మాణం, పశువుల పంపిణీ, శ్రమ సహకార బృందాలను ఏర్పాటు చేయడం, కొన్ని గ్రామాలలో సమిష్టి వ్యవసాయాన్ని కూడా ప్రోత్సాహించి ప్రారంభించాం. గంజాయి సాగును నిరుత్సాహ పరుస్తూ, ఆహర పంటలు పండించుకునే విధంగా ప్రోత్సహించాం. 'గిట్టుబాటు ధరల పెంపుదలకై, షావుకారుల, వడ్డీ వ్యాపారుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుదాం' అనే నినాదంతో ప్రజలను ప్రజా నిర్మాణాలలోకి సంఘటితపరుస్తూ విప్లవ రైతుకూలీ సంఘాలే ప్రజలకు నిజమైన నాయకత్వంగా ఎదగడం ప్రారంభమయింది. శత్రువు దాడి పథకాన్ని తిప్పికొడుతూ ప్రజలు మరింత ముందుకు కదులుతున్నారు.

2016, అక్టోబర్ 24 మల్కనగిరి జిల్లాలోని కటాఫ్ ప్రాంతంలోని రాంగూడ వద్ద పక్కా సమాచారం, పకడ్బందీ ప్లాన్‌తో ఎ.పి. గ్రేహౌండ్స్ బలగాలు పి.ఎల్.జి.ఎ. మకాంను అన్ని వైపుల నుండి చుట్టుముట్టి జరిపిన అతిపెద్ద దాడిలో 24 నుండి 27వ తేదీ వరకు, 31 మంది వివిధ స్థాయిల కామ్రేడ్స్‌ను అత్యంత పాశవికంగా హత్య చేసాయి. ఈ సంఘటనలో ఎమ్.కె.వి.బి. డివిజన్‌లోని స్థానిక ప్రజా నిర్మాణాల కామ్రేడ్స్ 9 మందితో పాటు 22 మంది పార్టీ, పి.ఎల్.జి.ఎ.లకు చెందిన కామ్రేడ్స్ అమరులయ్యారు. పార్టీ చరిత్రలోనే అతిపెద్ద సంఘటనగా నిలిచిన ఈ ఎన్‌కౌంటర్‌లో పొందిన నష్టం జోన్ ఉద్యమంతో పాటు ఎమ్.కె.వి.బి. డివిజన్ ఉద్యమంపై తీవ్రమైన ప్రభావం వేసింది. శత్రువు కూడా వాడి ఊహకు అందని విజయాన్ని సాధించాడు. ఈ సంఘటన తర్వాత ఎ.ఒ.బి. ఉద్యమం తుడిచిపెట్టుకుపోయినట్టేనని ప్రచారాన్ని లంకించుకొని ప్రజలను గందరగోళపరిచి, విశ్వాసం సడలింపజేసి లొంగదీసుకోవాలని ప్రయత్నించాడు. కాని ప్రజలు శత్రువు అంచనాలను తలక్రిందులు చేస్తూ అమరుల త్యాగాల స్ఫూర్తిని నింపుకొని శతృవుపై మరింత కసిని పెంచుకొని పార్టీతో మరింత దృఢంగా మమేకమై శత్రువుకు సవాల్ విసురుతూ పోరుబాటనే నడుస్తామని చాటి చెబుతున్నారు.

ఎస్.జడ్.సి. జోన్‌లో చేపట్టిన సామాజిక, వర్గ పరిశీలనపై ఆధారపడి ముఖ్యమైన నాయకత్వ కోర్‌తో వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ వర్క్‌షాప్ ప్రధానంగా వ్యవసాయిక విప్లవం కొనసాగింపులో ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి నూతన ఎత్తుగడలను రూపొందించింది. దాని తర్వాత డివిజన్‌లో పెదబయలు ఏరియాలో కోంద్రు పాకెట్‌లో 10 గ్రామాల రైతు ప్రతినిధులతోనూ, కటాఫ్ ఏరియాలోని ఒంద్రుపల్లి పంచాయితీలోని 5 గ్రామాల రైతు ప్రతినిధులతోను రెండు రైతాంగ సదస్సులు నిర్వహించాం. ఈ సదస్సులలో ప్రధానంగా దున్నేవారికి భూమి సమస్య, వ్యవసాయ అభివృద్ధి, పంటల సాగు, మార్కెట్ దోపిడీ, అధికవడ్డీ దోపిడీ, పశు సంరక్షణ తదితర అంశాలపై చర్చ నిర్వహించి వీరి అభిప్రాయాలపై ఆధారపడి మన ఎత్తుగడలను నిర్దిష్టంగా అన్వయించుకొని కార్యక్రమంలోకి వెళ్ళాం.

సాయుధ వ్యవసాయిక విప్లవ కార్యక్రమంలో భాగంగా విప్లవ రైతుకూలీ సంఘాల నాయకత్వంలో పెదబయలు ఏరియాలోని కోంద్రు దాని పరిధిలోని 8 గ్రామాల ప్రజలు నెల రోజులు సమిష్టిగా శ్రమ చేసి, కొండ భూమిని చదును చేసి భూమిలేని 79 కుటుంబాలకు పంపిణీ చేసారు. కటాఫ్ ప్రాంతలో మద్రివెడ గ్రామంలో భూమి చదును చేసి భూమిలేని 3 కుటుంబాలకు పంపిణీ చేసారు.

కటాఫ్ (గుమ్మ) ఏరియాలోని ఒంద్రుపల్లి గ్రామంలో ఆధిపత్య

---

58వ తరువాయి...

చుట్టుముట్టి ఎటువంటి హెచ్చరికలు లేకుండా కాల్పులు జరిపారు. ఈ కాల్పులో కామ్రేడ్ చిట్టిబాబు అక్కడే అమరత్వం చెందగా, గాయపడి కొంత దూరం వెళ్ళి స్పృహ తప్పి పడిపోయిన కామ్రేడ్ జాంబ్రిని ఇన్‌ఫార్మర్ సహాయంతో గుర్తించి పట్టుకొని పాశవికంగా చిత్రహింసలు పెట్టి హత్య చేశారు.

విప్లవ కారులను హత్యచేసి (భౌతికంగా వారిని లేకుండా చేసి) విప్లవోద్యమాన్ని నిర్మూలించాలనుకోవడం పాలకవర్గాల మూర్ఖత్వమే. వారిని భౌతికంగా దూరం చేశారు కానీ వారి భావాలనూ, ఆదర్శాలను దూరం చేయలేరని తెలుసుకోవాలి.

▲ కామ్రేడ్ జాంబ్రి, చిట్టిబాబులు అమర్‌రహే!

▲ అమరవీరుల ఆశయాలను తుదకంటా కొనసాగిద్దాం!

▲ ఫాసిస్టు శతృ దాడులను ఓడిద్దాం!

▲ ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం!

▲ సి.పి.ఐ. (మావోయిస్టు) వర్ధిల్లాలి!

✱

శక్తుల స్వాధీనంలో వున్న 35 ఎకరాలను స్వాధీనం చేసుకొని భూమిలేని 25 పేద రైతు కుటుంబాలకు పంపిణీ చేసాం. అలాగే సిమ్లిపొదర్‌లో ప్రజా వ్యతిరేకుల, తెగపెద్దకు సంబంధించిన 10 ఎకరాల భూమిని భూమిలేని 13 పేద రైతు కుటుంబాలకు పంపిణీ చేసాం. తాబేరు, కొండంజరి, నడుంజరి, మర్రివెడ, తోటగూడ గ్రామాలలో భూ అసమానతలను తగ్గించడంలో ఎక్కువ భూములు కల్గివున్న ధనిక రైతుల నుండి వారి ఆమోదంతోనే సుమారు 20 ఎకరాలకు పైగా భూములను తీసుకొని భూమిలేని 25 పేద కుటుంబాలకు పంపిణీ చేసాం. సన్యాసిగూడ గ్రామంలో గ్రామం విడిచివెళ్ళిన వారి (సాగు నిలిచిపోయినవి) సుమారు 15 ఎకరాల భూమిని దాని ప్రక్కనే వున్న చదరం గ్రామస్తులకు పంపిణీ చేసాం. పననపుట్ గ్రామంలో గ్రామ పెత్తందారులుగా వుండి, ప్రజావ్యతిరేకులుగా మారి ప్రజల చేత శిక్షకు గురై పారిపోయి శత్రువు ఏజెంట్లుగా మారిన భఘీరథీ, జొగర్‌నాథ్‌ల భూములు, గ్రామం బదిలీ అయినవారి (సాగులేని) భూములను గ్రామ ప్రజలు సమిష్టిగా సాగు చేసి పండిన పంటను భూమిలేని పేదలకు పంపిణీ చేసారు.

## నిర్బంధం రీత్యా సాగు నిలిచిపోయిన భూములను తిరిగి సాగులోకి తెచ్చుకున్న ప్రజానీకం

పెదబయలు ఏరియాలోని కిల్లంకోటలో భూస్వాముల నుండి గతంలో స్వాధీనం చేసుకుని పంపిణీ చేసిన భూములలో చింతగుప్ప గ్రామం వారు కొంతకాలం చేసి వదిలివేసారు. కారణం నిర్బంధం, ప్రజల సంసిద్ధత సమస్య అని అర్థమైంది. ప్రజలలో పై విషయాలపై చర్చించి తిరిగి భూములు సాగులోకి తేవడం జరిగింది.

గుంజివీధి భూస్వామి రామనాయుడుకు చెందిన భూములను 2015లో భూమిలేని 3 గ్రామాల ప్రజలకు పంపిణీ చేసాం. ప్రజలు రెండు సంవత్సరాలు సాగు చేసి, పంటలు తీసి ఫలసాయం పొందారు. 2016 రాంగూడ ఎన్‌కౌంటర్ తర్వాత పార్టీ దెబ్బతిందనీ, తిరిగిరాదని ప్రజలను బెదిరింపులకు గురిచేసి తిరిగి ఆక్రమించి దూర ప్రాంతం వారిని పిలిపించి కౌలుకిచ్చాడు. పార్టీ ఈ విషయంపై ప్రజాకోర్టు నిర్వహించి ప్రజలను సిద్ధపరిచి తిరిగి స్వాధీనపర్చుకొని సాగులోకి తెచ్చింది.

– కటాఫ్ (గుమ్మ) ఏరియాలోని బియానికుడి గ్రామంలో భూస్వామి బలరాం భూమిని గత రెండు సంవత్సరాల క్రితం పంపిణీ చేసాం. నిర్బంధం, భూస్వామి భయం మూలంగా గత సంవత్సరం సాగు నిలిచిపోయింది. ప్రజలను రాజకీయంగా సంసిద్ధ పరిచి తిరిగి ఆ భూములను ఈ సంవత్సరం సాగులోకి తేవడం జరిగింది. గుర్రశెట్టి గ్రామంలోని సుండి భూస్వాములకు చెందిన సుమారు 200 ఎకరాలను గత 4 సం॥రాల క్రితం స్వాధీనం చేసుకొని 4 గ్రామాల ప్రజలకు పంపిణీ చేసాం. ఆ సందర్భంగా వర్గ ప్రాతిపదికన పంపిణీ చేయడంలో అవకతవకలు చోటు చేసుకున్నాయి. గ్రామాలలో వర్గ పరిశీలన చేపట్టి అర్హులైన వారికే (భూమిలేని పేదలకు) పునఃపంపిణీ చేసాం.

**శ్రమ సహకార బృందాలు :–** కొందరు పేద రైతులకు దున్నుకోవడానికి పశువులు లేకపోవడం, పంటవేసే సీజన్‌లో అనారోగ్య సమస్యలు, వృద్ధాప్య సమస్యలు తదితర కారణాలతో సకాలంలో పంట వేయలేకపోవడం లేదా అసలే సాగు చేయలేని పరిస్థితి ఎదురయి కొన్ని కుటుంబాల భూములు సాగులోకి రాకపోవడం జరిగి నష్టపోవడం జరుగుతున్నది. ఈ పరిస్థితిని అధిగమించి సకాలంలో పంట వేయడం, పంట కోయడం, నూర్పిళ్ళ వరకు 5 నుండి 10 కుటుంబాలు (సమ భూములు కల్గిన) కలిసి శ్రమ సహకార టీంలుగా ఏర్పాటు చేసాం. దానితో ఒకరి సహకారం మరొకరికి లభించడంతో టీం స్పిరిట్‌తో వేగంగా పనులు చేయడం, సకాలంలో పంట విత్తడం, కోతలు జరిగి పంట దిగుబడిలో కూడా అభివృద్ధిని సాధించారు. దానితో పెదబయలు, కటాఫ్ ఏరియాలోని మెజారిటీ గ్రామాలలో ఈ సంవత్సరమే ఈ విధానం అమలులోకి వచ్చింది.

**సమిష్టి వ్యవసాయం :–** సమిష్టి వ్యవసాయం అంటే అందులో చేరే కుటుంబాల విడివిడిగా భూములను కలిపివేయడం, సమిష్టిగా శ్రమ చేయడం, పండించిన పంటను సమానంగా పంచుకోవడం అంటే ఒకరకంగా స్వంత ఆస్తి (వ్యక్తిగత) స్థానంలో ప్రజల ఉమ్మడి ఆస్తిగా ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలు సామాజిక స్వభావాన్ని సంతరించుకోవడంగా మారే క్రమంగా వుండటమే. అయితే ప్రజలు ఆ ఉన్నతమైన సోషలిస్టు చైతన్యంతో కాకపోయినా కొన్ని గ్రామాలలో భూములు తక్కువగా వుండటం, భూమిలేని పేదల భూమి సమస్యను పరిష్కరించుకోలేక పోవడం మూలంగా జరిగిన చర్చ నుండి సహజంగా ఆదివాసీలలో వుండే సహకార, సమిష్టితత్వం నుండి గత సంవత్సరం కటాఫ్ ఏరియాలోని తాబేరు, డకడపొదర్ గ్రామాల ప్రజలు "భూములను కలిపే (భూమి లేనివారిని కూడా కలుపుకొని) సాగుచేద్దాం. భూమిలేని వారి శ్రమను కూడా కలుపుకొని సాగుచేద్దాం. పండించిన పంటను సమాన భాగాలుగా పంచుకుందాం" అని నిర్ణయించుకొని అమలు చేసారు. ఫలితంగా సెంటుభూమి మిగలకుండా సాగులోకి తెచ్చారు. సకాలంలో పంట వేసారు. పంట కోసారు. పండిన పంటను సమభాగాలుగా పంచుకున్నారు. దీని తర్వాత వారి సమీక్షలో 1. భూమిలేని వ్యవసాయ కూలీలుగా వున్నవారికి భూమి వున్న రైతులలాగానే పంట వచ్చి లాభపడ్డారు. 2. ఎక్కువ భూమి వున్న వారు కూడా గతంలో విడిగా సాగు చేసుకున్న దానికన్నా కూడా కొంత ఎక్కువ ఫలసాయం పొందాం. దీనివల్ల ఎవరికి నష్టం జరుగలేదు. లాభమే జరిగిందని భావించారు. ఎలా? గతంలో భూమి వున్న వాళ్ళు మొత్తం భూములు సాగు చేయని కారణంగా గ్రామాలలో కొంత భీడు భూమిగానే వుండిపోయేది. అలాగే వర్షాధార పంటలు కనుక సకాలంలో పంట వేయకపోవడం మూలంగా దిగుబడి చాలా తక్కువగా వచ్చేది. సమిష్టి వ్యవసాయం ద్వారా పనులు వేగంగా జరగడం, భూమిలేని వారు ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా గ్రామంలోని ప్రతి సెంటును సాగులోకి తేవడం జరిగింది. సకాలంలో పంట వేయగలిగారు. దానితో దిగుబడి పెరిగింది. అలా అందరు లాభపడ్డారు. ఈ విషయం దాని చుట్టుపక్కల గ్రామాల ప్రజలపై మంచి ప్రభావాన్ని వేసింది. దాంతో ఈ సంవత్సరం మరో 7 గ్రామాలకు ఈ సమిష్టి వ్యవసాయ పద్ధతి విస్తరించింది. అనేక గ్రామాలలో దీనిపై చర్చ జరిగి సమిష్టి వ్యవసాయ విధానం వైపు ఆసక్తి పెంచుకుంటున్నారు. పోడు వ్యవసాయం కూడా నేటికి అమలులోవున్నది. అడవి నరికి పంటలు వేయడంలో కొండలు వర్షాకాలం కోతకు గురయ్యి మట్టి కొట్టుకుపోవడం మూలంగా భూసారం దెబ్బతిని 2, 3 సంవత్సరాలకే

పంటలు పండకపోవడం, గడ్డి, కంపచెట్లు పెరిగి భూమి నిరుపయోగంగా మారుతున్నది. అలాంటి భూములలో గత 2 సంవత్సరాల నుండి కటాఫ్, పెదబయలులోని కొన్ని గ్రామాలలో రైతులు పార్టీ ప్రోత్సాహంతో, సహకారంతో జీడి మామిడి మొక్కలు నాటడం ప్రారంభించారు. అది ఈ సంవత్సరం కటాఫ్‌లో మరి కొన్ని కొత్త గ్రామాలకు విస్తరించింది.

పోషకాహార లోపం మూలంగా ప్రజలు చిన్న చిన్న అనారోగ్య సమస్యలకే అకాల మరణాలకు గురవుతున్నారు. ఈ అనారోగ్యాలకు వైద్యం అందకపోవడం కూడా మరో కారణంగా వుంది. ఇవి సహజ మరణాలు కాదు. ప్రభుత్వ హత్యలేనని ప్రచారం చేస్తూనే మరొకవైపు ప్రజల ఆహారంలో మార్పు తీసుకురావాలని కూరగాయలు, పండ్లమొక్కల పెంపకాన్ని ప్రోత్సాహించాం. ఈ పిలుపునందుకొని 12 గ్రామాలలో వందలాది పండ్ల మొక్కలు, మునగమొక్కలు నాటారు.

ఈ సాయుధ వ్యవసాయక విప్లవ కార్యక్రమంలో ప్రజలు చురుకైన భాగస్వామ్యాన్ని పెంచుతూ, భూ సమస్యను పరిష్కరించడంతో పాటు వెనుకబడిన ఉత్పత్తి విధానం నుండి ఉత్పత్తి శక్తులను అభివృద్ధి పరిచే కార్యక్రమాలను చేపడుతూ, కేంద్ర కర్తవ్యం అయిన యుద్ధం ద్వారా అధికారం హస్తగతం చేసుకోవాలనే దిశానిర్దేశంతో, ప్రజలను రాజకీయంగా చైతన్యపరుస్తూ ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేసే కృషి కొనసాగుతున్నది. ఈ కృషిలో భాగంగానే బీజప్రాయంగా విప్లవ ప్రజాకమిటీలను నిర్మించి ప్రజల ప్రజాస్వామిక అధికారాన్ని స్థాపించుకొనే కృషి ప్రారంభమైంది.

### ఒడిశా స్థానిక (మూడంచెల) సంస్థలకు జరిగిన ఎన్నికలను బహిష్కరించి పార్లమెంటరీ పంథాను తిరస్కరించి పోరాట పంథాను ఎత్తిపట్టిన విప్లవ ప్రజలు.

భారత పాలకవర్గాలు పాత (ప్రస్తుత) దోపిడీ వ్యవస్థను నిలబెట్టి కాపాడేందుకు దానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ముసుగు తగిలించి, ప్రతి 5 ఏళ్ళకొకసారి గ్రామ స్థాయి నుండి దేశ స్థాయిలో ఎన్నికలు జరిపి, తమ అధికారానికి ఆమోదముద్ర వేయించుకొనేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రజలలో ఈ వ్యవస్థ పట్ల, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం సడలి, ఆసహ్యం పెరుగుతూ ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. మన పార్టీ ప్రారంభం నుండే ఎన్నికల బహిష్కరణకు పిలుపునిస్తూ ప్రత్యామ్నాయంగా సాయుధ పోరాటం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవం గెలుచుకోవాలని పిలుపునిస్తున్నది. అందుకు ప్రజల రాజకీయ చైతన్యాన్ని పెంచేందుకు ఎన్నికల బహిష్కరణను ఒక రాజకీయ పోరాటంగా చేపడుతున్నది.

2017, జనవరి ఒడిశా రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'స్థానిక ఎన్నికలను బహిష్కరించాలనీ, విప్లవ ప్రజాకమిటీలను నిర్మించుకోవాలని' పిలుపునిస్తూ 2016 అక్టోబర్ నుండే మన ప్రచారం, పోరాటాన్ని ప్రారంభించాం. పోస్టర్స్, కరపత్రాల ద్వారా ఎమ్.కె.వి.బి. డివిజన్‌లో ప్రచారం చేపట్టాం. అలాగే అక్టోబర్ ప్రారంభంలోనే కటాఫ్ ఏరియాలో ఎన్నికల బహిష్కరణకు పిలుపునిస్తూ 7వేల మంది ప్రజలతో బహిరంగ సభ జరిపాము. ఈ సభలో "ఎన్నికలను బహిష్కరిద్దాం. శత్రువు నిర్బంధాన్ని ప్రతిఘటించి పోరాడుదాం తప్ప లొంగిపోవద్దని" ప్రతినబూనారు. అదే నెలలో అక్టోబర్ 24న రాంగూడ వద్ద ఎ.పి.గ్రేహౌండ్స్ జరిపిన ఎన్‌కౌంటర్ హత్యాకాండలో 31 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ సంఘటన తర్వాత ప్రజానిర్మాణాలను, ప్రజలను లొంగదీసుకొని స్థానిక సంస్థల ఎన్నికలను సాఫీగా జరుపుకోవాలని పోలీసులు, ప్రభుత్వం విఫల ప్రయత్నం చేసారు. ఎన్‌కౌంటర్ తర్వాత ప్రజలకు రాజ్య స్వభావం మరింతగా బోధపడింది. మరింత వ్యతిరేకతను పెంచుకున్నారు. పార్టీ పిలుపును లోతుగా అర్థం చేసుకున్నారు. పార్లమెంటరీ మార్గం కాదు, పోరాట మార్గం ప్రజల విముక్తికి దారి అని నిర్ధారించుకున్నారు. శత్రువు బెదిరింపులకు, కుట్రలకు తల వంచలేదు. నామినేషన్ కూడా వేయకుండా ఎన్నికల అధికారులను తిప్పి పంపారు. మల్కనగిరి జిల్లా చిత్రకొండ బ్లాక్‌లో 18 గ్రామ పంచాయితీలలో సర్పంచ్, సమితి, జిల్లా పరిషత్తు ఎన్నికలను సంపూర్ణంగా బహిష్కరించారు. సాయుధ బలగాల మీద ఆధారపడి నిర్వహిద్దామనుకున్న ప్రభుత్వ పథకం ప్రజల పట్టుదల, వర్గకసి, ప్రభుత్వ వ్యతిరేకత ముందు తాత్కాలికంగా వెనక్కి తగ్గక తప్పలేదు. ప్రజలలో పార్లమెంటరీ పంథా పట్ల విముఖత, సాయుధ పోరాట పంథా పట్ల సుముఖతకు నిదర్శనంగా ఈ ఎన్నికల బహిష్కరణ కార్యక్రమం నిలిచింది.

### ప్రపంచ బ్యాంకు అభివృద్ధి నమూనాను వ్యతిరేకించి–స్వావలంబనతో కూడిన అభివృద్ధి–సంక్షేమం ద్వారా ప్రత్యామ్నాయ ప్రజా అభివృద్ధికి బాటలు వేసిన విప్లవ ప్రజానీకం

"ప్రభుత్వం ప్రజల అభివృద్ధికి పాటు పడుతుంటే మావోయిస్టులు ఆ అభివృద్ధికి ఆటంకంగా వున్నారని" ప్రభుత్వం వారి పోలీసులు, పెట్టుబడికి కట్టుకథలకు పుట్టిన విషపుత్రికలైన పత్రికలు భూమి ఆకాశం దద్దరిల్లేలా అసత్యాలతో కూడిన తప్పుడు ప్రచారం నిర్వహిస్తున్నారు. నిజమే ప్రభుత్వం అభివృద్ధిగా చెపుతున్నదంతా ప్రపంచ బ్యాంక్ అభివృద్ధి నమూనా. అంటే కార్పొరేట్ ప్రయోజనాల కోసం రోడ్లు, విమానాశ్రయాలు, డ్యాంల నిర్మాణం, ఖనిజ సంపద తవ్వి తరలించడం, అడవుల విధ్వంసం ద్వారా ప్రజలను దోచుకోవడం, నిర్వాసితులను గావించడం, రైతుల భూములను గుంజుకోవడం మొదలైన వాటిని వ్యతిరేకించేవారందరు ప్రభుత్వం దృష్టిలో అభివృద్ధి నిరోధకులే అవుతారు. ప్రభుత్వం అభివృద్ధి పేరుతో చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలన్నింటి పైన జరుగుతున్న పోరాటాలకు పార్టీ ప్రజలకు నాయకత్వం వహిస్తున్నది. నూటికి 90 మంది ప్రజల అభివృద్ధి కోసం అది పోరాడుతున్నది. ప్రజల స్వావలంబనతో కూడిన అభివృద్ధికి పాటు పడుతున్నది. వనరులు, శ్రమ ప్రజలకోసం ఉపయోగపడితేనే అది అభివృద్ధి, అది వారికి కాకుండా దోపిడీ వర్గాలకు ఉపయోగపడితే అభివృద్ధి నిరోధకం అవుతుంది. ప్రభుత్వం అభివృద్ధి పేరుతో చెబుతున్నదంతా ప్రజలకు అభివృద్ధి నిరోధకమైందే. ఉదాహరణకు ప్రభుత్వం నిర్మిస్తున్న రోడ్లను పార్టీ వ్యతిరేకిస్తున్నది. కారణం అది ప్రజలకు ఉపయోగపడకపోగా వారి శ్రమను, వనరులను దోచుకోవడానికి దోపిడీ వర్గాలకు ఉపయోగపడుతున్నాయి. ప్రజలకు ఉపయోగపడే రోడ్లను పార్టీ

స్వాగతిస్తున్నది. ప్రతి ఆలోచనకు, పనికి వర్గ దృక్పథం, వర్గ ప్రయోజనం ఉంటుంది. దోపిడీ వర్గాలు చెప్పే అభివృద్ధి దాని వర్గ ప్రయోజనాలను ఆశించి చేపట్టేదే అనే విషయాన్ని ప్రజలు పార్టీ ఇచ్చిన చైతన్యంతో అవగతం చేసుకుంటున్నారు.

కటాఫ్ ఏరియాలో స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించడంతో పాటు ప్రజలు తమ కోసం ఉపయోగపడే ప్రత్యామ్నాయ అభివృద్ధిని కొనసాగించడానికి అభివృద్ధి కమిటీలను ఎన్నుకున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించుకొని ప్రజల భాగస్వామ్యంతో వాటిని పరిష్కరించుకోవడానికి పథకాలు రూపొందించుకున్నారు. అందులో భాగంగా ఒక గ్రామం నుండి మరొక గ్రామానికి ప్రయాణం చేయడానికి వీలుగా రోడ్ల నిర్మాణం చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా మహిళలు, పురుషులు, ముసలివాళ్ళు, పిల్లలు సుమారు 2 నెలలు శ్రమించి 35-40 కి.మీ పరిధిలో రోడ్ల నిర్మాణం చేసుకున్నారు. దూరం నుండి మట్టిని (మొరం) తరలించడానికి స్థానికంగా వున్న ట్రాక్టర్‌లు, వ్యాన్‌లను వాటి యజమానులు స్వచ్ఛందంగా యిచ్చారు. డీజిల్ ఖర్చులను ప్రజలు ఇంటికి 100 రూ॥ల నుండి 200 రూ॥ల వరకు వసూలు చేసుకున్నారు. చిన్న వ్యాపారుల నుండి విరాళాలు సేకరించారు. ఈ రోడ్డు ప్రజల అభివృద్ధి నమూనా. ఈ సమస్య ఇంతకాలం ప్రభుత్వం పరిష్కరించలేదు. కారణం అది ప్రజలది కాబట్టి. హైవేలు, ఖనిజ సంపద తరలింపుకు కోట్లు గుమ్మరించి ప్రజలు వ్యతిరేకించినా సాయుధ బలగాల రక్షణలో నిర్మిస్తున్నారు. అది కార్పొరేట్ సంస్థల అభివృద్ధి నమూనా. ఎవరు అభివృద్ధి నిరోధకులో ప్రజలు సులువుగానే గ్రహిస్తున్నారు. విద్య, వైద్య రంగాలు కూడా కార్పొరేట్‌లకు దారులు బార్లా తెరిచాయి. పేదలకు విద్య, వైద్యం అందని ద్రాక్షగా మారిపోయింది. ఈ సమస్య పరిష్కరించుకోవడానికి కటాఫ్ ఏరియాలో ప్రతి కుటుంబం నుండి వారి ఆర్థిక స్థోమతను బట్టి 50 రూ॥ల నుండి 100 రూ॥ల వైద్య నిధిని సేకరించుకొంటున్నారు. పార్టీ ప్రజా సంక్షేమ నిధి నుండి కొంత బడ్జెట్‌ను కేటాయించి మందులు తెప్పిస్తున్నది. గ్రామంలోని యువతి, యువకులకు మందులు యివ్వడంపై డాక్టర్ తర్ఫీదునిస్తున్నది. గత 2 సంవత్సరాలుగా మెజారిటీ గ్రామాలలో ఈ పద్ధతి ద్వారా ప్రజలకు వైద్యం అందిస్తున్నారు. ఈ సంవత్సరం ఈ సదుపాయాన్ని మరిన్ని గ్రామాలకు విస్తరించుకున్నారు. ప్రజలు తమ అనారోగ్య సమస్యలను స్వావలంబన కృషిలో భాగంగా పరిష్కరించుకుంటున్నారు.

మెజారిటీ గ్రామాలలో ఈ నాటికి ప్రభుత్వ పాఠశాలలు లేవు. అక్కడక్కడ వున్నా టీచర్ల కొరత, ఉన్న టీచర్లు కూడా స్కూల్‌లకు రాకపోవడంతో పేద ఆదివాసీ పిల్లలు నేటికి 95% నిరక్షరాస్యులుగానే ఉన్నారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా విద్యారంగం బాధ్యతల నుండి తప్పుకుంటున్నది. ప్రజలే ముందుకు వచ్చి విద్యా సమస్యను పరిష్కరించుకోవడానికి చదువుకున్న యువతీ, యువకులను స్కూల్ టీచర్‌లుగా నియమించుకొని ప్రస్తుతం 8 గ్రామాలలో ప్రజా పాఠశాలలను నిర్వహించుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలలో టీచర్లు రెగ్యూలర్‌గా హాజరయ్యి ఆదివాసీ పిల్లలకు విద్య అందించాలని పార్టీ టీచర్‌లకు విజ్ఞప్తి చేస్తున్నది.

"మన సమాజం పారిశ్రామికంగా గణనీయమైన ప్రగతిని సాధించిందని, ప్రపంచంలోనే దేశం అభివృద్ధిలో శరవేగంగా దూసుకుపోతున్నదని" పాలకులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు. వాస్తవం అందుకు పరమ విరుద్ధంగా వుంది. ఆదివాసీ గ్రామాలలో నేటికి వరిధాన్యం, రాగులు తదితర తృణధాన్యాలను మహిళలు దంపుడు పద్ధతి ద్వారానే వంట తయారు చేసుకుంటున్నారు. అందుకు ప్రతి రోజు గంటల తరబడి శ్రమిస్తున్నారు. మహిళలకు విసుగు పుట్టించే ఈ అనవసరపు శ్రమ నుండి విముక్తి కలిగించడంలో భాగంగా పెదబయలు ఏరియాలోని ఇంజరి పంచాయితీలో, కటాఫ్‌లోని ఒంద్రుపల్లి పంచాయితీలో ప్రజల నిధులతో పార్టీ, విప్లవ మహిళ సంఘాల నాయకత్వంలో దంపుడు మిల్లులను ఏర్పాటు చేసుకున్నారు. ఈ ప్రజా అభివృద్ధి నమూనాను ప్రజలు చురుకైన భాగస్వామ్యంతో మరింత ముందుకు తీసుకుపోవడం కోసం కృషి చేస్తూనే ప్రపంచబ్యాంక్ నిర్దేశంతో అమలు జరుగుతున్న అభివృద్ధి నిరోధక ప్రభుత్వ నమూనాకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు.

**సమిష్టిగా, ప్రత్యామ్నాయ అభివృద్ధే లక్ష్యంగా రోడ్లు నిర్మించుకుంటున్న కటాఫ్ ఏరియా ప్రజలు**





## రాంగూడ అమరుల స్మారక భవనాలు, స్థూపాల నిర్మాణం

2015 ప్రారంభం నుండి ఆలౌట్ అభియాన్ పేరుతో నాయకత్వ నిర్మూలన లక్ష్యంతో ఎ.పి-ఒ.ఎస్. బలగాలు సంయుక్తంగా చేపట్టిన సైనిక దాడిని మన పార్టీ ప్రజల భాగస్వామ్యంతో వమ్ము చేస్తూ వచ్చింది. ఎ.పి. ఎస్.ఐ.బి. ఉన్నతాధికారులు ప్రత్యేక కేంద్రీకరణ పెట్టి స్థానిక ప్రజా శత్రువులను ఉపయోగించుకొని, లక్షలాది రూపాయలు వెచ్చించి అత్యంత పకడ్బందీగా ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను తయారు చేసుకొని, అనేక రిహర్సల్స్ నిర్వహిస్తూ వచ్చింది. 2016 అక్టోబర్ 20 నాటికి మన మకాం సమాచారాన్ని స్థానిక ఇన్‌ఫార్మర్ ద్వారా ఎ.పి. ఎస్.ఐ.బి. సేకరించింది. దానిపై ఆధారపడి అత్యంత రహస్యంగా ఒడిశా నుండి అక్టోబర్ 21, 22న రాత్రికి రాత్రే పడవలను ఉపయోగించుకొని బలిమెల రిజర్వాయర్‌ను దాటి కొండలపై నుండి 22న సాయంత్రానికి పాన్‌పొదర్ వద్ద వున్న మన మకాం పరిసరాలకు చేరుకున్నారు. అదే రోజు సాయంత్రం మన మకాం మార్చడంతో వాడి దాడి పథకాన్ని వాయిదా వేసుకుని (మార్చుకొని) మన ప్రయాణదిశను అనుసరిస్తూ రాంగూడలోని మన సంఘ నాయకుడు, అతని తమ్ముడు (అప్పటికే శత్రువు ఏజెంట్‌గా మారిపోయాడు.) స్థానిక నెటవర్క్‌ను అప్రమత్తం చేసుకొని మన కన్నా కొన్ని గంటల ముందే రహస్యంగా నదిని దాటి రాంగూడ కొండలను ఆక్రమించాడు. 23న ఉదయం రాంగూడ గ్రామ సమీపంలోని మన మకాంను గుర్తించి మన సంఖ్యను, నాయకత్వం వుందన్న విషయం నిర్ధారించుకున్నారు. అదే రోజు సాయంత్రం దాడి చేయాలనుకున్నారు. కాని ఆ రాత్రికి మనం అక్కడే ఆగుతున్నాం అనే విషయం (సంఘ నాయకుల ద్వారా) అర్థమయి, 24 ఉదయం దాడి చేయడానికి ప్లాన్ వేసుకొని మరిన్ని అదనపు బలగాలను 23 రాత్రికి పిలిపించుకొని తెల్లవారే సరికి అన్ని వైపుల నుండి మనం తప్పుకోవడానికి వీలులేని విధంగా చుట్టుముట్టారు. 2 రోజుల ముందే సెల్ నెట్‌వర్క్‌ను సైతం నిలిపివేసాడు. శాటిలైట్ ఫోన్స్, వాకీలను ఉపయోగించుకుంటూ, అధికారుల నుండి ఆదేశాలు అందుకుంటూ, బలగాల మధ్య సమన్వయం చేసుకుంటూ ఒడిశా పోలీసులకు కూడా అర్థం కాకుండా ఎ.పి. గ్రేహౌండ్స్‌లో కూడా ప్రత్యేకంగా ఎంపిక చేసిన బలగాలతో అత్యంత పకడ్బందీగా ప్లాన్ చేసి ఉన్నతాధికారుల నాయకత్వంలో 24 నుండి 27 వరకు వరుసగా 4 రోజులు మనల్ని చుట్టివేత ద్వారా దిగ్బంధానికి గురి చేసి జరిపిన ఈ ఆపరేషన్‌లో 31 మంది వివిధ స్థాయిల కామ్రేడ్స్‌ను అత్యంత పాశవికంగా హత్య గావించారు.

ఈ సంఘటన స్థానిక విప్లవ ప్రజానీకాన్ని తీవ్రంగా కలిచివేసింది. పార్టీని, పి.ఎల్.జి.ఎ.ని కాపాడుకోలేక పోయినందుకు తీవ్రంగా మదనపడ్డారు. ఈ పాశవిక హత్యాకాండను తీవ్రంగా నిరసించారు. ఎన్‌కౌంటర్ వాస్తవాలు తెలుకోవడానికి విద్యార్థులు, హక్కుల సంఘాలు, ప్రజాస్వామికవాదులు, పత్రికా విలేఖరుల ముందు నిర్భయంగా వాస్తవాలను మాట్లాడారు. ఈ సంఘటనపై న్యాయ విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

అమరులైన స్థానిక ప్రజా నిర్మాణాల కామ్రేడ్స్ శవాలను గ్రామలకు తెచ్చుకొని విప్లవ సాంప్రదాయాలతో అంత్యక్రియలు నిర్వహించి విప్లవ జోహార్లు అర్పించారు. అమరుల కుటుంబాలను ఆర్థికంగా, హార్ధికంగా ఆదుకొని అండగా నిలబడ్డారు. "ఈ దాడిని ప్రతిఘటించి ఓడించాలి. తప్ప లొంగిపోవద్దని" నిర్ణయించు కున్నారు. ఈ సంఘటనలో శత్రువుకు ఉపయోగపడిన స్థానిక ఏజెంట్లను పసిగట్టి పార్టీకి సమాచారం యిచ్చారు. వారికి శిక్ష విధించాలని నిర్ణయించారు. ఆ విధంగా ఈ సంఘటనలో పాల్గొన్న ముఖ్యులైన నువగూడ బొల్లు, రాంగూడ సంఘ నాయకుడు (ప్రజా ద్రోహి) దన్ను, ఇన్‌ఫార్మర్ శుక్రలను ఖతం చేయడంలో చురుకైన భాగస్వాములయ్యారు.

రాంగూడ అమరులకు స్మారకంగా ప్రతి కుటుంబం, 100 రూ॥లు చొప్పున వసూలు చేసుకొని కటాఫ్ ఏరియాలోని గుర్రశెట్టి గ్రామం వద్ద అనేక గ్రామాలకు చెందిన ప్రజలు 2 నెలలు శ్రమించి రాంగూడ అమరుల స్మారక భవనం నిర్మిచుకొన్నారు. "అమరుల త్యాగాలను వృద్ధా కానివ్వం. వారి ఆశయ సాధనలో ముందుకు సాగుతామని ప్రతినబూనారు".

ఎమ్.కె.వి.బి.లోని పెదబయలు, కటాఫ్ ఏరియాలో అనేక చోట్ల రాంగూడ అమరుల స్మారక స్థూపాలను నిర్మించుకొని వారి త్యాగాలకు జోహార్లు అర్పిస్తున్నారు.

**జులై 28 అమర వీరుల వారోత్సవాల సందర్భంగా రాంగూడ అమరుల గుర్తుగా ప్రజలు నిర్మించుకుంటున్న స్మారక భవనాలు**





## మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినాన్ని పోరాట వారసత్వ దినంగా పాటించిన విప్లవ మహిళా సంఘాలు

మర్చి 8 అంతర్జాతీయ కార్మిక, శ్రమజీవులైన మహిళల పోరాట వారసత్వ దినంగా జరుపుకోవడంతో పాటు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించుకొని ఎమ్.ఎల్.ఎమ్. వెలుగులో మహిళా విముక్తికి మార్గాన్ని నిర్ధేశించుకుంటున్నారు. ఈ సం॥రం పోరాడుతున్న మహిళలపై రాజ్యం అమలు జరుపుతున్న లైంగిక అత్యాచారాలు, హత్యలను వ్యతిరేకిస్తూ అమరులైన మహిళలను స్మరించుకొని వారి ఆశయాల బాటలో మహిళా విముక్తిని సాధిద్దామని ప్రతినబూనుతూ, తెగ వ్యవస్థలో నేటికి కొనసాగుతున్న బలవంతపు పెళ్ళిళ్ళు, బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ పోరాడాలని పిలుపునిస్తూ విప్లవ మహిళా సంఘం నాయకత్వంలో కటాఫ్ ఏరియా జొంత్రి గ్రామం వద్ద 15 గ్రామాలకు చెందిన 1500 మంది మహిళలతో ఊరేగింపు జరిపి సభ నిర్వహించారు. అలాగే బెజ్జి వద్ద 4 గ్రామాలకు చెందిన 350 మందితో, బియానికుడిలో 200 మందితో ఊరేగింపు జరిపి సభ నిర్వహించారు. ఈ సభలలో మహిళ సంఘం నుండి వక్తలు మాట్లాడుతూ "మహిళల వాస్తవ సమస్యల నుండి పక్కదారి పట్టించే కుట్రలో భాగంగా ప్రభుత్వాలు, బూర్జువాలు ఈ మార్చి 8ని ఒక జాతరగా జరుపుతున్నారు. శ్రామిక మహిళలు వాటిని వ్యతిరేకించాలి. అందులో పాల్గొనవద్దు. మహిళ విముక్తి సమాజ మార్పు ద్వారానే సాధ్యం. అందుకు పోరాటంలో ఎందరో మహిళలు రాజ్యం తలపెట్టిన హింసలో అమరులవుతున్నారు అంటూ" రాంగూడలో అమరులు అయిన మహిళలందరికీ 2 ని॥లు మౌనం పాటించి జోహార్లు అర్పించారు. వారి ఆశయాల బాటలో ముందుకు సాగుదామని ఈ సందర్భంగా మరోమారు ప్రతిన బూనాలని పిలుపునిచ్చారు.

**"మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినం అంటే సంబరాలు కాదు, మహిళా విముక్తికై పోరాటమంటూ" మీటింగులు నిర్వహించుకున్న కటాఫ్ ఏరియా విప్లవ మహిళా సంఘాలు**









**సగం ఆకాశాన్ని మహిళలు తమ భూజాల మీద మోస్తున్నారు. దాన్ని వాళ్ళు ఎట్టి పరిస్థితుల్లోనూ గెల్చుకొని తీరాలి.**

*–కామ్రేడ్ మావో*

# శ్రీకాకుళం-కొరాపుట్ డివిజన్

## ఖతం కార్యక్రమాలు

### పోలీసు ఇన్‌ఫార్మర్, ప్రజా వ్యతిరేకి జయరాం కొశలకు ప్రజాకోర్టులో మరణశిక్ష

నారాయణపట్నా ఎ.సి పరిధిలోని సిమిలిగూడ బ్లాక్, సరసపాదర్ పంచాయితీ, బిత్తరకోట గ్రామానికి చెందిన జయరాం కొశల డొంబు (ఎస్.సి) కులస్తుడు. ఈ గ్రామంలో మెజారిటీ కువ్వి తెగ ప్రజలున్నారు. 6 డొంబు కుటుంబాలున్నాయి. ఇందులో జయరాం తాత చాలా ఏళ్ళ క్రితమే ఈ గ్రామంలో బ్రతుకుదెరువు కోసం బారిక(గ్రామ చలాన్) పని చేస్తూ స్థిరపడ్డాడు. అతడు చనిపోయిన తరువాత అతని కొడుకు రంగ కొశల కూడా బారికపని చేయడంతో పాటు క్రమంగా సారా వ్యాపారం, చిన్నపాటి కిరణా దుకాణం కూడా నడుపుతూ ఆదివాసీ కువ్వి ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని, ప్రజలను దోపిడీ చేస్తూ ఆర్థికంగా బలపడుతూ ప్రజలకు డబ్బు అప్పులు ఇవ్వడం, ప్రజల భూములను తక్కువ డబ్బులకు తనఖా పెట్టుకొని వాటిని మెల్లగా ఆక్రమించుకొని పట్టాలు చేయించుకోవడం, క్రమంగా గ్రామ ప్రజలపై ఆధిపత్యం చెలాయించడమే కాకుండా ఆదే గ్రామానికి చెందిన కువ్వి యువకుడిని తను ఇంట్లో గొత్త(జీతగాడు) పనికి పెట్టుకునే స్థాయికి ఎదిగాడు. వీడి కొడుకు జయిరాం కేశల. వీడు తండ్రిని మించినవాడు. వీడు కాంట్రాంక్టర్‌గా ప్రభుత్వం నుండి గ్రామానికి వచ్చే పనులన్నింటిని వీడే కాంట్రాక్టుకు తీసుకొని ప్రజలకు కూలీ డబ్బులు కూడా ఇవ్వకుండా లక్షలకు లక్షలు మింగేస్తున్నాడు. గ్రామస్తులకు వచ్చిన ఇందిరావాస్ ఇళ్ళ డబ్బులను కూడా తీనేసాడు. ఈ గ్రామానికి ఆనుకొని వున్న మాలి పర్వతంపై మైనింగ్ కోసం ప్రభుత్వం వేయిస్తున్న రోడ్డు పనుల్లో కూడా వీడి భాగస్వామ్యం ఉంది. ఆ ప్రాంత ప్రజలంతా మాలి పర్వత తవ్వకాలనూ, రోడ్లను వ్యతిరేకిస్తున్నారు. గ్రామంలో వీడి దోపిడీ, అవినీతి, అరాచకత్వాలను కూడా గ్రామ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ ప్రజలకు పార్టీ మద్దతుగా వున్నందున, వీడి అరాచకాలను పార్టీ అడ్డుకుంటుంది. కనుక వీడు ప్రజలకు, పార్టీకి వ్యతిరేకంగా పోలీసు ఇన్ఫర్మర్‌గా మారి పార్టీ కదలికలను ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ మన పార్టీని దెబ్బతీయటానికి ప్రయత్నాలు చేసాడు. ఒకసారి మన దళం బిత్తరకోటకు అనుకుని వున్న మరో చిన్న గ్రామంలో వర్షం కారణంగా మకాం వేసినప్పుడు వీడిచ్చిన నిర్దిష్ట సమాచారంతో పోలీసు బ్యాచ్‌లు ఎంగేజ్ అయ్యాయి. ప్రజల మద్ధతుతో మన దళం తృటిలో సురక్షితంగా తప్పుకోగలిగింది. ఈ సంఘటన అనంతరం మనం ప్రజల్లో విచారించగా వీడే కారకుడు అని తేలింది. దాంతో 2016, నవంబర్ 18వ తేదీన పి.ఎల్.జి.ఎ. వీడిని పట్టుకొని ఇంటరాగేషన్ చేసి, ఆ గ్రామ ప్రజల ముందు పెట్టి, ప్రజల అభిప్రాయం తీసుకుని వీడికి మరణశిక్ష విధించి, వీడి కుటుంబాన్ని గ్రామం నుండి బహిష్కరించాలని ప్రజాకోర్టు తీర్పుని పి.ఎల్.జి.ఎ. అమలు చేసింది. వీడి కుటుంబం ఆక్రమించుకున్న భూములను తిరిగి ఆ ప్రజలకు అప్పగించింది. ఈ సందర్భంలోనే రోడ్డు నిర్మాణానికి ఉపయోగించే యంత్రాలు, వాహనాలను ప్రజలలో కలిసి పి.ఎల్.జి.ఎ దగ్ధం చేసింది.

### ఇన్‌ఫార్మర్, అవినీతిపరుడు, లంపెన్ రత్నాకు ప్రజాకోర్టులో మరణశిక్ష

నారాయణపట్నా బ్లాక్ బొరిగి పంచాయితీ పెద్దఇటికి గ్రామానికి చెందిన రత్నా కువ్వి తెగకు చెందినవాడు. వీడు 2008లోనే 'బికాస్' సంస్థలో పని చేస్తూ సంస్థ ద్వారా గ్రామానికి వచ్చిన లక్షలాది డబ్బులను దోచుకునేవాడు. ప్రజలను కూలీ పనులు చేయించి కూలీ డబ్బులు ఇవ్వకుండా ఎగ్గొట్టాడు. ఆ ప్రాంతంలో ప్రతి గ్రామంలోనూ వున్న ఈ సమస్యను అప్పుడు పార్టీ ప్రజల పక్షాన నిలబడి పరిష్కరించింది. ఇటువంటి వాళ్ళందర్ని ప్రజల ముందు పెట్టి డబ్బులను కట్టించింది. ఆదే సమయంలో అప్పుడు బలంగా వున్న సంఘం, ప్రజలు కదిలి ఇటువంటి అవినీతిపరుల ఇళ్ళపై దాడి చేసి ఇళ్ళను కూలగొట్టారు. ఆ సమయంలో రత్నా కూడా గ్రామం విడిచి పారిపోయాడు. తరువాత తిరిగి 2010లో తనకు ఎక్కడా బ్రతుకు తెరువు లేదని పార్టీ, ప్రజలు అనుమతిస్తే గ్రామంలోనే కష్టపడి వ్యవసాయం చేసుకుని బ్రతుకుతానని ప్రజలను ప్రాధేయపడ్డాడు. ప్రజల అభిప్రాయంతో పార్టీ కూడా అతడ్ని గ్రామంలో బ్రతకడానికి అనుమతి ఇవ్వడంతో 2010 నుండి తిరిగి వచ్చి గ్రామంలో పాత అంగన్‌వాడీ బిల్డింగ్‌లో మకాం వేశాడు. సంఘం బలంగా వుండటంలో కొంతకాలం ప్రజలకు, సంఘానికి లొంగి వుంటూనే క్రమంగా సంఘ కార్యక్రమాల్లో కూడా పాల్గొంటూ ముందుకు వచ్చాడు. 2012 తరువాత శత్రు బహుముఖ దాడి నేపథ్యంలో మన సంఘాలన్నీ సరెండర్స్ కావడం, పార్టీ కూడా బలహీనపడటంతో, పార్టీ కార్యక్రమాలు కూడా చురుగ్గా లేకపోవడంతో తిరిగి రత్నా పాత స్వభావము, నిజ స్వరూపం బయటకు వచ్చింది. మళ్ళీ బికాస్ సంస్థ ద్వారా, ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామానికి వచ్చిన పనులను గ్రామంలో మరికొద్ది మంది పెత్తందార్లతో కలిసి కాంట్రాక్టు పనులు చేసి ప్రజలకు కూలీ ఎగ్గొట్టడం, బెదిరించడం ప్రారంభించాడు. వీడి భార్యకు అంగన్‌వాడీ ఆయా ఉద్యోగం సంపాదించి, మరో కొత్త అంగన్‌వాడీ బిల్డింగ్ నిర్మాణం చేయించి అందులోకి మకాం మర్చాడు. ప్రజల నుండి దోచుకున్న డబ్బుతో మరో కొత్త ఇంటిని కూడా నిర్మాణం చేయిస్తున్నాడు. సంఘాల సరెండర్స్ పరంపర నడుస్తున్న కాలంలో పార్టీకి చెందిన వస్తువులను తీసుకెళ్ళి అప్పజెపితే పోలీసులు డబ్బులు ఇవ్వడం చేసేవారు. దాంతో వీడు ఆ గ్రామంలో వేరే వ్యక్తి దగ్గర మనం పెట్టిన యూనిఫారాలను అతడిని బెదిరించి, ఒప్పించి తీసుకెళ్ళి పోలీసులకు అప్పగించి డబ్బులు తెచ్చుకొని పంచుకున్నారు. అలాగే వేరే గ్రామానికి చెందిన బర్మార్ తుపాకిని మధ్యలో మరో గ్రామానికి చెందిన వ్యక్తుల ద్వారా వేట కోసం అని తెప్పించి, దాన్ని తీసుకెళ్ళి మావోయిస్టుల తుపాకీ అని పోలీసులకు అప్పగించి వచ్చిన డబ్బులను తిన్నాడు. మధ్యలో వీడి మాటలు నమ్మి వేట కోసం అని తుపాకీని అడిగి తెచ్చిన వ్యక్తులు తుపాకీ గల వ్యక్తికి తమ గొర్రెను అమ్ముకొని 4వేల రూ॥లు కట్టాల్సి వచ్చింది. ఈ సంఘటన జరిగిన తరువాత పార్టీ కార్యక్రమాలు కూడా మెల్లమెల్లగా ఆ ప్రాంతంలో ప్రారంభం కావడంలో వీడు గ్రామం విడిచి నారాయణపట్నాకు వెళ్ళిపోయి, పోలీసులు వేయించిన గుడిసెలో

మకాం వేశాడు. కొంత కాలం తరువాత తిరిగి వచ్చి గ్రామంలోనే వుంటున్నాడు. పై పరిణామాలను దృష్టిలో పెట్టుకుని పి.ఎల్.జి.ఎ. మార్చి 2017న గ్రామానికి వెళ్ళి రత్నాను, వీడికి సహకరిస్తూ, వీడితో కలసి డబ్బులు పంచుకున్న మరో నలుగుర్ని పట్టుకుని ఇంటరాగేషన్ చేయడం జరిగింది. ప్రజాకోర్టు నిర్వహించి మొత్తం పరిణామాలన్నీ ప్రజల ముందు వివరించాం. ప్రజల అభిప్రాయాలను కోరాం. ఒక్కరు కూడా రత్నాను విడిచిపెట్టమని, క్షమించి ఒక్కసారి అవకాశం ఇవ్వమని కోరలేదు. దాంతో ప్రజల అభిప్రాయం మేరకు రత్నాకి మరణశిక్ష విధించి, మరో నలుగురికి ప్రజలముందే దేహశుద్ధి చేసి, తప్పులు ఒప్పించి, రత్నాతో కలిసి పోలీసుల వద్ద నుండి తెచ్చుకుని పంచుకొని తిన్న డబ్బులను తిరిగి ప్రజలకు కట్టాలని జరిమానా విధించి, తిరిగి ఇటువంటి పనులకు పాల్పడవద్దని హెచ్చరించి విడిచి పెట్టడం జరిగింది.

## ప్రజా వ్యతిరేకి గుంజలిపాడు సుందరావు (కాంద్ర)కు మరణశిక్ష

పొట్టంగి బ్లాక్, రాళ్ళగడ్డ పంచాయితీ, గుంజెలిపాడు గ్రామానికి చెందిన సుందర్రావు గదబ తెగకు చెందినవాడు. వీడు గ్రామంలో సారా బట్టి పెట్టి సారా వ్యాపారం చేస్తూ, సారా అప్పు ఇచ్చి వడ్డీగా ప్రజల వస్తువులను, భూముల పట్టాలను తనకాలు పెట్టకోవటం, ఆక్రమించుకోవడం చేస్తున్నాడు. పక్కనే వున్న తోటగూడ గ్రామానికి చెందిన భూమి పట్టాను ఇదే విధంగా తనకా పెట్టుకుని, భూమి ఆక్రమించుకుని సాగు చేయడంతో పాటు అడగటానికి వెళ్ళిన ప్రజలను కొట్టాడు. ఈ విషయంలో పార్టీ వీడ్ని ప్రజల ముందు పెట్టి గతంలో ఒకసారి దేహశుద్ధి చేసి భూమి వదిలిపెట్టాలని హెచ్చరించినప్పటికీ వీడు అక్కడ ఒప్పుకొని మళ్ళీ తోటగూడ గ్రామస్తులను బెదిరించి భూమి గలవాళ్ళనుండి 5వేల రూ॥లు తీసుకున్నాడు. భూమిని వదిలిపెట్టలేదు. వీడు 2004లో కొరాపుట్ రెయిడ్ సందర్భంగా పార్టీ ఆ గ్రామ పరిసరాల్లో డంపు పెట్టిన కిట్ బ్యాగులను చూసి పోలీసులకు అప్పగించాడు. పక్క గ్రామానికి చెందిన ఒక మహిళపై అత్యాచారం చేసి, బయటకు చెబితే చంపుతానని బెదిరించి కొంత డబ్బు ఇచ్చి ఆ మహిళ కుటుంబాన్ని నోరు మూయించాడు. తనకు మొదటి భార్య వుండగా నూకదొర తెగకు చెందిన మరో మహిళను పెళ్ళి చేసుకుని ఆమె తన మాట వినటం లేదని డీజిల్ పోసి నిప్పంటించి కాల్చి చంపేసాడు. రాళ్ళగడ్డ క్యాంపు వచ్చిన తరువాత మరింత ధైర్యంతో సారా వ్యాపారాన్నీ, గుండాగిరిని తన అరాచకాలను కొనసాగిస్తూ పార్టీ సమాచారం వెంటనే పోలీసులకు అందించటం చేస్తున్నాడు. వీడి అరాచకాలను భరించలేని ప్రజలు వీడ్ని శిక్షించాలని పార్టీని కోరారు. డిసెంబర్ 2016న మన పి.ఎల్.జి.ఎ. వీడ్ని పట్టుకుని 2 గ్రామాల ప్రజల ముందు పెట్టి విచారించింది. ఆ ప్రజాకోర్టులో వీడి కుటుంబ సభ్యులు కూడా వీడి అరాచకాలను వ్యతిరేకించారు. ఒక్కరు కూడా వీడిని క్షమించమని కోరలేదు. దాంతో ప్రజల అభిప్రాయం మేరకు, ప్రజాకోర్టు తీర్పు ప్రకారం వీడికి మరణశిక్ష అమలు చేయడం జరిగింది. వీడు ఆక్రమించుకున్న భూమి పట్టాలను తిరిగి తోటగూడ గ్రామస్తులకు అప్పగించడం జరిగింది.

## ప్రజావ్యతిరేకి, అవినీతి పరుడు పోలీసు ఇన్‌ఫార్మర్ బొలదబోయి అప్పారావును ఖతం చేసిన పి.ఎల్.జి.ఎ.

పొట్టంగి బ్లాక్, గొల్లూరు పంచాయితీ, కొట్టూబ్ గ్రామస్తుడు బొలదబోయి అప్పారావు, తన భార్య సర్పంచ్ పదవిని ఉపయోగించుకుని పంచాయితీ, బ్లాక్ నుండి వచ్చే పనులన్నీ తానే కాంట్రాక్టుకు చేసి, ప్రజలకు కూలీ డబ్బులు సరిగా ఇవ్వకుండా బిల్లు చేసుకుని లక్షలకు లక్షలు డబ్బులు తినేశాడు. వాడు పెద్ద లంచగొండి. ఒక ఇందిరావాస్ ఇల్లు కావాలంటే 10వేలు లంచం, సర్పంచ్ సంతకం కావాలంటే 500 రూ॥లు, బియ్యం కార్డులు, పెన్షన్ కార్డులు, ఆధార్ కార్డులు మొదలైన పనులన్నింటికి లంచం ఇవ్వాల్సిందే. నూకదొరల పేరు మీద వచ్చిన సర్కారు ఇళ్ళను వాళ్ళకు ఇవ్వకుండా డబ్బులిచ్చిన వాళ్ళకు అమ్మేసుకున్నాడు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులకు కూడా లంచం ఇచ్చి కొనివేసాడు. ఎవరైనా లంచం ఇవ్వకపోతే పదే పదే తన చుట్టూ తిప్పుకుంటాడు. గట్టిగా అడిగితే కొట్టడం, తిట్టడం, తన పలుకుబడినీ, అధికారాన్ని ఉపయోగించుకుని ప్రజలపై పోలీసు కేసులు పెట్టి వేధించడంతో ఎన్నో కుటుంబాలు బలయిపోయాయి. నూకదొరలు ఏదైనా పని చేసిపెట్టమని వాడి దగ్గరకు వెళితే "మీరు ఓట్లు వేయరు కదా! మీకు సంఘం, అన్నయ్యలు వున్నారు కదా! నా వద్దకు ఎందుకు వచ్చారు" అని హేళనగా మాట్లాడి బాధపెట్టేవాడు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు చెందిన 50, 60 ఎకరాల వరకు భూములను అప్పులు, వడ్డీల పేరుతో దౌర్జన్యంగా ఆక్రమించుకుని లంచాలు కట్టి తన పేరు మీద పట్టాలు చేయించుకున్నాడు. తన భూములోకి గొడ్లు, మేకలు వస్తే పెద్ద మొత్తంలో జరిమానా వేసి, చెప్పిన టైంలో ఆ జరిమానా డబ్బులు కట్టకపోతే వాటిని వాడే సొంతం చేసుకుంటాడు. ఇలా స్వాధీనం చేసుకున్న గొడ్లు, మేకలు లెక్కలేనన్ని వున్నాయి. పక్కనే వున్న గంజాయిపాడు అనే గ్రామానికి చెందిన 60, 70 చింతచెట్లను వివిధ కారణాలతో గ్రామస్తులను బెదిరించి ఆక్రమించుకున్నాడు. ఆ ప్రాంతంలో చింతచెట్ల మీద వచ్చే ఆదాయమే ప్రధాన వనరు. సుమారు 15 ఏళ్ళుగా ఆ చింతచెట్ల మీద వచ్చే ఫలసాయమంతా వాడే అనుభవించాడు. 2012లో పార్టీ (అమరుడు కా॥ డుంబ్రి) ఆ ప్రాంతానికి వెళ్ళి ఈ సమస్యను తీసుకుని వీడిని ప్రజాకోర్టులో నిలదీసి చింతచెట్లను వీడి నుండి విడిపించటంతో ఆ గ్రామ సంఘం వాటిని ఇంటికి 3 చెట్ల చొప్పున గ్రామ ప్రజలందరికీ పంచింది. ఇక కొట్టూబు గ్రామానికి చెందిన ఊరుమ్మడి చింతచెట్లు, పనసచెట్లు అన్నీ వీడే ఆక్రమించాడు. పార్టీ, సంఘం వీడిలాంటి అవినీతి పరులపై, ప్రజా వ్యతిరేకులపై చర్యలు తీసుకోవడంతో పార్టీ మీద కక్షతో కుట్రపూరితంగా పోలీసులకు సమాచారం అందించి గొల్లూరులో కామ్రేడ్స్ డుంబ్రి, శ్యాంలను చంపించిన ఘటనలో వీడికి కూడా పాత్ర వున్నది. మన కామ్రేడ్స్ అమరత్వం తరువాత వెంటనే మనం ఆ ఘటనలో ముఖ్యమైన వాళ్ళను చంపడంతో కొంత వీడు లొంగినట్లు నటించాడు. మళ్ళీ 2017, డిసెంబర్‌లో ఆ ప్రాంతంలో ముట్టిచిడగ ఎన్‌కౌంటర్ జరిగిన తరువాత తీవ్రతరమైన శత్రు నిర్బంధం, ఎడతెరిపిలేని కూంబింగ్స్ వల్ల మన సంఘాలు, పార్టీ కొంత బలహీనపడటంతో తిరిగి వీడి నిజస్వరూపంతో ముందుకు వచ్చాడు. గుంజలిపాడు భూములను, చింతచెట్లను తిరిగి వీడు స్వాధీనం చేసుకున్నాడు. గొల్లూరు ప్రాంతంలోని బాక్సైట్ ఖనిజాన్ని తరలించుకుపోవటానికి వేస్తున్న రోడ్లకు పూర్తి మద్దతు ఇచ్చి తన తమ్ముడినే కాంట్రాక్టర్‌గా పెట్టాడు. రోడ్ల పనిలో భూములు పోయిన రైతులకు నష్టపరిహారం కూడా చెల్లించలేదు. బాక్సైట్ తవ్వకాల కోసం వేస్తున్న రోడ్లను ప్రజలు, పార్టీ వ్యతిరేకించినా, ఇటువంటి ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు

మానుకోవాలని హెచ్చరించినా వాటిని పెడచెవిన పెట్టి, పోలీసుల అండతో మరింత దోపిడీ దౌర్జన్యాలు, కొనసాగిస్తున్నందుకే పి.ఎల్.జి.ఎ. డిసెంబర్ 2016న వీడిని ఖతం చేసింది. గంజాయిపాడు గ్రామానికి చెందిన భూములను, చింతచెట్లను తిరిగి ఆ గ్రామ ప్రజలు స్వాధీనం చేసుకున్నారు.

## మాజీ సంఘనాయకుడు కేశుబద్ర బిర్సుకు ప్రజాకోర్టులో దేహశుద్ధి

బందుగాం బ్లాక్, అలమండ పంచాయితీ, కేశుబద్ర గ్రామానికి చెందిన బిర్సుది ధనిక రైతు కుటుంబం. గతంలో సర్పంచ్‌గా పోటీ చేసి గెలవకపోవడంతో నాయక్, సర్పంచ్‌గా కూడా పని చేసాడు. కాంట్రాక్ట్ పనులు కూడా చేసేవాడు. గ్రామానికి సంబంధించి ఆర్థిక విషయంలో వచ్చిన ఘర్షణలతో 2009లో గ్రామంలో 2 గ్రూపులు ఏర్పడ్డాయి. పి.ఎల్.జి.ఎ. చేతిలో చచ్చిన అర్జున్ ఒక గ్రూపు, బిర్సు ఒక గ్రూపుగా గ్రామంలో వైరుధ్యాలు తీవ్రతరమయ్యాయి. ఆ ఘర్షణలో బిర్సు కుటుంబాలపై అర్జున్ వర్గం దాడి చేసి ఇళ్ళు కాలబెట్టింది. టి.వి.తదితర విలువైన వస్తువులను కూడా ధ్వంసం చేసారు. అప్పటికీ పార్టీ ఆ ప్రాంతంలో కత్తులపేట షావుకార్లకు, భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజలను కదిలించి భూపోరాటాన్ని నడుపుతున్నది. ఆ క్రమంలో మన పి.ఎల్.జి.ఎ. అర్జున్‌ని కూడా చంపాల్సి వచ్చింది. ఈ పరంపరలో బిర్సు భూపోరాట కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ మన పార్టీ వైపు ముందుకు వచ్చాడు. దాంతో ప్రజలు అతని మీద విశ్వాసంతో బందుగాం ప్రాంతంలో అలమండ, కేరుబడి పంచాయితీలకు సంఘం అధ్యక్షుడిగా ఎన్నికోవడంతో మొత్తంగా ఛసి ములియా సంఘం ఏరియా కమిటీ సభ్యుడిగా కూడా బాధ్యతలు నిర్వహించాడు. ఇలా కొనసాగుతున్న క్రమంలో నాచికలింగ మితవాద-అవకాశవాద రాజకీయాలతో పార్లమెంటరీ పంథాలోకి వెళ్ళి పార్టీ నుండి, సంఘం నుండి వేరుపడిపోవడం, మరోవైపు శతృవు దాడి తీవ్రతరం దాల్చి ప్రజలను సరెండర్స్ చేయించుకోవటం, సంఘ నాయకత్వాన్ని నయాన బయాన లొంగదీసుకోవటం జరిగింది. ఆ దాడిని ఎదుర్కోవడానికి సిద్ధంగా లేని బిర్సు కూడా ప్రజలకు, సంఘానికి, పార్టీకి ద్రోహం చేసి శత్రువు ముందు మోకరిల్లాడు. అప్పటికీ ఇంకా సరెండర్ల క్యాంపెయిన్ ప్రారంభం కాలేదు. వీడు, వీడితో పాటు మరో 4గురు ఆ పంచాయితీల సంఘ నాయకులే ముందు రహస్యంగా లొంగిపోయారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఇతడిని సంఘ బాధ్యతల నుండి తొలగించి, సంఘ సభ్యుడిగా కూడా అర్హత లేదని ప్రకటించి, ఆ పంచాయితీ గ్రామాల ప్రజల ముందు పెట్టి ఇక నుండి తాను సాధారణ జీవితం గడపాలనీ, ఎటువంటి ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకూడదనీ హెచ్చరించడం జరిగింది. దీనికి కట్టుబడి వుంటానని ప్రజల ముందు ఒప్పుకున్న వీడు మరింతగా దిగజారిపోయి డబ్బు మీద ఆశతో పోలీసులతో, భూస్వాముల, షావుకార్లతో కుమ్మకైపోయి ప్రజలు పోరాడి సాధించుకున్న భూములను తిరిగి భూస్వాములకు అప్పగించి అందుకు పారితోషికంగా డబ్బులను తీసుకున్నాడు. పోలీసుల వద్ద సరెండర్ అయిన మాజీ మావోయిస్టుగా పోలీసులు ఇచ్చిన డబ్బులను తిన్నాడు. బైకు, ట్రాక్టర్, బ్రాయిలర్ (లెమన్ గ్రాస్ నుండి నూనె తీసే యంత్రం)వంటివి కొన్నాడు. భూస్వాములకు అప్పగించిన భూములనే మళ్ళీ వీడు లీజుకు తీసుకుని అందులో సెంటు (లెమన్ గ్రాస్) సాగు చేసి ఆర్థికంగా బాగా బలపడ్డాడు. తను సరెండర్ అవటమే కాకుండా ఆ పంచాయితీలో వున్న సంఘనాయకులందర్నీ సరెండర్స్ చేయిస్తానని పోలీసులతో ఒప్పందం ప్రకారం అందరినీ వివిధ పద్ధతులలో సరెండర్స్ చేయించాడు. కొద్ది మంది అరెస్టుకు కూడా కారకుడయ్యాడు. ఈ విషయాన్ని ప్రజల ద్వారా తెలుసుకున్న పార్టీ కత్తులపేట భూముల విషయంలో భూస్వాములతో పాటు బిర్సు కూడా కుమ్మక్కయి ప్రజలకు ద్రోహం చేశాడని, ఆ భూములన్నీ విడిచిపెట్టాలనీ, లేదంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరిస్తూ 2013లో పార్టీ పేరుతో పోస్టరు వేశాం. పత్రికా ప్రకటన ఇచ్చాం. అయినా వీడు బుద్ధి మార్చుకోకుండా తన కార్యక్రమాలను యధాప్రకారం కొనసాగిస్తూనే ఈ మధ్య పంచాయితీ ఎన్నికల సందర్భంగా బి.జె.డి. మద్ధతుదారుగా ఏరియాలో ప్రచారం చేసి 2 పంచాయితీలకు వచ్చిన ఓట్ల డబ్బులను కూడా తిన్నాడని ప్రజల్లో ప్రచారం జరిగింది. అలాగే మనం పోస్టర్లు వేసిన తరువాత తన భూమినీ, ఆస్తులను అమ్మేసుకొని వెళ్ళిపోవడానికి ప్రయత్నిస్తున్నాడని కూడా తెలిసింది. ఈ విషయాలన్నీ చుట్టుపక్కల గ్రామాలలో చర్చించిన అనంతరం ఇతడిని ప్రజాకోర్టులో ప్రజల ముందు నిలబెట్టి విచారించాలని నిర్ణయించుకోవడం జరిగింది. ఇతనితో పాటు అదే గ్రామంలో వున్న మరికొంత మంది పెద్ద మనుషులను కూడా (భూపోరాటానికీ ఆటంకంగా వున్నవారు)విచారించాలని అనుకున్నాం. ప్రధానంగా 4 గ్రామాలకు చెందిన మిలీషియా, పి.ఎల్.జి.ఎ. కలిసి మార్చి 2017న బిర్సుతో పాటు మరో 4గురిని అదుపులోకి తీసుకొని ప్రజకోర్టు నిర్వహించింది. ఈ ప్రజాకోర్టుకి 4 గ్రామాల నుండి 100 మందికి పైగా ప్రజలు హాజరయ్యారు. ప్రజాకోర్టులో ప్రజలు చాలా ధైర్యంగా, సూటిగా బిర్సుని ప్రశ్నించారు, నిలదీసారు. ముఖ్యంగా 2 గ్రామలకు చెందిన వారు అసలు బిర్సు సరెండర్ అవటానికంటే ముందే తమకు భూములను పంచినప్పుడే మోసం చేసాడనీ, తమకు కేటాయించిన భూములలో ఫలసాయం అంతా తానే తిన్నాడని అందుకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఉదయం 9 గంIIల నుండి సాయంత్రం 3 గంIIల వరకు జరిగిన ప్రజాకోర్టులో ప్రజలు భాగస్వాములయ్యారు. చేసిన తప్పులకు బిర్సుకి ప్రజల ముందే దేహశుద్ధి చేయడం జరిగింది. ఈ క్రింది షరతులతో ప్రజాకోర్టు బిర్సుకి ఇదే చివరి అవకాశంగా తన పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరిస్తూ తీర్పునిచ్చింది. 2 గ్రామాలకు కేటాయించిన భూములలో ఫలసాయం తిన్నందుకు ఒక్కో గ్రామానికి లక్ష రూIIల చొప్పున 2 దఫాలుగా నష్టపరిహారం (6నెలల్లో) చెల్లించాలి.

– షావుకార్ల వద్ద లీజుకి తీసుకుని సాగు చేస్తున్న పోరాట భూములను తక్షణమే విడిచిపెట్టాలి.

– పోలీసులతోనూ, షావుకార్లతోను ఎటువంటి సంబంధాలను కొనసాగించరాదు.

– బూర్జువా రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాలుపంచుకోరాదు. కాంట్రాక్ట్ పనులు చేయకూడదు.

– గ్రామం నుండి వెళ్ళిపోయి కొరాపూట్‌లో సెటిల్ అవటం కోసం ఇళ్ళ జాగా కోసం అడ్వాన్సుగా ఇచ్చిన డబ్బులను వెనక్కు తీసుకోవాలి. గ్రామంలో తన భూమిలో వ్యవసాయం చేస్తూ సాధారణ జీవితం గడపాలి. వీటిని ఉల్లంగించినట్లయితే ప్రజల చేతిలో శిక్ష తప్పదని, ఇదే చివరి అవకాశమని ప్రజాకోర్టు తీర్పునిచ్చింది.

చివరకు బిర్సు ప్రజల ముందు తన తప్పులన్నీ ఒప్పుకొని, క్షమాపణ చెప్పి, ప్రజలు విధించిన షరతులన్నింటికీ కట్టుబడి వుంటానని, ప్రజాకోర్టు తీర్పును శిరసావహిస్తానని హామి ఇచ్చాడు.

– బిర్సుతో పాటు తీసుకువచ్చిన ఆ గ్రామ పెద్దలు (వార్డ్ మెంబర్, హవంత, బారిక) భూపోరాటానికి ఆటంకంగా వుండరాదనీ, సారా వ్యాపారం మానుకోవాలనీ, పార్టీకీ, ప్రజలకు వ్యతిరేక కార్యకలాపాలకు పూనుకోరాదనీ, లేదంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారనీ, భూపోరాటంలో ఐక్యంగా కలిసి రావాలని హెచ్చరిస్తూ ప్రజాకోర్టు తీర్పు చెప్పింది.

ఈ ప్రజాకోర్టు ప్రత్యక్షంగా పాల్గొన్న గ్రామాల ప్రజలకే కాకుండా చుట్టుపక్కల గ్రామాల్లో కూడా పార్టీ పంథా, పీడిత ప్రజల పక్షాన పార్టీ వైఖరి పట్ల ఎంతో నమ్మకాన్నీ, గొప్ప ప్రభావాన్ని వేసింది. ఈ ప్రజాకోర్టు జరిగిన రోజు రాత్రికి రాత్రే కత్తులపేట భూముల్లో ఈ 4 గ్రామాలకు చెందిన మిలీషియా బ్యానర్లు, జెండాలు, పోస్టర్లు వేసారు. కత్తులపేట భూముల్లో మళ్ళీ పార్టీ నాయకత్వంలో పరిమిత గ్రామాల ప్రజలైనప్పటికీ అక్కడి నిర్దిష్ట పరిస్థితి, ప్రజల సంసిద్ధత, చైతన్యాన్ని దృష్టిలో పెట్టుకొని భూమి సమస్యపై పార్టీ తీసుకున్న ఈ కనిష్ట కార్యక్రమం ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల్లో మంచి ప్రభావాన్ని వేసింది.

### విధ్వంస కార్యక్రమాలు

✱ 2016 నవంబర్ 18న ఒడిశా రాష్ట్రం, కొరాపుట్ జిల్లాలో పుష్కలంగా వున్న సహజ ప్రకృతి వనరులనూ, ఖనిజ సంపదలను ప్రభుత్వం బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేసి ప్రజా సంపదను కొల్లగొట్టే లక్ష్యంతో కొరాపుట్ డివిజన్‌లో మైనింగ్ పైన ప్రత్యేక దృష్టిని సారించింది. ఫలితంగా ప్రజలు విస్తాపన సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ విస్తాపన సమస్యపై పెద్ద ఎత్తున ఆదివాసీ ప్రజలు వివిధ రూపాల్లో పోరాటాలు, ఆందోళనలు చేస్తున్నారు. ప్రజా ఆందోళనలను అణచివేయడం కోసం ప్రభుత్వం పోలీసు బలగాలను దింపి, బి.ఎస్.ఎఫ్. క్యాంపులను పెట్టి, సామాన్య ప్రజలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు చేసైన సరే గనులను తవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం కోట్లాది రూపాయాలు ఖర్చు పెట్టి పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణాలను, సెల్‌టవర్‌లను, యుద్ధ ప్రాతిపదికన అత్యంత వేగంగా పనులను జరిపించడానికి పూనుకున్నది. ఇందులో భాగంగానే సిమిలిగూడ బ్లాక్‌లో మాలి, దేవ్‌మాలి పర్వతంపై గనుల తవ్వకం కోసం వేస్తున్న రోడ్డుకు వ్యతిరేకంగా బిత్తరకోట గ్రామం వద్ద నిర్మాణ పనులను చేస్తున్న ప్రొక్లెయినర్స్, ట్రాక్టర్స్, వివిధ యంత్రాలను పి.ఎల్.జి.ఎ., ఆ గ్రామ ప్రజల మద్దతుతో దగ్ధం చేసింది. ఈ సందర్భంగా ఆ పనులను నిర్వహిస్తున్న సూపర్‌వైజర్‌కు, వర్కర్స్‌కు పార్టీ వైఖరిని అర్థం చేయించి ఇటువంటి కార్యక్రమాల్లో భాగం కావద్దని తెలియజేశాం. పార్టీ వైఖరిని తెలియజేస్తూ పోస్టర్లు వేశాం.

✱ 2016 డిసెంబర్ పొట్టంగి బ్లాక్, గొల్లూరు పంచాయితీ, ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని 'బాగుడొంగర్' పర్వతంపై మౌనింగ్ కోసం పెద్దపాడు నుండి అరకుకు వేస్తున్న రోడ్డు నిర్మాణ పనుల కోసం ఉపయోగిస్తున్న వాహనాలను పి.ఎల్.జి.ఎ. తగులబెట్టింది.

✱ 2017 మే 5న నారాయణపట్నా బ్లాక్ గుమ్మండి పంచాయితీలో గనుల తవ్వకం కోసం నాల్కో దామన్‌జోడికి లింక్ చేయడానికి వేస్తున్న రోడ్ల నిర్మాణం విషయంలో పంచాయితీ గ్రామ సర్పంచ్‌ను చుట్టు పక్కల 5 గ్రామాల ప్రజల ముందు నిలబెట్టి చర్చించాం. "ఆదివాసీ ప్రజల పక్షాన నిలబడతావా? ప్రభుత్వం, కంపెనీలు ఇచ్చే డబ్బుల కోసం ప్రజా వ్యతిరేకిగా వుంటావా?" తేల్చుకొమ్మని ప్రజలు నిలదీసారు. రోడ్డు పనులు తక్షణం నిలిపివేయించాలనీ, లేదంటే సర్పంచ్ పదవికి రాజీనామా చేయలని డిమాండ్ చేశారు. ఈ సమవేశం అనంతరం పి.ఎల్.జి.ఎ. రోడ్ల పనులు చేస్తున్న వాహనాలను, యంత్రాలను దగ్ధం చేసింది. పోస్టర్లు, బ్యానర్ల ద్వారా మన వాయిస్‌ను తెలియజేశాం. ✱

## మల్కనగిరి డివిజన్

### అంతర్జాతీయ కార్మిక మహిళా పోరాట దినాన్ని పురస్కరించుకొని గొప్ప విప్లవోత్తేజంతో సభలు నిర్వహించుకున్న పప్పులూరు విప్లవ ప్రజానీకం





## 2017 మార్చి 8 అంతర్జాతీయ కార్మిక మహిళా దినోత్సవాన్ని జరుపుకున్న విప్లవ ప్రజానీకం

ఏరియాలోని 10 గ్రామాలకు చెందిన మహిళలు, పురుషులు ఒక గ్రామాన్ని ఎంచుకొని 400 మంది అక్కడికి చేరుకున్నారు. మధ్యాహ్నం 1 గం॥లకు సమావేశ స్థలం వద్దకు ఊరేగింపుగా "అంతర్జాతీయ కార్మిక మహిళా దినోత్సవం వర్ధిల్లాలి. మార్చి 8 అంటే మహిళల హక్కుల పోరాట దినం. పితృస్వామ్య, పురుషాధిక్యానికి వ్యతిరేకంగా పోరాడదాం. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. బూర్జువా పార్టీల మహిళా జాతరలను వ్యతిరేకిద్దాం. భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతిని వ్యతిరేకిద్దాం. శ్రమ విముక్తి ద్వారానే మహిళా విముక్తి సాధ్యం. నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి" అనే నినాదాలతో సభ స్థలం వద్దకు చేరుకున్నారు. సమావేశ స్థలంలో దళ సీనియర్ మహిళా కామ్రేడ్ జెండా ఆవిష్కరించి స్థానిక మహిళల సమస్యలనుద్దేశించి మాట్లాడింది. ఆ తర్వాత మహిళా అమరులపై, మహిళల సమస్యలపై ఒడియాలో పాటలు ఆలపించారు.

విప్లవోద్యమంలో పీడిత ప్రజలకోసం ప్రాణాలర్పించిన ఎందరో మహిళా అమరులందరికీ జోహార్లు అర్పించి వారి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రధాన ఉపన్యాసంలో మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం గురించీ, మొత్తంగా మహిళల విముక్తి కోసం స్త్రీ, పురుషులు కలిసి ఈ దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించవలసిన ఆవశ్యకతను గురించి తెలియజేయడం జరిగింది.

ఈ విధంగా విప్లవ చైతన్యంతో సభ జరుపుకొని సాయంత్రానికి విజయవంతంగా ముగించారు. ఈ సభ కార్యక్రమం ప్రజలలో ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా స్త్రీ, పురుషులందరూ కలిసి మహిళా సమస్యలు, పోరాటాలు, హక్కుల గురించి వినడం ద్వారా పురుషులలో కూడా ఓ మేరకు అవగాహన వచ్చింది.

## డిసెంబర్ 2, 2016 పి.ఎల్.జి.ఎ. వారోత్సవాలు జరుపుకున్న ప్రజానీకం

పప్పులూరు ఏరియాలోని 4 గ్రామాల ప్రజలు ఏకమై పి.ఎల్.జి.ఎ. వారోత్సవాలు జరుపుకున్నారు.

ముందుగా అమరులకు శ్రద్ధాంజలి అర్పించి అమరుల స్మృతిలో ఒడియా పాటలతో సభను ప్రారంభించారు. సభ అధ్యక్షుడు వారోత్సవాల గురించి వివరిస్తూ పి.ఎల్.జి.ఎ. అవసరం గురించీ, పి.ఎల్.జి.ఎ.లో యువకులు చేరి దానిని బలోపేతం చేయాలనీ, ఇప్పటి వరకు పి.ఎల్.జి.ఎ. సాధించిన విజయాల గురించి ఉపన్యసించారు. మరొకరు మాట్లాడుతూ "నేడు రాజ్య నిర్బంధం పెరుగుతున్న కాలంలో మన సైన్యాన్ని మరింత పెంచుకోవాల్సిన అవసరం వుంది. అలాగే మిలీషియా నిర్మాణాలలోకి యువతీ యువకులు భర్తీ అవ్వాలి. మిలీషియా సైన్యం పెరగడం ద్వారా దూకుడుగా మనపైకి వస్తున్న సాయుధ శతృవును అరికట్టవచ్చు. ప్రజా సైన్యాన్ని నిర్మించడం కోసం ఎందరో గొప్ప ప్రజా నాయకులు, నాయకురాళ్ళు తన అమ్యూలమైన ప్రాణాలను పీడిత ప్రజల కోసం ధారపోసారు. వారి ఆశయ సాధనలో మనం అడుగులు వేయాలి. ఆ వైపుగా ప్రజలందరూ ఆలోచించాలి" అంటూ ముగించాడు. ఈ వరోత్సవాల సందర్భంగా ఒక గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి ప్రజలకు సంబంధించిన వివిధ రకాల అనారోగ్య సమస్యల గురించి తెలుసుకొని వైద్యం చేసారు. ఈ సభకు 100 మంది వరకు ప్రజలు హాజరై సభను విజవంతం చేసారు.

## దుకాణదారుల అధిక ధరలకు వ్యతిరేకంగా ప్రజాకోర్టు నిర్వహించి సమస్యను పరిష్కరించుకున్న గుర్రలూరు గ్రామ ప్రజలు

గుర్రలూరు గ్రామంలోని దూకాణదారు తను అమ్మే సరుకులన్నింటిపై వున్న రేటు కన్న అధికంగా ప్రజలనుండి దోచుకోవడం చాలా రోజులుగా జరుగుతుంది. ఈ విషయాన్ని గ్రామ ప్రజలందరూ ఆలోచించి పార్టీ ఆధ్వర్యంలో ప్రజా కోర్టు నిర్వహించాలని ప్లాన్ చేసుకున్నారు. వారి నిర్ణయానికనుగుణంగానే ప్రజా కోర్టు నిర్వహించి (100 మంది) ప్రజలందరూ హాజరయ్యారు. అతన్ని ప్రజల మధ్య సరుకులు అమ్మే విషయం మీద వివరణ అడిగి నిలదీసారు. ధరల దోపిడీపై గంటసేపు చర్చ జరిపారు. అనంతరం ప్రజల అంగీకారం మేరకు ఏమి సరుకులు దుకాణంలో అమ్మాలి? ఎంత ధరలకు అమ్మాలి? అనే విషయం ప్రజలే చెప్పారు. బయట నుండి తీసుకొని వచ్చే వస్తువల విషయంలో ఏ వస్తువుల మీద ఎంత రేటు ముద్రించి వుంటుందో ఆ రేటు కన్న ఒక రూపాయి ఎక్కువ వుండాలని నిర్ణయించారు. వాటిని అమలు జరపాలని తీర్మానించారు. రెట్లు ముద్రించి వున్న వస్తువులనే అమ్మాలని చెప్పారు.

## నారాయణ భూమి సమస్యను పార్టీ ఆధ్వర్యంలో పరిష్కరించిన విప్లవ ప్రజానీకం

40 సం॥ల క్రితం లక్ష్మయ్య పూర్వికుల నుండి నారాయణ కొంత భూమిని కొన్నాడు. అప్పటినుండి ఆ భూమిలో పంటను పండించుకుంటున్నాడు నారాయణ. 2015 నుండి దౌర్జన్యంగా లక్ష్మయ్య, నారాయణ భూమిలో వరి పంట వేసాడు. ఇరువురి మధ్య కొంత కాలంగా చెలరేగిన గొడవ చివరకు పార్టీ వద్దకు వచ్చింది. ఈ క్రమంలో 2016 అక్టోబర్ నెలలో పప్పులూరులో వుంటున్న గంజాయి వ్యాపారి బిష్ణుని పార్టీ దేహశుద్ధి చేసి గ్రామ బహిష్కరణ చేసింది. బిష్ణుకి అనుకూలంగా పని చేస్తున్న లక్ష్మయ్య ఆ ఘటన తర్వాత గ్రామాన్ని వదిలి లంకపాకలకు వెళ్ళి ఉంటున్నాడు. 2017 జనవరిలో దళం ఆ గ్రామానికి వెళ్ళి ప్రజలను సమావేశపరిచి వివరాలు సేకరించింది. ప్రజలందరి నుండి న్యాయంగా ఆ భూమి నారాయణదే అనీ, లక్ష్మయ్య పూర్వికుల నుండి 40 సం॥ల క్రితం కొన్నాడనీ, ఆ భూమి నారాయణకే దక్కుతుందని ప్రజలందరూ మాట్లాడారు. లక్ష్మయ్యపై భూమి విషయమే కాక గ్రామస్తుల నుండి మరిన్ని పిర్యాదులు అందాయి. లక్ష్మయ్య కుటుంబ సభ్యులు తప్పును ఒప్పుకున్నారు. పార్టీ ఆధ్వర్యంలోని ప్రజలందరి సమక్షంలో ప్రజా కోర్టుతీర్పు మేరకు ఆ భూమిని నారాయణకే ఇవ్వడం జరిగింది.

## వివిధ సంఘటనలపై ప్రచార కార్యక్రమాలు

1. అక్టోబర్ 24 రాంగూడ ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా పప్పులూరు ఏరియాలోని గ్రామాలలో 'ఎన్‌కౌంటర్ వ్యతిరేక సభలు' జరిగాయి. 2016న ఆంధ్ర, ఒడిశా ప్రభుత్వ కాపలా కుక్కలు పాశవికంగా జరిపిన దాడిలో 31 మంది కామ్రేడ్స్ అమరులైనారు.

ఈ ఘటనపై 10 రోజుల పాటు ఎన్‌కౌంటర్ మీద, ప్రభుత్వ నిర్వాకం మీద, ఆ బూటకపు ఎన్‌కౌంటర్‌ని ఎదిరించి, పోరాడవలసిన అవసరాన్ని వివరిస్తూ 20 గ్రామాలలో సభలు జరిగాయి. సభలు జరిగిన గ్రామంలోని ప్రజలందరూ ఆయా సభలకు హాజరయ్యారు.

2. పార్టీకి ద్రోహం చేసి పారిపోయి పోలీసుల వంచన చేరిన సుఖదేవ్ మీద, అతడు అనుసరించిన, ప్రస్తుతం అనుసరిస్తున్న పద్ధతుల మీద కరపత్రం వేసి, కలిమెల ఏరియాలోనూ, పప్పులూరు ఏరియాలోని గ్రామాలలో ప్రచారం చేయడం జరిగింది.

3. 2017 జనవరి 26 సందర్భంగా బూకటపు రిపబ్లిక్ డే దినోత్సవాలను బహిష్కరించాలనీ, పప్పులూరు, కుర్మనూరు, కప్పతొట్టి గ్రామాలలో నల్ల జెండాలు ఎగురవేసి నిరసన తెలిపారు. ఈ విషయం ప్రెస్, ఎలక్ట్రానిక్ మీడియాల ద్వారా కూడా ప్రచారం అయ్యింది.

4. ఒడిశాలో 2017 ఫిబ్రవరిలో జరిగిన పంచాయితీ ఎన్నికలను బహిష్కరించాలనీ, కరపత్రం వేసి పప్పులూరు ఏరియా, కలిమెల ఏరియాలలో అన్ని గ్రామాలలో ప్రచారం చేయడం జరిగింది. సభలు నిర్వహించి ఎన్నికల బహిష్కరణపై కరపత్రాల ప్రచారాన్ని చేపట్టాం.

5. మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం సందర్భంగా ప్రచారం చేయడం జరిగింది. శిల్పొండి, 9వ నంబరు, 11వ నెంబరు, కాకరపడ మొదలగు గ్రామాలలో పోస్టర్లు వేయడం జరిగింది. సమాన పనికి సమాన కూలీ, పురుషాధిక్యతకు వ్యతిరేకంగా పోరాడదాం, అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం వర్ధిల్లాలి” అనే నినాదాలతో పోస్టర్ల ద్వారా ప్రచారం చేసారు.

6. 2017 మార్చి 23 భగత్‌సింగ్ వర్ధంతి సదర్భంగా సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా జరుపుకోవాలనీ, సామ్రాజ్యవాదానికీ, మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా, దేశాన్ని దోపిడీ చేస్తున్న మోడీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోస్టర్లు రాసి శిల్పొండి, కాకరపడ, నవగూడ పంచాయితీ గ్రామాలు, చిత్రకొండ నుండి పప్పులూరు రోడ్డు వరకు ప్రచారం చేయడం జరిగింది.

7. 2016 నవంబర్ 8న ప్రధానమంత్రి నరేంద్రమోడి 1000, 500 రూ॥ల నోట్లను రద్దు చేసినట్లు ప్రకటించాడు. దీనికి వ్యతిరేకంగా పప్పులూరు ఏరియాలోని గ్రామాలలో బహిరంగ సభలు నిర్వహించడం జరిగింది.

ప్రజల వద్దనున్న కొద్దిపాటి డబ్బును కూడా నోట్ల రద్దు సందర్భంగా కోతలతో మార్చుకున్నారు. 1000 రూ॥లకు 200 రూ॥లు తగ్గించి మార్చుకున్నారు. పేద ప్రజలు బ్యాంకులకు పోలేక వ్యాపారుల వద్ద మార్చుకున్నారు.

బ్యాంకులలో ఖాళీ అయిన పెట్టుబడిని పూడ్చుకునేందుకు ప్రభుత్వం నోట్ల రద్దు నాటకాన్ని ఆడింది. దీని వెనక అంతర్జాతీయ ఫైనాన్సు సంస్థల, ప్రపంచ బ్యాంకు వత్తిడి కూడా ఉన్నది. పార్టీ ఈ విషయాలను బహిరంగ సభలను నిర్వహించి ప్రజలకు వివరించింది. తర్వాత పార్టీ దీనిమీద ఒక ప్రకటన కూడా ఇచ్చింది. ✱

## మావో ఉల్లేఖనలు



**1. మన ఆలోచనకు సైద్ధాంతిక పునాది మార్క్సిజం లెనినిజం.**

**2. విప్లవాన్ని విజయవంతం చేయడానికి రాజకీయ పార్టీకి ఒక కచ్చితమైన రాజకీయ పంథా, నిర్మాణ గట్టిదనమే ఆధారం.**

**3. మార్క్సిజాన్ని ఆచరించండి, రివిజనిజాన్ని కాదు. ఐక్యం కండి. చీలిపోవద్దు. బహిరంగంగా ఉండండి. కుట్రలూ కుహకాలు చేయవద్దు.**

**సోషలిస్టు సమాజం చెప్పకోదగ్గ సుదీర్ఘ చారిత్రక కాలం పాటు సాగుతుంది. సోషలిజం చారిత్రక కాలంలో ఇంకా వర్గాలు, వర్గ వైరుధ్యాలు, వర్గ పోరాటం ఉంటాయి. సోషలిస్టు మార్గానికీ, పెట్టుబడిదారీ మార్గానికీ మధ్య పోరాటం ఉంటుంది. పెట్టుబడిదారీ పునరుద్ధరణ ప్రమాదం ఉంటుంది. ఈ పోరాటానికి ఉన్న దీర్ఘకాలిక, క్లిష్టమైన స్వభావాన్ని గుర్తించి మనం మరింత అప్రమత్తంగా ఉండాలి. సోషలిస్టు బోధనను నిర్వహించాలి. వర్గ వైరుధ్యాలనూ , వర్గ సమాజాన్నీ సరిగా అర్థం చేసుకుని పరిష్కరించాలి. మనకీ శత్రువుకీ మధ్య ఉండే వైరుధ్యాలకూ, ప్రజల మధ్య ఉండే వాటికీ మధ్య తేడా చూడగలగాలి. వాటిని సరిగా పరిష్కరించాలి. లేకపోతే మన సోషలిస్టు దేశం తద్విరుద్ధంగా మారిపోయి, దిగజారిపోయి, పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరుగుతుంది. ఈనాటి నుంచీ మనం ప్రతీ సంవత్సరం, ప్రతి నెలా, ప్రతీ రోజు దీనిని జ్ఞాపకం ఉంచుకోవాలి. అప్పుడు మనం ఈ సమస్యను సాపేక్షికంగా మెరుగుగా అర్థం చేసుకోగలుగుతాం. మార్క్సిస్టు లెనినిస్టు పంథాను కలిగి ఉండగలుగుతాం.**

ఈ ప్రజాస్వామిక కర్తవ్యాలను దుర్మార్గమైన పాలక వర్గాల హంతక, కిరాయి సాయుధ బలగాలతో పోరాడుతూనే పరిపూర్తి చేస్తున్నారు. ఈ మార్గం కష్టభూయిష్టమైనదే, ప్రయాసభరితమైనదే. ఇది త్యాగాలను కోరుతుంది. అయినా ప్రజలు విముక్తి కావాలంటే ఇంతకు మించిన మరో మార్గం లేదు. పార్టీ, ప్రజానీకం భుజస్కందాలపైన వున్న ఈ కర్తవ్యం సీదాసాదా కర్తవ్యం కాదు. ఇది శతాబ్దాలుగా పాతుకుపోయిన ఈ దోపిడీ వ్యవస్థను కూకటివేళ్ళతో పెళ్ళగించి ఎటువంటి దోపిడీ పీడనలు లేని సుందర, సమతా ప్రపంచాన్ని నిర్మించడం ద్వారానే పరిపూర్తి అవుతుంది. ఇటువంటి కర్తవ్యం త్యాగాలను కోరడం మాత్రమే కాకుండా దీర్ఘకాల స్వభావంతో కూడుకొని వుంటుంది. గత కాలానికి చెందిన పాత వ్యవస్థల ధ్వంసానికి జరిగిన సామాజిక విప్లవాలు కూడా దీర్ఘకాల స్వభావాన్ని కలిగి వున్నాయి. ఆ విప్లవాలలో కూడా నాయకత్వంతో పాటు ప్రజలు అపారమైన త్యాగాలు చేశారు. ఈ చారిత్రక సత్యాన్ని దృష్టిలో వుంచుకొని జరిగిన నష్టాన్ని గుండెనిబ్బరంతో ఎదుర్కొని మన ప్రియాతి ప్రియమైన అమరుల ఆశయ సాధనకూ, అసంపూర్తిగా వున్న కర్తవ్యాల పరిపూర్తికీ మీ వంతు కృషి చేస్తారని ఆశిస్తున్నాము.

అయితే త్యాగాలు అనివార్యమైనప్పటికీ అనవసర త్యాగాలను నివారించాలని పార్టీ బలంగా అభిప్రాయపడుతున్నది. మన కామ్రేడ్స్ అమరులైన సంఘటనను లోతుగా సమీక్షించి గుణపాఠాలు తీసుకుంటాము. "ఒక నిజమైన కమ్యూనిస్టు పార్టీ నిజాయితీ కలిగిన పార్టీగా, ప్రజలకు బాధ్యత పడే పార్టీగా పరీక్షలో నెగ్గాలంటే అది తన తప్పులను ధైర్యంగా గుర్తించి అవి భవిష్యత్‌లో జరగకుండా వుండేందుకు పట్టుదలతో కృషి చేయాలి" అని పార్టీ గురించి కామ్రేడ్ లెనిన్ చెప్పిన సూత్రానికి దృఢంగా కట్టుబడి వుంటామని మీకు వినయ పూర్వకంగా తెలియజేసుకుంటున్నాము.

ఇక్కడే మీకు మరో విషయం కూడా చెప్పాలనుకుంటున్నాము. రామగూడలో శత్రువు జరిపిన మారణకాండ సందర్భంగా జరిగిన త్యాగాలను కొంత మంది హేళన చేస్తున్నారు. పి.ఎల్.జి.ఎ.ని 'చావు సైన్యమని' అడ్డగోలు రాతలు రాస్తున్నారు. వాస్తవంగా వాళ్ళు మాటల్లో, రాతల్లో అభ్యుదయకరంగా కనిపించినా ఆచరణలో పార్లమెంటరిజాన్ని నెత్తికెత్తుకొని ఈ దోపిడీ పాలకవర్గాలకు సేవ చేసేవాళ్ళే. చీకు, చింతలేని జీవితాన్ని గడుపుతూ ఒడ్డున కూర్చొని విప్లవ కార్యకలాపాలలో నిమగ్నమైన వారిపై రాళ్ళు వేస్తుండటమే వాళ్ళ దినచర్య. ఇటువంటి వారికి అమరులపై మాట్లాడే అర్హత లేదని మనం దృఢంగా చెప్పాలి. మరికొంత మంది సానుభూతి చూపిస్తూనే 'నిజాయితీ, ధైర్యం కలిగి దేశానికవసరమైన యువకులు తప్పడు పంథాలో వెళ్ళి అనవసరంగా చనిపోతున్నారని' నిట్టూర్పులు విడుస్తుంటారు. కానీ వాళ్ళకు తెలియనిదేమిటంటే, అంతగొప్ప నూతన మానవులు దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాతో తాదాత్మ్యం చెందడం వల్లనే తయారైనారనే విషయమే. ఇటువంటి వారికి మనం ఈ గతితార్కిక సంబంధాన్ని ఓపిగ్గా అర్థం చేయించాలి.

*ప్రియమైన కామ్రేడ్స్...!*

అమరులైన కామ్రేడ్స్ మనందరికీ ఆదర్శప్రాయులు. వాళ్ళు కామ్రేడ్ మావో చెప్పిన "ఫైట్ ఎగనెస్ట్ సెల్ఫ్" సూత్రానికి అనుగుణంగా స్వార్థం శిరస్సును కసిగా గండ్రగొడ్డలితో నరికారు. తుదిశ్వాస విడిచే వరకూ ఆ కర్తవ్య నిర్వహణలో ఏ మాత్రం ఏమరుపాటుగా లేరు. ముఖ్యంగా స్వార్థానికి పునాదిగా వున్న ఈ దోపిడీ వర్గ సమాజాన్ని ధ్వంసం చేసేందుకు 'సాయుధ వ్యవసాయ వర్గపోరాట' ఆయుధాన్ని చివరి క్షణం వరకు వదలలేదు. వాళ్ళు సర్వం ప్రజల కోసమే అంకితమయ్యారు. అందుకే వాళ్ళు మన రోజువారీ జీవితంలో, ఆలోచనల్లో, పనుల్లో మార్గదర్శకులుగా వుండాలి. మనం వాళ్ళ విప్లవ జీవితాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలి. అలా చేయడం ప్రస్తుత సామాజిక విప్లవానికి, భవిష్యత్ సమాజ నిర్మాణానికి ఎంతో అవసరం. ఆ కామ్రేడ్స్ మనకందించిన స్ఫూర్తితో ఈ దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, సోషలిజం గుండా కమ్యూనిజం చేరేందుకు మీరందరు మీ వంతు కృషి చేస్తారని ఆశిస్తున్నాం.

అమరులైన కామ్రేడ్స్‌లో మీరు ప్రియాతి ప్రియంగా భావించే మీ కూతుళ్ళు, కొడుకులు వున్నారు. వాళ్ళను కోల్పోవడం వల్ల మీతో పాటు పార్టీకీ, ప్రజలకు, ఉద్యమానికి రాజకీయంగా ఎంతో నష్టం జరిగింది. వాళ్ళు వివిధ స్థాయిల్లోకి ఎదిగి చైతన్యవంతంగా నాయకత్వాన్ని అందించారు. వారు లేని లోటును పూడ్చుకొనేందుకు మరింత లోతుగా విప్లవోద్యమంలో భాగస్వాములవుతామని హామీ ఇస్తున్నాము. అలాగే మీరు కూడా ఎప్పటిలాగే మన పార్టీ నాయకత్వంలో సాగుతున్న ప్రజాయుద్ధానికి మీ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నాం.

* దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో అసువులు బాసిన అమరులకు జోహార్లు !
* నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి !!
* సి.పి.ఐ. (మావోయిస్టు) వర్ధిల్లాలి !!!

విప్లవాభివందనాలతో,

ఆంధ్రా-ఒడిశా స్పెషల్ జోనల్ కమిటీ,

సి.పి.ఐ. (మావోయిస్టు).

నవంబర్ 2016

# అమరుల

## కుటుంబాలకూ, బంధుమిత్రులకు పార్టీ లేఖ

ప్రియాతి ప్రియమైన అమరుల తల్లిదండ్రులకు, బంధుమిత్రులకు లాల్‌సలామ్.

భారతదేశ విముక్తికై జరుగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో మీ కుమార్తెలు/కుమారులు.......... శత్రు సాయుధ బలగాలతో వీరోచితంగా పోరాడుతూ నేలకొరిగారు. ఈ విషయం పార్టీ, పి.ఎల్.జి.ఎ శ్రేణులనూ, పీడిత ప్రజానీకాన్నీ తీవ్రమైన దుఃఖంలో ముంచింది. ఇక మిమ్మల్ని ఈ విషయం ఎంత దుఃఖానికీ, వేదనకు గురి చేసి వుంటుందో మేము అర్థం చేసుకోగలం.

ప్రతి మనిషికి పుట్టుక, చావు ఉంటాయి. కానీ ఈ రెండింటి మధ్య వున్న జీవితాన్ని ఎవరికోసం, ఎందుకోసం, ఎలా గడిపారన్నదే అసలు విషయం. కొందరు తమ జీవితమే పరమార్థంగా ఎంచి, ఉన్న స్థితికి దాసోహమంటూ, అన్ని మానవ విలువలను వదిలేసి స్వార్థంతో జీవితాన్ని గడుపుతారు. మరి కొందరు తమ చుట్టు వుండే పీడిత ప్రజల బాధలు చూసి స్పందించి, వారిని బాధల నుండి విముక్తి చేసేందుకు తమ జీవితాన్ని సంపూర్ణంగా అంకితం చేస్తారు. వాళ్ళే విప్లవకారులు. ఈ విషయాన్ని కామ్రేడ్ మావో మరింత సూటిగా "ప్రజల కోసం మరణించడం హిమాలయాలకన్నా ఉన్నతమైనదనీ, దోపిడీ వర్గాల కోసం మరణించడం ఈక కన్నా తేలికైనదని" చెప్పారు. ఈ సూత్రీకరణ ప్రకారం మన కామ్రేడ్స్ మరణం హిమాలయాలకన్నా ఉన్నతమైనది.

నేడు భారతదేశంలో 'బ్రాహ్మణవాద హిందూ మతతత్వంతో విడదీయరాని విధంగా పెనవేసుకుపోయిన అర్థభూస్వామ్య, అర్థవలస వ్యవస్థ' కొనసాగుతూ వుంది. ఈ సామాజిక, ఆర్థిక వ్యవస్థే నేడు పీడిత ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలకు, కడగండ్లకు కారణం. ఈ దుష్ట వ్యవస్థను ధ్వంసం చేయకుండా ప్రజల కష్టాలు ఈడేరవు. అందుకు ఈ దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయడం తప్ప మరో మార్గం లేదు. ఈ కర్తవ్యాన్ని కార్మికవర్గ నాయకత్వంలో నాలుగు వర్గాలు (కార్మికవర్గం, రైతాంగం, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా వర్గం) ఐక్యంగా నిలబడి పోరాడడం ద్వారా మాత్రమే నిర్వహించగల్గుతాయి. ఈ వాస్తవం 1947 ఆగస్టు 15 అధికార మార్పిడి తర్వాత మరింతగా రుజువవుతూ వచ్చింది. ఆగస్టు 15న వాస్తవంగా మన దేశానికి స్వతంత్రం రాలేదు. కేవలం సామ్రాజ్యవాదుల అడుపాజ్ఞలలో, కనుసన్నలలో వుండే దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలకు మాత్రమే బ్రిటీషు ప్రభువుల నుండి అధికారం బదలాయించబడింది. వీరి నియంతృత్వానికే 'ప్రజాస్వామిక రిపబ్లిక్' ముసుగు తొడిగి ఈ దోపిడీ పాలక వర్గాలు ప్రజలను మోసం చేస్తూ వచ్చారు. వాస్తవంగా మన సామాజిక వ్యవస్థ పార్లమెంటరీ ప్రజాస్వామ్య, రిపబ్లిక్ ముసుగులో వున్న అర్థభూస్వామ్య, అర్థవలస వ్యవస్థే.

పై వాస్తవాన్ని అర్థం చేసుకొని ప్రస్తుతం ఉనికిలో వున్న ఈ దుష్ట వ్యవస్థను మార్చే సామాజిక విప్లవం కోసం కృషి చేస్తున్న పార్టీయే సి.పి.ఐ.(మావోయిస్టు) పార్టీ. ఈ ఆశయ సిద్ధి కోసం పార్టీ నేతృత్వంలో పోరాడుతున్న గెరిల్లా సైన్యమే 'ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం'(పి.ఎల్.జి.ఎ), ప్రజాధికార అంగాలే 'విప్లవ ప్రజా కమిటీలు' (ఆర్.పి.సి). ఈ విప్లవ నిర్మాణాలు దున్నేవారికే భూమి ప్రాతిపదికగా, సాయుధ వ్యవసాయక విప్లవంలో తమ వంతు భూమికను పోషిస్తున్నాయి. ఈ లక్ష్యానికి ఆటంకంగా వున్న బడా భూస్వాములకు, దళారీ నిరంకుశ బూర్జువాలకు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులకు, వారి సాయుధ బలగాలకు వ్యతిరేకంగా అశేష పీడిత ప్రజానీకాన్ని ప్రజాయుద్ధంలోకి సమీకరిస్తున్నాయి. ఈ ప్రజాయుద్ధమే ప్రజలకు ప్రత్యామ్నాయం అనే విషయాన్ని చరిత్ర ఇప్పటికే రుజువు చేసింది. ప్రజాయుద్ధం ద్వారానే ప్రజలు భూస్వాముల నుండి భూములను స్వాధీనం చేసుకొని వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని పట్టు విడవకుండా కొనసాగిస్తున్నారు. అభివృద్ధి పేరుతో సామ్రాజ్యవాదులు, వారి తైనాతీలు పెద్ద ఎత్తున అడవులనూ, భూములను కబ్జా చేసి ప్రజలను విస్థాపితుల్ని చేయడాన్ని నిరోధిస్తున్నారు. ఈ దోపిడీ పాలక వర్గాలు వివిధ రూపాలలో ముందుకు తెస్తున్న వ్యవసాయ విప్లవ వ్యతిరేక వ్యూహాన్ని తిప్పి కొడుతున్నారు. ప్రజాయుద్ధ రాజకీయాలతో సంఘటితపడి సాయుధులౌతున్నారు. పార్టీలోకీ, పి.ఎల్.జి.ఎ.లోకీ భర్తీ అవుతున్నారు. ఉద్యమ ప్రాంతాలలో ప్రత్యామ్నాయ రాజకీయ అధికార అంగాలైన ఆర్.పి.సి.లను ఏర్పర్చుకొని వాటిని రక్షించుకుంటున్నారు.

71వ పేజీలో...